అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
ఆదివారం 01-09-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి: 10 | సంచిక: 244 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 18 పేజీలు + వెబ్‌లో (సోపతి) | వెల: 8.00

ఐఏఎస్‌ల బదిలీలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పలువురు ఐఏఎస్ అధికారుల్ని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మైన్స్ అండ్ జియాలజీ ప్రభుత్వ కార్యదర్శిగా, ఆ శాఖ ఇంచార్జిగా పనిచేస్తున్న కే సురేంద్రమోహన్‌ను పూర్తికాలం డైరెక్టర్‌గా నియమించారు. మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తున్న తఫ్సీర్ ఇక్బాల్‌ను తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శిగా నియమించారు. ఆ పోస్టులో ఇంచార్జిగా ఉన్న ఆయేషా మస్రత్ ఖన్నంను జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వీసీ అండ్ ఎమ్‌డీగా ఏ నిర్మలాకాంతి వెస్లీని నియమించారు. ఆర్ అండ్ ఆర్ మరియు ఎల్‌పి కమిషనర్‌గా టీ వినయ్‌కృష్ణారెడ్డిని నియమించి, ఆ పోస్టులో ఉన్న రాహుల్ బొజ్జాను రిలీవ్ చేశారు. మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రభుత్వ కార్యదర్శిగా షేక్ యాస్మిన్‌బాషాను నియమించారు. ఖమ్మం (స్థానిక సంస్థలు) అడిషనల్ కలెక్టర్‌గా పీ శ్రీజాను, వక్ఫ్‌బోర్డ్ సీఈఓగా ఎమ్‌డీ అసదుల్లాను నియమించారు.

పాత పెన్షన్ విధానాన్ని
పునరుద్ధరించాలి

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ వి. లచ్చిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ చిన్నారెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం సెక్రటేరియట్ వద్ద విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకీకృత పెన్షన్ విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించొద్దనీ, 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాలకు ఉద్యోగులు ఇబ్బందులకు గురవు తున్నారని తాము చిన్నారెడ్డికి వివరించామని పేర్కొన్నారు. తమ సమస్యలను సావధానంగా విన్న ఆయన ముఖ్యమంత్రితో మాట్లాడి పరిష్కరిస్తానని హామి ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు దర్శన్, కత్తి జనార్ధన్, నిర్మల, ఊదరి గోపాల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే
ప్రభుత్వ లక్ష్యం : మంత్రి సీతక్క



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహిళల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదనీ, అందుకే సీఎం రేవంత్‌రెడ్డి విభిన్న ఆలోచనలతో వారి కోసం పథకాలు తీసుకొస్తున్నారని మంత్రి సీతక్క తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని శిల్పారామంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లను మంత్రి పరిశీలించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. 64 లక్షల మంది మహిళలు సొంత కాళ్ళ మీద నిలబడేందుకు.. 17 రకాల వ్యాపారాలను సేర్ప్ సంస్థ ద్వారా చేపట్టినట్టు తెలిపారు. వివిధ రకాల వ్యాపారాల్లో మహిళల ఉత్సాహంగా రాణిస్తున్నారని చెప్పారు. శిల్ప రామంలో ఉన్న 106 షాపింగ్ కాంప్లెక్స్‌లను అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేసుకునేందుకు అందుబాటులోకి తీసుకురావాలని ఆలోచిస్తున్నట్టు తెలిపారు. ఐటీ ఉద్యోగులు కొనుగోలు చేసుకునేలా రాత్రి 2గంటల వరకు నైట్ బజార్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నామన్నారు. గతంలో అవి బాగానే నడిచాయనీ, ఎనమిదేండ్లుగా మూత పడ్డాయని గుర్తు చేశారు. మహిళా సాధికారత వల్ల పేదరిక నిర్మూల జరుగుతుందనీ, కుటుంబం అన్నిరకాల అవసరాలను తీర్చుకోగల ఆర్థిక వ్యవస్థ ఏర్పడుతుందని చెప్పారు. కొన్నేండ్లుగా మహిళా సంక్షేమ కార్యక్రమాలు మరుగున పడ్డాయని సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. మూతపడ్డ షాపింగ్ కాంప్లెక్స్‌లను డిసెంబర్ తొమ్మిదిన ప్రారంభిస్తామని చెప్పారు. కాంప్లెక్స్ ల మరమత్తులు కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.7 కోట్లను కేటాయించామని తెలిపారు. సీతక్కతో పాటు సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, కాంగ్రెస్ మీడియా, కమ్యూనికేషన్ చైర్మెన్ సామ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 01-09-2024

సమగ్ర తెలుగు దినపత్రిక





వివరాలు 8లో

శ్రీశైలం..నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో జలకళ

సంపుటి : 10 | సంచిక : 244 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 18 పేజీలు + వెబ్‌లో (సోపతి) | వెల : 8.00

బుద్ధవనంలో అంతర్జాతీయ మ్యూజియం

నాగార్జున సాగర్ టూరిజంపై ప్రత్యేక దృష్టి

హుస్సేన్ సాగర్ చుట్టూ స్కై వాక్ వే : ముఖ్యమంత్రి రేవంత్ నిర్ణయం

గోల్కొండ చుట్టున్న ఆక్రమణలు తొలగించాలని ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా రాష్ట్రంలో ఉన్న బౌద్ధ పర్యాటక స్థలాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. దేశ విదేశాల్లోని బుద్ధిస్టులను ఆకట్టుకునేలా బుద్ధవనంలో 'ఇంటర్నేషనల్ బుద్ధ మ్యూజియా'న్ని నెలకొల్పాలని సూచించారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలంటూ దిశా నిర్దేశం చేశారు. నూతన టూరిజం పాలసీకి సంబంధించిన అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన సీఎం... రాష్ట్రంలో చారిత్రకంగా పేరొందిన ఫణిగిరి, నేలకొండపల్లి, నాగార్జున సాగర్ బౌద్ధ క్షేత్రాలతోపాటు హైదరాబాద్ హుస్సేన్ సాగర్‌లోని బుద్ధ విగ్రహాన్ని కలిపి ఒకే టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలంటూ సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వదేశీ దర్శన్ 2.0 పథకంలో భాగంగా బుద్ధవనం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే కేంద్రానికి డీపీఆర్‌ను పంపిందని గుర్తు చేశారు. ఇందులో భాగంగా రూ.25 కోట్ల అంచనాలతో బుద్ధవనంలో బుద్ధిస్ట్ డిజిటల్ మ్యూజియం అండ్ ఎగ్జిబిషన్, డిజిటల్ ఆర్కివ్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్టు తెలిపారు. వీటితోపాటు తాజాగా ఇంటర్నేషనల్ బుద్ధ మ్యూజియాన్ని ఇదే ప్రణాళికలో పొందుపరచాలని సూచించారు. నాగార్జున సాగర్ బుద్ధవనాన్ని టూరిజం, స్పిర్చువల్ డెస్టినేషన్ సెంటర్‌గా తీర్చిదిద్దుతామని సీఎం వెల్లడించారు. అక్కడి డ్యామ్ అందాలతోపాటు పరిసరాల్లోని బుద్ధవనాన్ని అంతర్జాతీయ బౌద్ధక్షేత్రంగా అభివద్ధి చేయాలంటూ అధికారులకు సూచించారు. సాగర్ సందర్శనకు వెళ్లే పర్యాటకులు బ్యాక్ వాటర్ వరకూ బోట్‌లో విహరించేందుకు వీలుగా ఏర్పాట్లను పునరుద్ధరించాలని ఆదేశించారు. దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులను ఆకర్షించేందుకు వీలుగా అనువైన టూరిజం ప్యాకేజీలను రూపొందించాలని సీఎం కోరారు.



(ఫైల్)

హైదరాబాద్ నుంచి సాగర్ వరకు నాలుగు లైన్ల రోడ్

హైదరాబాద్ నుంచి నాగార్జున సాగర్ వరకు నాలుగు లైన్ల రోడ్‌ను నిర్మించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందించాలంటూ ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు.

ఆ డిజైన్ వలయాకారంలో ఉండాలి

హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ నుంచి తెలంగాణ అమరవీరుల జ్యోతి, నెక్లెస్ రోడ్, సంజీవయ్య పార్కు వరకూ వలయాకారంలో 'స్కై వాక్ వే'ను ఏర్పాటు చేయనున్నట్టు సీఎం ఈ సందర్భంగా వెల్లడించారు. అందుకనుగుణంగా డిజైన్లు తయారు చేయాలని సూచించారు. ఈ ప్రాంతం మొత్తాన్ని భవిష్యత్తులో వరల్డ్ క్లాస్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని ...6లో

అప్రమత్తంగా ఉండండి

తక్షణ సహాయ చర్యలు చేపట్టండి :

భారీ వర్షాలపై సీఎస్, డీజీపీలకు

సీఎం రేవంత్ ఆదేశాలు 6లో..



అప్పాచెరువులో కూల్చివేతలు

గగన్‌పహాడ్‌లో భారీ బందోబస్తు మధ్య హైడ్రా చర్యలు

ఈదులకుంట, అమీన్‌పూర్‌లో కమిషనర్ రంగనాథ్ పర్యటన

సైబరాబాద్ పరిధిలో ఆరుగురు అధికారులపై కేసు

నవతెలంగాణ-రాజేంద్రనగర్, మియాపూర్/అమీన్‌పూర్

అక్రమ నిర్మాణాల విషయంలో హైడ్రా దూకుడు పెంచింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో శనివారం మరోసారి కూల్చివేతలు జరగ్గా.. మియాపూర్, సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో చెరువులు, కుంటల ఆక్రమణలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. చెరువుల స్థలాల ఆక్రమణల వెనుక ఎంతటి వారున్నా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కాగా, కమిషన్ సిఫారసుల మేరకు సైబరాబాద్ పరిధిలో ఆరుగురు అధికారులపై కేసు నమోదైంది.

రాజేంద్రనగర్ గగన్ పహాడ్ అప్పచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అక్రమ కట్టడాల కూల్చివేతకు ఉదయం 6 గంటలకే అధికారులు వచ్చారు. భారీ నిర్మాణాలను కూల్చేశారు. 32 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అప్పచెరువు బఫర్ జోన్‌లో సుమారు నాలుగు ...17లో

హైడ్రా తెచ్చిందే నా కోసం

నాకు వంద బిల్డింగ్‌లున్నాయి

ఒక్కటి పోతే వచ్చే నష్టమేమీ లేదు :

మాజీ మంత్రి మల్లారెడ్డి 17లో.

దంచికొడుతున్న వాన



హైదరాబాద్..విజయవాడ హైవేపై వరదనీరు

ఉరకలెత్తుతున్న వాగులు..నిండుకుండల్లా ప్రాజెక్టులు

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో రాకపోకలకు అంతరాయం
- బొగత జలపాతం, రామప్ప, లక్నవరం మూసివేత
- పిడుగుపాటుతో ఒకరు మృతి
- హైదరాబాద్ జిల్లాలో సోమవారం పాఠశాలలకు సెలవు

నవతెలంగాణ- విలేకరులు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల రాష్ట్రంలో భారీ నుంచి మోస్తరు వర్షాలు దంచికొడుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తోంది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. ఎడతెరిపిలేని వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. హైదరాబాద్‌లో రోడ్లపై వరద చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల జూరాల, శ్రీశైలం, సాగర్ జలాశయాలకు వరద పోటెత్తడంతో గేట్లను ఎత్తేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బొగత జలపాతం, రామప్ప, లక్నవరం పర్యాటక ప్రాంతాలను అధికారులు మూసేశారు.

మున్నేరు ఉధృతి

ఖమ్మం జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. ఖమ్మం నగరంలోని మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు- కట్లపాలెం గ్రామాల మధ్య రహదారిపై వరద ప్రవహిస్తోంది. శనివారం ...8లో

రెండు రోజులు భారీ వర్షాలు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి 17లో.

అఖిలపక్షంలో తేలని పంచాయతీ

కులగణనపై గళమెత్తిన ప్రతిపక్షాలు

అది రాష్ట్ర ప్రభుత్వ అంశమని తేల్చిచెప్పిన ఎస్ఈసీ

సెప్టెంబర్ నెలాఖరునాటికి సిద్ధంగా ఉంటామని స్పష్టీకరణ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను సెప్టెంబర్ నెలాఖరునాటికి పూర్తి చేస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) చైర్మెన్ పార్థసారధి స్పష్టం చేశారు. అయితే కులగణన ...6లో

జ్ఞానం ఉన్నచోట శక్తి, తెలివి ఉన్నచోట వెలుగు ఉంటాయి - స్వామి వివేకానంద



'హౌటూ రెస్పెక్ట్ ఉమెన్'

'మన తరాలన్నీ స్త్రీ సాధికారత కోసం పనిచేస్తూనే ఉన్నాయి. కానీ సాధికారత సాధించిన స్త్రీలతో ఎలా ఉండాలనే విషయాన్ని మాత్రం చెప్పలేకపోయాయి' అని ఒక పరిశీలనను మిత్రుడు పోస్టు చేశాడు. మహిళలు ముందుకు రావాలీ, సమానత సాధించాలి, అభివృద్ధి చెందాలని ప్రతి ఒక్కరూ మాట్లాడుతారు. కానీ, అభివృద్ధి చెందిన మహిళల పట్ల ఎలా ప్రవర్తించాలి? అనే ఆలోచనను మన సమాజం పురుషులకు నేర్పలేకపోవటం విచారకరం. ఎందుకంటే మొన్న కలకత్తా ఘటనలో డాక్టర్ మౌమితా మెడిసిన్‌లో పీజీ చేస్తున్న ఉన్నత విద్యాధికురాలు.అంతేకాదు, ఇప్పటికీ దేశంలోని మహిళా వైద్యులు ఎక్కువగా అభద్రతలో ఉన్నారని ఐ.ఎం.ఏ అధ్యయనం చెబుతున్నది. రాత్రిపూట వైద్యసేవలు అందించటానికి భయపడుతున్నారనీ తెలిపింది. వీళ్లే కాదు. ఈ మధ్యనే వెలుగులోకి వచ్చిన ముంబయి నటి కాదంబరి జత్వానీ సినీరంగంలో ఎదిగిన కళాకారిణి.తనను లైంగిక వేధింపులకు గురిచేశాడని వ్యాపారవేత్త జిందాల్‌పై కేసుపెడితే, అప్పటి ఏపీ ప్రభుత్వం వ్యాపార కుటుంబాన్ని రక్షించడానికి ఆమెపై కేసుపెట్టి చిత్రవధకు గురిచేశారని స్వయంగా ఆమే ఘోషిస్తున్నది.

2019లో హైద్రాబాద్, శంషాబాద్‌లో జరిగిన లైంగికదాడి, హత్యకు గురైన అమ్మాయి కూడా వెటర్నరీ డాక్టరే. పురుషులతో సమానంగా ఎదిగిన అమ్మాయే. ఢిల్లీ నిర్భయ, ఉన్నావ్, హత్రాస్ సంఘటనల్లో దారుణంగా, రాక్షసంగా అమ్మాయిలు హత్యచేయబడ్డారు. ఇక ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట లైంగిక వేధింపుల ఘటన, హత్య జరుగుతూనే ఉంది. ఏ విభాగం, వ్యవస్థా కూడా ఈ వేధింపులు లేకుండా లేదు. ఇటీవలే జస్టిస్ హేమా కమిటీ ఇచ్చిన నివేదికలో కేరళలోని సినీపరిశ్రమలో మహిళలపై వేధింపులు తీవ్రంగా ఉన్నాయని వివరించారు. అంతకుముందు టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ అన్ని చోట్లా కాస్టింగ్ కౌచ్‌కు పాల్పడుతున్నారని 'మీటూ' ఉద్యమం నడిచింది.

> **నేడు మహిళలను ఎలా గౌరవించాలో అనే విషయాలను ప్రజలకు అందించాల్సిన ప్రభుత్వ నిర్వాహకులు, సనాతన ధర్మం పేరుతో మనువాద భావజాలాన్ని ప్రచారం చేస్తున్నారు. దేశంలో స్త్రీని అబలగా కేవలం వంటింటికి, పిల్లలుకనేందుకు పరిమితం చేసే భావనలే వారి ఆలోచనలుగా ఉన్నాయి. రెండోవైపు స్త్రీలను, వారి అందాలను కాదు, అంగాలని వ్యాపార సరుకుగా మారుస్తున్న వ్యవస్థా విధానం మనపై ఆధిపత్యం చేస్తూవున్నది. ఈ రెండింటినీ ఎదుర్కోవాల్సిన సందర్భం ఇది. ఇప్పుడు జస్టీస్ కోసం నినదించే యువత, తల్లిదండ్రులూ, ఈ అవగాహనతో పనిచేస్తే ముందడుగేయగలం!**

సంపాదకీయం

ఇక కళాశాలల్లో, హాస్టళ్లలో, పాఠశాలల్లో ఆడపిల్లలపై వేధింపులు ఆగటం లేదు. మొన్న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలో గుడ్లవల్లేరు ఇంజనీరింగు కాలేజీలో ఆడపిల్లలు నివసిస్తున్న హాస్టలు బాత్ రూముల్లో హిడెన్ కెమెరాలు అమర్చి వీడియోలు తీస్తున్నారనే ఘటన విద్యార్థినుల ఆందోళనతో వెలుగులోకి వచ్చింది. ఉన్నత చదువులు చదువుకుంటారని, మంచి విద్యాసంస్థ అని మా పిల్లలను పంపించామని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. భారతదేశంలో ఈ వేధింపుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ప్రతి పది నిమిషాలకు ఒక అత్యాచారం జరుగుతోంది. ఇక ప్రేమించలేదని చేసే హత్యలు, ప్రేమించిందని కుటుంబ సభ్యులు చేసే హత్యలు కోకొల్లలు. బాబాలు, యోగులు, గురు వుల పేరుతో దుర్మార్గాలూ బయటపడుతున్నాయి. మొన్న కర్నాటకలో మురుగ మత పీఠాధిపతి శివ మూర్తి తమను లైంగికంగా వేధించాడని పాఠశాల విద్యార్థినులు చెప్పగా విచారించిన కమిటీ నిజమేనని తేల్చింది. ఇలా ఎన్నయినా ఉదహరించవచ్చు.

ఇప్పుడు మన తెలంగాణ ప్రభుత్వంలోని మంత్రి సీతక్క 'హౌటూ రెస్పెక్ట్ ఉమెన్' అనే పేరుతో పాఠ్యాంశాన్ని విద్యార్థులకు బోధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. శిక్ష, శిక్షణ రెండూ ఏకకాలంలో జరిగితేనే నేరాలను అరికట్టవచ్చని చెప్పారు. మంచి ప్రయత్నమే. కానీ, మనకు స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచాక, సమానత్వం, ప్రజాస్వామ్య భావనలతో పాలన ఇస్తున్నామని చెప్పుకున్న తర్వాతా... ఇప్పుడు మహిళలతో ఎట్లా ప్రవర్తించాలో, వారినెలా గౌరవించాలో అనేది తెలుసుకోవా ల్సిన దశలోనే ఉన్నాము. అదీ విషాదం. ఎదుటి మనుషులను, భిన్న అభిప్రాయాలను, మనతోనే ఉన్న ఇతర మతాలను, వారి ఆచారాలను, ఆహారాలను, ఆహార్యాలను ఎలా గౌరవించాలో కూడా ఇంకా నేర్చుకోనేలేదు. వైవిధ్యాల పట్ల అవగాహనా కలుగలేదు.ఈ బేధాలనే శతృష్వరితంగా మార్చేస్తున్న ఘటనలను చూస్తున్నాం.

నేడు మహిళలను ఎలా గౌరవించాలో అనే విషయాలను ప్రజలకు అందించాల్సిన ప్రభుత్వ నిర్వాహకులు, సనాతన ధర్మం పేరుతో మనువాద భావజాలాన్ని ప్రచారం చేస్తున్నారు. దేశంలో స్త్రీని అబలగా కేవలం వంటింటికి, పిల్లలుకనేందుకు పరిమితం చేసే భావనలే వారి ఆలోచనలుగా ఉన్నాయి. రెండోవైపు స్త్రీలను, వారి అందాలను కాదు, అంగాలని వ్యాపార సరుకుగా మారుస్తున్న వ్యవస్థా విధానం మనపై ఆధిపత్యం చేస్తూవున్నది. ఈ రెండింటినీ ఎదుర్కోవాల్సిన సందర్భం ఇది. ఇప్పుడు జస్టీస్ కోసం నినదించే యువత, తల్లిదండ్రులూ, ఈ అవగాహనతో పనిచేస్తే ముందడుగేయగలం!

హర్యానా ఎన్నికల్లో బీజేపీకి ఎదురుగాలి?


తెలకపల్లి రవి

హర్యానా శాసనసభ ఎన్నికలు అక్టోబరు ఐదో తేదీన ఒకేవిడతగా జరగనున్నాయి. సెప్టెంబరు పదహారుతో నామినేషన్ల చివరి దశ ముగుస్తుంది. కేంద్రలో మూడోసారి మూలు గుతూ అధికారానికి వచ్చిన బీజేపీ ఇక్కడ కూడా మూడోసారి ఎలాగైనా అధికారం నిలుపు కోవాలని నానా తంటాలు పడుతుంటే కాంగ్రెస్ కూడా అంతే ఆశతో వ్యూహాలు రచిస్తున్నది. ఏమంటే మొన్నటి లోక్‌సభ ఎన్నికలలో ఈ రాష్ట్రంలో వున్న పది స్థానా లలో ఇరు పార్టీలకూ సమానంగా చెరి అయిదు వచ్చాయి. అటూ ఇటూ కలుస్తూ అధికారంపై ప్రభావం చూపుతున్న ప్రాంతీయ పార్టీలు మనుగడ కాపాడుకునే పరిస్థితిలో పడిపోయాయి.ఆ విధంగా చూస్తే హిందీ రాష్ట్రాలలో హర్యానాది ప్రత్యేక పరిస్థితి.ఇక్కడ ప్రధాన పోటీ రెండు జాతీయ పార్టీల మధ్యనే జరుగుతున్నా ప్రాంతీయ పార్టీల ప్రభావాన్ని కాదనడానికి వుండదు.అలా అవే చక్రం తిప్పడమూ జరగదు.దేశ రాజధానికి దగ్గరగా వుంటూ ఢిల్లీని అమితంగా ప్రభావితం చేసే హర్యానాలో బీజేపీ హిందూత్వ ప్రభావం కన్నా రాజకీయ వ్యూహాలతోనే ఎక్కువగా పట్టు సాధించగలిగింది. ఇక కాంగ్రెస్ విషయానికొస్తే మధ్య మధ్య విరామాలతో వారు ప్రధాన శక్తిగా కొనసాగుతున్నారు. గతంలో కాంగ్రెస్‌లోనే లేక అప్పటి జనతా జనతాదళ్ వంటి పార్టీలతోనో వుండి అధికారం పోయాక ప్రాంతీయ పార్టీలు పెట్టుకున్న రాజకీయ కుటుంబాలు ప్రాబల్యం సాగిస్తుంటాయి. వాటాను పొందుతుంటాయి. హర్యానా వికాస్ పార్టీ, ఇండియన్ యూనియన్ లోక్‌దళ్, జననాయక్ జనతా పార్టీ వంటివి ఆ విధంగా చెప్పుకోదగినవి. ఓం ప్రకాశ్ చౌతాలా, దుష్యంత్ చౌతాలాలతో కూడిన మాజీ ఉప ప్రధాని దేవీలాల్ కుటుంబం, బన్సీలాల్ దీపేందర్ హుడా, రావు బీరేంద్రసింగ్‌ల కుటుంబాలు అక్కడ రాజకీయాలలో కీలక స్థానమాక్రమించి నడిపిస్తూ వచ్చాయి. వారి మధ్యనే ముఖ్యమంత్రి పీఠం అటూ ఇటూ మారుతూ వచ్చింది. కానీ గత పదేండ్లలో మాత్రం బీజేపీ పాలనలోనే కొనసాగింది.ఆర్థిక, సామాజిక నేపథ్యంలో చూసినా హర్యానా రాజకీయాలలో జాట్ ప్రాబల్యం ఒక కీలకాంశంగా వుంటుంది.పంజాబ్ నుంచి విడిపోయిన హర్యానాకు అక్కడి రాజకీయాలతో ఏ మాత్రం పోలిక వుండదు. కానీ రైతు ఉద్యమంలో మాత్రం ప్రధాన పాత్ర పోషించింది. బడా వాణిజ్య, భూస్వామ్య వర్గాలు కూడా హర్యానాలో ఏకకాలంలో పట్టుకలిగి వుండటం విశేషం.



బీజేపీ వ్యూహాత్మక రాజకీయం

పదేండ్లుగా హర్యానాను బీజేపీ పాలిస్తున్నా సంప్రదాయికంగా ఇది వారి కంచుకోట కాదు. 1977 జనతా ప్రయోగం తర్వాత కూడా జనతా జనతా దళ్(సమతా) లేదా ఆ నాయకులు ఏర్పాటు చేసిన ప్రాంతీయ పార్టీలే నిర్ణాయకపాత్ర పోషిస్తూ వచ్చాయి.1996లో ఇన్‌చార్జిగా వచ్చిన నరేంద్ర మోడీ బన్సీలాల్ హర్యానా వికాస్‌పార్టీతో కలసి మొదటిసారి అధికారంలో భాగం వచ్చేలా చేశారు. అయినా తర్వాత మళ్లీ 2000లో బీజేపీకి ఆరు,2005లో రెండు స్థానాలే దక్కాయి.2000లో ఓం ప్రకాశ్ చౌతాలా ఐఎన్ఎల్‌డి తరపున 47 స్థానాలతో ముఖ్యమంత్రి కాగా తర్వాతి రెండు పర్యాయాలు కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా భూపేందర్‌సింగ్ హుడా కొనసాగారు. 2014, 2019లో బీజేపీ కొనసాగింది.దేవీలాల్ కుటుంబం నుంచి చీలిపోయిన దుష్యంత్ చౌతాలా ఐఎన్ఎల్‌డికి పోటీగానే జేజేపీని ఏర్పాటు చేశారు.అయితే గత పర్యాయం అవసరమైన మెజార్టీ రాకపోవడంతో దుష్యంత్ చౌతాలా నాయకత్వంలోని జేజేపీతో చేతులు కలిపాల్సి వచ్చింది. తగు గౌరవం ఇవ్వలేదనే కారణంతో జేజేపీ 2024 ఎన్నికలకు ముందే ప్రభుత్వం నుంచి వైదొలగగా ఇండిపెండెంట్ల సహాయంతో నెట్టుకువస్తున్నారు. అయితే తీరా ఆ ఎన్నికల ప్రాంగణంలో అప్పటిదాకా ముఖ్య మంత్రిగా వున్న మనోహర్‌లాల్ కట్టార్‌ను తొలగించి నయాబ్ సింగ్ సైనీని నియమించింది బీజేపీ అధిష్టానం.

వ్యతిరేకతకు కారణాలు

ఇన్ని మార్పులు చేసినా లోక్‌సభ ఎన్నికల నాటికి బీజేపీ తీవ్ర అసంతృప్తిని ఎదుర్కోవాల్సి వచ్చింది. దేశవ్యాపితంగా సాగిన రైతు ఉద్యమంలో హర్యానా రైతులు ఒక ముఖ్యపాత్ర పోషించారు. కనీస మద్దతు ధర నిర్ణయంలో నిర్లక్ష్యం ఈ రాష్ట్రంపై చాలా ప్రభావం చూపింది.ఆ సందర్భంగా సాగిన నిర్బంధం, కర్నాల్ చెక్‌పోస్టు వద్ద ఘటనలు దేశమంతా సంచలనం కలిగించాయి.ఫసల్ బీమా కింద సహాయం కోసం రైతులు ఈ అకౌంట్లు తెరవాలని హడావుడి చేసినా ఆచరణలో ఫలితం లేకపోయింది.నిరుద్యోగ సమస్య తీవ్రంగా వుండగా అగ్నివీర్ పథకం కింద తాత్కాలిక సైనిక నియామకాల విధానం కూడా నిరసనకు గురైంది.రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా వున్నా నియామకం చేపట్టలేదు. కాంగ్రెస్ సగం తెచ్చుకోగలిగింది.2019 ఎన్నికలలో ఆప్ ఇక్కడ అన్ని స్థానాలకు పోటీ చేయడంతో ఓట్లు చీలిపోవడం బీజేపీకి మేలు చేసింది. లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్, బీజేపీ చెరి అయిదు స్థానాలు తెచ్చుకున్నా ఇండియాలోని కాంగ్రెస్, ఆప్‌లకు కలిపి చూస్తే 46 (42+4) అసెంబ్లీ విభాగాల్లో మెజార్టీ వచ్చినట్టయింది. బీజేపీ 44 స్థానాల్లో ఆధిక్యత తెచ్చుకోగలిగింది. దీనికి తోడు జాతీయ స్థాయిలోనూ బీజేపీ ఆధిక్యత తెచ్చుకోలేక మిత్రపక్షాల మద్దతుపై ఆధారపడవలసిన పరిస్థితి రాష్ట్రంపైనా ఇప్పుడు మరింత ప్రభావం చూపుతుంది. ఇదే సమయంలో యువతకు ఉద్యోగ భద్రత కల్పించడంపై ఏకంగా ఆర్డినెన్సునే జారీ చేశారంటే ఎంత ఆందోళనగా వున్నదీ విదితమవుతోంది. బీసీ తరగతుల క్రీమీలేయర్ ఆదాయ పరిమితి పెంపు. పొలాలతో వచ్చే ఆదాయంపైన పన్ను వుండదనే హామీ ఇలా వరస ఉత్తర్వులతో ఓట్లు రాబట్టడానికి బీజేపీ తంటాలు పడుతున్నా పరిస్థితి గడ్డుగానే వుంటోంది.రెజ్లర్ వినేష్ ఫొగట్ ఉదంతం కూడా విముఖత పెంచింది. బీజేపీ ఆత్మవిశ్వాసాన్ని ఇది ఎంతగా దెబ్బతీసిందంటే ఎన్నికల తేదీలే వాయిదా వేయాలని, ఎన్నికల సంఘాన్ని కోరేవరకూ వెళ్లింది. ఎన్నికల ప్రకటన తర్వాత బీజేపీ నాయకత్వం అమిత్ షా, ధర్మేంద్ర ప్రధాన్, మనోహర్‌లాల్ కట్టర్ వంటివారు అభ్యర్థులను ఖరారు చేసేందుకు కసరత్తులు చేసినా ఆరెస్సెస్ మాత్రం సగంమంది అభ్యర్థులను మార్చాల్సిందేనని హుకుం జారీచేసింది. గత తప్పిదాలను దిద్దుకోవడానికి అవస్థలు పడుతుంటే కంగనా రనౌత్ రైతు ఉద్యమాన్ని కఠినంగా అణచివేసి వుండాల్సిందని నోరుపారేసుకోవడం మరింత దెబ్బగా పరిణమించింది. ఆభయంతోనే కేంద్ర నాయకత్వం ఆగమేఘాల మీద రంగంలోకి దిగి ఖండించాల్సి వచ్చింది. అయినా నష్టం తప్పడం లేదు. పైగా ఆమె తర్వాత కూడా అదే ధోరణిలో మాట్లాడుతున్నారు.

> **సీపీఐ(ఎం) హర్యానా రాష్ట్ర కమిటీ సమావేశం బీజేపీని ఓడించడం, ప్రత్యామ్నాయ లౌకిక ప్రభుత్వం ఏర్పర్చడం, వామపక్షాల బలం పెంచుకోవడం మూడు లక్ష్యాలుగా ప్రకటించింది. ఈ కారణంగానే లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల చీలిక నివారించడం కోసం అభ్యర్థులను నిలపలేదు. ఇప్పుడు కూడా మత రాజకీయాలను ఓడించడం, ఇండియా వేదిక విజయానికి ప్రాధాన్యత తమ విధానంగా రాష్ట్ర కార్యదర్శి సురేంద్రసింగ్ వివరించారు. జిల్లా కమిటీల సూచనలు తెప్పించామనీ, మరికొంత కసరత్తు ఇతర పార్టీల ఎంపికలు చూసి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు.**

కాంగ్రెస్ అవకాశాలు, అనైక్యత

ఇక కాంగ్రెస్ విషయానికి వస్తే అనైక్యత షరామామూలు సమస్యే. అందులోనూ కాస్త అనుకూల వాతావరణం కనిపించడంతో తగాదాలు మరింత ముదురుపాకాన పడుతున్నాయి.భూపేందర్ సింగ్ హుడా,ఆయన కుమారుడు దీపేందర్ సింగ్ హుడా, కోడలు ప్రేమలత, కేంద్ర మాజీమంత్రి సెల్జా, సీనియర్ నాయకుడు రణదీప్ సింగ్ సూర్జేవాలా వంటివారు తమ తమ ఆధిపత్యాల కోసం పెనుగులాడుతున్నారు.ఇదే చాలక బీజేపీలోకి వెళ్లిన మాజీ మంత్రి రావుబీరేంద్రసింగ్ ఆయన కుమారుడు బ్రిజేంద్ర సింగ్ కాంగ్రెస్‌లోకి తిరిగొచ్చి పోటీ పడుతున్నారు. వీరిలో సెల్జా, దీపేందర్ సింగ్, బ్రిజేంద్ర సింగ్ వంటివారు మొన్ననే పార్లమెంటుకు ఎన్నికయ్యారు. దాంతో కాంగ్రెస్ అధిష్టానం పార్లమెంటు సభ్యులెవరూ శాసనసభ పోటీలో వుండబోరని స్పష్టం చేసింది. 'ఇండియా' కూటమి అంటున్నా కాంగ్రెస్‌కు ఎవరితో పొత్తులేదు. పక్కనే పంజాబ్‌ను పాలిస్తున్న 'ఆప్' సరిహద్దులలో వున్న 28 సీట్లపై కేంద్రీకరిస్తుందని చెబుతున్నారు.ఫలితాల తర్వాత కూడా బీజేపీ ఆప్ మద్దతునిచ్చే అవకాశం వుండకపోవచ్చు. ఒపీనియన్ పోల్స్‌లో కాంగ్రెస్‌కు ఆధిక్యత కనిపిస్తున్నా కొన్ని బీజేపీకి మొగ్గు చూపిస్తున్నాయి. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికల తర్వాత దృశ్యం మారిందనే సంకేతమివ్వడానికి ప్రయత్నిస్తున్నాయి. వీటిని గమనించిన కాంగ్రెస్ నాయకత్వం ఐక్యతను పెంచడానికి, తామే విజేతలమన్న భావం బలోపేతం చేయడానికి నడుం కట్టింది.మరింత మంది పరిశీలకులను వినియోగిస్తోంది. వాస్తవానికి మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లో జాట్ ఆధిక్యత వున్న హిస్సార్, సోనేపట్, సిర్సా,రోహ్తక్ వంటి చోట్ల , రైతు ఉద్యమం బలంగా సాగిన అంబాలాలో కాంగ్రెస్ గెలుపొం దడం సామాజిక సమీకరణల సంకేతాలు మార్చింది. కర్నాల్, కురుక్షేత్ర, బివానీ,గుర్గావ్,ఫరీదాబాద్ వంటి చోట్ల కూడా ప్రజల్లో అసంతృప్తి వున్నా బీజేపీ లోక్‌సభ స్థానాలు తెచ్చుకుంది.

సీపీఐ(ఎం) హర్యానా రాష్ట్ర కమిటీ సమావేశం బీజేపీని ఓడించడం, ప్రత్యామ్నాయ లౌకిక ప్రభుత్వం ఏర్పర్చడం, వామపక్షాల బలం పెంచుకోవడం మూడు లక్ష్యాలుగా ప్రకటించింది. ఈ కారణంగానే లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల చీలిక నివారించడం కోసం అభ్యర్థులను నిలపలేదు. ఇప్పుడు కూడా మత రాజకీయాలను ఓడించడం, ఇండియా వేదిక విజయానికి ప్రాధాన్యత తమ విధానంగా రాష్ట్ర కార్యదర్శి సురేంద్రసింగ్ వివరించారు. జిల్లా కమిటీల సూచనలు తెప్పించామనీ, మరికొంత కసరత్తు ఇతర పార్టీల ఎంపికలు చూసి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు.

ప్రాంతీయుల ప్రభావమెంత?

ఈవిధంగా కాంగ్రెస్, బీజేపీల మధ్య హోరాహోరీ పోరాటంగా వుంటే ప్రాంతీయ పార్టీల మనుగడ మరో సవాలుగా మారింది. పైనే చెప్పుకున్నట్టు ఈ రెండు పార్టీల మధ్యన గతంలో రాష్ట్రాన్ని పాలించిన నేపథ్యం వాటికి వుంది.అయితే మొన్నటి లోక్‌సభ ఎన్నికల దెబ్బతో అవి ఒక్కసారిగా కుదేలైపోయాయి. ఈ పార్టీలే పొత్తులకు కూడా సిద్ధమవడానికి కారణమదే. ఐఎన్ఎల్‌డి బీఎస్పీతో జట్టుకట్టింది.మాయావతి నుంచి విడిపోయిన చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వంలోని ఎస్పీ(కాన్షీరాం)వర్గం జేజేపీతో పొత్తు పెట్టుకుంది. గతంలో బీఎస్పీకి స్థానాలువచ్చిన ఉదాహరణలున్నాయి, జనాభాపరంగా కూడా జాట్‌లు 25శాతం అయితే దళితులు 20శాతం వున్నారు, మొత్తం 17 రిజర్వుడు స్థానాలున్నాయి. 2019లో పదిస్థానాలు తెచ్చుకున్న జేజేపీతో జట్టుకట్టిన బీజేపీ ఇప్పుడు దూరం కావడం ఇతర వర్గాలలో పట్టు పెంచుకోవడమే. ఆపార్టీ తరపున గెలిచిన పదిమందిలో ముగ్గురే మిగలగా తక్కిన వారు కాంగ్రెస్, బీజేపీలలో కలసిపోయారు. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కశాతం ఓట్లు కూడా రానిస్థితి. బీజేపీపై వ్యతిరేకత తమను దెబ్బతీసిందని జేజేపీ భావనగా వుంది. వీటన్నిటి అంతిమ ఫలితం ఏమిటో చూడవలసిందే.ప్రజాస్వామ్య లౌకిక విలువలు, రాష్ట్రాల హక్కుల కోసం గట్టిగా నిలబడకపోతే ప్రాంతీయ పార్టీల అవకాశవాద పోకడలు వాటి అస్తిత్వానికే ముప్పు తెస్తాయనే వాస్తవాన్ని కూడా హర్యానా అనుభవం చెబుతున్నది. జేజేపీ మద్దతు తీసుకుని కూడా నిష్కర్షగా గెంటివేసిన బీజేపీ తీరువాటికి ఒక హెచ్చరికగానూ వుంటుంది. మొత్తంపైన సర్వేలు,లోక్‌సభ ఫలితాల తీరు చూస్తే ఇక్కడ బీజేపీ ఎదురుదెబ్బ తినే అవకాశం ఎక్కువగా వుంటుందన్న పరిశీలకుల భావన నిజమయ్యే అవకాశాలే ఎక్కువ. ■

రుణమాఫీ ఏ'మాయే'?

తెలంగాణ సర్కార్ అమలు చేసిన రుణమాఫీ రాజుగారి కొత్తబట్టలు కథను గుర్తుకు తెస్తున్నది.అంతా ఓకే...అంతా అయిపోయింది అంటే.. అవుననే భజనపరులున్నంతకాలం రాజకీయాలు ఇలాగే ఉంటాయి. 'మోసేవాడికే తెలుస్తుంది..కావడి బరువన్నట్టు' ఏదైనా మన దగ్గరికొచ్చేసరికి అసలు విషయం బోధపడుతుంది. సరైన అంచనా, అవగాహన లేకుండా ఇష్టారీతిన హామీలిస్తే ఇలాగే ఉంటుందని రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ చర్యలు మరోసారి రుజువు చేస్తున్నాయి. అధికారం చేపట్టిన వారం రోజుల్లోనే రూ.రెండు లక్షల రుణమాఫీని ఏక కాలంలో చేస్తామని ఎన్నికలముందు ప్రకటించిన కాంగ్రెస్ ఎనిమిది నెలల తర్వాత మూడు దఫాల్లో తూతూ మం త్రంగా మమా అనిపించిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. రూ.2 లక్షలలోపు రుణాలు తీసుకున్న 42లక్షల మందికి మాఫీ చేయాలంటే రూ.31 వేల కోట్లు ఖర్చవుతాయని అసెంబ్లీ సాక్షిగా రేవంత్ ప్రభుత్వం ప్రకటించింది. తీరా అమలుకొచ్చేసరికి రూ.28వేల కోట్లకు కుదించింది. ఆచరణలో ఆ మొత్తాన్ని రూ.18వేల కోట్ల తగ్గించింది. ఫలితంగా రాష్ట్రంలో 12 లక్షల మంది అర్హులైన వారికి రుణమాఫీ కాని పరిస్థితి నెలకొంది. రైతు భరోసా కింద రెండుసార్లు రైతులకివ్వాల్సిన రూ.15 వేల కోట్ల నిధులకు మరో మూడు వేల కోట్లు కలిపి రుణమాఫీ చేసిందని విపక్షాలు దుమ్మెత్తి పోస్తున్నాయి. రైతులతో కలిసి ఆందోళబాట పట్టాయి.ఈ నేపథ్యంలో సమస్యను పక్కదారి పట్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. గత బీఆర్ఎస్ సర్కార్ ప్రారంభించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, దళితులకు మూడెకరాల భూమి, దళిత బంధు పథకాల అమలు తీరును కాంగ్రెస్ రూ.2లక్షల రుణమాఫీ మరిపిస్తున్నదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజా గ్రహం, ఆందోళన వస్తున్నదనే సందర్భంలో గతసర్కార్ భావోద్వేగాలను రెచ్చగొట్టి వాటిని అణగదొక్కే ప్రయత్నం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం సైతం అదే బాటలో పయనిస్తే తగిన మూల్యం తప్పకపోవచ్చు!

- ఊరగొండ మల్లేశం

ఏం.. ఇరగబొడిశారని..?

పార్లమెంటు ఎలక్షన్లు జరిగి కనీసం ఆర్నెల్లు కూడా పూర్తి కాలేదు. మన ప్రధాని మోడీగారు అప్పుడే వచ్చే సార్వత్రిక ఎన్నికల (2029) గురించి ఊదరగొట్టడం ప్రారంభించేశారు. ఇటీవల ఆయన ఓ కార్యక్రమంలో మాట్లా డుతూ... 'నాలుగోసారీ ఢిల్లీ పీఠం మాదే...' అంటూ నొక్కి వక్కాణించారు. ఇప్పుడైతే చంద్రబాబు మీద, నితీశ్ మీద ఆధారపడి బండి లాగించేస్తున్నారు కాబట్టి, బీజేపీ కూసింత భయంతో, భక్తితో నడుచుకుంటున్నట్టు కనబడుతోంది. కానీ గత రెండు దఫాలు ఇష్టానుసారంగా పాలించి, జనంపై భారాల మీద భారాలేసి నడ్డి విరిచింది ఈ కాషాయ దళపతులే కదా? నిర్దిష్ట ప్రణాళిక లేకుండా అర్థంపర్థం లేకుండా చేసిన పెద్దనోట్ల రద్దుతో ముసలోళ్లను సైతం బ్యాంకుల ముందు క్యూలో నిలబెట్టిన ఘనత కమలాధీశులదే కదా? జీఎస్టీతో కాఫీ దగ్గర్నుంచి కార్ల వరకూ అన్నింటి మీద పన్నుల మీద పన్నులేసి చావబాదింది వారే కదా? పెట్రో భారాలను పెంచి నిత్యావసరాల ధరలతో మనకు చుక్కలు చూపించింది కూడా '58 అంగులాల' ఛాతి ఉన్నవారే కదా?

కరోనా సమయంలోనూ వంట గ్యాస్ ధరల పేరుతో రూ.400 ఉన్న బండ బరువును రూ.వెయ్యి దాకా పెంచి, అంబానీ, అదానీలో సేవలో తరించింది 'ఈ మిత్రోన్'లే కదా? కోవిడ్ నివారణకు చప్పట్లు కొట్టండి, దీపాలు వెలిగించండి, అప్పడాలు తినండంటూ ప్రచారం చేసింది ఈ 'న.మో.' గారు, ఆయన వీరభక్తులే కదా? ఇలా చెప్పుకుంటే పోతే...2014 నుంచి ఈ 'అరివీర భయంకర దేశ భక్తులు' చేసిన మోసాలు, జనానికి పెట్టిన వాతలు అన్నా..ఇన్నా...? అందుకే ఇటీవల మోడీ స్పీచ్ విన్న తర్వాత ఈ రిపోర్టర్ డైరీ రూపంలో ఆయనకు ఒకటే ఒక ప్రశ్న వేస్తున్నా... 'ప్రధాని గారూ...గత పదేండ్లుగా మీరు ఏం ఇరగబొడిశారు...?' జర చెప్పండి సార్!

-కేఎన్ హరి

క్షమాభిక్ష



ఆఫీసు నుండి ఇంటికి వచ్చి, భార్య అందించిన చాయి తాగుతూ టీవీ పెట్టాడు పుష్పకుమార్. రిమోట్‌తో ఛానల్స్ మార్చుతూ ఉన్నాడు. ఉన్నట్టుండి ఒక ఛానల్ వద్ద ఆగిపోయాడు. ఆ ఛానల్‌లో పెద్దాయన కన్పించాడు మరి! పెద్దాయన అంటే పుష్పకుమార్‌కి ప్రాణం! పెద్దాయనను చూస్తూ తరించిపోతాడు. మాటలు వింటూ పులకరించిపోతాడు! పెద్దాయన అందరిలాంటి మనిషి కాదని, సాక్షాత్తూ ఆది విష్ణువు పదకొండవ అవతారమని, దుష్టశిక్షణ, శిష్ట రక్షణ చేయటానికి భూమిపై అవతరించాడని పుష్పకుమార్ ప్రగాఢ విశ్వాసం! అందుకే పెద్దాయన టీవీలో కనపడగానే టీవీ రిమోట్ గట్టిగా పట్టుకున్నాడు. ఇంకెవ్వరూ తీసుకోకుండా!

టీవీ చూస్తున్న పుష్పకుమార్ మొహంలో రంగులు మారుతున్నాయి. రకరకాల భావాలు కన్పిస్తున్నాయి! లేచి వెళ్లి టీవీని కౌగిలించుకోయాడు! పుష్పకుమార్ కదలికలు గమనిస్తున్న చింటుగాడు "అమ్మా" అంటూ గావుకేక పెట్టాడు!

వంట చేస్తున్న లక్ష్మి ఉలిక్కిపడింది! చేతిలోనే కడాయి అలాగే వదిలేసి, హాల్లోకి పరుగెత్తుకుని వచ్చింది! టీవీని పుష్పకుమార్ కౌగిలించుకోబోయే సీన్ చూసింది! పుష్పకుమార్ యుక్తవయస్సులోని అభిమాన హీరోయిన్ తెరమీదికొచ్చిందేమోనని అనుకుంటూ, ఆయన చేయి పట్టుకుని పక్కకు లాగేసింది! కాని తెరమీద పెద్దాయన! చిరాగ్గా భర్త మొహంలోకి చూసింది! పుష్పకుమార్ కండ్లలో నీళ్లు! టీవీలో పెద్దాయన! ఏకకాలంలో కనిపించేసరికి లక్ష్మి గందరగోళపడింది!

"ఏమైందండి!" అడిగింది పుష్పకుమార్‌ని ఆదుర్దాగా!

"పెద్దాయన క్షమాపణలు చెబుతున్నాడు లక్ష్మీ!" అన్నాడు పుష్పకుమార్ డగ్గుత్తికతో!

"అంతేనా!" అన్నది లక్ష్మి తేలికగా!

"అంత తేలికగా మాట్లాడుతావేం! పెద్దాయన క్షమాపణ చెప్పటం అంటే సాధారణ విషయమా!" అన్నాడు పుష్పకుమార్ కండ్లలో నీళ్లు తుడుచుకుంటూ.

"ఇంతకీ క్షమాపణ దేనికి చెప్పాడు!" అడిగింది లక్ష్మి.

"అలా అడుగు చెబుతాను!మహావీరుడైన శివాజీ విగ్రహం నేలకూలింది! మహారాష్ట్రలో జరిగిన ఈ దుర్ఘటనకు పెద్దాయన చలించిపోయారు! అందుకే శివాజీ నేలమీద అడుగుపెట్టగానే శివాజీకి పెద్దాయన క్షమాపణ చెప్పారు! అంత పెద్దాయన క్షమాపణ......" అంటూనే పుష్పకుమార్ గొంతు జీరబోయింది!

"అదేమిటండీ! పెద్దాయన క్షమాపణ చెబితే మీరు కండ్ల నీళ్లు పెట్టుకుంటున్నారెందుకు?" అన్నది లక్ష్మి ఆశ్చర్యంగా!

"పెద్దాయన అంటే ఎవరనుకున్నావ్? ఈ విశ్వానికే ఆయన పెద్దదిక్కు.. మహానాయకుడు! అంత స్థాయి గల నేత క్షమాపణ చెబుతున్నాడంటే అంది ఎంత లోతైన విషయమో! అర్థం చేసుకో!" అన్నాడు! పుష్పకుమార్!

"మీరు క్షమాపణ చెప్పడం పెద్దాయన గొప్పతనం అంటూ ఏవేవో చెబుతున్నారు! ఇంతకూ క్షమాపణ చెప్పే అర్హత పెద్దాయనకు ఉందా?" అడిగింది లక్ష్మి.

లక్ష్మి మాటలకు పుష్పకుమార్ నివ్వెరపోయాడు!దిగ్భ్రాంతి చెందాడు! కొంతసేపటికి తేరుకున్నాడు!

"ఉన్నమాటే అన్నాను! ఎందుకంటే ఇప్పటికే కొన్ని వందల, వేలసార్లు, ఈ జాతికి, భారతావనికి క్షమాపణ చెప్పాల్సి ఉండగా, ఈ రోజువరకు కూడా క్షమాపణ చెప్పలేదు! అందుకే క్షమాపణ చెప్పే అర్హత ఆయనకుందా? అని మళ్లీ అడుగుతున్నాను!"అన్నది లక్ష్మి.



" ఈ జాతికి క్షమాపణలు చెప్పేంత తప్పు ఏం చేశాడు?" ఆశ్చర్యంగా అడిగాడు పుష్పకుమార్.

"పెద్దనోట్ల రద్దు! దాని ప్రభావం ఈ రోజుకి చిన్నస్థాయి పరిశ్రమలపై పడింది. లక్షలమందికి ఉపాధి పోయింది! మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థ వెనక్కి వెళ్లిపోయింది! పెద్దనోట్ల రద్దు వల్ల యాభై రోజుల్లో ఫలితాలు రాకపోతే నన్ను ఉరితీయండి! అన్నాడు! ఈ రోజుకీ ఫలితాలు రానే లేదు! అందువల్ల కనీసం క్షమాపణలు కూడా చెప్పలేదు! దేశ ఆర్థిక వ్యవస్థ విధ్వంసమైంది! దీనికెవరు బాధ్యత వహిస్తారు?" అడిగింది లక్ష్మి.

"అదొక్కటే గదా?" అన్నాడు పుష్పకుమార్.

"చాలా ఉన్నాయి! కరోనా వచ్చినప్పుడు ఆకస్మికంగా లాక్‌డౌన్ ప్రకటించాడు! పొట్ట చేతపట్టుకుని బతుకుదెరువు కోసం వలసెల్లినవారు తిరిగొచ్చే అవకాశమే లేకుండా లాక్‌డౌను అమలు చేశారు! స్వగ్రామాలకు నడస్తూ బయలుదేరి మార్గమధ్యంలోనే వందలకొద్దీ పేదలు ప్రాణాలు వదిలారు!

అంతిమ సంస్కారాలు జరగడం హిందువులకు అత్యంత పవిత్రకార్యం!అది నోచుకోకుండానే ఎంతోమంది గంగానదిలో శవాలై తేలారు! కరోనా చావులకి పెద్దాయన ఎనాడైనా క్షమాపణ చెప్పాడా?" ప్రశ్నించింది! లక్ష్మి

"మనదేశంలోనే కరోనా వచ్చిందా? అది ప్రపంచ సమస్య!" అన్నాడు పుష్పకుమార్.

"దేవాలయంలో దేవుడి కండ్లముందే చిన్నపిల్లపై పాశవికంగా లైంగికదాడి చేసి చంపేశారు! మరోచోట లైంగికదాడి చేసిన దళిత యువతిని చంపేసి, తల్లిదండ్రులకు చెప్పకుండా ఆ యువతి శవానికి అంత్యక్రియలు చేసేశారు! మణిపూర్‌లో నగ్న యువతిని ఊరేగించారు! బెంగాల్‌లో నిద్రిస్తున్న డాక్టర్‌పై లైంగికదాడికి పాల్పడ్డారు! వీటిల్లో దేనికి పెద్దాయన క్షమాపణ చెప్పలేదేం?" నిలదీసింది లక్ష్మి.

"అందుకే బేటీ బచావో అని పెద్దాయన నినాదం ఇచ్చారు!" అన్నాడు పుష్పకుమార్.

" ఆ నినాదం ఇచ్చిన తర్వాతే లైంగికదాడులు పెరిగాయని మీరు తెలుసుకోండి! దేశంలో రైళ్లు వరసగా సొప్పకట్టెలతో చేసిన బండ్లలా విరిగిపోతున్నాయి! పదుల సంఖ్యలో ప్రాణాలు పోతున్నాయి! రైళ్లలో ప్రయాణించాలంటేనే జనం గుండెల్లో భయం కలుగుతున్నది! ఏనాడైనా వరసగా జరుగుతున్న రైలు ప్రమాదాలకు క్షమాపణ చెప్పారా? కనీసం విచారమైనా వ్యక్తం చేశారా?" నిలదీసింది లక్ష్మి

"రైళ్లలో భద్రతా ఏర్పాటు పెంచుతారు!" అన్నాడు పుష్పకుమార్.

"వర్షాలు పడుతుంటే అనేక బ్రిడ్జిలు లీకు అవుతున్నాయి! దాదాపు పది వంతెనలు కూలిపోయాయి! ఏ వంతెన ఎప్పుడు కూలిపోతుందో, ఏ దుర్వార్త వింటామో అని భయంగా గడుపుతున్నారు! ప్రజలు! బ్రిడ్జిలు కూలిపోతుంటే ఏనాడైనా క్షమాపణ చెప్పారా?" అడిగింది లక్ష్మి.

"పెద్దాయన మేస్త్రీ కాదు! బ్రిడ్జిలు కూలిపోతే క్షమాపణ చెప్పటానికి!" అన్నాడు పుష్పకుమార్ ఉక్రోశంగా.

"మరి శివాజీ విగ్రహాన్ని పెద్దాయన నిర్మించారా? క్షమాపణ ఎందుకు చెప్పినట్టు?" సూటిగా ప్రశ్నించింది లక్ష్మి.

పుష్పకుమార్‌కి సమాధానం దొరకలేదు!

"మీరు సమాధానం చెప్పలేరని నాకు తెలుసు!దేశంలో అనేక వ్యవస్థలు దెబ్బతింటున్నాయి. ప్రజలు పేదరికంలోకి పడిపోతున్నారు! మహిళలకు భద్రత లేదు! డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్న గుజరాత్‌లో వరదలు వస్తే ఇండ్లల్లోకి మొసళ్లు వచ్చాయి! ఇలాంటి వాటికి చలించరు! దేశంలో ఎంతటి అమానవీయ సంఘటనలు జరిగినా నోరెత్తి మాట్లాడరు! కాని ఈ రోజు శివాజీ విగ్రహం కూలిపోయిందని, బాధపడి ప్రజలకు క్షమాపణ చెబుతున్నారు! ఎందుకు చెబుతున్నారో మీకు తెలుసా?" ప్రశ్నించింది లక్ష్మి.

అయోమయంగా చూశాడు పుష్పకుమార్!

"రాబోయే కాలంలో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి! మహారాష్ట్ర ప్రజలకు శివాజీ అంటే ఎంతో ప్రేమ!గౌరవం! ఎందుకంటే ఈ దేశపు మూలవాసులలోని శూద్రకులంలో పుట్టి మహావీరుడై, ఎందరినో ఎదిరించి సామ్రాజ్యాన్ని స్థాపించిన మహనీయుడు శివాజీ! అందుకే ఎన్నికలమీద ప్రేమతో శివాజీ విగ్రహం పడిపోయిందని క్షమాపణ చెప్పారు! ఆ క్షమాపణలు హృదయంలో నుండి రాలేదు! పెదవుల నుండి వచ్చాయి! ఓట్లకోసం మాత్రమే వచ్చాయి!" అని ముగించింది లక్ష్మి.

- ఉషాకిరణ్

ఎన్ఎంఎంఎస్ఎస్ దరఖాస్తు గడువు 30 వరకు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్ఎంఎంఎస్ఎస్)కు 2024-25 విద్యాసంవత్సరంలో ఎంపికైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 30వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పీ) ద్వారా దరఖాస్తుల పునరుద్ధరణ, ఆన్‌లైన్‌లో దరఖాస్తులను అప్‌లోడ్ చేసే గడువు ఈనెల 30 వరకు ఉందని తెలిపారు. సకాలంలో దరఖాస్తు చేసేలా విద్యార్థులకు వివరించాలని సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలను కోరారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు https://scholorships.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

కేజీబీవీ ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పరిధిలోని పాలమాకుల గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో సమస్యలపై ప్రశ్నిస్తే వేధిస్తున్నారనీ, కులం పేరుతో తిడుతున్నారని విద్యార్థులే రోడ్డెక్కి ఆందోళన చేసే పరిస్థితి రాష్ట్రంలో దాపురించిందనిభారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి, భాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాలల్లో పాఠాలు చెప్పి విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు వివక్షను పాటించడం దుర్మార్గపు చర్య అని విమర్శించారు. ఇలాంటి వాటిని ప్రభుత్వం ఉపేక్షించకూడదని కోరారు. విద్యార్థులకు బోర్ వాటర్ ఇచ్చి ఉపాధ్యాయులు ప్రత్యేకంగా మినరల్ వాటర్ తెచ్చుకోవడం, ప్రత్యేకంగా వంట చేయించుకోవడం సరైంది కాదని తెలిపారు. విద్యార్థులకు వడ్డించే అన్నంలో పురుగులు వస్తున్నాయనీ, నాణ్యమైన భోజనం పెట్టాలని అనేకసార్లు ఉపాధ్యాయులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని విమర్శించారు. పైగా ప్రశ్నిస్తున్నరనే కారణంగా విద్యార్థులను ఉపాధ్యాయులు వేధించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

సమస్యలు పరిష్కారం చేయాలని అడిగిన విద్యార్థులను కులం పేరుతో వేధించడం దుర్మార్గపు చర్య అని విమర్శించారు. కనీసం ఉన్నత అధికారుల నుంచి కూడా సరైన పర్యవేక్షణ లేదని తెలిపారు. రాష్ట్రంలో గురుకులాలు, కేజీబీవీలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలనీ, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అప్రమత్తంగా ఉండండి

- ఆరోగ్య శాఖ అధికారులకు మంత్రి దామోదర ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఉన్నతాధికారులను ఆదేశించారు. వర్షాలు తగ్గే వరకూ డాక్టర్లు, సిబ్బందికి సెలవులు ఇవ్వొద్దంటూ డీఎంఈ వాణి, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, డీహెచ్ రవిందర్ నాయక్‌ను ఒక ప్రకటనలో ఆదేశించారు. డాక్టర్లు, స్టాఫ్ అందరూ హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలనీ, ప్రతి ఒక్కరూ డ్యూటీలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టిమేటెడ్ డెలివరీ డేట్ (ఈడీడీ) దగ్గరగా ఉన్న గర్భిణులను ముందే హాస్పిటళ్లకు తరలించి, వెయిటింగ్ రూమ్స్ కేటాయించాలని ఆదేశించారు. గర్భిణికి, ఆమెతో వచ్చిన కుటుంబ సభ్యులకు భోజన వసతి కల్పించాలని ఆదేశించారు. అంబులెన్స్ సర్వీసులు అన్ని చోట్ల అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మెడిసిన్, టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. పేషెంట్లకు అందించే ఆహారం, తాగునీరు విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు తగ్గిన తర్వాత దోమల బెడద ఎక్కువగా ఉంటుందనీ, ప్రస్తుతం తగ్గుముఖం పట్టిన జ్వరాలు మళ్లీ పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఈ విషయాన్ని ముందే ప్రజలకు తెలిసేలా అవగాహన కల్పించాలనీ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ సహకారం తీసుకోవాలని సూచించారు.

మెడికల్ కాలేజీలు, నర్సింగ్ కాలేజీల హాస్టళ్లలో స్టూడెంట్స్‌కు అందజేసే ఫుడ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గురుకులాల్లో పిల్లలకు అందించే భోజనం విషయంలోనూ జాగ్రత్తలు పాటించేలా సంబంధిత శాఖ అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

గురుకుల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గురుకుల విద్యాసంస్థలు, సంక్షేమ హాస్టళ్లలో ఉండే విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తెలిపారు. వారి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నాసిరకం, కల్తీ వస్తువులను ఉపయోగించడం, తాగునీరు కలుషితం కావడం వల్ల వల్ల విద్యార్థులు అనార్యోగాల పాలవుతున్నారని తెలిపారు. ఫుడ్‌పాయిజన్‌కు గురవుతున్నారని వివరించారు. అందుకుగల కారణాలను గుర్తించాలని కోరారు.

ఆయుష్ శాఖ జనరిక్ వృద్ధాప్య వైద్య శిబిరం



హైదరాబాద్ : ప్రభుత్వ హోమియోపతి వైద్యశాల ఓల్డ్ ఎంఎల్ఏ క్వార్టర్స్ హిమాయత్‌నగర్ వారి ఆధ్వర్యంలో శనివారం ఆయుష్ శాఖ జనరిక్ వృద్ధాప్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో షుగర్‌వ్యాధిగ్రస్తులకు రక్త నమూనాలను సేకరించి పరీక్షలు చేశారు. 100 మందికి పైగా రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేట్ మహాలక్ష్మి, ఆయుష్ డైరెక్టర్ డా॥ వేణు సుకుమార్, సీనియర్ వైద్యాధికారి డా॥ ఎస్‌బి మాధవి సిబ్బది డీపీఎం శ్రావణ్, ఫార్మసిస్టు సిబ్బంది ప్రభాకర్ చారి, నవీన్ స్థానికులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు అమలు చేయాలి

- సుప్రీంకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలి : వెబినార్‌లో టాప్రా అధ్యక్షులు పి.నారాయణరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈపీఎఫ్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు అమలు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ల అసోసియేషన్ (టాప్రా) అధ్యక్షులు పి.నారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "మరి..... పీఎఫ్, పెన్షనర్ల సంగతేమిటి" అనే అంశంపై జరిగిన వెబినార్‌లో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. నేషనల్ పెన్షన్ సిస్టమ్ స్థానంలో ఆగస్టు 24న కేంద్రం యూపీఎస్‌ను ప్రవేశ పెట్టిందన్నారు. ఎన్‌పీఎస్ కంటే కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ అందులోనూ అనేక ఆంక్షలు ఉన్నాయని ఆక్షేపించారు. 1972లో తీసుకొచ్చిన ఫ్యామిలీ పెన్షన్ స్కీం వల్ల దేశంలో మొత్తం 75 లక్షల మంది పీఎఫ్ పెన్షన్ దారులు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2013లో కేంద్రం నియమించిన భగత్‌సింగ్ హెూషియార్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని కోరారు.

హెచ్ఏఎల్‌లో విజయం సాధించిన నాయకులకు అభినందనలు : వీఎస్ బోస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హెచ్ఏఎల్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన కార్మిక సంఘ నాయకులకు ఏఐటీయూసీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వీఎస్ బోస్ అభినందనలు తెలిపారు. ప్రస్తుతం గుర్తింపు సంఘంగా ఉన్న బీఎంఎస్‌పై హెచ్ఏఎల్ వర్కర్స్ యూనియన్ విజయం సాధించిందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై గెలవటమేనని తెలిపారు. హెచ్ఏఎల్‌లో కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విజయం సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్పొరేట్ విద్యాసంస్థలను నియంత్రించాలి

- ప్రయివేటు స్కూళ్ల పరిష్కారానికి కృషి చేస్తా : ట్రస్మా సమావేశంలో ఎమ్మెల్సీ కోదండరామ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలను నియంత్రించాల్సిన అవసరముందని టీజేఎస్ అధినేత, ఎమ్మెల్సీ కోదండరామ్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో విద్యారంగంపై సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేటు బడ్జెట్ స్కూళ్లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డీఆర్డీడీవో మాజీ చైర్మెన్, రక్షణ శాఖ మంత్రి సలహాదారు జి సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక రంగాల పట్ల అవగాహన పెంపొందించాలని సూచించారు. 2047 నాటికి వికసిత్ భారత్‌గా కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని చెప్పారు. ఇప్పుడు చదువుతున్న విద్యార్థులను ఏదో ఒక రంగంలో గొప్పవారిగా తీర్చిదిద్దాలని కోరారు. అందుకనుగుణంగా ఉపాధ్యాయులు, యాజమాన్యాలు కృషి చేయాలని సూచించారు. పరిశోధనల్లో భారత్ మరింత ముందుకెళ్లాలంటే విద్యార్థి స్థాయి నుంచే ప్రోత్సహించాలని అన్నారు. ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు కెవి ప్రదీప్ మాట్లాడుతూ విద్యార్థులను గొప్పవారిగా తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులకే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎల్ఎఫ్ వ్యవస్థాపకులు వెంకటస్వామి, పీఎస్ఏసీడబ్ల్యూఏ జాతీయ అధ్యక్షులు సయ్యద్ అహ్మద్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు కందాల పాపిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు ఆరుకాల రామచంద్రారెడ్డి, రామచందర్, బాణాల రాఘవ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

- గిరిజన కార్పొరేషన్ చైర్మెన్ బెల్లయ్య నాయక్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రత్యేక కేంద్రీకరణ ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరముందని గిరిజన కార్పొరేషన్ చైర్మెన్ బెల్లయ్య నాయక్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌లో ట్రైకార్ రుణాలు, విధివిధానాలపై ప్రభుత్వ విప్ రామ చంద్రునాయక్ అధ్యక్షతన ఎంపీ బలరామ్ నేతృత్వంలో గిరిజన ఎమ్మెల్యేల సమక్షంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధి కుంటు పడిందన్నారు. ఆ ప్రాంతాల అభివృద్ధికి కేటాయించిన నిధులను గిరిజనేతర అవసరాలకు దారి మళ్లించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీడీఏలు నిర్వీర్యమయ్యాయన్నారు. ట్రైకార్ రుణాలు అవసరానికి తగిన విధంగా క్షేత్ర స్థాయికి చేరాలని చెప్పారు. మిగిలి ఉన్న పోడు భూముల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. అందుకు తగిన విదివిధానాలను రూపొందిస్తామని చెప్పారు. స్వయం ఉపాధికి తగిన విధంగా లోన్లు ఇచ్చేందుకు కృషి జరుగుతున్నదని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మురళీనాయక్, తెల్లం వెంకట్రావ్, అనిల్‌జాదవ్, ఎడ్మ బొజ్జి,కోరం కనకయ్య,పాయం వెంకటేశ్వర్లు, రాందాస్, ట్రైకార్ జనరల్ మేనేజర్ కె శంకర్‌రావు, జీసీసీ జనరల్ మేనేజర్ వి.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌కు ఎల్ఐసీ సాయం



నవ తెలంగాణ - హైదరాబాద్

నగరంలోని చిరంజీవి ఛారిటబుల్ ట్రస్టుకు ఎల్ఐసీ రూ.52 లక్షల కోట్ల విలువ చేసే మెడికల్ పరికరాలను అందించింది. ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్‌లో భాగంగా చిరంజీవి ఐ, బ్లడ్ సెంటర్‌లకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా సాయం చేసినట్టు పేర్కొంది. ఈ పరికరాలను ఎల్ఐసీ జోనల్ మేనేజర్ పునీత్ కుమార్, చిరంజీవి ఐ అండ్ బ్లడ్ బ్యాంక్ సెంటర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవి రాజుకు అందజేశారు. తమకు సాయం అందించిన ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎల్ఐసీనే ఫస్ట్ అని మాధవి రాజు పేర్కొన్నారు.

ఫార్చునర్ కారు బీభత్సం

- పార్కింగ్ వాహనాలను ఢీకొట్టి.. పల్టీలు కొట్టి ధ్వంసమైన కారు, ఆటో, ద్విచక్రవాహనం



నవతెలంగాణ-బంజారాహిల్స్

హైదరాబాద్ బంజారాహిల్స్ ప్రధాన రహదారిపై శనివారం ఫార్చునర్ కారు బీభత్సం సృష్టించింది. వివరాల్లోకెళ్తే.. బన్సిలాల్ పేటకు చెందిన కుటుంబ సభ్యులు ఫార్చునర్ కారులో హైటెక్ సిటీ వైపు నుంచి పంజాగుట్ట వైపుకు వెళ్తున్నారు. ఆ సమయంలో ఎండీ అబ్బాస్ డ్రైవింగ్ చేస్తున్నాడు. అయితే, అతివేగంగా ఉన్న వాహనం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2లోని లుంబిని మాల్ వద్ద అదుపు తప్పి పల్టీలు కొడుతూ అక్కడే పార్కింగ్ చేసి ఉన్న ఆటో, కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో అవి ధ్వంసమయ్యాయి. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రానికి బీజేపీ చేస్తున్న అన్యాయం పై పోరాటం చేయండి

- మాజీ సీఎం కేసీఆర్‌కు ఎంపీ చామల సూచన

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మాజీ సీఎం కేసీఆర్ ప్రజల్లోకి రావడాన్ని స్వాగతిస్తున్నామని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. అయితే కేంద్రంలోని బీజేపీ సర్కారు రాష్ట్రానికి అన్యాయంపై పోరాటం చేయాలని సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి హాజరై ప్రజల తరుపున పోరాడాలని కోరారు. పదేండ్లు అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు ఎన్నో హామీలిచ్చారనీ, అందులో ఏ ఒక్కదాన్ని కూడా అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ బుల్డోజరు సర్కార్ అంటూ మాజీ మంత్రి కేటీఆర్ ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గేకు ట్వీట్ చేశారని ఎద్దేవా చేశారు. మున్సిపల్ మంత్రిగా పని చేసిన వ్యక్తిగా చట్టవిరుద్ధంగా నిర్మాణం చేసిన భూములను లీజ్‌కు తీసుకున్నట్టు చెప్పడం సిగ్గు చేటన్నారు.

'మహాలక్ష్మి'కి 'నకిలీ' బెడద

- నకిలీ ఆధార్ కార్డులతో కండక్టర్లకు తలనొప్పులు
- గుర్తించకుంటే పై అధికారులు సీరియస్ అవుతున్నారని ఆవేదన
- సిటీలోని కొన్ని రూట్లలో కొంతమంది తప్పుడు మార్గాలు
- స్మార్ట్ కార్డులతోనే సమస్యకు పరిష్కారం



ఉచిత బస్సు ప్రయాణ పథకం 'మహాలక్ష్మి'లో నకిలీలతో కండక్టర్లకు తలనొప్పులు వస్తున్నాయి. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో ఈ పథకాన్ని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ ఆర్టీసీ) రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో గతంలో రోజుకు సగటున 35లక్షల మంది ప్రయాణం చేయగా.. మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఆ సంఖ్య 55లక్షలకు పెరిగింది. ఆధార్, ఓటర్ ఐడీ వంటి గుర్తింపు కార్డు చూపించి ఫ్రీ జర్నీ చేసే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించిన విషయం తెలిసిందే. అయితే, తెలంగాణ కార్డు లేని కొంతమంది నకిలీ కార్డులు సృష్టించి ప్రయాణిస్తున్నారని తెలిసింది. దీంతో కండక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. గుర్తించకుంటే చెకింగ్‌ల సమయంలో పై అధికారుల వద్ద మాటలు పడాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఇలాంటివి హైదరాబాద్‌లో ఎక్కడో చోట బయటపడుతున్నాయని తెలిసింది. ఒకరిద్దరు చేసే తప్పుడు చర్యల వల్ల లక్షలాది మందికి ఉపయోగపడే పథకాన్ని విమర్శించే వారికి అవకాశం కల్పించినట్లవుతుందని కండక్టర్లు అంటున్నారు. నకిలీ కార్డులను గుర్తించే సాధనాలు ఏవీ ఆర్టీసీ వద్ద లేకపోవడంతో కండక్టర్లు తిప్పలు పడుతున్నారు. పథకం దెబ్బతినకుండా పటిష్టంగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకానికి మహిళా ప్రయాణికుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. ప్రతి రోజూ సగటున 30 లక్షల మంది మహిళలు రాకపోకలు సాగిస్తున్నారు. పురుషులతో కలుపుకుంటే మొత్తంగా రోజూ 54.19లక్షల మందిని ఆర్టీసీ సురక్షితంగా సంస్థ గమ్యస్థానాలకు చేర్చుతోంది. ప్రయాణికుల్లో 50 శాతానికిపైగా మహిళ ప్రయాణికులే ఉంటున్నారు. బస్సులు కిక్కిరిసిపోతుండటంతో ఒక్కోసారి కండక్టర్లకు టిక్కెట్లు జారీ చేసేందుకు వీలు కూడా కలగడం లేదు. అధికంగా మహిళలే బస్సుల్లో ప్రయాణిస్తున్నారని కండక్టర్లు చెబుతున్నారు. కానీ కొందరు మహిళలు తమ ప్రయాణ సమయంలో గుర్తింపు కార్డులకు బదులు.. వాటి ఫొటో కాపీలను తెస్తున్నారని, స్మార్ట్ ఫోన్‌లలో సాఫ్ట్ కాపీలు చూపిస్తున్నారని చెబుతున్నారు. ఈ సమస్య ఎక్కువగా హైదరాబాద్‌లోనే ఉందని కండక్టర్లు అంటున్నారు. గుర్తింపు కార్డుల్లో ఫొటోలు స్పష్టంగా ఉండటం లేదన్నారు. చాలా మంది ఆధార్ కార్డుల్లో చిన్న నాటి ఫొటోలు ఉన్నా.. అప్‌డేట్ చేసుకోకుండా వచ్చేవారితో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు కండక్టర్లు వాపోతున్నారు.

తెలంగాణ ఉంటే చాలు..ఒకే..!

ఉచిత బస్సు పథకం కేవలం తెలంగాణ రాష్ట్రానికి చెందిన మహిళలకే వర్తిస్తోంది. ఇతర రాష్ట్రాల మహిళలు విధిగా చార్జీలు చెల్లించి టికెట్ తీసుకోవాలి. అయితే, గుర్తింపు కార్డులపై తెలంగాణ ప్రభుత్వం అని ఉంటే ఆర్టీసీ జీరో టికెట్లు జారీ చేస్తోంది. 40 మంది ప్రయాణం చేసేచోట వంద మందికిపైగా ఎక్కుతుంటే ఒరిజనల్ లేదా నకిలీ కార్డులు అనేవి గుర్తించలేకపోతున్నామని కండక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దీంతో ఓకవైపు ఒత్తిడికి గురవుతుంటే.. మరోవైపు పనిష్‌మెంట్‌లు తప్పడం లేదని మహిళా కండక్టర్లు ఆవేదనతో చెబుతున్నారు. అందువల్ల తెలంగాణ మహిళల పేరుతో స్మార్ట్ కార్డులు జారీ చేస్తే.. ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. టికెట్లు ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు.

అఖిలపక్షంలో తేలని 'పంచాయతీ'

(మొదటిపేజీ తరువాయి)

పూర్తికాకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు వాదనకు దిగాయి. అయితే అది రాష్ట్ర ప్రభుత్వ అంశమనీ, తాము నిర్ణయించుకున్న తేదీ నాటికి రిజర్వేషన్లు ఇస్తే, వాటిని అమలు చేస్తామని ఎస్ఈసీ తేల్చిచెప్పింది. తాము ఎన్నికల సంఘానికి జవాబుదారీనే తప్ప, రాష్ట్ర ప్రభుత్వానికి కాదనీ, పంచాయతీ ఎన్నికలు నిర్వహించకుంటే రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి రావల్సిన నిధులు నిలిచిపోతాయని ఎస్ఈసీ చైర్మెన్ తెలిపారు. శుక్రవారంనాడిక్కడి రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో మాసబ్‌ట్యాంక్‌లోని కార్యాలయంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా తదితర అంశాలపై చర్చించేందుకు చైర్మెన్ పార్థసారధి అధ్యక్షతన అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, సీపీఐ నుంచి పల్లా వెంకటొరెడ్డి, బాలమల్లేష్, బీఆర్ఎస్ నుంచి సోమ భరత్‌కుమార్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, కాంగ్రెస్ నుంచి నిరంజన్, బీజేపీ నుంచి చింతల రాంచంద్రారెడ్డితో పాటు పలు గుర్తింపు పార్టీల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎంఐఎం సభ్యులు హాజరుకాలేదు. కులగణన జరక్కుండా పంచాయతీ ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బీసీ జనగణన లెక్క తేల్చకుండా ఎన్నికలు నిర్వహిస్తే, ఆయా వర్గాలకు అన్యాయం చేసినట్టే అవుతుందని బీజేపీ సభ్యులు చెప్పారు. రాజ్యాంగ ప్రకారం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందనీ, అంతకు మించి రిజర్వేషన్లు ఇవ్వాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుందని సీపీఐ(ఎం) సభ్యులు స్పష్టంచేశారు.

కేంద్రంలో బీజేపీ అధికారంలో, కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నందున వీరిద్దరి లక్ష్యం ఒకటే అయినప్పుడు రాజ్యాంగ సవరణ ఎందుకు చేయరని వారు ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న అంశంపై ఇక్కడ చర్చ సరికాదని వివరించారు. కాంగ్రెస్ సభ్యులు కులగణనకు కట్టుబడి ఉన్నామనీ, దానిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. పరస్పర అభిప్రాయాల సేకరణ అనంతరం రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశమనీ, దానితో తమకు ఎలాంటి సంబంధం లేదని ఎస్ఈసీ చైర్మెన్ పార్థసారధి స్పష్టం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల ప్రకారమే వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సెప్టెంబర్ 7వ తేదీ నాటికి తుది జాబితా సిద్ధం చేసి, 13న డ్రాఫ్టును ముద్రిస్తామని చెప్పారు.

దానిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈఆర్వో, ఆర్డీఓ, ఎమ్మార్వోలకు దరఖాస్తులు, ఫిర్యాదులు చేసుకోవచ్చని అన్నారు. సెప్టెంబర్ నెలాఖరు నాటికి ఎన్నికల నిర్వహణ కోసం తాము అన్నీ సిద్ధం చేస్తామనీ, ఆలోపు రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల జాబితా ఇస్తే, దాన్ని అమలు చేస్తామని తెలిపారు. అయితే ఈ ప్రతిపాదనలపై బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కులగణనపై బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతుండగా చైర్మెన్ ఒకింత అసహనం వ్యక్తం చేశారు. రాజకీయ ప్రసం గాలు చేయొద్దని వారిస్తూ, రాజ్యాంగం ప్రకారం నిర్ణీత సమయంలో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందనీ, దీనిపై సుప్రీంకోర్టు ఉత్తర్వులు కూడా ఉన్నాయని గుర్తుచేశారు.

బుద్ధవనంలో అంతర్జాతీయ మ్యూజియం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఈ క్రమంలో అనుభవమున్న కన్సల్టెన్సీలు, నిపుణులతో అంతర్జాతీయ స్థాయిలో నమూనాలు, డిజైన్లను తయారు చేయించాలని అన్నారు. పర్యాటకులు ఆహ్లాదంగా గడిపేందుకు వీలుగా ఫుడ్ కోర్టులు, వివిధ స్టాళ్లను ఏర్పాటు చేయటం ద్వారా హైదరాబాద్‌లోనే ఈ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని గోల్కొండ చుట్టూ ఉన్న రోడ్లన్నీ ఇరుకుగా మారాయని సీఎం పేర్కొన్నారు. వాటిని విశాలంగా అభివృద్ధి చేయాలని అన్నారు. ఆక్రమణలుంటే తొలగించాలనీ, అక్కడున్న పేదలు, దుకాణాదారులు, ఇతరులు... నిరాశ్రయులు కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారికి మరో చోట పునరావాసం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని రేవంత్ ఈ సందర్భంగా ఆదేశించారు.

అప్రమత్తంగా ఉండండి

- తక్షణ సహాయ చర్యలు చేపట్టండి : భారీ వర్షాలపై సీఎస్, డీజీపీలకు సీఎం రేవంత్ ఆదేశాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో సీఎం మాట్లాడారు. అన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్న క్రమంలో రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్యారోగ్య శాఖాధికారులు అప్రమత్తంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా చూడాలనీ, లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సహాయక శిబిరాలకు తరలించాలని సూచించారు. రిజర్వాయర్ల గేట్లు ఎత్తుతున్న నేపథ్యంలో దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. సీఎం ఆదేశాల మేరకు సీఎస్, డీజీపీ జితేందర్ అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, కార్పొరేషన్, మున్సిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్‌ఫిట్

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

ఇరిగేషన్ మంత్రిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్‌ఫిట్ అని, కనీస అవగాహన లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పూర్తి చేసిన ప్రాజెక్టుల కింద కూడా నీళ్లు ఇవ్వలేని చేతగాని మంత్రి అని విమర్శించారు. నాగార్జునసాగర్ కింద కూడా పూర్తిస్థాయిలో నీరివ్వకుండా అడ్డగోలు మాటలతో టైంపాస్ చేస్తున్నారన్నారు. సాగర్ ఆయకట్టు, కాళేశ్వరం కింద పంటలు ఎండిపోతున్నా ఉత్తమ్ కుమార్ రెడ్డికి రైతుల బాధలు పట్టడం లేదన్నారు. మంత్రి ఆయన సొంత నియోజకవర్గం హుజూర్‌నగర్‌లో కూడా పంటలు ఎండిపోతు న్నాయన్నారు. ఇప్పటికైనా కన్నెపల్లి, మేడిగడ్డ పంపులను స్టార్ట్ చేసి నీరివ్వాలని కోరారు. సాగర్ కింద ఎత్తిపోతలకు పూర్తిస్థాయిలో నీరు అందించి చూపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డేకాయిట్ల పాలన నడుస్తోందని ఆరోపించారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందని కేసీఆర్‌ను డెకాయిట్‌లా పోల్చిన మంత్రి ఉత్తమ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. పట్టపగలు నోట్లకట్టలతో దొరికిన దొంగలు మీరే డెకాయిట్లని రేవంత్‌రెడ్డిని అనాల్సిన మాటలు తమపై వాడుతు న్నారని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా కాంగ్రెస్ నాయకుల కమీషన్లు, దోపిడీ గురించి ప్రజలు చెబుతున్నారని చెప్పారు. అన్ని శాఖల్లో అవినీతి రాజ్యమేలు తున్నదని, చేయి తడపందే ఏ పనీ కావట్లేదని కాంట్రాక్టర్లు మొత్తు కుంటున్నారని అన్నారు. నీరు, విద్యుత్ కోసం ధర్నాలు జరుగుతున్నాయని, ముందు వాటి గురించి మాట్లాడాలని సూచించారు. కాళేశ్వరం నీటిని అందించక పోతే కాంగ్రెస్ నాయకులకు రైతులతో దెబ్బలు తప్పవని అన్నారు. రైతాంగ సమ స్యలపై కేసీఆర్ కార్యాచరణ రూపొందిస్తారని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. ప్రభుత్వం మెడలు వంచి రైతులను ఆదుకుంటామన్నారు.

4న కోదండరాంకు పౌర సన్మానం

- ఇందిరాపార్కు నుంచి చిక్కడపల్లివరకు భారీ ప్రదర్శన
- పోస్టర్ ఆవిష్కరించిన టీజేఎస్ నేతలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీగా శాసనమండలిలో అడుగుపెట్టనున్న నేపథ్యంలో ఆయనకు ఈ నెల 4న ఆత్మీయ పౌర సన్మానం చేయనున్నట్టు ఆ పార్టీ నేతలు వెల్లడించారు. ఈ సందర్భంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కట్టమైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఇందిరాపార్క్ నుంచి చిక్కడ్‌పల్లిలోని త్యాగరాయగాన సభకు భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్టు తెలిపారు. శనివారం హైదరాబాద్ నాంపల్లిలోని ఆ పార్టీ కార్యాలయంలో టీజేఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం.నర్సయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అందుకు సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్రుద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ధర్మార్జున్, బైరి రమేష్, పల్లె వినయ్, రాష్ట్ర నాయకులు మారం లక్ష్మారెడ్డి, కొత్త రవి, నగర ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, బీసీ సెల్ అధ్యక్షులు జశ్వంత్ కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజు, నగర ఉపాధ్యకులు మానేపల్లి లక్ష్మణ్, పునిరెడ్డి జైపాల్ రెడ్డి, కోశాధికారి సురేష్ కుమార్, ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు శ్రవణ్‌కుమార్‌లు ఆవిష్కరించారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ

- సీఎంఆర్ చెక్కుల పంపిణీలో బీఆర్ఎస్ నేతలు పాల్గొనడంపై వివాదం
- కావాలనే రాద్ధాంతం చేస్తున్నారు: ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కౌడిపల్లి

మెదక్ జిల్లా కౌడిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం చేపట్టిన సీఎంఆర్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య ఘర్షణ ఏర్పడింది. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చెక్కులు పంపిణీ చేసే క్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ఫాష, ప్రవీణ్‌రెడ్డి, కార్యకర్తలు నాయకులు, బీఆర్ఎస్ నాయకులు ఘర్షణకు దిగారు. వాగ్వివాదం తీవ్ర స్థాయికి చేరడంతోపాటు ఇరు పార్టీల కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. ఏ అధికారంతో బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేస్తారని కాంగ్రెస్ పార్టీ నాయకులు నిలదీశారు.

ఎమ్మెల్యే హెూదాలో సునీతా రెడ్డి ఒక్కరు మాత్రమే చెక్కులు పంపిణీ చేయాలని, బీఆర్ఎస్ నాయకులు వెళ్లిపోవాలని పట్టుబట్టారు. దీంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

ఇలాంటివి ఎన్నో చూశా.. : ఎమ్మెల్యే

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఘర్షణ పడుతుండగా, ఎమ్మెల్యే సునీత రెడ్డి కలగజేసుకొని.. కాంగ్రెస్ నాయకులు కావాలనే రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలకు భయపడే ప్రసక్తే లేదని, ఇలాంటి రాజకీయాలు ఎన్నో చూశానన్నారు. తనకు రాజకీయాల్లో ఎత్తుకు పై ఎత్తు రాజకీయాలు చేయడం తెలుసునని, ప్రజా సమస్యలపై ఎన్నో ఏండ్లుగా పోరాటం చేస్తున్న తనకు ఇలాంటివి కొత్తేమీ కాదని అన్నారు. కాంగ్రెస్ నాయకులు స్టేజిపై కూర్చోవడంతో.. బీఆర్ఎస్‌లో కొత్తగా కాంగ్రెస్ పార్టీ వారు జాయిన్ కావడం సంతోషకరమని ఎమ్మెల్యే అనడంతో వివాదం ఏర్పడింది.

ఎడ్‌సెట్‌లో 9,817 మందికి సీట్ల కేటాయింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఎడ్ కోర్సులో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎడ్‌సెట్ మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా శనివారం సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఎడ్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ పి రమేష్‌బాబు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 16,841 మంది వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని తెలిపారు. బీఎడ్ కోర్సుల్లో కన్వీనర్ కోటాలో 14,211 సీట్లు అందు బాటులో ఉన్నాయని వివరించారు. ఎడ్‌సెట్ మొదటి విడతలో 9,817 మందికి సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఇంకా 4,394 సీట్లు మిగిలిపోయాయని తెలిపారు. సోమవారం నుంచి ఈనెల ఐదో తేదీ వరకు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. ఈనెల తొమ్మిది నుంచి బీఎడ్ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఘోష్ కమిషన్ గడువు పొడిగింపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంపై విచారణ చేస్తున్న జస్టిస్ పీ చంద్రఘోష్ కమిషన్ కాలపరిమితిని మరో రెండు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వ కార్యదర్శి రాహుల్‌బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలపై ఘోష్ కమిషన్ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. పొడిగింపు ఉత్తర్వులు అక్టోబర్ 31వ తేదీ వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.

అవినీతి జలగలు..!

- పట్టుబడుతున్నా మారని తీరు
- చేయి తడిపితేనే పనులు
- సగానికిపైగా ప్రభుత్వ శాఖల్లో ఇదే తంతు
- పెచ్చుమీరుతున్న అక్రమ వసూళ్లు
- తరచూ వెలుగు చూస్తున్న ఘటనలు
- వరుసగా ఏసీబీకి చిక్కుతున్న అధికారులు

ప్రభుత్వ శాఖల్లో అవినీతి వేళ్లూనుకుంది. కొన్ని శాఖల్లో చేతులు తడిపితే తప్ప కాగితం కార్యాలయం గడప దాటడం లేదు. అవసరం కోసం ప్రభుత్వ ఆఫీసులకు వెళ్తే అడిగినంత ఇచ్చుకోలేక, అటు సమయానికి పనులు కాక, సామాన్యులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పై నుంచి క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు ఇదే వ్యవహారం నడుస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అధికారుల వేధింపులకు విసుగు చెందుతున్న బాధితులు తప్పనిసరి పరిస్థితుల్లో ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. సగానికిపైగా ప్రభుత్వ శాఖల్లో ఇదే తంతూ నడుస్తూ, వరుసగా ఏసీబీకి పట్టుబడుతున్నా, కొందరు అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. ఇటీవల రాష్ట్రంలో వరుసగా ఏసీబీ తనిఖీలు, పట్టివేతలు జరుగుతున్నాయి.

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఓ వైపు ఐటీ, రియల్, పారిశ్రామిక రంగాల్లో దూసుకెళ్తూ.. మరోవైపు ఎడ్యుకేషన్, హెల్త్ హబ్‌కు కేరాఫ్‌గా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నిలుస్తోంది. ఇదే స్థాయిలో అవినీతి సైతం పెచ్చుమీరుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఒకరి తర్వాత ఒకరు ఏసీబీకి పట్టు బడుతుండటం చూస్తుంటే కరప్షన్ ఏ స్థాయిలో పెరిగిపోయిందో అర్థమవుతోంది. రూ.45 వేలు లంచం తీసుకుంటూ ఓ అధికారి ఇటీవల ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. ఈ విషయాన్ని మరువక ముందే తాజాగా మరో అధికారి ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశమైంది. ప్రభుత్వ విభాగాల్లో అవినీతిని నిర్మూలించేందుకు టీఎస్ ఐపాస్, టీఎస్ బీపాస్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. రెవెన్యూ మున్సిపల్, రిజిస్ట్రేషన్, ఇండస్ట్రీ, విద్యుత్, పంచాయతీరాజ్, హెచ్ఎండీఏ, ఇరిగేషన్ ఇలా అన్ని శాఖల్లోనూ ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయినప్పటికీ కొందరు అధికారులు సాంకేతిక సమస్యలు, ప్రజల అవసరాలను సాకుగా చూపించి దరఖాస్తులను రిజెక్ట్ చేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారిని కలిసి అడిగినంత సమర్పించుకుంటే కానీ.. అనుమతి పత్రాలు జారీ చేయడం లేదు. దీంతో విసిగి వేసారిన బాధితులు చివరికి ఏసీబీని ఆశ్రయించి అధికారుల చీకటి బాగోతాన్ని బట్టబయలు చేస్తున్నారు.

రెవెన్యూ శాఖల్లో..

పట్టాదారు పాస్ బుక్ జారీ కోసం రూ.30 లక్షలు డిమాండ్ చేసిన శామిర్‌పేట తహసీల్దార్ ఏసీబీకి చిక్కారు. గడిమలక్‌పేటలో ఉన్న 29 ఎకరాలకు పాస్‌బుక్, ధరణిలో నమోదు కోసం బాధితుడు దరఖాస్తు చేసుకున్నారు. అనుకూలంగా రిపోర్టు రాసేందుకు తహసీల్దార్ లంచం డిమాండ్ చేసి ఏసీబీకి చిక్కారు. ఇటీవల మేడ్చల్ తహసీల్దార్ రూ.100 కోట్ల భూదాన్ భూమికి ఎసరు పెట్టారు. ఈ భూమిని పట్టాగా మార్చేందుకు ఏకంగా కీసర ఆర్డీఓని బురిడీ కొట్టించి జిల్లా కలెక్టర్ ద్వారా ఎన్‌ఓసీ తీసుకునే ప్రయత్నం చేశారు. కానీ కలెక్టర్ చాకచక్యంగా వ్యవహరించి తహసీల్దార్ సిఫారసును హెూల్డ్ చేసి అంతర్గత విచారణ చేపట్టగా.. అది భూదాన్ భూమిగా తేలింది. విషయం తెలుసుకున్న సదురు తహసీల్దార్ లాంగ్ లీవ్‌లో వెళ్లారు. మేడ్చల్ నుంచి బదిలీ చేయించుకునే ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం.

రెవెన్యూ మచ్చుకకు కొన్ని ఘటనలు ఇలా..

1.విద్యుత్ శాఖలో పని చేస్తున్న జూనియర్ అకౌంటెంట్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. టీజీఎస్‌పీడీసీఎల్ హబ్సిగూడ శాఖలో పని చేస్తున్న మరో ఉద్యోగి తనకు రావాల్సిన బకాయిల కోసం జూనియర్ అకౌంటెంట్‌ను సంప్రదించగా లంచం డిమాండ్ చేసి ఏసీబీ ట్రాప్‌లో పడ్డాడు.



2.జిల్లా ఇండస్ట్రీస్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ రూ.45వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. టిప్పర్‌ను ఎస్సీ, ఎస్టీ కోటా కింద గవర్నమెంట్ స్కీం (తెలంగాణ స్టేట్ ప్రోగ్రాం ఫర్ రాపిడ్ ఇంక్యుబేషన్ ఆఫ్ దళిత ఎంటర్‌ప్రెన్యూర్స్ ఇన్సెంటీవ్ స్కీం)కు వర్తింపజేయాలని కోరగా.. సదురు అధికారి లంచం డిమాండ్ చేశాడు. చేసేదేమీ లేక బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు.

3.జిల్లా కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రూ.లక్ష లంచం తీసుకుంటూ ఇటీవల ఏసీబీకి పట్టుబడ్డాడు. ఓ కో-ఆపరేటివ్ బ్యాంక్, మరో కుటుంబానికి మధ్య వివాదాన్ని పరిష్కరించేందుకు లంచం డిమాండ్ చేయగా బాధితులు ఏసీబీని ఆశ్రయించడంతో సదురు అధికారి పట్టుబడ్డాడు.

మేడ్చల్ కలెక్టరేట్‌పై ఏసీబీ నజర్

మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌పై ఏసీబీ నజర్ పెట్టినట్టు సమాచారం. కొద్ది రోజులుగా మేజర్ శాఖలు, అధికారుల పని తీరుపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు తెలుస్తోంది. ప్రతి పనికీ రేటు కట్టి మరీ కొందరు అధికారులు లంచం డిమాండ్ చేస్తున్నారని ఆయా శాఖలపై ఏసీబీ అధికారులకు వరుస ఫిర్యాదులు అందాయి. దీంతో సదురు శాఖలపై ఏసీబీ ప్రత్యేక దృష్టి సారించింది.

రెవెన్యూ సహా రెగ్యులర్ ఆదాయంతో ముడిపడిన శాఖల్లో పని చేస్తున్న అధికారుల వ్యవహార శైలి, వారి పనులపై ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఇటీవల ఎక్కువగా నగదు డిమాండ్ చేసినట్టు బాధితులు ఏసీబీని ఆశ్రయించడంతో అధికారులు కలెక్టరేట్ చూట్టే తిరుగుతున్నారు. త్వరలో మరికొన్ని శాఖల్లో ఏసీబీ రైడ్స్ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కాశ్మీర్ బరిలో...

బీజేపీ, పీడీపీ ఒంటరి పోరు

కాషాయ పార్టీ ఆశలన్నీ జమ్మూ పైనే

సమధికోత్సాహంతో 'ఇండియా' బ్లాక్

- తామూ పోటీలో ఉన్నామంటున్న చిన్నా చితకా పార్టీలు



శ్రీనగర్ : వచ్చే నెల 18వ తేదీ నుండి మూడు దశలుగా జరిగే జమ్మూకాశ్మీర్ శాసనసభ ఎన్నికలకు జాతీయ, ప్రాంతీయ పార్టీలు సమాయత్తమవుతున్నాయి. ఎన్నికల్లో భాగస్వాములమవుతామని స్థానిక పార్టీలైన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ), పీపుల్స్ కాన్ఫరెన్స్ (పీసీ), జమ్మూకాశ్మీర్ పీపుల్స్ మూవ్‌మెంట్ (జేకేపీఎం), అప్నీ పార్టీ ఇప్పటికే ప్రకటించాయి. కాంగ్రెస్ పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్‌తో పొత్తు పెట్టుకోగా, బీజేపీ ఒంటరి పోరుకు సిద్ధమైంది. 90 స్థానాలున్న జమ్మూకాశ్మీర్ శాసనసభ ఎన్నికల్లో 87 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు. 2014 తర్వాత అక్కడ ఎన్నికలు జరగడం ఇదే మొదటిసారి. 2014లో బీజేపీ, పీడీపీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ అది కలహాల కాపురంగానే సాగింది. చివరికి 2018లో కూటమి విచ్ఛిన్నమైంది. ఫలితంగా శాసనసభ రద్దయింది. ప్రస్తుతం జమ్ము, కాశ్మీర్ ప్రాంతాలు లెఫ్టినెంట్ గవర్నర్ ఏలుబడిలోనే ఉన్నాయి.

ఎన్నికల ప్రాధాన్యత

జమ్మూకాశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన తర్వాత జరుగుతున్న మొదటి ఎన్నికలు ఇవి. 2022లో ఎన్నికల కమిషన్ పునర్విభజన ప్రక్రియను చేపట్టి జమ్మూలో 43, కాశ్మీర్‌లో 47 స్థానాలను గుర్తించింది. జమ్మూలో ఆరు, కాశ్మీర్‌లో మూడు స్థానాలను ఎస్టీలను రిజర్వ్ చేశారు. అసెంబ్లీ స్థానాల్లో మూడో వంతును మహిళలకు కేటాయిస్తూ పార్లమెంట్ 2023లో బిల్లును ఆమోదించింది. వాల్మీకులను ఎస్సీలుగా, పహారీలను ఎస్టీలుగా గుర్తించారు.

కాశ్మీర్‌లో ప్రభావం చూపని బీజేపీ

ముస్లిం మైనారిటీల ప్రభావం ఎక్కువగా ఉండే జమ్మూకాశ్మీర్ శాసనసభలోని అన్ని స్థానాలకూ పోటీ చేయాలా వద్దా అనే విషయంపై బీజేపీ ఇంకా ఓ నిర్ణయానికి రాలేదు. ఆ పార్టీ ఇప్పటి వరకూ 45 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత లోయలో జరిగిన వార్డులు, పంచాయతీలు సహా అన్ని ఎన్నికల్లోనూ బీజేపీ పోటీ చేస్తూనే ఉంది. ఆ పార్టీ ఏ ప్రాంతీయ పార్టీతోనూ అధికారికంగా పొత్తు పెట్టుకోనప్పటికీ పలువురు స్వతంత్రులకు, జమ్మూకాశ్మీర్ విషయంలో తన విధానాన్ని (ప్రత్యేక హోదా రద్దు) సమర్థించే స్థానిక పార్టీలకు మద్దతు ఇస్తోంది. 2020లో జరిగిన జిల్లా అభివృద్ధి మండలి (డీడీసీ) ఎన్నికల్లో బీజేపీ అతి పెద్ద పార్టీగా అవతరించింది. మొత్తం 280 స్థానాల్లో ఆ పార్టీకి 75 స్థానాలు లభించాయి. యాభై మంది స్వతంత్రుల మద్దతుతో బీజేపీ ఆరు డీడీసీలను కైవసం చేసుకుంది. అయితే అవన్నీ జమ్మూ ప్రాంతంలోనివే. కాశ్మీర్‌లో కమల దళానికి ఒక్క డీడీసీ కూడా రాలేదు.

దూరమైనా చేరువే...

తాము ఇండియా బ్లాక్‌కి దూరమైనప్పటికీ తమ ఎజెండాను అది అంగీకరిస్తే వారితోనే ఉంటామని పీడీపీ అధినేత మెహబూబా ముఫ్తీ తెలిపారు. ఎన్‌సీ తన మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలనే పీడీపీ కూడా ఇచ్చింది. పీడీపీ ఇప్పటికే 21 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. వీరిలో తొమ్మిది మంది ఎన్‌సీ అభ్యర్థులతో పోటీ పడుతున్నారు. మెహబూబా ముఫ్తీ అసెంబ్లీ ఎన్నికలకు దూరంగా ఉంటున్నప్పటికీ ఆమె కుమార్తె తొలిసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రశ్నే లేదని పీడీపీ స్పష్టం చేసింది.

ఆదిలోనే హంసపాదు

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పోటీగా ప్రతిపక్ష ఇండియా బ్లాక్ ఉమ్మడిగా అభ్యర్థులను నిలపలేకపోయింది. బారాముల్లా, శ్రీనగర్, అనంతనాగ్-రాజౌరి లోక్‌సభ స్థానాల్లో ఎన్‌సీ, పీడీపీ పరస్పరం తలపడ్డాయి. ఈ మూడింటిలో బీజేపీ అభ్యర్థులను నిలపలేదు. లడక్, ఉధంపూర్, జమ్మూలో మాత్రం కాంగ్రెస్‌తో తలపడింది. జమ్మూలోని రెండు స్థానాలనూ బీజేపీ గెలుచుకోగా లఢక్‌లో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పలువురు ముస్లిం అభ్యర్థులను రంగంలోకి దింపింది. ముఖ్యంగా పిర్ పంజల్ లోయ నుండి ఆ పార్టీ తరపున ముస్లిం అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో బరిలో నిలిచారు. అయితే తొలి జాబితా ప్రకటనతో బీజేపీలో అసమ్మతి భగ్గుమంది. ఇతర పార్టీల నుండి వలస వచ్చిన వారికి పార్టీ టిక్కెట్లు ఇచ్చారని, పార్టీకి అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను విస్మరించారని పలువురు సీనియర్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తొలి జాబితాను బీజేపీ వెనక్కి తీసుకుంది. కానీ వైష్ణోదేవి స్థానంలో మాత్రమే అభ్యర్థిని మార్చింది. పార్టీకి గట్టి పట్టున్న నౌషెరా స్థానానికి ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు.

ఇండియా బ్లాక్‌కి బీజం

ఇక ఇండియా బ్లాక్ విషయానికి వస్తే...2020లో జమ్మూకాశ్మీర్‌కు చెందిన పలువురు నేతలు జైలు నుంచి విడుదలయ్యారు. ఆ తర్వాత కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు తాజ్ మొహియుద్దీన్ ఎన్‌సీ సీనియర్ నేత ఫరూఖ్ అబ్దుల్లా నివాసంలో జరిగిన ఓ సమావేశానికి హాజరయ్యారు. జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కోసం జరుపుతున్న పోరాటాన్ని ముందుకు తీసికెళ్లేందుకు ఆరు రాజకీయ పార్టీలు...ఎన్‌సీ, పీడీపీ, పీసీ, కాంగ్రెస్, సీపీఐ (ఎం), అవామీ నేషనల్ కాన్ఫరెన్స్ (ఏఎన్ఎస్) జట్టు కట్టేందుకు అక్కడే నాంది పడింది. పీపుల్స్ అలయన్స్‌లో తాను భాగస్వామిని కానప్పటికీ దానితో ఎన్నికల పొత్తు కుదుర్చుకునేందుకు సిద్ధమేనని కాంగ్రెస్ తెలిపింది. డీడీసీ ఎన్నికల్లో ఈ ఫోరం మంచి ఫలితాలు సాధించింది. 280 స్థానాల్లో 110 సీట్లను గెలుచుకుంది.

ఎన్‌సీ-పీడీపీ మధ్య విభేదాలు

గత సంవత్సరం జులైలో ఎన్‌సీ, పీడీపీ, సీపీఐ (ఎం)లను కాంగ్రెస్ ప్రతిపక్ష కూటమిలో చేర్చింది. అయితే లోక్‌సభ ఎన్నికల్లో ఐక్య ప్రతిపక్ష ఫోరంగా ఏర్పాటు కోసం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మిజోరం శాసనసభ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యత ఇచ్చిందని ఎన్‌సీ, పీడీపీ ఆరోపించాయి. శాసనసభ ఎన్నికల కోసం ఈ రెండు పార్టీల మధ్య జరిగిన చర్చలు ఆదిలోనే బెడిసికొట్టాయి. కాశ్మీర్‌లోని మూడు స్థానాలూ తనకే కేటాయించాలని ఎన్‌సీ పట్టుపట్టింది. కానీ తన కంచుకోట అయిన అనంతనాగ్-రాజౌరి నుండి పోటీ చేయాలని పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ ఆశించారు. అయితే ఆ సీటును పీడీపీకి వదిలేసేందుకు ఎన్‌సీ ససేమిరా అంది. దీంతో ఇండియా కూటమి నుండి పీడీపీ నిష్క్రమించింది. ఎన్‌సీ డిమాండ్‌కు కాంగ్రెస్ అంగీకరించింది. ఎన్‌సీ, కాంగ్రెస్ మధ్య కుదిరిన రాజీ లోక్‌సభ ఎన్నికల్లో సత్ఫలితాన్ని ఇచ్చింది. ఎన్‌సీ పార్టీ లోయలో రెండు స్థానాలు గెలుచుకుంది. కానీ మాజీ ముఖ్యమంత్రులు ఒమర్ అబ్దుల్లా (ఎన్‌సీ-బారాముల్లా), మెహబూబా ముఫ్తీ (అనంతనాగ్- రాజౌరి...పీడీపీ) ఇద్దరూ పరాజయం పాలయ్యారు.

చేయి కలిపిన ఎన్‌సీ, కాంగ్రెస్

లోక్‌సభ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు వచ్చాయి. బీజేపీ, ఎన్‌సీ చెరో రెండు స్థానాలు, స్వతంత్రులు రెండు స్థానాలు గెలుచుకున్నారు.

ఈ నేపథ్యంలో శాసనసభ ఎన్నికల కోసం సీట్ల సర్దుబాటు కుదుర్చుకోవాలని ఎన్‌సీ, కాంగ్రెస్ నిర్ణయించాయి. ఎన్‌సీ 51, కాంగ్రెస్ 32 స్థానాలకు పోటీ చేస్తాయి. సీపీఐ (ఎం), జమ్మూ కాశ్మీర్ నేషనల్ పాంథర్స్ పార్టీ చెరో స్థానంలో అభ్యర్థులను నిలుపుతాయి. జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇచ్చేంత వరకూ ఎన్నికల్లో పోటీ చేయబోనని గతంలో ప్రకటించిన ఎన్‌సీ నేత ఒమర్ అబ్దుల్లా మనసు మార్చుకొని గండర్‌బాల్ నుండి శాసనసభకు పోటీ చేస్తున్నారు.

అవి బీజేపీకి తోక పార్టీలు

ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు సజ్జాద్ లోన్ నేతృత్వంలోని పీపుల్స్ కాన్ఫరెన్స్ (పీసీ), కాంగ్రెస్ మాజీ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ నాయకత్వంలోని డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ (డీపీఏపీ), అల్తాఫ్ బుఖారీకి చెందిన అప్నీ పార్టీ కూడా ఎన్నికల క్షేత్రంలో నిలిచాయి. ఎన్‌సీ, పీడీపీ మధ్య తలెత్తిన విభేదాల నేతృత్వంలో 2021లో ప్రతిపక్ష కూటమి నుండి లోన్ వైదొలిగారు. బారాముల్లా స్థానంలో అబ్దుల్లాను సవాలు చేసి 1.73 లక్షల ఓట్లు సాధించారు. ఇక ఆజాద్ 2022లో కాంగ్రెస్‌ను వీడి వేరు కుంపటి పెట్టుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆయన పార్టీ మూడు స్థానాలకు పోటీ చేసి కేవలం 80,264 ఓట్లు మాత్రమే సాధించింది. అయినా రాబోయే శాసనసభ ఎన్నికల్లో పోటీకి సిద్ధపడింది. అల్తాఫ్ బుఖారీ 30 మంది నేతలతో కలిసి పీడీపీని వదిలేసి అప్నీ పార్టీని ఏర్పాటు చేశారు. డీడీసీ ఎన్నికల్లో ఆ పార్టీ 12 స్థానాలు గెలుచుకుంది. ఇప్పుడు 24 శాసనసభ స్థానాలకు పోటీ చేస్తోంది. బుఖారీ కూడా బరిలో నిలిచారు. కాగా ఈ మూడూ బీజేపీకి తోక పార్టీలని ఇండియా బ్లాక్ విమర్శించింది. బీజేపీ నేతలు మోడీ లేదా అమిత్ షా ఈ మూడు పార్టీల నేతలను ఎన్నడూ పల్లెత్తు మాట అనకపోవడం గమనార్హం. ఎన్‌సీ, కాంగ్రెస్, పీడీపీలకు ఓటు వేయవద్దని మాత్రమే వారు కోరుతున్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత మోడీ, షాలను కలిసిన మొదటి నేతల్లో బుఖారీ ఒకరు. ఇక ఆజాద్ రాజ్యసభ నుంచి రిటైర్ అయిన ప్పుడు మోడీ నుండి భావోద్వేగ పూరితమైన వీడ్కోలు లభిం చింది. ఈ మూడు పార్టీలు మాత్రమే కాకుండా మరికొన్ని చిన్నా చితకా పార్టీలు కూడా ఎన్నికల బరిలో దిగాయి.

జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలి దశకు 219 మంది అభ్యర్థులు



జమ్మూకాశ్మీర్ : జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ మొదటి దశ ఎన్నికల్లో మొత్తం 219 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. నామినేషన్ల ఉప సంహరణకు చివరితేదీ అయిన శుక్రవారం 25 నామినేషన్లను అభ్యర్థులు ఉపసంహరించుకున్నారు. జమ్మూకాశ్మీర్‌లో మొత్తం మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 18న తొలిదశలో 24 అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వీటికి 280 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల పరిశీలన ప్రక్రియలో భాగంగా 36 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. శుక్రవారం 25 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో తొలి దశ ఎన్నికల బరిలో చివరకు 219 మంది అభ్యర్థులు నిలిచారని అధికారులు తెలిపారు. కాగా, నామినేషన్లు ఉపసంహరించుకున్న ఈ 25 మంది అభ్యర్థుల్లో ఐదుగురు కాశ్మీర్ డివిజన్ నంచి, 20 మంది జమ్మూ డివిజన్ నుంచి ఉన్నారు. వీరిలో 18 మంది స్వతంత్రులు ఉన్నారు. డెమోక్రాటిక్ ప్రోగ్రెస్సివ్ ఆజాద్ పార్టీ నుంచి ఐదుగురు, జమ్మూ కాశ్మీర్ నేషనల్ పాంథర్స్ పార్టీ(ఇండియా), బీఎస్పీ ల నుంచి ఒక్కరు చొప్పున అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

ఏడుగురు పోలీసు అధికారుల బదిలీ



జమ్మూకాశ్మీర్ ప్రభుత్వం ఆదేశాలు

ఈసీఐ ఆదేశాల మేరకు ట్రాన్స్‌ఫర్

జమ్మూ : జమ్మూకాశ్మీర్‌లో ఏడుగురు పోలీసు అధికారులు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఇందులో ఇద్దరు ఐపీఎస్‌లు కూడా ఉన్నారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదేశాల మేరకు జమ్మూకాశ్మీర్ ప్రభుత్వం బదిలీలు చేసింది. ఈ మేరకు జమ్మూకాశ్మీర్ హెూం ప్రిన్సిపల్ సెక్రెటరీ ఒక ఉత్తర్వు జారీ చేశారు. ఈ ఏడుగురు పోలీసు అధికారులకు కొత్త బాధ్యతలను అప్పగించారు. జమ్మూకాశ్మీర్ పోలీస్ సర్వీసెస్ (జేకేపీఎస్) నుంచి నలుగురు పోలీసు అధికారులను శ్రీనగర్, బారాముల్లా, కుప్వారా జిల్లాలకు ఎస్ఎస్పీలుగా, హంద్వారా ఎస్పీలుగా నియమిస్తూ జమ్మూకాశ్మీర్ ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీ చేసింది. బారాముల్లా, కుప్వారా జిల్లాల ఎస్ఎస్పీలుగాగా ఉన్న గురిందర్‌పాల్ సింగ్, శోభిత్ సక్సేనాలను డైరెక్టర్ పోలీస్ టెలికమ్యూనికేషన్స్ ఇంచార్జీగా, సీఐడీ (హెడ్‌క్వార్టర్స్) ఎస్ఎస్పీలుగా నియమితులయ్యారు. హంద్వారా ఎస్పీ దావుద్ అయూబ్‌ను సీఐడీ ఎస్ఎస్పీగా నియమించారు. కాగా, జమ్మూకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగటానికి ఇలాంటి బదిలీలు చేపడుతున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న

సీతారాం ఏచూరి



న్యూఢిల్లీ : కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గత కొన్నిరోజులుగా శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ న్యూఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆగస్టు 19 తేదీన ఆయన ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స కోసం చేరారు. మొదట ఎమర్జెన్సీ వార్డులో చికిత్స తీసుకున్నారు. ఆ తర్వాత ఆయనను వైద్యులు ఐసీయూకి తరలించారు. ఆయనకు స్పెషలిస్టు వైద్యుల బృందం చికిత్సనందిస్తోంది. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటున్నారని, అయితే ఆయన ఎప్పుడు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవుతారనే విషయాన్ని ఆస్పత్రి వెల్లడించలేదని ఆ పార్టీ సెంట్రల్ కమిటీ కార్యాలయం శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటన పేర్కొంది.

పతంజలి పండ్లపొడిలో

మాంసాహార పదార్థాలు

ఢిల్లీ హైకోర్టు నోటీసులు



న్యూఢిల్లీ : దివ్య దంతమంజన్ పండ్లపొడిలో మాంసాహార పదార్థాలు ఉన్నాయంటూ దాఖలైన పిటిషన్‌ను పురస్కరించుకొని ఢిల్లీ హైకోర్టు బాబా రాందేవ్, పతంజలికి చెందిన దివ్య ఫార్మసీకి నోటీసులు జారీ చేసింది. పండ్లపొడిలో శాఖాహార పదార్థాలు మాత్రమే ఉన్నాయని చెప్పి, అందులో మాంసాహార సంబంధమైన పదార్థాలు కలిపారని పిటిషనర్ యతిన్ శర్మ ఆరోపించారు. ప్యాక్‌పై పండ్లపొడి శాఖాహార ఉత్పత్తేనని సూచించే ఆకుపచ్చ చుక్క ఉన్నదని, కానీ పదార్థాల జాబితాలో మాంసాహారానికి సంబంధించిన కటిల్ ఫిష్ ఉన్నదని ఆయన తెలియజేశారు. కాగా ఈ కేసు విచారణ నవంబర్ 28వ తేదీన జరుగుతుంది. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయమూర్తి సంజీవ్ నరులా కేంద్రం, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ), పతంజలి, దివ్య ఫార్మసీ, యోగా గురు రాందేవ్, ఇతరులకు నోటీసులు జారీ చేశారు. ఇది శాఖాహార పండ్లపొడి అని, మూలికలకు సంబంధించిన ఉత్పత్తి అని చెప్పడం వల్ల తన కుటుంబం చాలా కాలం నుండి దీనిని వాడుతోందని, అయితే అందులో కటిల్ ఫిష్ ఎముకల నుండి తీసిన పదార్థం ఉన్నదని ఇటీవలే తెలిసిందని పిటిషనర్ వివరించారు. తనది బ్రాహ్మణ కుటుంబమని, మాంసాహార పదార్థాలు తీసుకోవడం తమ మత విశ్వాసాలకు, మనోభావాలకు విరుద్ధమని కోర్టు దృష్టికి తెచ్చారు. జంతు సంబంధమైన పదార్థాన్ని ఉపయోగించిన విషయాన్ని బాబా రాందేవ్ కూడా ఓ యూట్యూబ్ వీడియోలో అంగీకరించారని తెలిపారు.

ఆ ఆదేశాలను ఉపసంహరించుకోండి

కేంద్రాన్ని కోరిన మాజీ సీనియర్ అధికారులు



న్యూఢిల్లీ : ఆర్ఎస్ఎస్‌లో ప్రభుత్వోద్యోగుల చేరికపై అమలులో ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని కాన్‌స్టిట్యూషనల్ కండక్ట్ గ్రూపునకు చెందిన మాజీ సీనియర్ అధికారులు మోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ విదేశాంగ కార్యదర్శులు సుజాతా సింగ్, శివశంకర్ మీనన్ సహా 115 మంది రిటైర్డ్ సీనియర్ అధికారులు ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. 'భారత రాజ్యాంగ లౌకిక స్వభావాన్ని, బహుళత్వాన్ని తిరస్కరించే సంఘంలో జిల్లా మెజిస్ట్రేట్, పోలీస్ అధికారి, ప్రభుత్వ కార్యదర్శి, ప్రొఫెసర్, ఉపాధ్యాయుడు లేదా ప్రభుత్వ వైద్యుడు బహిరంగంగానే సభ్యుడు కావచ్చునని ప్రభుత్వ ఆదేశాలు చెబుతున్నాయి. లేదా అతను ఆ సంఘం కార్యకలాపాలలో భాగస్వామి కావచ్చు. పదవీ విరమణ సమయంలో హైకోర్టు న్యాయమూర్తులు ఇటీవల చేసిన ప్రకటనలు వారికి ఆర్ఎస్ఎస్‌తో ఉన్న సైద్ధాంతిక అనుబంధాన్ని బయటపెట్టడం విచారకరం' అని ఆ ప్రకటనలో మాజీ ప్రభుత్వాధికారులు అభిప్రాయపడ్డారు.



కర్నాటక సీఎం సిద్ధరామయ్య ధర్నా

ముడా భూముల కేటాయింపుపై దర్యాప్తునకు గవర్నర్ ఆదేశం

బెంగళూరు: కర్నాటకలో రాజకీయం వేడెక్కుతోంది. బెంగళూరులో మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూముల కేటాయింపులో సిద్ధరామయ్యపై దర్యాప్తు చేయాలని ఆ రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ అనుమతిచ్చారు. దీనికి నిరసనగా కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్‌తో పాటు ఇతర కాంగ్రెస్ నేతలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు.మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

కేరళ ఎల్‌డీఎఫ్ కన్వీనర్‌గా టిపి రామకృష్ణన్



తిరువనంతపురం : కేరళలో వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డీఎఫ్) కన్వీనర్‌గా టిపి రామకృష్ణన్‌కు బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం జరిగిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ తెలి పారు. ఈ పదవిలో ఇదివరకు ఉన్న ఇపి జయరాజన్ తన బాధ్యతల నిర్వహణలో కొన్ని 'పరిమితులు' ఎదుర్కొ వాల్సివచ్చిందని, అందువల్లే మార్పు అవసరమైంద న్నారు. ఈ మార్పు అనేది జయరాజన్‌పై చర్య తీసు కున్నట్లుగానో, ఆయనను మందలించినట్లు గానో పరిగణించరాదని తెలిపారు. జయరాజన్ ఇప్పటికీ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులుగా కొనసాగుతున్నారని గోవిందన్ తెలిపారు.

హర్యానా అసెంబ్లీ ఎన్నికల తేదీ మార్పు

- అక్టోబర్ 5కు ఎలక్షన్స్.. అదే నెల 8న ఫలితాలు
- ఎన్నికల సంఘం ప్రకటన

బిష్ణోయ్ వర్గం నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు తేదీల సవరణ



చండీగఢ్ : హర్యానా అసెంబ్లీ ఎన్నికల తేదీ మారింది. ముందుగా ఎన్నికల సంఘం(ఈసీ) ప్రకటించినట్టుగా ఎన్నికలు అక్టోబర్ 1న జరగాల్సి ఉన్నది. అయితే, బిష్ణోయ్ కమ్యూనిటీ నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ఈసీ ఎన్నికల తేదీని ఇదే నెల 5కు మార్చింది. బిష్ణోయ్ కమ్యూనిటీ పండుగా ఇదే సమయంలో ఉండటంతో ఓటింగ్ హక్కులను గౌరవిస్తూ ఎన్నికల తేదీని మార్చినట్టు ఈసీ ప్రకటించింది. ముందుగా ప్రకటించినట్టుగా హర్యానాతో పాటు జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అక్టోబర్ 4న వెలువడాల్సి ఉన్నది. అయితే, హర్యానాలో ఎన్నికల తేదీ అక్టోబర్ 5కు వాయిదా పడటంతో ఈ రాష్ట్రంతో పాటు జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కూడా అదే నెల 8కు వెలువడనున్నాయి. బిష్ణోయ్ వర్గానికి చెందిన పండుగా అక్టోబర్ 2న వస్తున్నది. దీంతో వేలాది కుటుంబాలు రాజస్థాన్‌లోని తమ ఇండ్లకు వెళ్లనున్నాయి. ఈ కారణంతో వారు ఓటు హక్కుకు దూరమయ్యే అవకాశమున్నది. గతంలోనూ పలు సందర్భాల్లో ఈసీ పలు వర్గాల సెంటిమెంట్లను గౌరవిస్తూ ఎన్నికల తేదీలను సవరించింది. ఇందులో భాగంగానే ఇప్పుడు కూడా హర్యానా అసెంబ్లీ ఎన్నికలు, ఫలితాల తేదీలను మారుస్తూ ఈసీ ప్రకటన చేసింది.

కాశ్మీర్‌లో పత్రికా స్వేచ్ఛ నీటి మూటేనా?



శ్రీనగర్ : దశాబ్ద కాలం తర్వాత జమ్మూకాశ్మీర్‌లో అక్టోబరులో శాసనసభ ఎన్నికలు జరగబోతున్నాయి. అయితే ఎన్నికలకు సంబంధించిన వార్తలు, కథనాలను అందించే విషయంలో పాత్రికేయులు స్వేచ్ఛగా వ్యవహరించే అవకాశాలు మాత్రం కన్పిం చడం లేదు. కాశ్మీర్ లోయలో గత ఐదు సంవత్సరాల కాలంలో చోటుచేసుకున్న పరిణామాలను పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. ఈ కాలంలో డజన్ల కొద్దీ పాత్రికేయులు వేధింపులకు గురయ్యారు. కొందరిని కటకటాల వెనక్కి నెట్టారు. వారిలో ఇద్దరు ఇప్పటికీ నిర్బంధంలోనే ఉన్నారు. పాత్రికేయులతో మాట్లాడేందుకు లేదా సమావేశమయ్యేందుకు అధికారులు ఇష్టపడడం లేదు. ప్రత్యేక కథనాలు లేదా ఘటనలపై అధికారిక ప్రకటనలు ఎప్పుడో అరుదుగా వస్తున్నాయి. అభిప్రాయాలు తెలియజేయడం ప్రమాదకరంగా పరిణమించింది. ఆచితూచి వ్యవహరిస్తూ, భయపడుతూ వార్తలు రాయాల్సి వస్తోంది.

కాశ్మీర్‌లో ప్రెస్‌క్లబ్‌ను తిరిగి తెరుస్తున్నట్లు ఈ నెల ప్రారంభంలో ప్రకటన చేశారు. అయినప్పటికీ ఆ లోయలో విధులు నిర్వర్తించే పాత్రికేయులకు వార్తలు అందించే వనరులు చాలా స్వల్పంగానే ఉంటాయి. 2022 జనవరి 17న కాశ్మీర్ ప్రెస్‌క్లబ్‌ను మూసివేయడం పత్రికా స్వేచ్ఛకు గట్టి ఎదురు దెబ్బగానే భావించవచ్చు. లాక్‌డౌన్ సమయంలో, ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఇంటర్నెట్ సేవలను నిలిపివేసినప్పుడు అక్కడ బాగా సందడి కన్పించింది. ప్రెస్‌క్లబ్‌లో ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉంటాయని, సీనియర్ పాత్రికేయుల మార్గదర్శకత్వం లభిస్తుందని భావించిన పలువురు యువ జర్నలిస్టులు అక్కడికి వచ్చి పోతుండేవారు.

అయితే కొన్ని అవాంఛనీయ ఘటనల నేపథ్యంలో అది మూతపడింది. దాని రిజిస్ట్రేషన్‌ను పెండింగులో పెట్టారు. ప్రెస్‌క్లబ్ బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేశారు. తాజాగా ప్రెస్‌క్లబ్ ఆఫ్ కాశ్మీర్ పేరిట దానిని పునఃప్రారంభించబోతున్నట్లు ప్రకటన వెలువడింది.

గత సంవత్సరం నవంబరులో ముగ్గురు కాశ్మీర్ పాత్రికేయులను అధికారులు జైలు నుండి విడుదల చేశారు. వీరిలో ఇద్దరు సుమారు రెండు సంవత్సరాల పాటు జైలు జీవితం గడిపారు.

మరో పాత్రికేయుడు ఐదు సంవత్సరాల నిర్బంధం తర్వాత స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు. 2023 మార్చిలో ఎన్ఐఏ అరెస్ట్ చేసిన ఇర్ఫాన్ మెహ్రాజ్ అనే పాత్రికేయుడు ఇప్పటికీ జైలులోనే మగ్గుతున్నారు. ఉగ్రవాద కార్యకలాపాలకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ మానవ హక్కుల సంస్థతో సంబంధం ఉన్నదని ఆయనపై అభియోగాలు మోపారు. వాస్తవానికి 1990వ దశకంలో కాశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుండే మీడియాకు ఇబ్బందులు మొదలయ్యాయి.

త్వరలో కొత్త రెవెన్యూ చట్టం

- ముసాయిదాపై అభిప్రాయ సేకరణ ముగిసింది : రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి త్వరలో కొత్త రెవెన్యూ చట్టం అందుబాటులోకి రానుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 2024 ఆర్వోఆర్ ముసాయిదాపై ప్రజాభిప్రాయం ముగిసిన నేపథ్యంలో కొత్త రెవెన్యూ చట్టం రూప కల్పనకు అవసరమైన కసరత్తును త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలు, సూచనలన్నింటినీ ఒక దగ్గర పొందుపరచి పరిశీలించాలనీ, వాటిలో రాష్ట్ర ప్రజలకు అవసరమున్న అంశాలను కొత్త చట్టంలో ఉండేలా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకునీ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకురాబోతున్నామని వెల్లడించారు. 2020 రెవెన్యూ చట్టం లోపభూయిష్టంగా ఉండడంతో రైతులు, భూ యజమానులు అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా కొత్త చట్టాన్ని రూపొందించి, పబ్లిక్ డాక్యుమెంట్ గా అందరికీ అందుబాటులో ఉంచబోతున్నామని ప్రకటించారు.

వీఎస్ రావు ఉద్యోగ విరమణ



- సత్కరించిన ఎమ్‌డీ సజ్జనార్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆర్టీసీ ప్రధాన కార్యాలయం బస్‌భవన్‌లో కమ్యూనికేషన్ సెల్ ఓపీడీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వీఎస్ రావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనతో పాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్ కృష్ణకాంత్, డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న బీ కుమారస్వామి కూడా ఉద్యోగ విమరణ చేశారు. ఈ సందర్భంగా బస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దాదాపు 37 ఏండ్లు సంస్థకు విశేష కృషి చేసిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయా ఉద్యోగుల సహచరులు, వారి కింద పనిచేసిన సిబ్బంది ఘనంగా సన్మానించారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించి, సంస్థ ఉన్నతికి కారణమైన అధికారుల్ని ఈ సందర్భంగా ఎమ్‌డీ సజ్జనార్ ప్రసంసించారు. ఉద్యోగ విరమణానంతరం శుభప్రదమైన జీవనం కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీవోవో డాక్టర్ రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మునిశేఖర్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప తదితరులు పాల్గొన్నారు.

జనగణనలోనే కులగణన చేపట్టాలి

- ఎంసీపీఐ(యూ) ప్రధాన కార్యదర్శి అశోక్ ఓంకార్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా ఈనెలలో చేపట్టబోయే జనగణనలోనే కులగణన కూడా చేపట్టాలని ఎంసీపీఐ(యూ) అఖిల భారత ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదం, ఇజ్రాయెల్ సాగిస్తున్న దాడులను తీవ్రంగా ఖండించారు. బీజేపీకి పార్లమెంటులో మెజార్టీ తగ్గినా మోడీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక నిర్ణయాలను తీసుకుంటున్నదని విమర్శించారు. మహిళలపై దాడులు, లైంగిక దాడులకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తామనీ, ఈనెల 10న హైదరాబాద్‌లో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తామని చెప్పారు. ఎన్ రెడ్డి హంసారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, వనం సుధాకర్, వసుకుల మట్టయ్య, గోనె కుమారస్వామి, కుంభం సుకన్య, వస్తియ తుకారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సెలెక్టెడ్ దాడులు చేస్తారా?

- హైడ్రాపై నిరంజన్‌రెడ్డి ఫైర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

హైడ్రా పేరుతో సెలెక్టెడ్ దాడులు చేస్తారా? అంటూ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హైడ్రాను ప్రశ్నించారు. పాలమూరులో పేదల ఇండ్లు కూల్చివేతలను ఆయన శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. అక్రమ నిర్మాణాలన్నీ కూల్చుతామంటూ పైకి చెబుతున్నా...దాని చర్యలు మాత్రం అనుమానాస్పదంగా ఉన్నాయని పేర్కొన్నారు. హైడ్రా కార్యాలయమే అలుగులో ఉందంటూ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ చెప్పారనీ, నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ పార్క్ ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించారని తెలిపారు. ఎలాంటి విచక్షణ లేకుండా తీసుకుంటున్న ప్రభుత్వ చర్యల మూలంగా ప్రజలు బాధితులౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

దంచికొడుతున్న వాన

(మొదటిపేజీ తరువాయి)

ఉదయం ఓ వ్యక్తి బైక్‌పై రోడ్డు దాటుతూ కొట్టుకుపోయాడు. సమీపంలో చెట్టును పట్టుకొని కేకలు వేయడంతో స్థానికులు కాపాడారు. బైక్ నీటిలో కొట్టుకుపోయింది. మధిర మండలం రాయపట్నం గ్రామంలోని లోతట్టు ప్రాంతంలో ఇండ్లలోకి నీరు చేరింది. మధిర రైల్వే అండర్ బ్రిడ్జి కింద నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుండంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఖమ్మం నుంచి మధిర వచ్చే దారిలో ఉన్న పాలవాగు ప్రవాహంతో రాకపోకలు నిలిచాయి.

బోనకల్ - చింతకాని మధ్య నాగులవంచ శివారులో ఉన్న వాగు వరద ఉధృతితో వాహనాలను దారి మళ్లించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ వ్యాప్తంగా 82 మి.మీ వర్షపాతం నమోదయింది.

ఉరకలెత్తుతున్న వాగులు

గద్వాల, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో వర్షం దంచి కొట్టింది. ప్రాజెక్టులు నిండి దిగువకు నీరు వస్తుండటంతో చెరువులు కళకళలాడుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట ఉమామహేశ్వర క్షేత్రాన్ని వరద నీరు చుట్టుముట్టింది. వరద ఉధృతికి జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. జడ్చర్ల పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి చుట్టూ నీరు చేరింది. మోకాల్లోతు నీరు ప్రవహిస్తుండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అభంగాపూర్ వద్ద వాగు, మందిపల్లి, పాతపల్లి, ఎమోనోన్‌పల్లి వద్ద వాగుల వరద ఉధృతికి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు వరద పోటెత్తింది. 2 గేట్లను ఎత్తి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు.

పర్యాటక ప్రాంతాలు బంద్

వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో భారీ వర్షం పడింది. హన్మకొండ, వరంగల్, కాజీపేటలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. గార్లలో పాకాల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తొర్రూరు మండలం కంటయపాలెం వద్ద వంపు వాగు ప్రవాహం వల్ల తొర్రూరు-కంటాయపాలెం మధ్య రాకపోకలను అధికారులు నిలిపేశారు. ములుగు జిల్లాలోని మొండాలతోగు పొంగిపొర్లడంతో పసర-తాడ్వాయి మధ్య 163వ జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. పిడుగుపాటుకు గురై తాడ్వాయి మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన పశువుల కాపరి పుట్ట మహేష్ (19) మృతిచెందాడు. మహబూబాబాద్ జిల్లాలోని పెద్దవంగర, తొర్రూరులో వాగులు, వంకలు పొంగిపోర్లాయి. రోడ్లన్నీ చెరువులను తలపించాయి. వరంగల్, ములుగు, జనగామ జిల్లా కలెక్టరేట్లలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. బొగత జలపాతం, లక్నవరం, రామప్ప పర్యాటక ప్రాంతాలను మూసేశారు.

సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని వేములూరు ప్రాజెక్టు పొంగిపొర్లుతోంది. వర్షాలు లేక రెండు సంవత్సరాలుగా పూర్తిగా ఎండిపోయిన ప్రాజెక్టు ఇటీవల సాగర్ ప్రాజెక్టు నుంచి ఎడమ కాలువకు నీరు విడుదల చేయడంలో పూర్తిగా నిండింది. కోదాడ సమీపంలోని ఆంధ్రప్రదేశ్ నందిగామ వద్ద వాగు పొంగిపొర్లుతుండటంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. జాతీయ రహదారిపైకి వరద రావడంతో కోదాడ బైపాస్ వద్ద వాహనాలు నిలిచిపోయాయి. దాంతో హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను ఖమ్మం వైపు మళ్లించారు. హైదరాబాద్‌లో శనివారం ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. యూసఫ్‌గూడ, కార్మిక్‌నగర్, ఫిలింనగర్, సుచిత్ర, బాలానగర్, జీడిమెట్ల, గచ్చిబౌలి, రాయదుర్గం, షేక్ పేటలో భారీ వర్షం కురిసింది. చాలా ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షాల కారణంగా విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సీఎస్ ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం స్కూళ్లకు సెలవు దినంగా నిర్ణయించారు.









విద్యారంగ సమస్యల పరిష్కారంలో సర్కార్ నిర్లక్ష్యం

- 10న ఇందిరా పార్కు వద్ద విద్యార్థి మహాగర్జన : ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు మూర్తి, నాగరాజు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యారంగం సమస్యలు పరిష్కరించటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల10న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద విద్యార్థి మహాగర్జన నిర్వహించనున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడు నెల్లయిందని తెలిపారు. ఇప్పటికీ విద్యాశాఖకు మంత్రి లేకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలను సమస్యలు చుట్టుముట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాలు, జనరల్ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న గురుకులాలు, జనరల్ వసతి గృహాల అద్దెలు నేరుగా భవనాల ఓనర్లకే చెల్లించటంతో ఆయా భవనాల్లో కనీసం మైనర్ రిపేర్లు కూడా చేయటం లేదని తెలిపారు. అద్దె భవనాల్లో తాగునీరు, టాయిలెట్ల సమస్య ఉందన్నారు. కిటికీలు, డోర్లు లేకుండా విద్యార్థులు ఎలా ఉంటారని ప్రశ్నించారు. ఇటువంటి మృత్యు కూపాల్లోనే విద్యార్థులు బతికులీడుస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యవసరాల ధరల కారణంగా చాలీచాలని మెస్ ఛార్జీలతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీల్లో సీజనల్ వ్యాధులు పట్టిపీడిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాసంస్థల్లో రెగ్యులర్ వైద్య సిబ్బంది లేదని చెప్పారు. దీంతో విద్యార్థులకు రోగం తీవ్రత దాల్చినప్పుడు పట్టణ కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పరుగులు తీస్తున్నారన్నారు. ఆరేండ్లుగా స్కాలర్‌షిప్‌లు, రీయంబర్స్‌మెంట్ బకాయిలు రూ. ఎనిమిదివేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రయివేటు యాజమాన్యాలు కోర్సులు పూర్తయిన తర్వాత ట్యూషన్ ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నాయని ఆరోపించారు. సర్టిఫికెట్లు జారీ చేయకుండా ట్యూషన్ ఫీజులు చెల్లించాలని మొండికేసి విద్యార్థుల భవిష్యత్తు పట్ల తల్లిదండ్రులను తీవ్రమైన నిరాశావాదంలోకి నెట్టివేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో అనేక సమస్యలున్నా యన్నారు. కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించడం లేదని వివరించారు. యూనివర్సి టీల పర్యవేక్షణ చూడాల్సిన రెగ్యులర్ వైస్ ఛాన్సలర్‌లు లేరన్నారు. వాటిల్లో 70 శాతానికి పైగా ఆచార్యుల పోస్టులు, నాన్ టీచింగ్ పోస్టులన్నీ ఖాళీ అయ్యాయని తెలిపారు. పరిశోధనలు రోజురోజుకు కుంటుపడుతు న్నాయనీ, పరిశోధక ఫెలోషిప్‌ల ఊసే లేదని విమర్శించారు. ప్రభుత్వ యూనివర్సిటీల్లో విద్యార్థుల మెస్ బిల్లులన్నీ ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల భూములు కబ్జాకు గురవుతున్నాయనీ, యూనివర్సిటీల స్వయంప్రతి పత్తి పూర్తిగా దెబ్బతింటుందని తెలిపారు. నీట్ విద్యార్థులకు స్థానికత అంశంలో ప్రభుత్వం ఇచ్చిన జీవో 33 రద్దు చేసి పాఠశాల విద్యా స్థానికతను ప్రామాణికంగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల విద్యను పర్యవేక్షిం చాల్సిన మండల, జిల్లా కేంద్రాల్లో రెగ్యులర్ ఎంఈఓలు, డీఈఓలు లేరని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంలో ప్రభుత్వ పాఠశాల లన్నింటినీ చేర్చి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలనీ, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంటర్‌మిడియట్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు డి. కిరణ్, ఎం. మమత, కె. అశోక్ రెడ్డి రాష్ట్ర కమిటీ సభ్యులు జె. రమేష్, లెనిన్ పాల్గొన్నారు.

ఏపీని కుదిపేస్తున్న భారీ వర్షాలు..

- 8 మంది మృతి..పోటెత్తిన వరద
- శ్రీకాకుళం..విశాఖ మధ్య తుపాను
- ప్రకాశం బ్యారేజీ 70 గేట్లు ఎత్తివేత.. జలదిగ్బంధంలో లంకగ్రామాలు
- సహాయక చర్యలపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి : ఏపీలో భారీ వర్షాలు కుదిపేస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రహదారులు, వంతెనలు పొంగిపొర్లు తున్నాయి. ప్రకాశం బ్యారేజీ 70 గేట్లు ఎత్తి కిందకు నీటిని విడుదల చేస్తున్నారు. వరద నీరు ప్రవాహం ఎక్కువవుతుండటంతో..లంక గ్రామాల్లో జనంలో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు విజయవాడలో కొండచరియలు విరిగిపడటం, గుంటూరు శివారులోని ఉప్పలపాడు కాల్వల్లో కారు దూసుకెళ్లింది. ఈ ఘటనలతో సహా పలు ప్రమాదాల్లో ఇప్పటి వరకు ఎనిమిది మంది చనిపోయారు. బాధిత కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం అందించాలని ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అన్ని కార్యక్రమాలు రద్దు చేసుకొని వర్షాల ప్రాంతాల్లో పరిస్థితులు, సహాయక చర్యలపై సమీక్షించారు. సీఎస్, డీజీపీ, మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలతో సాయంత్రం మరోసారి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సహాయక చర్యలకు జిల్లాకు రూ.3కోట్ల చొప్పున తక్షణ విడుదల చేయాలని ఆదేశించారు.

ఆ మూడు జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలి..

ఆదివారం కూడా వర్షాలు ఉంటాయన్న సమాచారం నేపథ్యంలో ప్రతి ప్రభుత్వ విభాగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. శ్రీకాకుళం-విశాఖపట్నం మధ్య శనివారం రాత్రికి తుపాను తీరం దాటే అవకాశముందని అధికారులకు సీఎంకు వివరించారు. ఉత్తరాంధ్రలోని 3 జిల్లాల్లో తీరం వెంట ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని సీఎం ఆదేశించారు. 3 జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తతో ఉండాలన్నారు. తుపాను తీరం దాటే సమయంలో 55 నుంచి 65 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. తీరం దాటే సమయంలో గాలుల వేగంపై స్పష్టమైన అంచనాలతో సన్నద్ధంగా ఉండాలన్నారు. ఇప్పుడు తుపాను ఎంత వేగంతో ప్రయాణిస్తుంది..ఎటువైపు వెళుతోంది అనే విషయాన్ని విశ్లేషించి అందుకు అనుగుణంగా అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. నష్టం జరిగిన తరువాత స్పందించడం కాదు..నష్టం తగ్గించేలా అధికారుల పనితీరు ఉండాలని స్పష్టంచేశారు. హుద్ హుద్ తుఫాను సమయంలో అనుసరించిన బెస్ట్ ప్రాక్టీసెస్‌ను ఇప్పుడు కూడా పాటించాలని అధికారులకు సూచించారు. టెలికాన్ఫరెన్స్‌లో అధికారులు, ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. వర్షాలు తగ్గేవరకు అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కొన్ని చోట్ల 10 నుంచి 20 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైందని, ఆదివారం కూడా వర్షాలు పడతాయని తెలుస్తోంది. ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సీఎం ప్రజలకు సూచించారు. బుడమేరులో నీటి ఉద్ధతి అధికంగా ఉందని మంత్రి కొల్లు రవీంద్ర, అధికారులు సీఎంకు వివరించారు. విజయవాడ నగరంలో రోడ్లపై నిలిచిన నీటిని బయటకు పంపేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు తెలిపారు.

సాగర్‌లో 26 గేట్ల ద్వారా నీటి విడుదల



నవతెలంగాణ-నాగార్జునసాగర్

నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు శ్రీశైలం నుంచి కృష్ణమ్మ ప్రవాహం కొనసాగుతోంది. దీంతో సాగర్ డ్యామ్ 26 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 20గేట్లను 10 అడుగులు, 6గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 3,87,653 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్టు ఎన్ఎస్పీ అధికారులు విడుదల చేస్తున్నారు. డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 588.90 అడుగుల వద్ద నీరు నిల్వ వుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా, ప్రస్తుతానికి 308.7614 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29,313 క్యూసెక్కుల నీటిని, కుడి కాలువ ద్వారా 5496, ఎడమ కాల్వ ద్వారా 6634, ఎస్ఎల్‌బిసి ద్వారా 1800, లోలెవల్ కెనాల్ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని.. మొత్తం 3,87,653 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

శ్రీశైలం ప్రాజెక్టు 10 గేట్లు ఎత్తివేత

- జూరాలలో 45 గేట్ల ద్వారా నీరు విడుదల



నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి/ధరూరు

ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల నుంచి భారీగా వరద దిగువకు వస్తోంది. దీంతో జూరాల 45 గేట్లను ఎత్తగా.. కృష్ణమ్మ పరుగులు తీస్తూ శ్రీశైలం జలాశయంలోకి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు కూడా నిండటంతో 10 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నట్టు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 3లక్షల 24 వేల 525 క్యూసెక్కుల నీరు, ఔట్ ఫ్లో 3లక్షల 49 వేల 152 క్యూసెక్కులుగా ఉందన్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకు చేరింది. కాగా కుడి, ఎడుమ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోందని అధికారులు తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని ధరూర్ మండల పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు 45 గేట్లు ఎత్తినట్టు పీజేపీ అధికారులు తెలిపారు.

స్కూళ్లకు సెలవులు కలెక్టర్ల బాధ్యతే...

- భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్లతో సీఎస్ టెలీ కాన్ఫరెన్స్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండ్రోజులు అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది, దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీజీపీ డాక్టర్ జితేందర్, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, ప్రణాళికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, నీటి పారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, పంచాయితీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, ఫైర్ సర్వీసుల శాఖ డీజీ నాగిరెడ్డి, జీహెచ్ ఎంసీ కమీషనర్ ఆమ్రపాలి, మున్సిపల్ పరిపాలన విభాగం సంచాలకులు గౌతమ్ తదితరులు కూడా టెలీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయనీ, ఎలాంటి ఆకస్మిక విపత్తు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సంసిద్ధంగా చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో క్లౌడ్ బరస్ట్ అయ్యే అవకాశం కూడా ఉందని హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయం తోపాటు జీహెచ్ఎంసీ, రాష్ట్ర సచివాలయంలోనూ కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లోతట్టు, వరద ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా నిఘా పెట్టాలని చెప్పారు. ఉధృతంగా పారే వాగుల వద్ద ఒక అధికారిని ప్రత్యేకంగా నియమించి పర్యవేక్షించాలనీ, తీవ్రతను బట్టి జిల్లాల్లో పాఠశాలలకు సెలవు దినంగా ప్రకటించుకునే నిర్ణయం కలెక్టర్లు తీసుకోవాలని తెలిపారు. పునరావాస శిబిరాలను ఏర్పాటుపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. జాగ్రత్తలపై ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలను చైతన్య పరచాలని చెప్పారు. అంటు వ్యాధులు ప్రబల కుండా బ్లీచింగ్ పౌడర్, క్లోరినేషన్ చేపట్టాలనీ, వైద్య బృందాలను అప్రమత్తం చేయాలనీ, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో ఉన్నాయనీ, ముందస్తు సమాచారం ఇస్తే ఆ బృందాలను పంపిస్తామన్నారు.

పారాలింపిక్స్‌లో పతకాలు సాధించిన
అవని, మోనాకు కేటీఆర్ అభినందనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పారిస్‌లో జరుగుతున్న పారాలింపిక్స్‌లో మహిళల పది మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో స్వర్ణం గెలిచిన అవనికి, కాంస్య సాధించిన మోనాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ట్వీట్ చేశారు. పారా అథ్లెట్లు అద్భుతమైన ప్రతిభతో భారతీయ క్రీడారంగం సత్తా చాటుతున్నారని పేర్కొన్నారు. ఇది భారతీయులందరికీ గర్వకారణమైన రోజని తెలిపారు. వారి విజయాలు దేశానికి స్ఫూర్తిదాయకమనీ, అద్భుతమైన ప్రతిభ కనబరుస్తున్న వారి సంకల్పం ఎంతో గొప్పదని పేర్కొన్నారు.

ఫెయిల్యూర్ సీఎం రేవంత్‌రెడ్డి

- విద్యార్థులను ఎలుకలు కొరికినా పట్టించుకోరా.?
- మెస్, కాస్మోటిక్ బిల్లులు విడుదల చేయాలి
- నిధుల్వికుంటే టీచర్లు ఎక్కడి నుంచి తెచ్చి పెడతారు..: ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి



నవతెలంగాణ- శంషాబాద్

గత ప్రభుత్వం గురుకులాలను నిర్మించి దేశానికి ఆదర్శంగా నిలిపితే ప్రస్తుత ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తున్నది.. సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉన్నా ఒక్కసారి కూడా రివ్యూ చేయలేదు.. సీఎం రేవంత్ ఫెయిల్యూర్ సీఎం.. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి గురుకులాలను పట్టించుకోవాలని మాజీ మంత్రులు.. ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఇది ప్రజా వ్యతిరేక ప్రభుత్వమని విమర్శించారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని పాలమాకుల కేజీబీవీ విద్యార్థులు జాతీయ రహదారిపై ఆందోళన చేసిన విషయం విదితమే. శనివారం పాలమాకుల కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని వారు సందర్శించారు. వంట గదులు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు దాయనీయమైన పరిస్థితులను విద్యార్థులు వారికి వివరించారు. కేజీబీవీలో కుల వివక్ష పాటిస్తున్నారని, టీచర్లు వేధిస్తున్నారని, పురుగుల అన్నం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడిగితే కారం పొడితో దాడి చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని విద్యార్థినులు ఎమ్మెల్యేల దృష్టికి తీసుకొచ్చి కన్నీటి పర్యంతమయ్యారు.

ఈ సందర్భంగా హరీశ్‌రావు, సబితారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యార్థులకు భద్రత లేకుండా పోయిందన్నారు. రామాయంపేటలో 11 మంది విద్యార్థులను, నల్లగొండ గురుకుల బీసీ హాస్టల్‌లో 13 మంది పిల్లలను ఎలుకలు కొరికాయని చెప్పారు. పాములు, ఎలుకల వల్ల విద్యార్థులు ప్రాణం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భువనగిరిలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న ఘటనను గుర్తు చేశారు. గత ప్రభుత్వం రెసిడెన్షియల్ విద్యా విధానాన్ని ప్రోత్సహించడంతో తల్లితండ్రులు తమ పిల్లలను రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పడానికి ఆసక్తి చూపారని చెప్పారు. దీనికి భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఐదారు నెలలుగా కాస్మోటిక్, మెస్ చార్జీలు రావడం లేదన్నారు. మైనారిటీ గురుకులాల్లో కూడా సమస్యలు పేరుకుపోతున్నాయన్నారు. పాలమాకులలో ఒక టీచర్ మాట్లాడుతూ.. ఎక్కడి నుంచి తెచ్చి పెట్టాలని ఆందోళన వ్యక్తం చేసినట్టుగా మీడియాలో చూశామని అన్నారు. ప్రభుత్వం బిల్లులు ఇవ్వకుంటే టీచర్లు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీచర్లను చూసి విద్యార్థినులు భయందోళనకు గురవుతున్నారని, ప్రస్తుతం కొనసాగుతున్న టీచర్లందరినీ బదిలీ చేయాలని అన్నారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులు తమ వైఖరిని మార్చుకోవాలని, విద్యార్థుల పట్ల ప్రేమ భావంతో మెలగాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా పతిపక్షనేతలపై కక్ష సాధింపు చర్యలు, వారిని ఎలా కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవాలో వంటి విషయాలపై కాకుండా.. గురుకులాల్లో సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. గురుకులాల్లో మౌలిక సదుపాయాలు, నాణ్యమైన భోజనం అందించా లని కోరారు. ఇక్కడి పరిస్థితులపై జిల్లా కలెక్టర్ స్పందించి, వెంటనే రివ్యూ చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినులు ఆందోళన చేసిన నేపథ్యంలో ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మెన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కూడా పాలమాకుల కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిసామని అన్నారు. శంషాబాద్ మాజీ జెడ్పీటీసీ తన్వీరాజు, నాయకులు పి.కార్తిక్ రెడ్డి, కె.చంద్రా రెడ్డి ఉన్నారు.

మహిళలపై అఘాయిత్యాల కేసుల్లో సత్వర న్యాయం జరగాలి : ప్రధాని మోడీ



ఢిల్లీ : దేశంలోనిమహిళలపై అఘాయిత్యాల కేసుల్లో ఎంత వేగంగా న్యాయం జరుగుతుందో.. అప్పుడే వారి భద్రతపై ఎక్కువ భరోసా ఏర్పడుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు.భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ సమక్షంలో జరిగిన జిల్లా న్యాయవ్యవస్థ జాతీయ సదస్సు ప్రారంభ సెషన్‌లో ప్రధాని పాల్గొని మాట్లాడారు. న్యాయవ్యవస్థలపై ప్రజలు ఎన్నడూ అపనమ్మకం చూపలేదన్నారు. ఇక ఇదే సదస్సులో దేశంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి ప్రస్తావించారు.

'దేశంలో మహిళలకు భద్రత కల్పించేందుకు ఇప్పటికే అనేక కఠినమైన చట్టాలు ఉన్నాయి. ఇలాంటి కేసుల్లో వేగంగా విచారణ పూర్తి చేసి శిక్షలు విధించాలి. 2019లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు చట్టాన్ని తీసుకొచ్చాం. ఈ చట్టం కింద సాక్షులను రక్షించే కేంద్రాలను ఏర్పాటు చేశాం. జిల్లా పర్యవేక్షక బందాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. వీటిని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. అప్పుడే మహిళలపై నేరాల విషయంలో వేగంగా తీర్పులు వెలువడతాయి' అని ప్రధాని మోడీ అన్నారు.

నితీశ్‌కుమార్‌పై దాఖలైన పిటిషన్ కొట్టివేత

ఢిల్లీ: జనతాదళ్(యునైటెడ్)పార్టీ అధ్యక్షుడిగా బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై గురువారం ఢిల్లీ హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా.. జేడీయూ మాజీ సభ్యుడు గోవింద్ యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌కు అర్హత లేదని, అంతర్గత పార్టీ మార్పులపై కోర్టు జోక్యం చేసుకోవడానికి బలమైన కారణం లేదని జస్టిస్ పురుషేంద్ర కుమార్ కౌరవ్ అన్నారు. "ఈ పిటీషన్‌ను విచారించే మెరిట్ లేదు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 అధికార పరిధికి సంబంధం లేకుండా ఉంది.పెండింగ్‌లో ఉన్న పిటిషన్లతో పాటు రిట్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం" అని ఢిల్లీ కోర్టు పేర్కొంది. 2016, 2019, 2022 సంవత్సరాల్లో జేడీయూ నిర్వహించిన పార్టీ అంతర్గత ఎన్నికలు పార్టీ రాజ్యాంగాన్ని ఉల్లంఘించాయని ప్రకటించాలని గోవింద్ యాదవ్ హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఇదే విషయాన్ని గతంలోనూ జేడీయూ పార్టీలోని ఒక వర్గం లేవనెత్తగా.. 2017లో ఎన్నికల సంఘం నితీశ్‌కుమార్‌కు అనుకూలంగా తీర్పునిచ్చిందని హైకోర్టు పరిశీలించింది.

కేదార్‌నాథ్‌లో కూలిన హెలికాప్టర్

కేదార్‌నాథ్ : కేదార్‌నాథ్‌లో ఓ హెలికాప్టర్ శనివారం కూలిపోయింది. కేదార్‌నాథ్ సందర్శన సమయంలో యాత్రికులను తరలించేందుకు వినియోగించే ఓ క్రెస్టల్ హెలికాప్టర్ మే 24న ల్యాండింగ్ సమయంలో దెబ్బతింది. దీని మరమ్మత్తుల నిమిత్తం శనివారం ఎంఐ-17 విమానంలో తీసుకెళ్లే క్రమంలో కూలిపోయినట్లు అధికారులు తెలిపారు. ఈ హెలికాప్టర్‌ను విమానం బ్యాలెన్స్ చేయలేకపోయింది. ఈ ప్రమాదాన్ని ఊహించిన పైలట్ ఆ హెలికాప్టర్‌ను లోయలోని ఖాళీ ప్రదేశంలో పడేశాడు. ఈ విషయంపై జిల్లా పర్యాటక అధికారి రాహుల్ చౌబే మీడియాతో మాట్లాడుతూ.. 'ఎంఐ %-% 17 ఎయిర్ క్రాఫ్ట్ సహాయంతో హెలికాప్టర్‌ను రిపేర్ కోసం శనివారం గౌచర్ ఎయిర్‌స్ట్రిప్‌కు తీసుకెళ్లాలని ప్లాన్. విమానం కొద్దిదూరం వెళ్లగానే అధిక బరువు కారణంగా బ్యాలెన్స్ కోల్పోయింది. ఆ సమయంలోనే బలమైన గాలులు వీయడంతో.. పైలట్ హెలికాప్టర్‌ను థారు క్యాంప్ సమీపంలో జారవిడిచారు. హెలికాప్టర్‌లో ప్రయాణీకులు, సమానులు లేవు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం లేదు. రెస్క్యూటీమ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలిస్తోంది' అని ఆయన అన్నారు.

రష్యాలో 22 మందితో ప్రయాణిస్తున్న హెలికాప్టర్ అదృశ్యం..



రష్యా : రష్యా తూర్పు ప్రాంతంలోని కమ్‌చత్కా ద్వీపకల్పంలో 22 మందితో ప్రయాణిస్తున్న హెలికాప్టర్ అదృశ్యమైంది. వీరిలో 19 మంది ప్రయాణికులు, ముగ్గురు సిబ్బంది ఉన్నారు. ఈ విషయాన్ని ఫెడరల్ ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీ కూడా ధ్రువీకరించింది. ఎంఐ-8టీ శ్రేణికి చెందిన ఈ హెలికాప్టర్ వచ్కజెట్స్ అగ్ని పర్వతం సమీపం నుంచి బయల్దేరింది. కానీ, గమ్యస్థానానికి చేరలేదు. అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సెప్టెంబర్ 4 నుంచి జమ్ముకాశ్మీర్‌లో ఎన్నికల ప్రచారం



న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్‌లో వచ్చే నెల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో లోక్‌ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. సెప్టెంబర్ 4 నుంచి రాహుల్ ఎలక్షన్ క్యాంపెయిన్ మొదలుపెట్టనున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ సీనియర్ నేత గులాం అహ్మద్ మీర్ ఇప్పుడు జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో దూరు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. రాహుల్ కూడా ఈ దూర్ నియోజకవర్గం నుంచే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారని, సెప్టెంబర్ 4వ తేదీన దూర్ నియోజకవర్గంలో జరిగే బహిరంగ సభలో రాహుల్ ప్రసంగించనున్నారని పార్టీ వర్గాల సమాచారం.

పనితోనే సమాధానం చెబుతా

- శరద్‌పవార్ కౌంటర్




నాగపూర్ (మహారాష్ట్ర) : నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) చీఫ్ అజిత్ పవార్ మహారాష్ట్రలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి పెట్టారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తన పార్టీకి మహాయతి కూటమికి మధ్య సీట్ల సర్దుబాటు గురించి చర్చలు జరిపినట్లు అజిత్‌పవార్ శనివారం తెలిపారు. పోటీ చేసే సీట్లకు సంబంధించి ఇప్పుడు జరిగినవి మొదటి దఫా చర్చలే.. రెండో దఫా కూడా చర్చలు జరిగే అవకాశం ఉందని అజిత్ మీడియాకు తెలిపారు.కాగా, మహాయతి కూటమిపై శివసేన నేత తానాజీ అసంతప్తి వ్యక్తం చేశారు. తాజాగా ఆయన ఓ కార్యక్రమంలో మాట్లా డుతూ.. 'కేబినెట్‌లో ఎన్‌సిపి మంత్రుల పక్కనే నేను కూర్చుంటాను. దీంతో నాకు వికారంతో వాంతి వచ్చినట్టుగా ఉంటుంది' అని ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై ఎన్‌సిపి చీఫ్ అజిత్‌పవార్ శనివారం స్పందించారు. విమర్శలను పట్టించుకోనని, వేటికైనా తన పనితోనే సమాధానం చెబుతానని అజిత్ అన్నారు. ఈ విషయంపై మీడియాతో ఆయన మాట్లాడుతూ.. 'ఎవరైనా ఏదైనా నా గురించి మాట్లాడితే.. నేను దానిపై స్పందించలచుకోలేదు. నేను ఈ నిర్ణయం జన్ సమ్మాన్ యాత్ర ప్రారంభంలోనే నిర్ణయించుకున్నాను. ఎవరు.. ఏ విమర్శ చేసినా నేను పట్టించుకోను. నేను నా పనినే నమ్ముతున్నాను' అని ఆయన అన్నారు.

ఛాత్ర సమాజ్ నాయకుడికి బెయిల్

పశ్చిమ బెంగాల్ : పశ్చిమబెంగాల్ ఛత్ర ఎంంరమాజ్ నాయకులు సయన్ లాహిరికి కలకత్తా హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. కోల్ కతా హత్యాచార ఘటనకు నిరసనగా ఆగస్టు 27న నిర్వహించిన చలో సచివాలయం ర్యాలీఉద్రిక్తంగా మారింది. దీంతో ర్యాలీ నిర్వహించే వారిలో ఒకరైన పశ్చిమ బెంగాల్ ఛత్ర సమాజ్ నాయకుడు సయన్ లాహిరిని పోలీసులు అరెస్టు చేశారు. ఆగస్టు 27 సాయంత్రం ఆయన్ని అరెస్టు చేశారు. ఇది హింసాత్మకంగా మారిందని అధికారులు పేర్కొన్నారు.

గుజరాత్‌లో వరద బాధితుల ఆక్రందనలు

- పూర్తిగా చేతులెత్తేసిన డబుల్ ఇంజిన్ సర్కార్
- ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఫినాయిల్ తాగిన యువకుడు





అహ్మదాబాద్ : ఢిల్లీ ఎన్నికలైనా..గల్లీ ఎన్నికలైనా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 'డబుల్ ఇంజిన్ సర్కార్' అంటూ నినదిస్తుంటారు. కేంద్రంలోనూ, స్థానికంగానూ బీజేపీయే ఉంటే డబుల్ ఇంజిన్‌లా అభివృద్ధి పరుగులు పెట్టిస్తామంటూ ప్రసంగాలు దట్టిస్తుంటారు. ఆయన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో ఇప్పుడు డబుల్ ఇంజిన్ సర్కారే పాలనలో ఉంది. కానీ భారీ వర్షాలతో అతలాకుతలమైన ప్రాంతాల్లోని ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. భారీ వర్షాల కారణంగా నదులు ఉప్పొంగడంతో పలు ప్రాంతాలలో వరదలు పోటెత్తాయి. తమ నివాసాలు నీటిలో మునిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తమకు తాత్కాలిక వసతి,ఆహారం అందించాలని వేడుకుంటున్నా బీజేపీ ప్రభుత్వం కనీసంగానైనా కనికరం చూపడం లేదు. దీనికి తోడు అధికారుల అలసత్వం తోడవ్వడంతో ప్రజలే బతుకు జీవుడా అంటూ రోజులు లెక్కిస్తున్నారు. జామ్‌నగర్‌లోని వరద బాధితులను ఆదుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వ తీరుతో విసుగుచెందిన ఒక యువకుడు ఫినాయిల్ తాగి నిరసన వ్యక్తం చేసినట్లు పోలీసులు తెలిపారు. తమకు కనీస సౌకర్యాలు కల్పించాలని బాధితులు జామ్‌నగర్ జిల్లా అభివద్ధి అధికారి (డీడీఓ) భంబీని ఆశ్రయించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఉన్నతస్థాయి అధికారులు ముంపు ప్రాంతాలను సందర్శించడానికి వచ్చిన సమయంలో విపుల్ అనే యువకుడు తీవ్ర నిరసన తెలిపారు. కనీస అవసరాలు కూడా తీర్చకపోతే అధికారులు ఉండి ఏమి లాభమంటూ ప్రశ్నించారు. తన నిరసనను తెలుపుతూ వెంట తెచ్చుకున్న ఫినాయిల్ తాగాడు. అధికారులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వరదల కారణంగా చాలామంది ప్రజలు ఇండ్లల్లోనే చిక్కుకుపోయారని, వారిని రక్షించి, తాత్కాలిక వసతి కల్పించాలని ఆయన కోరాడు. ఈ సమస్యలపై జిల్లా పంచాయతీకి పలుమార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోలేదని వాపోయారు. దీనిపై జామ్‌నగర్ కలెక్టర్ భవిన్ పాండ్యా మాట్లాడుతూ గతకొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో డ్యామ్‌లు పొంగిపొర్లుతున్నాయని పేర్కొన్నారు. ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ బందాలు ఇప్పటికే సహాయచర్యల్లో పాల్గొన్నాయని, వరదల్లో చిక్కుకున్న దాదాపు 20,000 మందిని రక్షించామన్నారు.

చిత్ర పరిశ్రమలో మహిళల భద్రతకు పటిష్ట చర్యలు

- అధికార పార్టీ ఎమ్మెల్యేపైనా చర్యలు
- దేశానికే మోడల్‌గా హేమా కమిటీ : సీపీఎం కేరళ రాష్ట్ర కార్యదర్శి గోవిందన్



తిరువనంతపురం : చలనచిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనానికి దేశంలోనే తొలిసారిగా వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం మాత్రమే కమిటీ ఏర్పాటు చేసిందని సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ తెలిపారు. హేమా కమిటీ నివేదికలో ప్రతిపాదించిన అంశాలపై ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. చిత్ర పరిశ్రమలోని నటులతో పాటు అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులందరూ పూర్తి భద్రతా భావంతో పనిచేసేందుకు వీలైన అన్ని చర్యలూ చేపట్టేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. హేమా కమిటీ నివేదికలో వ్యక్తిగత విషయాలు మరియు గోప్యతను ప్రభావితం చేసే అంశాలు ఉన్నందునే బహిర్గతం చేయడం లేదన్నారు. అయితే ఈ విషయంలో ఎటువంటి పక్షపాతమూ లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, అధికార పార్టీ ఎమ్మెల్యేపైనా కేసు నమోదు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా జయరాజన్ గుర్తు చేశారు.

ఇలాంటి సమస్యల పట్ల కాంగ్రెస్ కానీ, బిజెపి కానీ ఏనాడూ చర్యలు తీసుకున్న ఆనవాళ్ళు లేవన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కున్నపల్లి, ఎం విన్సెంట్‌పైనా ఆరోపణలు వచ్చినా కూడా వారు రాజీనామా చేయలేదని, ఎల్‌డిఎఫ్ మాత్రమే నిష్పక్షపాతంగా వ్యవహరించిన విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. అందరికీ సమానంగా న్యాయం జరగాలన్నదే తమ పార్టీ విధానమన్నారు. చలనచిత్ర పరిశ్రమలోని సమస్యల పరిష్కరించి అభివృద్ధి చేసేందుకు చలనచిత్ర పరిశ్రమ కోసం ప్రత్యేకంగా విధానాన్ని రూపొందించేందుకు షాజీ ఎన్ కరుణ్ నేతత్వంలో కమిటీని నియమించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో సినిమా రంగంలో ప్రభుత్వ జోక్యం ఆదర్శప్రాయంగా మారనుంది. దేశంలో 135 మంది ఎమ్మెల్యేలు, 16 మంది ఎంపీలు మహిళలపై నేరాలకు పాల్పడిన అభియోగాలు ఎదుర్కొంటున్నారని, వారెవరూ తమ పదవులకు రాజీనామా చేయలేదన్నారు. నిష్పక్షపాతంగా విచారణ జరగాలన్నదే తమ పార్టీ వైఖరన్నారు. హేమా కమిటీ నివేదికపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, అయితే మలయాళ చిత్ర పరిశ్రమ మొత్తం చెడ్డదని ప్రచారం చేసే ధోరణి సరైనది కాదని ఆయన అన్నారు.

సినిమా కోసం తమ జీవితాన్ని అంకితం చేసిన చాలా మంది వ్యక్తుల కృషితోనే మలయాళ సినిమా ఎదిగిందని కొనియాడారు. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తోందని, కెఐఎఫ్‌బిఐ పథకం ద్వారా ప్రభుత్వ నిర్వహణలోని థియేటర్లను ఆధునీకరించామని తెలిపారు. దేశంలోనే ప్రభుత్వ యాజమాన్యంలో నిర్వహిస్తున్న ఏకైక ఒటిటి వేదికను కూడా కేరళ ప్రభుత్వమే నిర్వహిస్తోందని ఆయన గుర్తు చేశారు.

విద్యుత్ ఉద్యోగుల సెలవులు రద్దు

- తక్షణం విధుల్లో చేరండి : టీజీఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాల నేపథ్యంలో విద్యుత్ పంపిణీ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది సెలవులు అన్నీ రద్దు చేస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ ప్రకటించారు. సెలవుల్లో ఉన్న ఉద్యోగులు తక్షణం విధుల్లో చేరాలనీ ఆదేశించారు. శుక్రవారం అర్ధరాత్రి ఆయన హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, మెదక్ ఉమ్మడి జిల్లాల చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యుత్ సరఫరా పరిస్థితిని సమీక్షించారు. సిబ్బంది అందరూ తమ తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రతి సర్కిల్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసేలా ప్రత్యేక కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలనీ, స్థానిక కలెక్టర్ కార్యాలయం, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎమ్‌సీ) అధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. అధికారులు తమ పరిధిలోని ఫ్యూజ్ ఆఫ్ కాల్, సీబీడీ కార్యాలయాలకు వెళ్లి,సరఫరా సమస్యలు సకాలంలో పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఎస్ఈ, డీఈ స్థాయి అధికారులు ప్రతి గంటకు విద్యుత్ సరఫరా పరిస్థితిని సమీక్షించాలని కోరారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో సిబ్బంది తప్పనిసరిగా అన్ని భద్రతా చర్యలను పాటించాలని చెప్పారు. ముంపు భయం ఉన్న లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఎలాంటి ప్రమాదాలు జరక్కుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాధారణ ప్రజలు, వినియోగదారులు తడిచిన విద్యుత్ స్తంభాలు, ఇతర పరికరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఏర్పడినా వెంటనే 1912 కి లేదా సమీప విద్యుత్ కంట్రోల్ రూమ్ సిబ్బందికి తెలపాలని చెప్పారు.

మంత్రి ఉత్తమ్‌పై మాజీమంత్రి హరీశ్ ఆగ్రహం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ మంత్రి కేసీఆర్ ఓ డెకాయిట్ అంటూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించటం శోచనీయమని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఆ కామెంట్లు ఉత్తమ్ దిగజారుడుతనానికి నిదర్శమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు హరీశ్‌రావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి వ్యాఖ్యల ద్వారా బూతులు తిట్టటంలో, అన్‌పార్ల మెంటరీ భాషను వాడటంలో ముఖ్యమంత్రి రేవంత్‌కు తానేమీ తక్కువ కాదంటూ నిరూపించదలుచుకున్నారా? అని ఉత్తమ్‌ను ప్రశ్నించారు. జలయజ్ఞం కింద గతంలో కాంట్రాక్టు పద్ధతిని ప్రవేశపెట్టింది ఎవరని ప్రశ్నించారు. తద్వారా ఇష్టానుసారంగా ప్రాజెక్టుల అంచనాల విలువలను పెంచిందని ఎవరంటూ నిలదీశారు. ఏజెన్సీలకు మొబిలైజేషన్ అడ్వాన్సు లిచ్చే పద్ధతిని ప్రవేశపెట్టి, నిబంధనలకు విరుద్ధంగా సర్వేలు, డిజైన్లు చేపట్టింది కాంగ్రెస్ నేతలు కాదా? అని హరీశ్ ప్రశ్నించారు. అడ్వాన్సులను 0.5 శాతం నుంచి 3.5 శాతానికి పెంచుకుని రాష్ట్రాన్ని డెకాయిటీ చేసింది మీరే కదా? అంటూ ఉత్తమ్‌నుద్దేశించి ఆయన ఎద్దేవా చేశారు.

బ్రెజిల్‌లో ఎక్స్ సేవలు బ్యాన్



బ్రెజిల్ : సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ఎక్స్ బిలియనీర్ యజమాని ఎలాన్‌మస్క్ దేశంలోని చట్టపరమైన తమ ప్రతినిధిని పేర్కొనడానికి నిరాకరించడంతో బ్రెజిల్ సుప్రీం కోర్టు న్యాయమూర్తి అలెగ్జాండర్ డి మోరేస్ శుక్రవారం బ్రెజిల్‌లో ఎలోన్ మస్క్ నిర్వహించే ఎక్స్ ని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. దీంతో బ్రెజిల్‌లో ఎక్స్ సేవలను పూర్తిగా నిలిపివేస్తూ అక్కడి టెలికాం శాఖ చర్యలు తీసుకుంది. ఆ దేశ సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఆదేశాల మేరకు టెలికామ్ విభాగం ఈ చర్యలు తీసుకొన్నట్లు ఓ ఆంగ్ల వార్తా సంస్థ తెలిపింది. దీంతో ఇక్కడి ప్రజలకు ఎక్స్‌లోకి లాగిన్ అవడం సాధ్యం కావడం లేదు. బ్రౌజర్‌ను రీలోడ్ చేసి లాగిన్ అవ్వండి అంటూ పదేపదే సందేశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు ఆండ్రాయిడ్, యాపిల్ ఐవోఎస్ నుంచి ఎక్స్ యాప్‌ను తొలగించడానికి బ్రెజిల్ న్యాయస్థానం డెడ్‌లైన్ విధించింది. ఈ చర్యతో ఎక్స్ లోని ఒక పోస్ట్‌లో మస్క్ అతన్ని "దుష్ట నియంత" అని పేర్కొన్నారు.

బ్రెజిల్‌లో ఎక్స్‌కు న్యాయప్రతినిధి లేరు....

తమ దేశంలో బ్రెజిల్‌లో ఎక్స్ ఎలాటి న్యాయ ప్రతినిధిని నియమించకపోవడంతో అక్కడి సుప్రీం కోర్టు న్యాయమూర్తి అలెగ్జాండర్ డె మోరాసే తక్షణమే ఎక్స్‌ను 24 గంటల్లో ఆపేయాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ వివాదం గత ఏప్రిల్‌లో మొదలైంది. దేశంలో తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్న పలు ఎక్స్ ఖాతాలను తొలగించాలని న్యాయస్థానం ఆదేశించడం వివాదానికి దారితీసింది.

బ్రెజిల్ న్యాయవ్యవస్థను ఎక్స్ యజమాని గౌరవించలేదు : న్యాయమూర్తి డి మోరేస్

బ్రెజిల్ చట్టపరమైన నిబంధనలకు కట్టుబడి ఉండటానికి ఎక్స్‌కు 24 గంటల సమయం ఇచ్చాం కానీ అది చేయలేదని న్యాయమూర్తి తెలిపారు. ఎలాన్‌మస్క్ బ్రెజిలియన్ సార్వభౌమాధికారం, ప్రత్యేకించి, న్యాయవ్యవస్థ పట్ల అగౌరవంగా ప్రవర్తించారు అని డి మోరేస్ పేర్కొన్నారు. తమ దేశ నిబంధనను పాటించే వరకు ఎక్స్ సస్పెండ్ చేయబడుతుందని స్పష్టం చేశారు. ప్లాట్‌ఫారమ్‌కు యాక్సెస్‌ను నిరోధించడానికి ఐఎస్‌పి లు, యాప్ స్టోర్‌లకు ఐదు రోజుల సమయం ఇచ్చామన్నారు. అతను వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్‌లు లేదా విపిఎన్ లను తీసివేయాలని కూడా ఆదేశించారు. ఇది ప్లాట్‌ఫారమ్‌ను మరొక దేశం నుండి యాక్సెస్ చేస్తున్నట్లు కనిపించేలా చేయగలదని చెప్పారు. ఎక్స్ ని యాక్సెస్ చేయడానికి విపిఎన్ లను ఉపయోగించే వ్యక్తులు లేదా కంపెనీలకు 8,900 డాలర్లకి సమానమైన జరిమానా విధించారు.


యాపిల్, గూగుల్‌కు 5 రోజుల గడువు...

మరోవైపు టెక్ దిగ్గజాలైన యాపిల్, గూగుల్‌కు న్యాయమూర్తి మోరాసే ఐదు రోజుల గడువు విధించారు. ఈలోపే వాటి ఆండ్రాయిడ్, ఐవోఎస్ అప్లికేషన్ల నుంచి ఎక్స్‌ను తొలగించాలని సూచించారు. అంతేకాదు వీపీఎన్ సాయంతో వ్యక్తులు లేదా వ్యాపారసంస్థలు ఎక్స్‌లో లాగిన్ అయితే 5,000 డాలర్ల ఫైన్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎక్స్ బ్రెజిల్‌లో న్యాయ ప్రతినిధిని ఏర్పాటు చేసేవరకు ఈ నిషేధం కొనసాగుతుందని కోర్టు ఆదేశాల్లో పేర్కొంది.

రాజకీయ లబ్ది కోసం నాశనం చేశారు : ఎలాన్‌మస్క్

అక్కడి న్యాయస్థానం తీరుపై ఎక్స్ యజమాని ఎలాన్‌మస్క్ స్పందిస్తూ ... " వాక్ స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి పునాది. ప్రజామోదంతో ఎన్నిక కాని న్యాయమూర్తి.. ఈ పునాదిని రాజకీయ లబ్ది కోసం నాశనం చేస్తున్నాడు " అని పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థుల గొంతుకలు నొక్కలేదన్న కారణంగా ఎక్స్‌ను మూసివేస్తున్నట్లు న్యాయమూర్తి త్వరలోనే చెబుతారని అన్నారు.

'ప్రపంచ క్రిప్టో క్యాపిటల్' గా అమెరికా - ట్రంప్



వాషింగ్టన్: అమెరికా రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అమెరికాను ప్రపంచ క్రిప్టో కరెన్సీ రాజధానిగా మార్చే ప్రణాళికను ఆవిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గురువారం ఎక్స్‌లో ఓ పోస్ట్‌లో ఈ మధ్యాహ్నం, యునైటెడ్ స్టేట్స్ గ్రహం.. క్రిప్టో రాజధానిగా ఉండేలా నా ప్రణాళికను రూపొందిస్తున్నాను అని మాజీ అమెరికా అధ్యక్షుడు ఒక వీడియోలో పేర్కొన్నారు. "వారు మిమ్మల్ని వ్యాపారం నుంచి ఉక్కిరి బిక్కిరి చేయాలనుకుంటున్నారు" అని ట్రంప్ వీడియోలో "వారు" ఎవరో పేర్కొనకుండా చెప్పారు. మేము అలా జరగనివ్వం అని అతను ముగించాడు. ఆ పోస్ట్‌లో అతని కుమారులు డోనాల్డ్ ట్రంప్ జూనియర్, ఎరిక్ ట్రంప్ ఇటీవల ప్రచారం చేస్తున్న వికేంద్రీకత ఆర్థిక ప్రాజెక్ట్ అయిన వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్‌కి లింక్‌ని చేర్చారు. ఈ ప్లాట్‌ఫారమ్ సంప్రదాయ బ్యాంకింగ్ వ్యవస్థకు పోటీగా నిలుస్తుందని ట్రంప్ జూనియర్ గతంలో చెప్పాడు. ప్రాజెక్ట్ యొక్క టెలిగ్రామ్ ఛానెల్ త్వరగా చందాదారులను పొందుతోంది. గురువారం నాటికి 53,000 కంటే ఎక్కువ మంది ఫాలోవర్స్ ఉన్నారు. క్రిప్టోకరెన్సీలో విరాళాలను స్వీకరించిన మొదటి ప్రధాన అధ్యక్ష అభ్యర్థి ట్రంప్. అతను గత నెలలో జరిగిన బిట్‌కాయిన్ కాన్ఫరెన్స్‌లో ఫీచర్ చేసిన స్పీకర్, అక్కడ దాతలు అతనితో రౌండ్ టేబుల్ వద్ద సీటు కోసం 844,600 చెల్లించమని అడిగారు. భవిష్యత్తులో అమెరికాకు క్రిప్టో అవసరమని ట్రంప్ అన్నారు. గత నెలలో, అతను వైట్ హౌస్‌కు తిరిగి వస్తే అమెరికా ప్రభుత్వం తన బిట్‌కాయిన్ హోల్డింగ్‌లను ఎప్పుడూ విక్రయించదని, బిట్‌కాయిన్ వ్యూహాత్మక రిజర్వ్‌ని సష్టిస్తుందని హామీ ఇచ్చారు. మంగళవారం, ట్రంప్ నాన్‌ఫంగబుల్ టోకెన్‌ల (ఎన్ ఎఫ్ టిలు) నాల్గవ సేకరణను ప్రారంభించారు. ఇందులో సూపర్ హీరో దుస్తులలో ఉన్న మాజీ అధ్యక్షుడి నుంచి అలంకారిక బిట్‌కాయిన్‌ల వరకు చిత్రాలు ఉన్నాయి. ఒక్కొక్క ఎన్ఎఫ్‌టీని 99 డాలర్లకి విక్రయిస్తారు.

సీఎన్ బీసీ ప్రకారం, క్రిప్టో ప్లాట్‌ఫారమ్, ఎన్ఎఫ్‌టీలు డిజిటల్ కరెన్సీ స్థలంలో ప్రయివేట్ ట్రంప్ కుటుంబ సంస్థ, అధికారికంగా ట్రంప్ అధ్యక్ష ఎన్నికల ప్రచారానికి కనెక్ట్ కాలేదు. 2019లో సోషల్ మీడియాలో బిట్‌కాయిన్ విలువ సన్నని గాలిపై ఆధారపడి ఉంది అని వ్రాసిన ట్రంప్, 2021 లో క్రిప్టోకరెన్సీలు జరగడానికి వేచి ఉన్న విపత్తు అని హెచ్చరించిన ట్రంప్, ప్రస్తుత ఎన్నికల ప్రచారం

ప్రారంభంలో తన వాక్చాతుర్యాన్ని ఉపయోగించి దానికి భిన్నంగా మాట్లాడుతున్నాడు. రిపబ్లికన్ అభ్యర్థి క్రిప్టోను ఆలింగనం చేసుకోవడం వల్ల ఎలోన్ మస్క్, మార్క్ ఆండ్రీసెన్ బెన్ హోరోవిట్జ్ వంటి కొంతమంది ప్రసిద్ధ వెంచర్ క్యాపిటలిస్టులు ఎగ్జిక్యూటివ్‌ల నుంచి ఆమోదం లభించింది.

ఉక్రెయిన్‌లో కూలిన మొదటి ఎఫ్-16 యుద్ధ విమానం



కైవ్: ఉక్రెయిన్‌కు పాశ్చాత్య దేశాలు సరఫరా చేసిన ఎఫ్-16 ఫైటర్ జెట్ దాని పైలట్‌తో పాటు కూలిపోయినట్టు ఆ దేశ సైనికాధికారులు ధ్రువీకరించారు. ఈ నెల ప్రారంభంలో అమెరికా తయారు చేసిన కొన్ని విమానాలు ఉక్రెయిన్‌కు పంపిణీ చేయబడ్డాయి. అదే సమయంలో ముందు రోజు రష్యా భారీ క్షిపణి దాడి సమయంలో జెట్‌లు చర్య తీసుకున్నాయని ఉక్రేనియన్ నాయకుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ మంగళవారం ధ్రువీకరించాడు. "లక్ష్యాన్ని అనుసరించిన విమానంలో ఒకదానితో సంపర్కం తెగిపో యింది. విమానం కూలిపోయి పైలట్ చనిపోయాడు" అని జనరల్ స్టాఫ్ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేసేందుకు కీవ్‌లోని రక్షణ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. క్రేనియన్ వైమానిక దళంలోని ఒక అధికారి వాయిస్ ఆఫ్ అమెరికాతో మాట్లాడుతూ ప్రస్తుతం పరిశీలించ బడుతున్న ఎంపికలలో పైలట్ లోపం, సాంకేతిక లోపం, ఉక్రేనియన్ వైమానిక రక్షణ నుంచి స్నేహపూర్వక కాల్పులు ఉన్నాయి.అంతకుముందు రోజు, ఉక్రేనియన్ ఎఫ్-16 లలో ఒకటి సోమవారం జరిగిన క్రాష్‌లో ధ్వంసమైంది అని వాల్ స్ట్రీట్ జర్నల్ సిఎన్ఎన్ ఒకటి అమెరికా అధికారిని, మరొకటి కీవ్‌లోని అధికారులను ఉటంకిస్తూ రిపోర్ట్ చేశాయి పైలట్ తప్పిదమే కారణమా అనే దానిపై విరుద్ధమైన అభిప్రాయాలు ఉన్నాయి. పడిపోయిన పైలట్‌ని అలెక్సీ మెస్‌గా గుర్తించారు, కాల్‌సైన్ మూన్‌ఫిష్, ఎఫ్-16 లను నడపడానికి పశ్చిమ దేశాలలో శిక్షణ పొందిన ఉక్రేనియన్ పైలట్‌లలో ఒకరు. అతని మరణాన్ని మెస్ స్వస్థలమైన లుట్స్క్ లోని కౌన్సిల్ మెన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన సంస్మరణ ద్వారా మొదట వెల్లడైంది. మెస్, అతని స్క్వాడ్రన్ సహచరులలో ఒకరైన ఆండ్రీ జ్యూస్ పిల్షికోవ్, పాశ్చాత్య మీడియాకు పలు ఇంటర్వ్యూలు ఇస్తూ ఎఫ్-16 లను కొనుగోలు చేసేందుకు ఉక్రెయిన్ ప్రచారానికి ముఖాలుగా ఉన్నారు. పిల్షికోవ్ గత ఆగస్టులో జరిగిన చర్యలో చంపబడ్డాడు.

నాటో కూటమి కీవ్‌కు డజన్ల కొద్దీ ఎఫ్-16 విమానాలను వాగ్దానం చేసినప్పటికీ, ఇప్పటివరకు ఆరు మాత్రమే పంపిణీ చేయబడ్డాయి. యుద్ధంలో మొదటి ఎఫ్-16ను ఎవరు కాల్చివేస్తే వారికి 15 మిలియన్ రూబిళ్ల (170,000డాలర్లు) రివార్డ్‌ను రష్యన్ కంపెనీ ఆఫర్ చేసింది. ఇంతవరకు పారితోషికం తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. యుద్ధ క్షేత్రంలో అమెరికన్-నిర్మిత జెట్‌లు ఎటువంటి తేడాను చూపవని, సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుంచి కీవ్‌కు అందించిన ఇతర పాశ్చాత్య హార్డ్ వేర్‌ల మాదిరిగానే నాశనం చేయబడతాయని మాస్కో తెలిపింది.

బిజినెస్

ప్రభుత్వ వ్యయం తగ్గడంతోనే మందగింపు

- జీడీపీ పతనంపై ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత



న్యూఢిల్లీ : ప్రభుత్వ వ్యయాలు తగ్గడం ద్వారానే జీడీపీ మందగించిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంతదాస్ అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత వృద్ధి రేటు 6.7 శాతానికి పరిమితమై 15 నెలల కనిష్టానికి పడిపోవడానికి సార్వత్రిక ఎన్నికల వేళ ప్రభుత్వ వ్యయాలు తగ్గడమేనని పేర్కొన్నారు. శనివారం ఓ కార్యక్రమంలో శక్తికాంత మాట్లాడుతూ.. తొలి త్రైమాసికంలో భారత్ 7.1 శాతం వృద్ధి సాధించనుందని ఆర్‌బీఐ తొలుత అంచనా వేసిందన్నారు. దీనికి భిన్నంగా కేంద్ర గణంకాల శాఖ కార్యాలయం 6.7 శాతం వృద్ధిని ప్రకటించిందన్నారు. వినియోగం, పెట్టుబడులు, తయారీ, సేవలు, నిర్మాణం వంటి రంగాలు జీడీపీ వృద్ధికి ప్రధాన శోధకాలుగా ఉన్నాయన్నారు కాగా.. కేవలం రెండు అంశాలు మాత్రమే వృద్ధి రేటును కొద్దిగా తగ్గించాయన్నారు. అవి ప్రభుత్వ (కేంద్ర , రాష్ట్ర) వ్యయం, వ్యవసాయం అని శక్తికాంత ఎత్తి చూపారు.

మొదటి త్రైమాసికంలో ప్రభుత్వ వ్యయం తక్కువగా ఉందని, బహుశా ఎన్నికలు, ఎన్నికల సంఘం మోడల్ ప్రవర్తనా నియమావళిని అమలు చేయడం వల్ల కావచ్చునని పేర్కొన్నారు. "రాబోయే త్రైమాసికాల్లో ప్రభుత్వ వ్యయం పెరుగుతుందని, వృద్ధికి అవసరమైన మద్దతును అందిస్తామని మేము ఆశిస్తున్నాము. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వ్యవసాయ రంగం దాదాపు 2 శాతం కనిష్ట వృద్ధి రేటును నమోదు చేసింది. దేశంలో కొన్ని ప్రాంతాలు మినహా రుతుపవనాలు చాలా బాగా ఉన్నాయి. దీంతో వ్యవసాయ రంగం పట్ల ప్రతి ఒక్కరూ ఆశాజనకంగా, సానుకూలంగా ఉన్నారు." అని శక్తికాంత తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో 2024-25లో 7.2 శాతం వార్షిక వృద్ధి రేటు సాకారం కానుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

నవ్వుతోనూ చెల్లింపులు

- ఫెడరల్ బ్యాంక్ వెల్లడి



హైదారబాద్ : భారతదేశంలో తొలిసారిగా ఫేషియల్ పేమెంట్ సిస్టం స్మైల్ పేను ఆవిష్కరించినట్లు ఫెడరల్ బ్యాంక్ తెలిపింది. యుపిఐ చెల్లింపులకు వినూత్నమైన ఫేషియల్ ఆథెంటికేషన్ టెక్నాలజీతో కెమెరా వైపు చూసి నవ్వితే చాలు.. లావాదేవీ ఎలాంటి ఇబ్బంది లేకుండా త్వరగా పూర్తవుతుందని తెలిపింది. భీమ్ ఆధార్ పే ఆధారంగా ఈ టెక్నాలజీ ఉంటుంటుందని వెల్లడించింది. దీన్ని తొలుత పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించినట్లు ఫెడరల్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాలినీ వారియర్ తెలిపారు.

గోల్డ్‌మాన్ శాక్స్ సిబ్బందిపై వేటు



న్యూయార్క్ : ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ దిగ్గజం గోల్డ్‌మన్ శాక్స్ తమ ఉద్యోగులపై వేటు వేసేందుకు సిద్ధం అయ్యిందని సమాచారం. మొత్తం ఉద్యోగుల్లో 3 నుంచి 4 శాతం మందిని ఇంటికి పంపించడానికి ప్రక్రియను ప్రారంభించినట్లు రిపోర్టులు వస్తున్నాయి. సిబ్బంది వార్షిక పనితీరు సమీక్ష ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రానున్న కొన్ని వారాల్లో ఈ తొలగింపులు చోటు చేసుకోనున్నాయి. 1300 మందికి పైగా ఉద్యోగులపై వేటు పడనుందని అంచనా. అంతర్గతంగా ఈ ప్రక్రియ ప్రారంభమయ్యిందని.. కానీ ఆ సంస్థ అధికారికంగా ప్రకటించలేదని తెలుస్తోంది. ఈ ఏడాది జూన్30 నాటికి సంస్థలో 44,300 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

ఐసిఐసిఐ ప్రుడేన్షియల్ రికార్డ్ ఎయుఎం

న్యూఢిల్లీ : ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కో లిమిటెడ్ తమ నిర్వహణలో ఆస్తులు (ఎయుఎం) పరంగా రూ. 3 లక్షల కోట్ల రికార్డ్‌ను నమోదు చేసినట్లు తెలిపింది. 2024 జులై 31 నాటికి రూ.3.14 లక్షల కోట్ల ఎయుఎంను సాధించినట్లు ఆ సంస్థ ఎండి, సిఇఒ అనుప్ బాగ్చి తెలిపారు. ఇది మా ఉత్పత్తులకు కస్టమర్‌లు ఇచ్చే ప్రాధాన్యతను, వారి దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి తోడ్పాటు అందిస్తామనే మాపై ఉన్న నమ్మకాన్ని సూచిస్తుందన్నారు 2023-24లో 99.17 శాతం క్లెయిమ్‌లు సెటిల్‌మెంట్ చేశామన్నారు.

నిరుపేదలకు 'శ్రేయ' ఫౌండేషన్ సాయం

హైదరాబాద్ : సంపాదనలో ఎంతో కొంత నిరుపేదలకు ఇవ్వడంలో సంతృప్తి ఉంటుందని.. ఆ సంతృప్తిని ఎంత పెట్టినా కొనలేమని శ్రేయ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మెన్, శ్రేయ ఫౌండేషన్ ప్రెసిడెంట్ హేమంత్ కుమార్ రాయ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే శ్రేయ ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా తమ ఖాతాదారులు, ఆర్థికంగా వెనుకబడిన ఉద్యోగులకు మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్టు వారు ఓ ప్రకటనలో తెలిపారు. పేదల ఇండ్ల నిర్మాణానికి శ్రేయ ఆషియానా, పేద విద్యార్థులకు చైల్డ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్, ఆడ పిల్లల మ్యారేజ్ ఇనిషియేటివ్ ప్రోగ్రాం ద్వారా సాయం అందిస్తున్నామన్నారు. 27వేల మందికి మద్దతును ఇస్తున్నట్టు పేర్కొన్నారు.

అద్దెకు కియా కార్లు

హైదరాబాద్ : తమ కార్లను కొనుగోలు చేయకుండా అద్దెకు పొందే సౌలభ్యాన్ని కియా కార్స్ అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం ఎఎల్‌డీ ఆటోమోటివ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొంది. దేశంలోని హైదరాబాద్ సహా 14 నగరాల్లో కియా సబ్‌స్క్రైబ్ పేరుతో ఈ సేవలను ప్రారంభించింది. 12-36 నెలల వ్యవధికి కార్లను అద్దెకు తీసుకోవాల్సి ఉంటుంది. సోనెట్‌కు నెలకు రూ.19,999, సెల్టోస్‌కు రూ.23,999, కారెన్స్‌కు రూ.24,999కు చొప్పున వసూలు చేయనున్నట్టు కియా ఇండియా ఉన్నతాధికారి హర్దీప్ సింగ్ బ్రార్ పేర్కొన్నారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా అద్దె సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు.

ఏడాదిలో నిఫ్టీ 26,820కి చేరొచ్చు

- పిఎల్ కాపిటల్ అంచనా

ముంబయి : వచ్చే 12 నెలల కాలంలో నిఫ్టీ 26,820కి చేరొచ్చని బ్రోకరేజీ సంస్థ పిఎల్ కాపిటల్ ప్రభుదాస్ లిల్లదర్ అంచనా వేసింది. ప్రస్తుత స్థాయితో పోల్చితే 6 శాతం పెరగొచ్చని పేర్కొంది. ఒకవేళ దీర్ఘకాలంలో పడిపోతే 10 శాతం తగ్గి.. 24,407 వద్ద నమోదు కావొచ్చని తెలిపింది. మార్కెట్లలో దేశీయ పెట్టుబడులు పెరుగుతున్నాయని.. పటిష్టమైన పండుగ సీజన్ డిమాండ్, గ్రామీణ ప్రాంతాలు పుంజుకోవడం, వడ్డీ రేట్లు మరింత తగ్గే అవకాశాలు ఉన్నందున స్టాక్ మార్కెట్లకు మద్దతు లభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంచనా వేసింది.

కునారిల్లుతున్న డిగ్రీ విద్య

డిగ్రీ, పీజీ కోర్సుల్లో బోధనకు తిలోదకాలు

- మూడేండ్లుగా ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు
- ఒక్కొక్కటిగా మూతపడుతున్న ప్రయివేటు డిగ్రీ కాలేజీలు
- అమ్మకానికి పెట్టినా ఎవరూ ముందుకు రాని వైనం
- ఎలాగైనా నడపాలని పోటీపడి ప్రోత్సాహకాలతో ప్రవేశాలు

ఫ్రీ బస్సు, రోజువారీ హాజరుకూ మినహాయింపు



నవతెలంగాణ- కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

పాఠశాల, ఇంటర్మీడియెట్ విద్య ప్రయివేటు పరమవ్వడంతోపాటే వ్యాపారమైపోయింది. తరువాతి కోర్సుల్లో చేరుదామనుకునే వారికి వైద్యం, ఇంజినీరింగ్, లా, సీఏ, ఫార్మసీ, కంప్యూటర్ తదితర కోర్సులన్నీ ఖరీదయ్యాయి. ఈ స్థితిలో ఆర్థిక పరిస్థితులు బాగోలేక, చదువు ముందుకు సాగించలేని నిరుపేద విద్యార్థులకు ఇప్పుడు సాధారణ డిగ్రీ, పీజీ వంటి యూనివర్సిటీ కోర్సులే దిక్కు. ఈ నేపథ్యంలో సర్కారు ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై బతికే కొన్ని ప్రయివేటు కాలేజీలు బోధన, నిర్వహణ గాలికొదిలేసి ఏయేటికాయేడు పోటీపడి మరీ ప్రోత్సాహకాలతో విద్యార్థుల ప్రవేశాలు పెంచుకునే పనిలో పడ్డాయి. పార్ట్‌టైం జాబ్ చేసుకుంటూ పరీక్షలప్పుడే హాజరయ్యే వెసులుబాటు కల్పిస్తున్నాయి. ఇప్పుడు ఆ ప్రవేశాలూ సరిగాలేక సదరు కాలేజీలు మూతపడే స్థితికి చేరాయి. ఇప్పుడు వాటిని అమ్మకానికి పెట్టినా కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్నత విద్య అవసరాలు తీర్చేందుకు 2008 జూన్ 25న శాతవాహన యూనివర్సిటీని స్థాపించారు. దాని పరిధిలో ప్రస్తుతం ప్రభుత్వ, ప్రయివేటు కాలేజీలు అండర్ గ్రాడ్యుయేట్ 93, పోస్టు గ్రాడ్యుయేట్ 40, బీఈడీ 23, ఎంబీఏ 10, లా, బీఫార్మసీ కాలేజీలు రెండు చొప్పున, ఎమ్ఈడీ, ఎంసీఏ, ఎంఫార్మసీ, బీపీఈడీ, హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీలు ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. ఐదేండ్లుగా 'దోస్త్' వెబ్‌సైట్ ద్వారా వర్సిటీ పరిధిలో డిగ్రీ, పీజీ ప్రవేశాలు కల్పిస్తున్న నేపథ్యంలో సగం సీట్లు కూడా భర్తీకాని పరిస్థితి నెలకొంది. శాతవాహన పరిధిలో ప్రతియేటా 45వేల వరకు సీట్ల భర్తీకి అవకాశం ఇస్తుండగా.. ఏటా సగం కూడా నిండటం లేదు.

రూ.174.68కోట్ల బకాయిలు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం ప్రారంభం నుంచి పెద్దఎత్తునే ప్రయివేటు డిగ్రీ కాలేజీలు పుట్టుకొచ్చాయి. పదేండ్ల కిందటి వరకూ డిగ్రీ కోర్సులకు ఓ స్థాయిలో డిమాండ్ ఉండటంతో ఆయా కాలేజీల్లో సీట్లన్నీ భర్తీ అయ్యేవి. అప్పుడున్న సర్కారు సైతం ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయి పెడుతున్నా.. ఓ ఏడాది కాకపోయినా మరుసటి ఏడాది విడుదల చేసేది. అయితే, అది రానురానూ రెండేండ్లు కూడా దాటుతూ వచ్చింది. ప్రస్తుతం మూడేండ్లుగా ఒక్క రూపాయి కూడా కాలేజీలకు బకాయిలు చెల్లించలేదు. కరీంనగర్ జిల్లాకు సంబంధించి మూడేండ్లుగా ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.174.68కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఇందులో సామాజిక తరగతుల వారీగా విద్యార్థులకు సంబంధించిన బకాయిలు చూస్తే ఎస్సీ- రూ.30.28 కోట్లు, ఎస్టీ- రూ.7.05 కోట్లు, బీసీ- రూ.131.35 కోట్లు, మైనార్టీ - రూ.5కోట్లు ఉన్నాయి. ఈ బకాయిలు రాక ప్రతియేటా కాలేజీల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు, ఇతర ఖర్చులకు ప్రయివేటు విద్యాసంస్థలు అప్పులపాలయ్యాయి. రెండేండ్లుగా ఉమ్మడి జిల్లాలో కనీసం పది కాలేజీల వరకు మూతపడ్డాయి. మరికొన్ని అమ్మకానికి పెట్టినా.. అందులో పేరుమోసిన డిగ్రీ కాలేజీలనూ కొనేందుకు ఎవరూ ముందుకురాని పరిస్థితి.

బోధన గాలికొదిలేసి.. పోటీపడి ప్రోత్సాహకాలతో ప్రవేశాలు..

సాధారణ డిగ్రీ, పీజీ కోర్సులతో భవిష్యత్ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెద్దగా లేకపోవడంతో ప్రస్తుతం ఇంటర్మీడియట్ పూర్తయిన మెజార్టీ విద్యార్థులు ఇంజినీరింగ్ కోర్సుల వైపే వెళ్తున్నారు. దీంతో ఏయేటికాయేడు డిగ్రీ ప్రవేశాలు దారుణంగా పడిపోతూ వస్తున్నాయి. చేరిన విద్యార్థుల్లోనూ సింహభాగం ఆర్థిక పరిస్థితి బాగోలేని, పార్ట్‌టైం జాబ్ చేస్తూ కాలేజీకి వచ్చే వారే ఉంటున్నారు. వారికి సైతం పోటీపడి మరీ ప్రయివేటు కాలేజీలు ప్రవేశాలు కల్పిస్తున్నాయి. యూనివర్సిటీ దోస్త్ వెబ్‌సైట్‌లో ప్రవేశ రుసుం నుంచి వారికి సీటు కల్పించే వరకూ ఖర్చంతా భరిస్తూ రూ.5వేల నుంచి రూ.10వేల వరకు అదనపు ప్రోత్సాహకాలిస్తూ విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. అందులోనూ ఫ్రీ బస్సు సహా కేవలం పరీక్షలకు హాజరైతే చాలన్నట్టుగా వ్యవహరిస్తున్నాయి.

పేద విద్యార్థుల భవిత.

యూనవర్సిటీ విద్య.. అందులోనూ అండర్, పోస్టు గ్రాడ్యుయేషన్ చదువులతో ఒకప్పుడు.. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అధ్యయన కేంద్రాలుగా ఆయా కాలేజీలు ఉండేవి. రాష్ట్ర, దేశ రాజకీయాల కోసం యువతకిక్కడ ఓనమాలు దిద్ది, పునాదులు వేసేవి. ఆయా రంగాల్లో ఉన్నత స్థితికి చేర్చేవి. అలాంటిది ఇప్పుడు యూనివర్సిటీ డిగ్రీ, పీజీ విద్య 'కొడిగట్టిపోతున్న దీపం'లా తయారైంది. వర్సిటీ, ప్రభుత్వ, ప్రయివేటు కాలేజీల్లో నిబద్ధత లేని మెజార్టీ బోధకులు పాఠాలు చెప్పకుండా తప్పించుకుని తిరుగుతున్న పరిస్థితి నెలకొంది. పలు కాలేజీల్లో పూర్వవిద్యార్థులనే బోధకులుగా తక్కువ వేతనానికి నియమిస్తూ తరగతులను గాలికొదిలేశారు. వెరసి డిగ్రీ, పీజీ పట్టా చేతికొస్తే చాలన్నట్టు విద్యార్థులు విధిలేక సరిపెట్టుకుంటున్న దైన్యస్థితి నెలకొంది.

శాతవాహన యూనివర్సిటీ పరిధిలో యేటా 45వేల సీట్లకుగాను భర్తీ అవుతున్న వివరాలు

సంవత్సరం	విద్యార్థులు	విద్యార్థినులు	మొత్తం
2019-20	8450	13053	21503
2020-21	12800	14780	27580
2021-22	12582	13584	26166
2022-23	9206	11012	20218
2023-24	7524	8895	16419

ఆటలు

రూబినా కాంస్య గురి

- 10మీ ఎయిర్ పిస్టల్‌లో కాంస్యం
- భారత్ ఖాతాలో ఐదో మెడల్
- పారిస్ 2024 పారాలింపిక్స్

నవతెలంగాణ-పారిస్

పారిస్ పారాలింపిక్స్‌లో టీమ్ ఇండియా ఖాతాలో ఐదో పతకం చేరింది. రెండో రోజు పోటీల్లో షుటింగ్‌లో భారత్‌కు మూడు పతకాలు రాగా.. మూడో రోజు షుటింగ్ నుంచి మరో మెడల్ లభించింది. రూబినా ఫ్రాన్సిస్ కాంస్య గురితో అదరగొట్టింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో రూబినా ఫ్రాన్సిస్ కాంస్య పతకం సాధించింది. ఫైనల్లో రూబినా ఫ్రాన్సిస్ గొప్పగా ఆరంభించింది. వరుసగా 10 ప్లస్ స్కోర్లతో ముందంజలో నిలిచింది. నాల్గో స్థానంలో నిలిచిన పారా షుటర్ ఎలిమినేషన్ సమయానికి రూబినా రెండో స్థానంలో నిలిచింది. దీంతో రూబినా కనీసం సిల్వర్ మెడల్ సొంతం చేసుకుంటుందనే అనిపించింది.

కానీ ఆఖర్లో రూబినా స్వల్ప తేడాతో కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. ఇరాన్ షుటర్ 236.8 పాయింట్లతో పసిడి పతకం సాధించగా, 231.1 పాయింట్లతో టర్కీ షుటర్ సిల్వర్ మెడల్ కైవసం చేసుకుంది. టోక్యో పారాలింపిక్స్‌లో పతక ఆశలతో బరిలోకి దిగిన రూబినా.. అక్కడ ఫైనల్లో ఏడో స్థానంలో నిలిచి నిరాశపరిచింది. పారిస్‌లో గురి తప్పని రూబినా మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సొంతం చేసుకుంది.



న్యూయార్క్‌లో సంచలనాల మోత మోగుతోంది. ప్రతీ ఏడాది మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్లకు పరాజయాలు ఎదురువుతుండగా.. యుఎస్ ఓపెన్‌లో ఈసారి పురుషుల సింగిల్స్‌లో దిగ్గజాలు వరుసగా నిష్క్రమిస్తున్నారు. కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్) రెండో రౌండ్లో పరాజయం చవిచూడగా.. సెర్బియా యోధుడు నొవాక్ జకోవిచ్ మూడో రౌండ్లో కంగుతిన్నాడు. కెరీర్ 25వ, టెన్నిస్ ఓపెన్ చరిత్రలో రికార్డు గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసి న్యూయార్క్‌కు వచ్చిన జకోవిచ్‌కు ఓటమి తప్పలేదు. అల్కరాస్, జకోవిచ్ ఓటమితో మెన్స్ సింగిల్స్ టైటిల్ రేసు సమీకరణం ఆసక్తికరంగా మారింది.

జకోవిచ్ నిష్క్రమణ

- రెండో సీడ్‌కు ఊహించని భంగపాటు
- మూడో రౌండ్లో సెర్బియా యోధుడి ఓటమి

యు.ఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ 2024



న్యూయార్క్ (అమెరికా) : యు.ఎస్ ఓపెన్‌లో అతిపెద్ద సంచలనం నమోదైంది. 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల నెగ్గిన మొనగాడు, ఆధునిక టెన్నిస్ శకంలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడైన నొవాక్ జకోవిచ్ (సెర్బియా) 25 ఏండ్ల ఆస్ట్రేలియా కుర్రాడి చేతిలో కంగుతిన్నాడు. కెరీర్ 25వ గ్రాండ్‌స్లామ్ విజయంతో ఆల్‌టైమ్ చరిత్ర సృష్టించేందుకు రంగం సిద్ధం చేసుకున్న డిఫెండింగ్ చాంపియన్ న్యూయార్క్ నుంచి నిష్క్రమించాడు. పురుషుల సింగిల్స్ మూడో రౌండ్లో రెండో సీడ్ నొవాక్ జకోవిచ్ 4-6, 4-6, 6-2, 4-6తో పరాజయం పాలయ్యాడు. వరల్డ్ నం.25, అన్‌సీడెడ్ ఆస్ట్రేలియా ఆటగాడు అలెక్సీ పాపిరిన్ నాలుగు సెట్ల సూపర్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్‌పై కెరీర్ అత్యుత్తమ విజయం నమోదు చేశాడు. సుమారు మూడున్నర గంటల పాటు నిలకడగా అద్భుత ప్రదర్శన చేసిన అలెక్సీ.. యుఎస్ ఓపెన్‌లో అతిపెద్ద విజయం సాధించాడు.

జకోవిచ్‌కు భంగపాటు :

హార్డ్‌కోర్టుపై నొవాక్ జకోవిచ్‌కు తిరుగులేని రికార్డు ఉంది. గత 17 ఏండ్లలో కేవలం నాలుగు సార్లు మాత్రమే క్వార్టర్‌ఫైనల్‌కు చేరకుండా ఇంటి ముఖం పట్టాడు. ఈ ఏడాది ఒలింపిక్స్ పసిడి పతకంతో జోరందుకున్న జకోవిచ్‌కు.. యు.ఎస్ ఓపెన్‌లో ఊహించని ఓటమి ఎదురైంది. జకోవిచ్ సుదీర్ఘ కెరీర్‌లో 2024ను ఒక్క గ్రాండ్‌స్లామ్ టైటిల్ సైతం లేకుండా ముగించాడు. 2002 తర్వాత బిగ్ 3 ప్లేయర్లు రోజర్ ఫెడరర్, రఫేల్ నడాల్, నొవాక్ జకోవిచ్‌లలో ఎవరూ ఒక్క సింగిల్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సైతం నెగ్గలేదు. ఆస్ట్రేలియా కుర్రాడు అలెక్సీ ఎవరూ ఊహించని ఫలితాన్ని రాబట్టాడు. నొవాక్ జకోవిచ్‌కు ఏ సెట్లోనూ అవకాశం ఇవ్వలేదు. తొలి రెండు సెట్లను 6-4, 6-4తో గెల్చుకున్న అలెక్సీ.. మూడో సెట్‌ను 2-6తో కోల్పోయాడు. ఓ సెట్ నెగ్గిన ఉత్సాహంలో ఉన్న జకోవిచ్‌కు అలెక్సీ ఏమాత్ర తలొగ్గలేదు. 6-4తో నాల్గో సెట్‌ను సొంతం చేసుకుని డిఫెండింగ్ చాంపియన్ డ్రీమ్ గ్రాండ్‌స్లామ్ వేటకు తెరదించాడు. మూడున్నర గంటల పాటు సాగిన మ్యాచ్‌లో జకోవిచ్ అంచనాలను అందుకోలేదు. 25 ఏండ్ల కుర్రాడి ముందు జకోవిచ్ తేలిపోయాడు. అలెక్సీ 15 ఏస్‌లు కొట్టగా.. జకోవిచ్ 16 ఏస్‌లు సంధించాడు. అలెక్సీ ఆరు డబుల్ ఫాల్ట్స్‌కు పాల్పడగా, జకోవిచ్ 14 డబుల్ ఫాల్ట్స్‌కు పాల్పడ్డాడు. బ్రేక్ పాయింట్ల పరంగా అలెక్సీ ఆరు సార్లు జకోవిచ్ సర్వ్‌ను బ్రేక్ చేయగా... అలెక్సీ సర్వ్‌ను జకోవిచ్ నాలుగు సార్లు మాత్రమే బ్రేక్ చేశాడు. పాయింట్ల పరంగా 130-127తో అలెక్సీ పైచేయి సాధించాడు. అలెక్సీ 20 గేమ్ పాయింట్లు గెలుపొందగా జకోవిచ్ 18 గేమ్ పాయింట్లతో సరిపెట్టుకున్నాడు.

పురుషుల సింగిల్స్‌లో నాల్గో సీడ్, జర్మనీ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్ ముందంజ వేశాడు. మూడో రౌండ్లో అలవోక విజయం సాధించి ప్రీ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. అర్జెంటీనా ఆటగాడు థామస్ మార్టిన్‌పై అలెగ్జాండర్ జ్వెరెవ్ గెలుపొందాడు. 5-7, 7-5, 6-1, 6-3తో అలెగ్జాండర్ అదరగొట్టాడు. అలెగ్జాండర్ జ్వెరెవ్ 12 ఏస్‌లు కొట్టగా.. థామస్ మార్టిన్ 5 ఏస్‌లు సంధించాడు. ఆరు బ్రేక్ పాయింట్లు సాధించిన జ్వెరెవ్ నాల్గో రౌండ్‌లోకి అడుగుపెట్టాడు. ఇటలీ ఆటగాడు లోరాంజో ముసెటి పరాజయం పాలయ్యాడు. 2-6, 6-3, 3-6, 6-7(4బి7)తో బ్రాండన్ (అమెరికా) చేతిలో ఓటమి పాలయ్యాడు. మహిళల సింగిల్స్‌లో అమెరికా వెటరన్ స్టార్ మడిసన్ కీస్ సైతం ఇంటిబాట పట్టింది. 7-6(7-5), 5-7, 4-6తో ఎలిసీ మెర్టెన్స్ చేతిలో ఓటమి చెందింది.



వ్యవసాయ నల్ల చట్టాల

అమలుకు కుట్ర

అందుకే బడ్జెట్‌లో కేటాయింపుల్లో కోత

- రైతు సంఘాలతో చర్చించకుండానే విద్యుత్ బిల్లు
- కేంద్రం విధానాలు, రైతు ఉద్యమాలపై భవిష్యత్ కార్యాచరణ
- రాష్ట్రంలో అందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలి : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్
- మంగల్‌పల్లిలో సంఘం రాష్ట్ర శిక్షణా తరగతులు ప్రారంభం
- నేడు హాజరుకానున్న జాతీయ ప్రధాన కార్యదర్శి ఉజ్జి కృష్ణన్



నవతెలంగాణ- రంగారెడ్డి ప్రతినిధి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను రైతు ఉద్యమాలతో వెనక్కి తీసుకున్నప్పటికీ.. వాటిని అమలు చేసే కుట్రలో భాగంగానే బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించిందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ అన్నారు. విద్యుత్ సవరణ బిల్లుపై రైతు సంఘాల ప్రతినిధులతో చర్చించకుండానే పార్లమెంట్‌లో పెట్టడాన్ని తప్పుపట్టారు. ఉపాధి గ్యారంటీ చట్టానికి నిధుల్లో కోత పెట్టారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మూడ్రోజులపాటు జరగనున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర శిక్షణా తరగతులు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మంగల్‌పల్లి గేటు సమీపంలో శనివారం ప్రారంభమయ్యాయి. సీనియర్ నాయకులు పి.జంగారెడ్డి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ ప్రారంభోపన్యాసం చేస్తూ.. రాష్ట్రంలో రుణమాఫీ పూర్తిగా కాలేదన్నారు. రుణమాఫీ చేసేందుకు రూ.42 వేల కోట్లు అవసరమని ప్రభుత్వమే ప్రకటించి.. తీరా రూ.1793 కోట్లు మాత్రమే రుణమాఫీ చేసిందన్నారు.

రైతులు బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమాధానం లభించని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షల రుణమాఫీ అందరికీ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు వానాకాలం సీజన్ ముగింపునకు వస్తున్నా రైతు భరోసా డబ్బులు నేటికీ రైతుల ఖాతాల్లో వేయలేదన్నారు. వానాకాలం, యాసంగి కలిపి ఎకరానికి రూ.15వేలు చెల్లించాలని కోరారు. పది రకాల పంటలకు బోనస్ కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం ఎందుకు మాట తప్పిందని ప్రశ్నించారు. ధరణి స్థానంలో భూమాత యాప్‌ను తీసుకొచ్చినా రైతాంగ సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. సమగ్ర భూ సర్వే పరిగణలోకి తీసుకోవడం లేదన్నారు. తద్వారా భూ సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. ఈ సమస్యలపై ఈ శిక్షణా తరగతుల్లో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటాలు నిర్వహిస్తామని, భవిష్యత్ మొత్తం పోరాటాల కాలమని, అందుకు రైతాంగం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ముందుగా ప్రతినిధులను జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి వేదిక మీదకు ఆహ్వానించారు. జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై జాతీయ ఉపాధ్యక్షులు జి.నాగయ్య ప్రస్తావించారు. ప్రొఫెసర్ హరిబండి ప్రసాదరావు, సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ తమ సందేశాన్ని అందజేశారు. కాగా, ఆదివారం రైతు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఉజ్జి కృష్ణన్ హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు బొంతల చంద్రారెడ్డి, నాయకులు కందాల ప్రమీల, శోభన్, జిల్లా అధ్యక్షులు రాంచందర్, ఇబ్రహీంపట్నం మండల అధ్యక్ష, కార్యదర్శులు ముసలయ్య, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హామీలను పక్కదారి పట్టించేందుకు డైవర్షన్ రాజకీయాలు

- బీజేపీ రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హామీలను పక్కదారి పట్టించేందుకే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నదని బీజేపీ రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీల నుంచి ప్రజలను దారి మళ్లించడానికి ఫోర్త్ సిటీ, హెల్త్ సిటీ, స్కిల్ సిటీ పేరుతో రేవంత్ సర్కార్ ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. అన్ని రోగాలకు మందు హైడ్రానే అన్నట్టుగా హడావుడి చేస్తోందని విమర్శించారు. అయితే చెరువులను, ప్రభుత్వ భూములను కాపాడాల్సిన కాపాడాల్సిన అవసరముందనీ, హైడ్రా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఎండో మెంట్, ప్రభుత్వ భూముల కబ్జాపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సర్కార్ హైడ్రా పేరుతో పేదల భూముల జోలికొస్తే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

అటకెక్కిన గృహజ్యోతి

- మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తూతూ మంత్రంగా అమలు చేస్తున్న గృహజ్యోతి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అటకెక్కిస్తున్నదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు విమర్శించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నట్టు డబ్బా కొట్టుకుంటూ, వాస్తవానికి పేదల నుంచి బిల్లులు వసూలు చేస్తున్నారని శుక్రవారంనాడొక ప్రకటనలో పేర్కొన్నారు. జీరో బిల్లులు జనరేట్ కాలేదనే నెపంతో పేదల నుండి పెండింగ్ బిల్లులు వసూలు చేయడం దుర్మార్గమనీ, ఎన్నికల ముందు ఒకమాట, అధికారంలోకి వచ్చాక మరోమాట, మేనిఫెస్టోలో చెప్పిన ఆరు గ్యారెంటీలు 13 హామీల్లో ఒక్క పథకాన్ని అయినా సంపూర్ణంగా అమలు చేస్తున్నారా? అని ప్రశ్నించారు.

పిల్లలు లేరనే సాకుతో 1,864 స్కూళ్లను మూసేస్తారా?

- ఇలాంటి నిర్ణయాలు మంచివికావు : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యార్థులు లేరనే కారణంతో రాష్ట్రంలోని 1,864 పాఠశాలలను మూసేయటం దారుణమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పేద పిల్లలను విద్యకు దూరం చేసే ఇలాంటి నిర్ణయాలు మంచివి కావని పేర్కొంటూ ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయుల నియామకాలను చేపట్టాలనీ, మౌలిక వసతులను కల్పించాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా ప్రమాదపుటంచునున్న ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని కేటీఆర్... రేవంత్ సర్కారును కోరారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు వీలుగా మంత్రులు, విద్యావేత్తలతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
ఆదివారం | సెప్టెంబర్ 01, 2024 | www.navatelangana.com

అంబేడ్కర్ విగ్రహాల వద్ద డ్రయినేజీ మట్టి తొలగించాలి



నవతెలంగాణ - ధూల్ పేట్

గోషామహల్ నియోజకవర్గం చుడీ బజార్‌లోని జలమండలి అధికారులు డ్రయినేజీ మట్టి తొలగించి డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్, బాబు జగజీవన్ రామ్ విగ్రహాల దగ్గర పెడుతున్నారు. దీంతో స్థానికులు పలుమార్లు పెట్టొద్దని చెప్పినా తొలగించకుండా విగ్రహాల వద్ద పెట్టడంపై స్థానికులుఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ఇలాంటి గొడవలకు దారి తీసే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ డ్రయినేజీ మట్టి వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

గుర్తు తెలియని యాచకుడు మృతి



నవతెలంగాణ - ముషీరాబాద్

గుర్తు తెలియని యాచకుడు మృతి చెందిన ఘటన ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ముషీరాబాద్ బొలక్‌పూర్ బడి మస్జిద్ వద్ద బిక్షాటన చేస్తూ జీవిస్తున్న గుర్తు తెలియని యాచకుడు (30)మృతి చెంది పడి ఉండడం గమనించిన స్థానికులు డైల్ 100 కాల్ చేసి సమాచారం అందించగా ముషీరాబాద్ పోలీస్‌లు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాల కోసం దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులు చెడు సావాసాలకు దూరంగా ఉండాలి





- న్యూయార కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రవణ్ కుమార్
- ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

నవతెలంగాణ - ముషీరాబాద్

విద్యార్థులు చెడు సావాసాలకు దూరమై బాధ్యత గల పౌరులుగా ఎదగాలని న్యూ యార కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రవణ్ కుమార్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ ఫంక్షన్ హాల్ లో న్యూ యార కాలేజ్ ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రావణ్ కుమార్, ప్రముఖ ఆధ్యాత్మికవేత ప్రభాకర్, చార్టర్ అకౌంటెంట్ జితేందర్ రెడ్డి, చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి సమాజంలో యువత మత్తు పదార్థాలకు బానిసై తమ అమూల్యమైన జీవితాన్ని పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే ముఖ్యంగా చెడు సావాసాలకు దూరంగా ఉండాలని, గురువులపై గౌరవం ఉండాలని కోరారు. విద్యార్థుల్లో ప్రతిభ దాగి ఉంటుందని దానిని వెలికి తీసి ఆదర్శవంతమైన పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంచుకున్న రంగాల్లో విజయం సాధించాలి



- మాజీ వైస్ ఛాన్స్‌లర్ సి.హెచ్.గోపాల్‌రెడ్డి

నవతెలంగాణ - ముషీరాబాద్

విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాన్ని ఛాలెంజ్‌గా తీసుకోని ముందుకు సాగితేనే విజయం సాధిస్తారని మహాత్మాగాంధీ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సి.హెచ్.గోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవంతి డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ సెరమని కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేసిన అనంతరం ప్రొఫెసర్ గోపాల్రెడ్డి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో తట్టుకోవాలంటే నిరంతర అధ్యాయనం అవసరమన్నారు. ప్రతిభ ఎవరి సొత్తు కాదని కష్టపడి చదివిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. పోటీ పరీక్షల్లో స్కిల్స్ను సంపాదించాలంటే ప్రతి రోజు న్యూస్ పేపర్స్ చదవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రభుత్వం కూడా విద్యార్థులను నైపుణ్యాన్ని ప్రొత్సహిస్తుందని అందులో భాగంగానే ఇంటర్, డిగ్రీ స్థాయిలోనే సాంకేతిక విద్యతో పాటు ఒకేషనల్ కోర్సును ప్రవేశపెడుతుందన్నారు. కామాలతో సంతృప్తి పడకుండా పులిస్టాప్ పెట్టే వరకు కష్టపడి దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో ఓయూ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ ఏ.కృష్ణం రాజు, ప్రముఖ పర్యావరణవేత్త టాకూర్ రేష్మాసింగ్, అవంతి విద్యా సంస్థల జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం. ప్రియాంక, అధ్యక్షులు ఎం. జ్ఞానేశ్వరి, మేనేజింగ్ డైరెక్టర్ శ్రావణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఎం.వి.ఎస్.ఎస్.నందీష్, హెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై. జయప్రద, డాక్టర్ డి.వెంకట్రావు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.వీరసామయ్య పాల్గొన్నారు.

తొలి స్వాతంత్ర్య సమరయోధులు సంచార జాతులు



- తెలంగాణ సంచారజాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఒంటెద్దు నరేందర్

నవతెలంగాణ - ముషీరాబాద్

తొలి స్వాతంత్ర సమరయోధులు సంచార జాతులని తెలంగాణ రాష్ట్ర సంచారజాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఒంటెద్దు నరేందర్ అన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం అధ్వర్యంలో సంచార జాతుల 72 వ జాతీయ విముక్తి దినోత్సవం సందర్భంగా బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం అధ్యక్షులు ఒంటెద్దు నరేందర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ కో - ఆర్డినేటర్ శ్రీనివాస్ తిపిరిశెట్టి, రాష్ట్ర అధ్యయన కమిటీ చైర్మన్ వెంకటనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ. దేశానికి తొలి స్వతంత్ర సమర యోధులుగా చెప్పవచ్చు ఎందుకంటే వీరిపైన బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా దేశ రక్షణ కోసం దేశ సామంత రాజులకు, దేశ ప్రజల రక్షణకు ఈ సంచార జాతి ప్రజలు ప్రాణాలకు తెగించి యుద్ధాలను తలపించే పోరాటాలు చేసి బ్రిటిష్ వారిని ఎదిరించి పోరాటం చేసి ప్రాణ త్యాగాలు చేశారని తెలిపారు. అందువల్ల బ్రిటిష్ వారు స్వాతంత్ర్యానికి ముందే 1871 లోనే ఈ సంచార జాతుల పైన క్రిమినల్ యాక్ట్ పెట్టి పుట్టుకతో నేరస్థులుగా చేశారన్నారు. ఇలా దేశ వ్యాప్తంగా ఉన్న సంచార జాతుల కులాలు చేదిరి దేశ నలుమూలల భయం భయంగా ఎక్కడి వారు అక్కడే జీవన భృతి కోసం ఊరు ఊరు తిరుగుతూ ఈ దేశంలో సంచార జాతులగా చలామణి అయ్యారు. రాష్ట్ర జనాభాలో దాదాపుగా 12% నుండి 15% ఉన్న ఈ సంచార జాతి ప్రజల సంక్షేమం కోసం రాజ్యాంగ బద్ధమైన ప్రత్యేక 10 శాతం రిజర్వేషన్స్ కల్పించి విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అవకాశాలు కల్పించి ఈ జాతులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగజోగి శ్రీనివాస్, రాష్ట్ర కార్యనిర్వాహన అధ్యక్షులు వెన్నెల నాగరాజు, రాష్ట్ర ఉద్యోగ విభాగం రాష్ట్ర అధ్యక్షులు చెన్నయ్య,యూత్ అధ్యక్షులు యువరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యామల యాదగిరి,జాంగీర్ పాషా,వెంకటేష్ పూసల,శ్రీనివాస్ రెడ్డిక, బండారి లక్ష్మన్, బొప్పల బాపన్న,తదితరులు పాల్గొన్నారు.

నూతన అడహక్ కమిటీ నియామకం..

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియే షను నూతన అడహక్ కమిటీ ఏర్పాటైంది. అసోసియేషన్ కన్వీనర్ కొప్పునమోని శ్రీనివాస్ ను నియమిస్తూ టీజీఓ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న కలీమొద్దీన్ అహ్మద్ పదవీ విరమణ చేశారు. దీంతో ఆయన స్థానంలో నూతన కార్యవర్గం ఏర్పాటయ్యే వరకు అడహక్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు శనివారం కోఠి లోని కార్యాలయంలో ఆయన ప్రకటించారు. కన్వీనర్ కే శ్రీనివాస్, కో- కన్వీనర్లుగా ఎస్.రామాంజనేయులు గౌడ్, ఎన్.సునీల్ రాజ్, నామాల శ్రీనివాస్, చంద్రప్రకాష్, సభ్యులుగా సకలా రెడ్డి, విజయనిర్మల, శ్రీనివాసులు నియమితులయ్యారు.

ముసురు పట్టింది..







నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌కు ముసురు పట్టింది. బంగాళాఖాతంలో అల్ప పీడనం వాయు గుండంగా మారింది. దీనికి తోడు మరో రుతుపవన ద్రోణి కూడా ఏర్పడటంతో రాష్ట్రం అంతటా వానలు మొదలయ్యాయి. రాజధాని నగరం హైదరాబాద్‌లో శనివారం ఉదయం నుంచి వర్షం మొదలైంది. సిటీలో అంతటా చిరు జల్లులు పడుతున్నాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, కూకట్‌పల్లి, మూసాపేట, అమీర్‌పేటలో వర్షం నాన్ స్టాప్‌గా కురుస్తోంది. యూసఫ్‌గూడ, కార్మిక్‌నగర్, ఫిలింనగర్, సుచిత్ర, బాలానగర్, జీడిమెట్ల, గచ్చిబౌలి, రాయదుర్గం, షేక్ పేటలో కూడా వర్షం కురుస్తోంది. దీంతో నగరంలోని చాలా ఏరియాల్లో రోడ్లపై వర్షపు నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అక్కడక్కడ ట్రాఫిక్ జాం కావడంతో వాహనదారులు ఇబ్బందులు



పడ్డారు. మరో మూడు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. దీంతో అవసరమైతే తప్ప బయటకు రావొద్దని వాతావరణ శాఖ హెచ్చరించింది.

సోమవారం స్కూళ్లకు సెలవు

ఈ వర్షాల కారణంగా విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ జిల్లా పరిధిలో సోమవారం స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. సీఎస్ ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం స్కూళ్లకు సెలవు దినంగా నిర్ణయించారు.



'పల్లా రాజేశ్వర్ రెడ్డి, చామకూర మల్లారెడ్డిలు చెరువులను దోచుకుంటున్నారు'

నవతెలంగాణ-ఘట్కేసర్

మేడ్చల్ జిల్లా ను ఒక పక్క చామకూర మల్లారెడ్డి, మరో పక్క పల్లా రాజేశ్వర్‌రెడ్డిలు దరిద్రంలా దాపరించి పందికొక్కుల్లా చెరువులను, కుంటలను దోచుకుంటున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్యాదవ్ ఆరోపించారు. ఘట్కేసర్ మండలంలోని వెంకటాపూర్‌లోని నాడెం చెరువు తూంను శనివారం గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి నీటిని కిందికి వదిలారు. ధ్వంసమైన తూంను తోటకూర వజ్రేష్ యాదవ్ పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్దేశపూర్వకంగానే చెరువు తూంను ధ్వంసం చేసి నీటిని కిందికి విడిచిపెట్టడం వల్ల బఫర్ జోన్ విస్తీర్ణం తగ్గి తమ నిర్మాణాలకు ఇబ్బంది కలుగదనే ఉద్దేశంతో అనురాగ్ విద్యాసంస్థల యాజమాన్యం కావాలనే ధ్వంసం చేశారని ఆరోపించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువు లో నీరు పెరిగి తమ కట్టడాల వరకు వచ్చినందునే రాత్రికి రాత్రే దారుణానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లాకు ఒక పక్క చామకూర మల్లారెడ్డి, మరో పక్క పల్లా రాజేశ్వర్‌రెడ్డిలు శనిల దాపురించి చెరువులను, కుంటలను కబ్జా చేసి తమ కళాశాలలను విస్తరిస్తు న్నారని ఆరోపించారు. న్యాయస్థానంలో శుక్రవారం పల్లాకు చుక్కెదురైనందునే చెరువు తూంను ధ్వంసం చేశారన్నారు. జాతీయ రహదారి నుంచి వెంకటాపూర్ వరకు ఉన్న 200 మీటర్ల రోడ్డును తగించి ఇరుకుగా చేశారని, దీంతో కళాశాల సమయంలో గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతుందన్నారు. బఫర్, ఎఫ్‌టీఎల్ కబ్జాలపై హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. తూంను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజేష్, దర్గా దయాకర్ రెడ్డి వినోద్ శివకుమార్ రాధాకృష్ణ బాలరాజ్ పాల్గొన్నారు.

మహిళల గొంతు నొక్కడానికి ప్రభుత్వాల ప్రయత్నాలు

- వక్తలు

నవతెలంగాణ - ముషీరాబాద్

దేశంలో మహిళల గొంతు నొక్కడానికి ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయని.. మహిళలపై దాడులు లైంగికదాడులు పెరిగిపోతున్నాయి అని ప్రగతిశీల మహిళా సంఘం ఏడవ రాష్ట్ర మహాసభలో వక్తలు అన్నారు. శనివారం ప్రగతిశీల మహిళా సంఘం ఏడవ రాష్ట్ర మహాసభ సందర్భంగా వీఎస్‌టీ నుంచి ఇందిరా పార్క్ వరకు భారీ ప్రదర్శనగా కళాకారుల డప్పు దరువులు, నృత్యాలు,నినాదాలతో మహిళ హక్కుల సాధనకై ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద సభ నిర్వహించారు. ఈ సభలో ముఖ్య వక్తగా ఐ ఎఫ్ టి యు జాతీయ అధ్యక్షులు డా.అపర్ణ హాజరై మాట్లాడుతూ. అందుకే మీటింగ్ కు పర్మిషన్ లు తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై లైంగిక హింస పెరిగిందని అన్నారు. కేంద్రంలో అధికారం లో ఉన్న ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం అయిన మనువాద భావజాలాన్ని దేశంపై రుద్దుతున్నారన్నారు. ఇది మహిళలపై అత్యంత ప్రభావం చూపుతుందని తెలిపారు . ఢిల్లీలో నిర్భయ హత్యాచారం సందర్భంలో పోరాటం చేసి చట్టం తెచ్చుకున్నా,లైంగిక వేదింపులు ఆగట్లేదని నిన్న పశ్చిమ బెంగాల్ లో మహిళా డాక్టర్ హత్య కుట్ర వల్ల జరిగిందని అన్నారు. ఇందులో ప్రభుత్వాలు రాజకీయాలు చేస్తూ సరైన చర్యలు తీసుకోవట్లేదని అన్నారు. మహిళలను అణచాలంటే



లైంగిక దాడే పరిష్కారం అనేలా పితృస్వామ్యం పెట్రెగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల హక్కుల సాధనకై సమిష్టిగా పోరాటం చేయాలని మహిళలకు సరైన భద్రత కల్పించి దాడులు పూర్తిస్థాయిలో ఆపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మహిళా శక్తి ఏకమై ప్రభుత్వాలను అణిచివేస్తాయని హెచ్చరించారు.

రైతు చట్టాలను సంఘటిత పోరాటాలతో తిప్పికొట్టాం కానీ 4 కార్మిక చట్టాలతో ఈ ప్రభుత్వం ముందుకొస్తుందని,దానికి వ్యతిరేకంగా పోరాటాలను నిర్మించాలని అన్నారు.ఉపాధిహామీ పథకంలో మహిళలకు సరైన వేతనాలు లేవని,అవినీతి పెరిగిందని అన్నారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు జి.ఝాన్సీ అధ్యక్షత వహించారు.వక్తలుగా ఎం.లక్ష్మి, పి ఓ డబ్ల్యు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,అరుణ, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షులు, జి.అనసూయ,డా.పిట్లా సరిత , ఎం.జ్యోతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆర్.సీత, జె.హరిత, రాష్ట్ర కార్యదర్శులు, గీత రాష్ట్ర కోశాధికారి ఎస్.కావేరీ , జాతీయ నాయకులు వి.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ చేస్తున్న రాజకీయాలు చెల్లవు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టి.నరసింహ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఎంఐఎంను అడ్డుపెట్టుకుని బండి సంజయ్ చేస్తున్న రాజకీయాలు చెల్లవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ అన్నారు. శనివారం హిమాయత్ నగర్ లోని సీపీఐ జిల్లా కార్యాలయంలో హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ.టి.నరసింహ మాట్లాడుతూ.. బీజేపీ కేంద్ర మంత్రులు ఎంఐఎంను అడ్డంపెట్టుకుని మత రాజకీయాలు చేస్తూ అసలు విషయాన్ని పక్కదారి పట్టించి, ప్రజల ఆలోచనలను కేవలం మతానికే పరిమితం చేయాలన్న దృష్టితో బండి సంజయ్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. గత పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ పాత నగర అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించకపోగా నిరంతరం సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్న ప్రజలను భావోద్వేగ మత రాజకీయాల వైపు నెట్టుతున్నారన్నారు. ఓల్డ్ సిటీ మెట్రో రైలు నిర్మాణం కోసం తాము అనేక పోరాటాలు నిర్వహించి సాధించుకోవడం జరిగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మెట్రో నిర్మాణం చేపడతామని అందు కోసం బడ్జెట్ కేటాయించారని, కానీ నగరం అభివృద్ధి జరిగితే తమ మాట చెల్లుబాటు కాదనే ఉద్దేశంతోనే ఎంఐఎం, బీజేపీ కుమ్మక్కై మత రాజకీయాలు చేస్తున్నారన్నారు.అందులో భాగంగానే హైడ్రా, కాంగ్రెస్ పై బండి సంజయ్ వ్యాఖ్యలు ఉన్నాయని, ఒకప్పుడు చెరువులకు, తోటలకు, నిలయమైన హైదరాబాద్ నగరాన్ని పాలకులు కాలుష్య నగరంగా మార్చారని, ప్రభుత్వ భూములను, చెరువులు, కుంటలను ఆక్రమించుకుని పెద్ద పెద్ద భవనాలు నిర్మించుకున్నారని ఆరోపించారు. దీని ద్వారా హైదరాబాద్ నగరానికి పెను ప్రమాదం పొంచి ఉందని, మరో చెన్నై నగరంగా మారే పరిస్థితి నెలకొందన్నారు.దీనిపై వామపక్ష పార్టీలు, ప్రగతిశీల శక్తులు, ఎన్జీవోలు అనేక సంవత్సరాలుగా పోరాడుతున్నాయని గుర్తు చేశారు.దీన్ని పరిగణలోకి తీసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ఇవాళ చెరువులు, కుంటల పరిరక్షణ కోసం అక్రమంగా నిర్మించుకున్న కట్టడాలను కూల్చివేస్తున్న క్రమంలో బండి సంజయ్ స్వాగతించాల్సింది పోయి దీనికి మతం రంగు పులుముతూ కబ్జాదారులను కాపాడుతున్నారన్నారు. ఇప్పటికే హైడ్రా ఎంఐఎం పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యేల ఆరు అక్రమ కట్టడాలను కూల్చివేయడం ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, ఓవైసీ సోదరులు నడుపుతున్న ఫాతిమా కాలేజీకి నోటీసులు జారీ చేశారని గుర్తు చేశారు.దేశ వ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ప్రతిపక్ష రాజకీయ పార్టీలపై సిబిఐ, ఈడి, ఐటీ వంటి సంస్థల చేత కేసులు నమోదు చేయించి, బెదిరింపులకు పాల్పడుతూ అనేక ఇబ్బందులకు గురి చేయడమే కాకుండా ముఖ్య మంత్రులు, ఉప ముఖ్యమంత్రులను జైళ్లకు పంపిస్తున్నారని ఆరోపించారు.మహత్తరమైన తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను సెప్టెంబర్ 1 నుంచి 17 వరకు హైదరాబాదులో జరుపుతామని, అందులో భాగంగా తెలంగాణ సాయుధ పోరాటం నిర్వహించిన కమ్యూనిస్టు పార్టీ త్యాగాలను, పోరాటాలను, ఉద్యమాన్ని, వివరిస్తూ నేడు బీజేపీ ఆ పోరాటాన్ని ఏ విధంగా వక్రీకరణ చేస్తున్నదో ప్రజలకు వివరించటానికి సెమినార్ లు, కటౌట్లు, పోస్టర్లు, బుక్ లెట్స్, ఇంటింటికి తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషలలో ముద్రించిన కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, జిల్లా సహాయ కార్యదర్శులు స్టాలిన్, కమతం యాదగిరి, కార్యవర్గ సభ్యులు నెర్లకంటి శ్రీకాంత్, మహమూద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా వినాయక చవితి జరుపుకోవాలి

- సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్

నవ తెలంగాణ - ముషీరాబాద్

ప్రశాంతమైన వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించాలని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్ అన్నారు. శనివారం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌ను డీసీపీ ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో ప్రజలకు అందుతున్న సేవలపై ఇన్‌స్పెక్టర్ సీతయ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాబోవు వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో పండగలు జరుపుకునే విధంగా చూడాలని సూచించారు. నవరాత్రి



ఉత్సవాలలో ప్రజల కు అందుబాటులో ఉండాలన్నారు. పోలీసులు తమ డ్యూటీలను సక్రమంగా నిర్వహించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజలతో మమేకమై ఉంటూ బాధితులకు సత్వర న్యాయం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ఎస్సైలు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై రాజ్యాంగ ధర్మాసనం తీర్పు లోప భూయిష్టం



- రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఇటీవల ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఏడుగురు జడ్జిల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పు లోప భూయిష్టంగా ఉందని, ఈ తీర్పును వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి డిమాండ్ చేసింది. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమితి కో-కన్వీనర్లు బత్తుల రాంప్రసాద్, ఆవాత సుధీర్, గుడిమల్లె వినోద్ కుమార్, పిల్లి సుధాకర్ తదితరులు మాట్లాడుతూ ప్రతిసారి మాల సామాజిక వర్గానికి చెందిన ఒకరిద్దరి పేర్లను ప్రస్తావిస్తూ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ చేస్తున్న తప్పుడు ప్రచారాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 70 ఏండ్ల రిజర్వుడ్ స్థానాలను మాలలు మాత్రమే అనుభవిస్తూ మాదిగలకు మోసం చేస్తున్నారని పదే పదే అంటున్న మందకృష్ణ మాదిగ మాటలు, ఆయన చేసే ప్రచారం అవాస్తవమన్నారు. అనేక మంది మాదిగలు రాజకీయంగా అనేక పదవులు అనుభవించిన వాస్తవాలను కుట్ర పూరితంగా కప్పిపుచ్చి కేవలం మాలలు మాత్రమే అనుభవిస్తున్నారని అసత్య ప్రచారాలు చేయడం ఇప్పటికైనా మానుకోవాలని వారు హెచ్చరించారు. దళిత బంధు పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా అత్యధికంగా మాదిగలే లబ్ధి పొందిన నగ్న సత్యాన్ని తెలుసుకోవాలని సూచించారు. వర్గీకరణ అంశం కేవలం తెలంగాణకు సంబంధించినది మాత్రమే కాదని, ఇది దేశవ్యాప్త సమస్య అని, దేశవ్యాప్తంగా దళిత మేధావి వర్గం, వివిధ రాజకీయ పార్టీలలోని దళిత ప్రజా ప్రతినిధులు యావత్ దళిత సమాజం సుప్రీంకోర్టు తీర్పును ముక్తకంఠంతో వ్యతిరేకించాలని వారు కోరారు. సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ పిలుపు మేరకు సెప్టెంబర్ 11న ఛలో జంతర్ మంతర్, సెప్టెంబర్ 4న తెలంగాణ 33 జిల్లాల్లోని కలెక్టర్ కార్యాలయాల ఎదుట రిలే నిరాహార దీక్షలు, సెప్టెంబర్ 19న దేశవ్యాప్త నిరసన ర్యాలీలు చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సమితి కో-కన్వీనర్లు జంగా శ్రీనివాస్, సత్యనారాయణ, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గా శ్రీనివాస్ తిపిరిశెట్టి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం భాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులుగా తిప్పిరి శెట్టి శ్రీనివాస్ ను రాష్ట్ర కమిటీ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. -నవ తెలంగాణ - ముషీరాబాద్

ఆకట్టుకుంటున్న గ్రాండ్ నర్సరీ మేళా..

నవతెలంగాణ-అంబర్‌పేట

వర్షంలోనూ ప్రకృతి ప్రియులు మొక్కలు తీసుకోవడానికి నెక్లెస్‌రోడ్డు, పీపుల్స్ ప్లాజాకు పరుగులు తీశారు. శనివారం అంతా ముసురుతో ఒకవైపువర్షం వస్తున్నా లెక్క చేయకుండా నర్సరీ మేళాకు వచ్చి తమకు కావాల్సిన మొక్కలు తీసుకువెళ్లారు. మొక్కలు పెంచడం అంటే భావితరాలకు మంచి భవిష్యత్తు అందించడమేనని, ప్రకృతిని ప్రేమించడమంటే కొంగొత్త సమాజాన్ని ప్రేమించడమేనని పర్యావరణ ప్రేమికులు స్పష్టం చేశారు. గురువారం నెక్లెస్‌రోడ్ పీపుల్స్‌ప్లాజాలో ప్రారంభమైన ఆలిండియా హార్టికల్చర్, అగ్రికల్చర్‌షోకు నగర ప్రజలను అమితంగా ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శనలో వర్టికల్ గార్డెనింగ్, హైడ్రోఫోనిక్ సిస్టమ్, టెర్రస్ గార్డెనింగ్, వంటి నూతన టెక్నాలజీ ఈ ప్రదర్శనలో ప్రత్యేకంగా నిలిచాయి. కిచెన్, అవుట్ డోర్, ఎక్సోటిక్ టిక్, బల్బ్, సీడ్, సీడ్ లింక్స్ ,ఇండోర్, ఆడినియం, బోన్సాయ్, క్రీపర్స్, ఫ్లవర్స్, ఇంపోర్టెడ్ ప్లాంట్స్ ప్రదర్శించారు. దేశవ్యాప్తంగా డార్జిలింగ్, కోల్కతా, ఢిల్లీ, హర్యానా, ముంబయి, బెంగుళూరు, పూణే, షిర్డీ, కడియం, చెన్నై తెలంగాణ, ఆంధ్రా తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 150స్టాల్స్ ప్రదర్శిస్తున్నారు. బోన్సాయ్ వృక్షాలు, పూలు, పండ్ల మొక్కలు అబ్బురపరుస్తున్నాయి. టెర్రస్?, హోమ్?, బ్యాక్?



యార్డ్? గార్డెనింగ్ బీజీగా ఉండే నగర వాసులకు మానసిక ఒత్తిడి తగ్గించి ఆరోగ్యాన్ని, ఆనందాన్ని ఉల్లాసాన్ని కలిగిస్తాయని షో ఇంచార్జీ ఖాలీద్ అహ్మద్ అన్నారు. సోమవారం వరకూ ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ఈ షో ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ షో లో మెడిసినల్ ప్లాంట్స్, రకరకాల పండ్లు, పూల మొక్కలు, అగ్రికల్చర్, హార్టికల్చర్‌కు అవసరమైన పనిముట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలను పరిరక్షించాలని కోరారు. పర్యావరణాన్ని విస్మరిస్తే ఇప్పుడు వాటర్ బాటిల్స్ కొంటున్నట్లు భవిష్యత్తులో ఆక్సిజన్ బాటిల్స్ కొనుక్కోవాల్సి వస్తుందన్నారు. ఈ మేళాలో ఏర్పాటు చేసిన స్టాల్స్ లో నర్సరీ స్టాల్స్ తో పాటు మెడిసినల్ ప్లాంట్స్ , ఫ్రూట్, ఫ్లవర్ ప్లాంట్స్, బల్బ్స్ ప్రదర్శించారు.

కొట్టేసిన చెట్ల కొమ్మలను తొలగించాలి



నవతెలంగాణ - ధూల్‌పేట్

జియాగూడ దుర్గా నగర్ బస్తీలోని భారత అభ్యుదయ పాఠశాల ప్రక్కన 10 రోజుల క్రితం కొట్టేసి, అక్కడే పడేసిన చెట్ల కొమ్మలను జీహెచ్‌ఎంసీ అధికారులు తొలగించాలని జియాగూడ పేరెంట్స్ అసోసియేషన్ కన్వీనర్ పి.నాగేశ్వర్, వికలాంగుల సంఘం దుర్గానగర్ నాయకుడు వి.నరేష్‌లు డిమాండ్ చేశారు. శనివారం పాఠశాల పరిసరాలు శుభ్రతకు ఆటంకంగా ఉన్న ఈ స్థలాన్ని సందర్శించారు. ఈ సమస్యను స్థానిక కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదన్నారు. కొట్టి పడేసిన చెట్ల కొమ్మలను తొలగించక పోవడంతో కొందరు వచ్చి ఇతర చెత్త సంచులు తెచ్చి అక్కడే పడేస్తున్నారన్నారు. దానితో దోమల బెడద పెరుగుతున్నదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం సంబంధిత జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరారు.

వినాయక నిమజ్జన చెరువుల పరిశీలన



నవతెలంగాణ-కాప్రా

వినాయకుడి నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఉప్పల్ జోనల్ మిషనర్ హేమంత పాటిల్‌తో కలిసి కాప్రా, చర్లపల్లిలోని పలు చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వినాయక చవితి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని, పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. చెరువుల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డీసీ జగన్, వివిధ విభాగాల అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులున్నారు.

లోతట్టు ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-నేరేడ్ మెట్

మౌలాలి డివిజన్‌లోని ఈస్ట్ మారుతీ నగర్‌లోని లోతట్టు ప్రాంతాల్లో కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా వర్షాలతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక కాలనీవాసులు తమ కాలనీలో వెంటనే ఆర్‌సీసీ పైపు లైన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ మధురిమ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్ ఏఈ ఉదయ్, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు నరేందర్, మహేందర్, సంజయ్, కాలనీ అధ్యక్షులు అధ్యక్షులు కుమార్, మాధవాచారి, శివ గౌడ్, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో కోటి 35 లక్షల వ్యయంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధికి సహకరిస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ.. డివిజన్ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు. డివిజన్ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యేకు డివిజన్ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ శ్రవంతి, కాలనీల సంక్షేమ సంఘ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, సుఖేందర్ రెడ్డి, ఉల్లెమ్ బాలరాజు, కాళిదాస్, సత్యనారాయణ, కృష్ణారావు, ప్రసాద్, అశోక్ రెడ్డి, రాకేష్, రాజు, వేణు, శీను, హరినాథ్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, రామకృష్ణ, వీరభద్ర రావు, పూస రమేష్, చక్రవర్తి, శ్రీపతి, శ్రీనివాస్ గౌడ్, సంతోష్, అంజయ్య, చారి, బాలయ్య, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్ ఆయా కాలనీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్‌లో ప్రముఖ కవి ఆరుద్ర జయంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో అభ్యుదయ రచయిత, ప్రముఖ కవి ఆరుద్ర 99వ జయంతిని శనివారం కమలానగర్ ఆఫీసులో స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డమ్ అండ్ డెఫ్ విద్యాసంస్థలు మాజీ ప్రిన్సిపాల్ పద్మ ఆరుద్ర చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆరుద్ర 1925 ఆగస్టు 31 తేదీన జన్మించారని తెలిపారు. వారు రచించిన త్వమేహం కవితల పుస్తకం తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతో ప్రాచుర్యం పొందిందని చెప్పారు. ఆరుద్ర రచించిన పుస్తకాన్ని చదివిన శ్రీశ్రీ ఇంత మంచి కవిత్వం చూసిన తర్వాత తాను రాయాల్సిన అవసరం లేదని ప్రశంసించారని గుర్తు చేశారు. స్ఫూర్తి గ్రూపు నాయకులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ.. సమగ్ర సాహిత్య పరిశోధనా గ్రంథాలు 13 వ్యాల్యూమ్స్ ప్రచురించారని, ఇప్పటికీ అది పరిశోధాత్మక రచనల్లో ముందు భాగాన నిలిచిందన్నారు. జనుల జానపద కళలను, దాని పరిణామాలను అధ్యయనం చేసి గొప్ప రచన చేశారని చెప్పారు. అభ్యుదయ భావాలతో అభ్యుదయ రచయితల సంఘాన్ని ఏర్పాటు చేయడంలోనూ క్రియాశీలకంగా ఉన్నారని చెప్పారు. సినీ రంగంలో ఆరుద్ర రచించిన ఎన్నో అద్భుత పాటలు నేటికీ ప్రజల హృదయాల్లో నిలిచే పాటలు అనేకం ఉన్నాయని పేర్కొన్నారు. శారద మాట్లాడుతూ.. సుందరయ్య విజ్ఞాన కేంద్రం గ్రంథాలయాన్ని ప్రారంభించేటానికి వచ్చి తాను ప్రత్యేకంగా వేరే గ్రంథాలయం పెట్టనని నా దగ్గర ఉన్న వేల గ్రంథాలను సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి బహుకరిస్తానని చెప్పారని గుర్తు చేశారు. ఆయన తదనంతరం ఆయన సతీమణి రామలక్ష్మి మొత్తం ఆరుద్ర గ్రంథాలయాన్ని సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి బహుకరించారని తెలిపారు. అనంతరం సభికులందరూ ఆరుద్ర చిత్రపటానికి పూలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జయరాజు, చందన్ రాజు, హరి ప్రసాద్, శారద, గౌస్య శ్రీనివాసరావు, రుక్కయ్య, పద్మ యాదగిరిరావు, కేకే ఉన్నికృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్‌లోని పలు సమస్యలను పరిష్కరించాలని కాప్రా కాలనీ కోఆర్డినేషన్ కమిటీ మెంబర్స్ కాప్రా డిప్యూటీ కమిషనర్ జగన్‌ను కోరారు. శనివారం డిప్యూటీ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వివిధ కాలనీల సమస్యలను వివరించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు 11కేవీ, 440 వైర్లకు తాగడంతో త్యాగరాయ నగర్, మరికొన్ని కాలనీల్లో విద్యుత్తు ఓల్టేజీ హెచ్చుతగ్గులతో గృహ పరికరాలు కాలిపోతున్నావని తెలిపారు. వెంటనే ఎత్తుగా ఉన్న చెట్లను క్రేన్ సహాయంతో తొలగించాలని కోరారు. వర్షంతో చాలా చోట్ల రోడ్లు గుంతలమయం కావడంతో ప్రజలు ఇబ్బందుల కు గురవుతున్నారని తెలిపారు. గుంతలను తక్షణమే కూడిపించాలని కోరారు. డిప్యూటీ కమిషనర్ స్పందిస్తూ సమస్యలను పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నాగిరెడ్డి సంజీవరెడ్డి, సెక్రెటరీ తుమ్మల మధుకర్ రెడ్డి, ఉపాధ్యాయులు రామాచారి, శంఖు కాలనీ అధ్యక్షులు సింగయ్య పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

కాప్రాలోని మల్లారెడ్డి ఫంక్షన్ హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీని కాప్రా ఎమ్మార్వో సుచరిత అధ్యక్షతన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై రూ.2 కోట్ల 52 లక్షల 3,780 విలువగల చెక్కులను లబ్దిదారులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్ల వివాహానికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ఎంతో మేలు చేస్తుందన్నారు. చెక్కులు సకాలంలో మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-బోడుప్పల్

మహిళ సంక్షేమంలో రాష్ట్ర ప్రభుత్వం ముందంజలో ఉందని మేడ్చల్ కాంగ్రెస ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శనివారం మేడిపల్లి మండల పరిధిలోని బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్ల పరిధిలో కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్నారు.

బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌లో వసతులు కల్పించాలి

- మేడ్చల్ కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-హైదరాబాద్‌డెస్క్

బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో మౌలిక వసతులు కల్పించాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ అన్నారు. శామీర్‌పేట్‌లోని అమీనా ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ (బాలుర)ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెసిడెన్షియల్ స్కూళ్లల్లో మౌలిక వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. స్కూల్‌లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారని స్కూల్ నిర్వాహకులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్కూలులో అవసరమైన లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, టాయిలెట్లకు మరమ్మతులు చేయించాలని సూచించారు. భోజనశాలలో టేబుళ్లు, కుర్చీలు విద్యార్థులకు సరిపడా ఏర్పాటు చేయాలన్నారు. భోజనశాలకు వెళ్లే దారిని మొరంతో నింపాలన్నారు. వాటికి అయ్యే ఖర్చులను యాజమాన్యానికి ఇచ్చే అద్దెలో 4,5 నెలల్లో కొంచెం కొంచెంగా మినహాయించాలని నిర్వాహకులకు తెలిపారు. స్కూలులోని వంట శాలను, స్టోరు రూంను కలియ తిరిగి పరిశీలించారు. స్టోరు రూంలోని వంట సామాగ్రిని పరిశీలించి తడి లేకుండా సామాగ్రిని నిలువ ఉంచాలని కలెక్టరు స్టోర్ ఇన్‌చార్జిని ఆదేశించారు. తరగతి గదులను కలెక్టరు పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. రెసిడెన్షియల్ స్కూలుకు వెళ్లే రహదారి చాలా గుంతలతో ఉన్నదని, దానికి కావలసిన మరమ్మతులను చేపట్టాలని ఎంపీడీవోను కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు విద్యార్థులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనలో ఎంపీడీవో మమతా బాయి, రెసిడెన్షియల్ స్కూలు నిర్వాహకులు, టీచర్లు, విద్యార్థులు, పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను సంతోషంగా జరుపుకోవాలి

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి



నవతెలంగాణ-ఉప్పల్

గణేష్ ఉత్సవాలు ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అందుబాటులో ఉండాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఉప్పల్ మునిపల్ కార్యాలయంలో ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులు అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన వినాయక చవితి, నిమర్జన సమన్వయ సమావేశానికి కార్పొరేటర్లు బన్నాల గీత, బండారు శ్రీవాణిలతో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకునేలా అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. మండపాల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు మండపాల నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, ఉప్పల్ సీఐ ఎలక్షన్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ లక్ష్మి మాధవి, ఈఈ నాగేందర్, తహశీల్దార్ వాణి రెడ్డి, పాల్గొన్నారు.

హైడ్రా బారి నుంచి తప్పిస్తా : ఎంపీ ఈటల



నవతెలంగాణ-అల్వాల్

పేద ప్రజలను హైడ్రా బారి నుంచి తప్పిస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. అల్వాల్, ఆనందరావు నగర్ కాలనీ, జానకి నగర్, వాసవీ నగర్, భారతి నగర్ వాసులకు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టినట్టు హైడ్రా నోటీసులు అందజేశారు. విషయం తెలుసుకున్న ఎంపీ ఈటల రాజేందర్ శనివారం నాలుగు కాలనీల వారితో మాట్లాడారు. భయభ్రాంతులకు గురి కావద్దని భరోసా కల్పించారు. స్థానికులు మాట్లాడుతూ.. 30 ఏండ్ల క్రితం అన్ని వసతులతో కాలనీలను ఏర్పాటు చేసుకున్నామని ఎంపీకి తెలిపారు. టాక్స్, కరెంటు బిల్లులు సక్రమంగా చెల్లిస్తున్నామని ఆయనతో మొరపెట్టుకున్నారు. కాలనీవాసులు భయపడాల్సిన అవసరం లేదని, ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేస్తామని ఎంపీ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, ఆనంద్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ హరిబాబు, శ్రీనివాస రావు, లారెన్స్ శర్మ, నరహరి, భారతి నగర్ ప్రెసిడెంట్ రాజయ్య, కె ఎస్ ఎన్ మూర్తి, జానకి నగర్ నుండి మోహన్ రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు మాణిక్య రెడ్డి, మాధవ్, మల్లికార్జున గౌడ్, కార్తీక్ గౌడ్, రవి, కిరణ్, అంటోని, లక్ష్మణ్, ప్రశాంత్ రెడ్డి, గోవి తదితరులున్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి



- ఏసీపీ బి.శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ లక్ష్య సాధన కోసం ప్రతిరోజు కృషి చేయాలని మేడ్చల్ ఏసీపీ బి.శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం మేడ్చల్‌లో స్ఫూర్తి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరై మాట్లాడుతూ.. సమాజంలో సోషల్ మీడియా ప్రభావం అధికంగా ఉందని, దీని ద్వారా మంచి..చెడు రెండు ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ వయస్సులో విద్యార్థులు త్వరగా చెడుకు ప్రభావితమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఏది మంచి ఏది చెడో గుర్తించాలని సూచించారు. ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లలో పరిచయం లేని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని, ఎటువంటి నేరం చేసినా నేరం చేసేవారికి సహాయం చేసినా శిక్ష పడుతుందని హెచ్చరించారు. జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్.మావుదూరి సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులు ఇంటర్మీడియట్ దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. దేశ ఔన్నత్యం ఎంతో గొప్పదని, ప్రతి విద్యార్థి దేశం పట్ల అభిమానం, తల్లిదండ్రులు, గురువులపై గౌరవం సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అంతకుముందు విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మేడ్చల్ సీఐ సత్యనారాయణ, కళాశాల కరస్పాండెంట్ కమలాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ దేవరాజ్, యాజమాన్య సభ్యులు గణేష్, మంజుల ప్రకాష్, రామ్ శంకర్, సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్య పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వినాయక్‌నగర్‌లోని వివిధ కాలనీల్లో డ్రయినేజీ సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ క్యానం రాజ లక్ష్మి అన్నారు. ఏడాది కాలంగా భూగర్భ డ్రయినేజీ ప్రపోజల్స్ పెండింగ్‌లో ఉన్నాయని, డ్రయినేజీలు పొంగడంతో ఆయా కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించేలా అధికారులను ఆదేశించాలని, బడ్జెట్‌కు అనుమతులు తీసుకురావాలని శనివారం సైనిక్‌పురి కార్యాలయంలో జనరల్ మేనేజర్ వి.అశోక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డ్రయినేజీకి సంబంధించిన ప్రపోజల్స్‌ను ఎక్స్ మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్ రెడ్డికి, అశోక్ రెడ్డిలను కలిసి విన్నవించినా ఎటువంటి స్పందన లేదన్నారు. జనరల్ మేనేజర్‌కు, ఎండీకి ఇక్కడి పరిస్థితి వివరించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో దీన్ దయాల్ నగర్ కాలనీవాసులు ఉపేంద్ర, జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని పూజిద్దాం..పర్యావరణాన్ని కాపాడుదాం

- కుషాయిగూడ ఏసీపీ మహేష్,
- జవహర్ నగర్ సీఐ నాగరాజు



నవతెలంగాణ - జవహర్ నగర్

మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని కుషాయిగూడ ఏసీపీ మహేష్ అన్నారు. జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జమ్మిగడ్డలోని మద్దూరి స్వరూప గార్డెన్‌లో జవహర్ నగర్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రులపై గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మహేష్ మాట్లాడుతూ.. ఉత్సవ నిర్వాహకులు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని, ప్రతి గణేష్ మండపానికి జియోట్యాగింగ్ చేస్తామని, రోడ్లపై మండపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం మత్తులో హంగామా చేస్తే కటకటాలే లెక్కిస్తారని హెచ్చరించారు. డీజేలు వద్దనీ, కోలాటాలు, భజనలే ముద్దని సూచించారు. కాలనీకి ఒక విగ్రహం పెట్టుకోడానికి ప్రయత్నం చేయాలన్నారు. నిమజ్జనం చేసే ముందు రోజు పోలీసుకు సమాచారం ఇవ్వాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం లేకుండా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశామని తెలిపారు. మండపాల్లో కరెంటు, ఫైర్ సెఫ్టీ నిబంధనలు పాటించాలని, రాత్రి సమయంలో నిర్వాహకులు తప్పక ఉండాలని సీఐ నాగరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ గౌడ్, ఎస్సైలు ఇద్రీస్‌అలీ, రామునాయక్, వేణుమాధవ్, దమ్మాయిగూడ మున్సిపల్ ఛైర్మెన్ ప్రణీత, కమిషనర్ నాగరాణి, కార్పొరేషన్ మేనేజర్ నగేష్, కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, కాప్రా డివిజన్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సతీష్ గౌడ్, నాయకులు సతీష్ గౌడ్, పాషామీయా, మాట్ల వినయ్ కుమార్, నాయకం భాస్కర్, కాప్రా, జవహర్ నగర్, దమ్మాయిగూడ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-హైదరాబాద్‌డెస్క్

మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం మూడుచింతలపల్లి మండలానికి మంజూరైన షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి లబ్దిదారులకు అందజేశారు. మండల వ్యాప్తంగా 44 మంది లబ్దిదారులకు ఈ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, డీసీఎంఎస్ వైస్ ఛైర్మెన్ మధుకర్ రెడ్డి, తహశీల్దార్ వెంకట నర్సింహ రెడ్డి, ఎంసీపల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, మాజీ సర్పంచులు జాం రవి, శిల్పా యాదగిరి, మాజీ ఎంపీటీసీ అఖిలేష్ రెడ్డి, నాయకులు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నగర్ కమిషనర్ పదవీ విరమణ



నవతెలంగాణ - జవహర్ నగర్

జవహర్ నగర్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న తాజ్ మోహన్ రెడ్డి పదవి కాలం నేటితో ముగియడంతో శనివారం రిటైర్మెంట్ అయ్యారు. మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్‌లు కమిషనర్ సేవలను గుర్తు చేస్తూ రిటైర్మెంట్ జీవితాన్ని సంతోషంగా గడపాలని ఆకాంక్షిస్తూ సన్మానించారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ ప్రవీణ్ రెడ్డికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మున్సిపల్ సిబ్బంది, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



నవతెలంగాణ-కీసర

ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నాగారం పురపాలక సంఘ పరిధిలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో కల్యాణ లక్ష్మి చెక్కుల, షాదీ ముబారక్ చెక్కుల పంప ణీ కార్యక్రమానికి మేడ్చల్ శాసన సభ్యు లు మల్లారెడ్డితో కలిసి చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రా రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ జి. రాజేంద్ర కుమార్, కీసర తహశీల్దారు , కౌన్సిలర్లు, కో- ఆప్షన్ సభ్యులు ఇతర నాయకులు లబ్దిదారులు పాల్గొన్నారు.

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

- మేయర్ శాంతి కోటేష్ గౌడ్,
- డిప్యూటీ మేయర్ శ్రీనివాస్



నవ తెలంగాణ - జవహర్ నగర్

భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలో శనివారం ఉదయం నుండి రాత్రి వరకు ఆకాశం మేఘావృతమై వర్షం కురువడంతో లోతట్టు ప్రాంతాలన్ని జలమయ్యాయి. మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని పిలుపునిచ్చారు. భారీ వర్షాల నేపథ్యంలో మున్సిపల్, విద్యుత్ అధికారులు, సిబ్బంది అలర్టుగా ఉండాలని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.

అంగన్‌వాడీలకు సర్కార్ అన్యాయం



- రిటైర్మెంట్ బెనిఫిట్స్ తగ్గించే నిర్ణయం మానుకోవాలి
- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.సునిత, బి.శోభారాణి
- ఆయా సెక్టార్లలో నల్ల బ్యాడీలు ధరించి నిరసన

నవతెలంగాణ-సిటీబ్యూరో

అంగన్‌వాడీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తుందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.సునిత, బి.శోభారాణి అన్నారు. ఈ మేరకు అంగన్‌వాడీలు ఆయా సెక్టార్లలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జి.సునిత, బి.శోభారాణి మాట్లాడుతూ 65 ఏండ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ తగ్గించి ఇచ్చే నిర్ణయాన్ని మానుకోవాలనీ, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇస్తామని చెబుతూ ఈ నెల 20వ తేదీన టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50వేలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం అన్యాయం అన్నారు. ఇందుకు నిరసనగా ఈ రెండు రోజులపాటు సెక్టార్ మీటింగ్‌లలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేయాలని యూనియన్ జిల్లా కమిటీ పిలుపు మేరకు వినాయకనగర్, మల్కాజిగిరి, శామిర్‌పేట, అల్వాల్, దుండిగల్ సెక్టార్లలో నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ చిన్న పిల్లలకు విద్యా బోధనను అందిస్తూ, ఇటు ప్రజలు, అటు ప్రభుత్వానికి 40 ఏండ్లుగా అనేక సేవలందిస్తున్న తమకు సర్కార్ అన్యాయం చేయడం సరికాదన్నారు. మంత్రి సీతక్క హామీ మేరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్‌లకు రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మీనాక్షి, వనజ, రమాదేవి, శ్రీదేవితో పాటు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రాగం అర్జున్‌కు సన్మానం



నవతెలంగాణ- మేడ్చల్

బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఇటీవల నియామకమైన రాగం అర్జున్‌ను శనివారం బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్ శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంబు ప్రభాకర్ మాట్లాడుతూ 20ఏండ్లుగా బీజేవైఎంలో రాగం అర్జున్ చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పదవి రావడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో ఉన్నతంగా రాణిస్తూ మరెన్నో పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు. కలిసిన వారిలో నాయకులు ముత్యాల గాంధీ ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
ఆదివారం | సెప్టెంబర్ 01, 2024 | www.navatelangana.com

గొడ్డలితో దాడి ఘటన.. మహిళ మృతి



నవతెలంగాణ-బాలానగర్

ఈనెల 27న బాలానగర్‌లో జరిగిన హత్య కేసులో పాత కక్షలతో వ్యక్తిపై గొడ్డలితో దాడి కేసులో ముఖేందర్ మృతి చెందిన సంఘటన తెలిసిందే... కాగా అదే క్రమంలో అడ్డుగా వచ్చిన ముఖేందర్ తల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లి సావిత్రి(63) శనివారం మృతి చెందిన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దామోదర సంజీవయ్య కాలనీ నివాసితుడ ఏర్పుల మధు ముఖేందర్ పై గొడ్డలితో దాడి చేసి క్రమంలో అడ్డుగా వచ్చిన తల్లి సావిత్రిపై కూడా దాడిచేయగా తీవ్ర గాయాలతో ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ మేరకు సీఐ నవీన్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రసిద్ధ వ్యక్తులతో ఇంటరాక్షన్, భోజన కార్యక్రమంలో భాగంగా కేంద్ర సాహిత్య అకాడెమీ యువ పురస్కారగ్రహీత, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యాపకుడు డా. గడ్డం వెంహన్ రావును తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అభినందించారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరవాసులు అత్యవసరం అయితేనే బయటకు రండీ..



- వర్షాల నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలి
- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

నవతెలంగాణ-సిటీబ్యూరో

మరో రెండు రోజుల పాటు నగరంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో క్షేత్ర స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ ఆమ్రపాలి కాట, జోనల్ కమిషనర్‌లతో మేయర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... నగరంలో వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అత్యవసరం అయితేనే బయటికి రావాలని, ఏదైనా సహాయం కావాలంటే జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్ 040-21111111ను సంప్రదించాలని పేర్కొన్నారు. మాన్సూన్ ఎమర్జెన్సీ బందాలు అప్రమత్తమైన 24 గంటల పాటు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. డి.ఆర్.ఎఫ్, మాన్సూన్ ఎమర్జెన్సీ టీంలు అందుబాటులో ఉండాలని తెలిపారు. కంట్రోల్ రూం నుండి నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని, అధికారులందరూ అప్రమత్తమై క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ అందరూ అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. డిప్యూటీ మేయర్ శ్రీ లత శోభన్ రెడ్డి, కమిషనర్ ఆమ్రపాలి కాట మాట్లాడుతూ... వర్షాల సందర్భంగా 141 వాటర్ లాగింగ్ పాయింట్‌ల వద్ద స్టాటిక్, మాన్సూన్ ఎమర్జెన్సీ బందాలు ఎప్పటికప్పుడు నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారని, వర్షాల సందర్భంగా మ్యాన్ హెూల్స్ ఓపెన్ చేయకూడదని కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హైడ్రా జీహెచ్ఎంసీ సమన్వయంతో పని చేసి ఎవ్వరికీ సమస్యలు రాకుండా చూస్తామన్నారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, రవి కిరణ్, ఉపేందర్ రెడ్డి, వెంకన్న, శానిటేషన్ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫతేనగర్‌లో త్వరలో ఎస్‌టీపీ కేంద్రం ప్రారంభం

- ఎస్‌టీపీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కృష్ణారావు



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో మురగునీటిని శుద్ధి చేయడం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం చేపట్టి పూర్తి చేసిందని, త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. డ్రయినేజీలలో మురికి నీళ్లు నిల్వ ఉండకుండా, చెరువుల్లో డ్రయినేజీ నీళ్లు కలవకుండా నూతన ఆలోచనలతో మాజీ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఎస్.టి.పి. ప్లాంట్‌కు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్లతో 9 చెరువులపై ఏర్పాటు చేసిన ఎస్.టి.పి. పనులను శంకుస్థాపనకు సిద్ధంగా ఉన్నా.. ఫతేనగర్ ఎస్.టి.పి పనులను పరిశీలించారు. ఫతేనగర్ డివిజన్ లాల్ బహదూర్ శాస్త్రి నగర్‌లో నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న మురుగు నీటిశుద్ధి కేంద్రాన్ని కార్పొరేటర్ సతీశ్ గౌడ్‌తో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి శుద్ధి పనులలో ఎలాంటి పనులు పెండింగ్ ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని మురుగు నీరు నాలాల ద్వారా ప్రవహిస్తున్న మురుగునీటిని శుద్ధి చేయడం, గ్రౌండ్ వాటర్ పొల్యూషన్ కాకుండా నిరోధించడం కోసం రూ. 135 కోట్లతో గత ప్రభుత్వం ఎస్‌టీపీల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అతి త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడానికి ఎస్‌టీపీ సిద్ధంగా ఉన్నట్లు ఆమర పేర్కొన్నారు. ఎస్‌టీపీ నిర్మాణం ద్వారా మురుగు నీటి ఇబ్బందులు దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో జంట డివిజన్ల కార్పొరేటర్లు పండాల సతీష్ గౌడ్, ఆవుల రవీందర్రెడ్డి, కూతాడి రాములు, శంకర్ గౌడ్, ఉదయ్ కంచి బిక్షపతి, సురేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఏడబ్ల్యూయూ కూటమి విజయం



నవతెలంగాణ-బాలానగర్

హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ కూటమి ఎన్నికలలో బీ.యం.యస్ యూనియన్ పై హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ కూటమి (హెచ్ఏడబ్ల్యూయూ) బాలానగర్ పరిశ్రమ హెచ్.ఏ.ఎల్ లో జరగిన ఎన్నికల్లో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ కూటమి 17 ఓట్ల మెజారిటీతో బీఎంఎస్ పై విజయం సాధించింది. యూనియన్ అధ్యక్షులు వేంకటాద్రి, హానరబుల్ ప్రెసిడెంట్ విజయప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బాబు మాట్లాడూతు హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ కూటమి గెలిపించినందుకు కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానలను నెరవేరుస్తామ్మన్నారు. కార్మికుల సమస్యలను యాజమాన్యంతో చర్చించి త్వరలో పరిష్కరిస్తామన్నారు. కార్మికుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామన్నారు. పరిశ్రమలో మొత్తం ఓట్లు 890 ఓట్లు ఉండగా పోస్టల్ బ్యాలెట్ 51ఓట్లు రాగా, 11 చెల్లని ఓట్లు రాగా బీఎంఎస్‌కు 427 కేవలం వచ్చాయి. హిందుస్థాన్ ఏరోనాటికల్స్ వర్కర్స్ యూనియన్ 441 ఓట్లు రాగా 17 మెజారిటీతో విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గణేష్, ప్రవీణ్, చంద్రావు నాయక్, సురేష్, రాంచందర్, వెంకటపతి, అన్వర్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ప్రభుత్వం న్యాయం చేయాలి



- సీఐటీయూ అంగన్వాడి టీచర్స్ దుండిగల్ మండల కార్యదర్శి రాధ

నవతెలంగాణ-దుండిగల్

65 సంవత్సరాలు నిండిన అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ తగ్గించి, ఇచ్చే నిర్ణయాన్ని తెలంగాణ ప్రభుత్వం మానుకోవాలని అంగన్వాడి యూనియన్ మండల కార్యదర్శి రాధా ప్రభుత్వాన్ని కోరారు. శనివారం దుండిగల్ అంగన్వాడి స్కూల్ వద్ద అంగన్వాడి టీచర్లు నల్ల బ్యాడ్జి ధరిస్తూ నిరసన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి రాధా మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ చిన్నపిల్లలకు విద్య బోధనను అందిస్తూ ఇటు ప్రజలకు.. అటు ప్రభుత్వానికి.. గత 40 సంవత్సరాలుగా అనేక సేవలు అందిస్తున్న అంగన్వాడీ ఉద్యోగులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 65 సంవత్సరలు నిండిన అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లను జూలై - 1 నుంచి విధవద్దని సర్క్యులర్ జారీ చేయడం జరిగిందన్నారు. వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు సంబంధించి గత ప్రభుత్వంలో 24 రోజుల సమ్మె సందర్భంగా అప్పుడు ఉన్నటువంటి మంత్రి సంబంధిత అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం టీచర్‌కు రూ.2 లక్షలు, హెల్పర్‌కు రూ.1 లక్ష రూపాయలు కాకుండా .. పాత జీవో నెంబర్ 10 ప్రకారమే అంగన్వాడీ టీచర్‌కు రూ.1 లక్ష, హెల్పర్‌కు రూ.50 వేలు ఇస్తామని సర్క్యులర్‌లో పేర్కొనడంతో సీఐటీయూ ఆధ్వర్యంలో.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. వేలాది మంది అంగన్వాడి ఉద్యోగులతో చలో హైదరాబాద్ ఐసీడీఎస్ కమిషనర్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమం చేపట్టిన సందర్భంగా.. కమిషనర్ అంగన్వాడి ఉద్యోగులకు సంబంధించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్ లకు రూ.1 లక్ష రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క అసెం బ్లీ సాక్షిగా హామీ ఇచ్చారన్నారు. లేని పక్షంలో సీఐటీయూ అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు అనిత, పార్వ తి, సుకన్య, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవఖానా సేవలపై అవగాహన కల్పించాలి



- ఓపీ సంఖ్య పెంచేలా ఆశాలు ఇంటింటి ప్రచారం చేయాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఓపీ సంఖ్యను పెంచేలా ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి పల్లె దవఖానా అందించే వైద్య సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్‌ను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. శనివారం శామీర్‌పేట మండలంలోని ఆలియాబాదులో గల పల్లె దవఖానాను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోజుకు ఎంత ఓపీ ఉంటుందని మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ దవఖానాలో ఎంత మంది సిబ్బంది ఉన్నారని సమాచారం తెలుసుకుని, ఇక్కడ అందించే వైద్య సేవల రికార్డుల గురించి అడిగి రిజిస్టర్లను పరిశీలించారు. ప్రసవాల సంఖ్య, వ్యాక్సినేషన్, ఇమ్యూనైజేషన్ గురించి అడిగి వాటి నమోదు రిజిస్టర్లను సైతం తనిఖీ చేశారు. రిజిస్టర్లలో నమోదు సరైన విధంగా లేవనీ, ఎప్పటి రికార్డులను అప్పుడే నమోదు చేయాలనీ, రిజిస్టర్లలో ఖాళీలు ఉండకూడదని సూచించారు. ఈడీడీ క్యాలెండరు, వంద కాలమ్ రిజిస్టరును తప్పనిసరిగా నిర్వహించాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ప్రసవాల సంఖ్య, వ్యాక్సినేషన్‌ను పెంచాలన్నారు. లేబర్ రూమ్‌ను పరిశీలించి ప్రసవాలకు అవసర మైన నవీకరణ యంత్రాలను తెప్పించుకోవాల ని సూచించారు. మందుల గదిని పరిశీలించి మందుల నమోదు రిజిస్టర్లు, పేషంట్లకు మందులు అందించిన రిజిస్టర్లను తనిఖీ చేసి నాలుగు నెలలుగా పేషంట్లకు మందులు ఇచ్చిన రికార్డుల నమోదు సరిగా లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రిజిస్టర్ల నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. అనంత రం శామీర్‌పేట్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, అక్కడ ఉన్న వైద్య సిబ్బంది ఎంత మంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. పేషెంట్లకు అందించే సేవలను మెరుగు పరిచి మరింత విస్తతం చేయాలని వైద్యులకు సూచించారు. హాస్పిటల్‌లోఉన్న డెంటల్, ల్యాబ్ విభాగాలను పరిశీలించి వాటి పనితీరును డాక్టర్లతో అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌ను తనిఖీ చేస్తూ ల్యాబ్ రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. రోజుకు ఎన్ని ర్యాపిడ్ కిట్లను ఉపయోగిస్తారని అడిగి, వారానికి కనీసం 1500 కిట్లను ఉపయోగించాలని సూచించారు. లేబర్ రూంను పరిశీలించి హైడ్రాలిక్ డెలివరీ టేబుల్‌ను తెప్పించుకోవాలనీ, అందుకు అవసరమైన నిధుల కోసం ప్రణాళిక తయారు చేసి నివేదిక పంపాలని సూచించారు. హాస్పిటల్‌కు అవసరమైన మరమ్మత్తులను చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ టి.రఘునాథస్వామి, శామీర్‌పేట్ ఎంపీడీఓ మమతా బాయి, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

రెసిడెన్షియల్ స్కూల్ పరిశీలన

శామీర్‌పేట్‌లోని అమీనా ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతిబా పూలే, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ (బాలుర)లో మౌళిక వసతులను కల్పించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. శనివారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా స్కూల్‌లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారని స్కూల్ నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. స్కూల్‌లో అవసరమైన లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలనీ, టాయిలెట్లకు అవసరమైన మరమ్మత్తులు చేయించాలని సూచించారు. భోజన శాలలో టేబుళ్లు, కుర్చీలు విద్యార్థులకు సరిపడా ఏర్పాటు చేయాలనీ, భోజనశాలకు వెళ్లే దారిని మొరంతో నింపాలని నిర్వహకులకు సూచించారు. వీటికి అయ్యే ఖర్చులను యాజమాన్యానికి ఇచ్చే అద్దెలో 4,5 నెలల్లో కొంచెం కొంచెంగా మినహాయించాలని నిర్వాహకులకు తెలిపారు. స్కూల్‌లోని వంటశాల, స్టోర్ రూంలో కలియ తిరిగి పరిశీలిం చారు. స్టోర్ రూంలోని వంట సామాగ్రిని పరిశీలించి తడి లేకుండా సామాగ్రిని నిల్వ ఉంచాలని స్టోర్ ఇన్‌చార్జిని ఆదేశించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. రెసిడెన్షియల్ స్కూల్‌కు వెళ్లే రహదారి చాలా గుంతలతో ఉన్నదనీ, కావాల్సిన మరమ్మత్తులను చేపట్టాలని ఎంపీడీఓను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ మమతా బాయి, రెసిడెన్షియల్ స్కూల్ నిర్వహకులు, టీచర్లు, విద్యార్థులు ఉన్నారు.



మాజీ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు, సంఘాల ప్రతి నిధులు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ని షాపూర్ నగర్‌లోని తన నివాసం వద్ద పలువురు నాయకులు, పలు సంఘాల ప్రతినిధులు కలిసి పలు ఆహ్వాన పత్రికలు అందజేశారు. జన విజ్ఞాన వేదికకు సంబంధించిన ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్‌ని ఐదవ రాష్ట్ర మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు. సూరారం డివిజన్‌కు చెందిన నాయకులు స్థానికంగా నెలకొన్న ప్రజా సమస్యలు మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా .. వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని, మాజీ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



సర్వేంద్రియానం నయనం ప్రధానం



- కార్పొరేటర్ రావుల శేషగిరి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మన శరీరంలో కళ్లకు ఎంతో ప్రాముఖ్యత ఉందని వాటిని కాపాడుకోవాలని సర్వేంద్రియానం నయనం ప్రధానమని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. శనివారం డివిజన్ పరిధి ఉషోదయ కాలనీ ఫేస్ వన్ కమిటీ హాల్‌లో శ్రీ నేత్రాలయ ఐ హాస్పిటల్ అండ్ లేజర్ సెంటర్‌లో నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న నేత్రాలయ వైద్యశాల వైద్య బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ కాలనీ ఫేస్ వన్ అధ్యక్షులు సురేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సతీష్ బాబు, లయన్స్ క్లబ్ గాజులరామారం అధ్యక్షులు జీవన్, లయన్స్ క్లబ్ ఉషోదయ అధ్యక్షులు రవికాంత్, జోనల్ చైర్పర్సన్ రంజిత్, స్థానికులు రమేష్ బాబు, శ్రీను, రాజు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించి, దేశ ప్రతిష్ట పెంచాలి

- ఎన్.ఎస్.యు.ఐ.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

యువత క్రీడల్లో రాణించి దేశ ప్రతిష్ట ఇనుమడింపజేయాలని ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ సూచించారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి హెచ్ఎంటి క్రీడా మైదానంలో 18 వ సంవత్స ర రాజీవ్ గాంధీ స్మారక ఎన్.ఎస్.యు.ఐ స్పోర్ట్స్ మీట్ - 2024 సందర్భంగా జాతీయ ఎన్.ఎస్.యు.ఐ. కార్య దర్శులు తెలంగాణ ఎన్.ఎస్.యు.ఐ.ఇన్‌చార్జిలు ప్రతీక్‌మ ద్ సింగ్, ఫహద్,రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ స్వామిలతో కలిసి ఆయన ఇప్పుడు రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ ఎన్.ఎస్.యు.ఐ నేత గొల్ల జాన్ గత 10 సంవత్సరాల నుంచి క్రీడాసంస్థతో పాటు పార్టీని బలోపేతానికి చేయడానికి కృషి చేస్తున్నారని, రాజీవ్ గాంధీ స్మారకార్థం ఇటువంటి క్రీడల పోటీలు నిర్వహించడం పట్ల ఆయనను అభినందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాకారులను అన్ని విధాలుగా గుర్తిస్తుందని వారి అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. క్రీడల వల్ల మానసికోలాసం, దేహ దారుఢ్యం పెంపొందుతుందని తెలిపారు.క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే క్రీడా కోట కింద కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ సర్వీసు ఉద్యోగాలు వస్తాయన్నారు. అనంతరం కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్ పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రతినిధి యడమ పవన్‌జీ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు, రాహుల్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు అరుంధ్యాజీరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎం.సాయి కిరణ్, కె.నవీన్, విశ్వనాథ్, హరీష్ విద్యార్థులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన సీపీఆర్ఓ మహమ్మద్ ముర్తుజా







- ఘనంగా వీడ్కోలు పలికిన సిబ్బంది, అధికారులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

పదవీ విరమణ పొందిన జీహెచ్ఎంసీ సీపీఆర్వో మహమ్మద్ ముర్తుజా అలీకి ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పన్వర్ హాల్‌లో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, మీడియా మిత్రులు ఘనంగా సన్మానించారు. సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ అయిన మహమ్మద్ ముర్తుజా అలీ సెప్టెంబర్ 06, 2021 సంవత్సరంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సీపీఆర్ఓగా విధులలో చేరారు. ఆయన అప్పటి నుండి విధుల పట్ల అంకిత భావంతో సేవలందించారు. అన్ని వేళల అందుబాటులో ఉండి అటు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు, మీడియాకు వారధిగా ఎప్పటికప్పుడు సమాచారం అందించడంలో తనకు తానే సాటిగా నిరూపించుకున్నారు. గత మూడు సంవత్సరాల నుంచి జీహెచ్ఎంసీ అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో, మీడియా ప్రతినిధులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ అందరి మన్ననలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఆర్ఓ కార్యాలయ సిబ్బంది, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సీపీఆర్ఓతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మున్ముందు జీవితం ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని వారు కోరారు. శేష జీవితాన్ని మీ కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, పీఆర్ఓ విజయలక్ష్మి, ఏ.ఎం.సీ శారద, సూపరింటెండెంట్‌లు శైలజ, పద్మ, సక్కుబాయి, సీనియర్ అసిస్టెంట్‌లు మహమ్మద్ మోసిన్, రోహిత్, ఫోటోగ్రాఫర్ రమేష్, ఎం.సి.ఓ అబ్దుల్ సత్తార్, కంప్యూటర్ ఆపరేటర్లు ఆనంద్, శ్రీను, ఆఫీస్ సబార్డినేట్‌లు అంజయ్య, మహేందర్, ఉమ, రమేష్, తౌఫిక్, అస్రఫ్, యాదగిరి, నరేందర్, శ్రీనివాస్, నర్సింగ్ రావు, ఠాకూర్, డ్రైవర్ సలాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి తాము అందించిన సేవలతోనే గుర్తింపు..

ప్రతి ఉద్యోగికి తాము అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. జీహెచ్ఎంసీ సీపీఆర్ఓ మహమ్మద్ ముర్తుజా అలీ పదవీ విరమణ పొందిన నేపథ్యంలో శనివారం మేయర్ ఛాంబర్‌లో సీపీఆర్ఓను కుటుంబ సమేతంగా మేయర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తమ ఉద్యోగ నిర్వహణలో అందించిన సేవలు గుర్తింపు ఇస్తాయని, సీపీఆర్ఓగా ముర్తుజా అంకిత భావంతో విధులు నిర్వహించారని పేర్కొన్నారు. వారి మున్ముందు జీవితం బాగుండాలని ఆమె ఆకాంక్షించారు.

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ పుస్తకావిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ రచించిన పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నారు. ఆదివారం సాయంత్రం 5గంటలకు కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జైన్ చౌధరీ, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, హరియాణ గౌవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్ తదితరులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్నేహితులు, బంధుమిత్రులు, రచయితలు పెత్తఎత్తున హాజరై విజయ వంతం చేయాలని కోరారు.

ఉద్యోగుల జేఏసీ ప్రతినిధుల భేటీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలో ఏకీకృత పెన్షన్ విధానాన్ని అనుమతించొద్దని.. 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగుల జే.ఏ.సీ. విజ్ఞప్తితో సెప్టెంబర్ 1న(నేడు) గన్ పార్క్ వద్ద చేపట్టే నిరసన కార్యక్రమానికి విజయవంతం చేయాలని జలమండలి టీజీఓస్ అండ్ టీఎన్‌జీఓస్ శాఖ నాయకులు, ప్రతినిధులు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. కార్యక్రమంలో టీజీవో హైదరాబాద్ జిల్లా సెక్రెటరీ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ఇతర యూనియన్ నాయకులు ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.



ఇఫ్లూ ఇన్‌చార్జి వీసీగా ప్రొ.హారిబండి లక్ష్మీ

నవతెలంగాణ-ఓయూ

ది ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ (ఇఫ్లూ) , ఇన్‌చార్జి వీసీ గా ట్రాన్స్ లేషన్ స్టడీస్ సీనియర్ ప్రొఫెసర్ ప్రో.హరిబండి.లక్ష్మీ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం వీసీ గా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఉన్న వీసీ సురభి భారతి పదవీ విరమణ చేయడంతో ఆమె కేంద్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.కె.నరసింహ రావు, పీఆర్వో ప్రొ.రాజారాం ,ఇఫ్లూ ప్రొఫెసర్స్ పాల్గొన్నారు. పలువురు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తు సత్కరించారు.



మహిళలు స్వయం శక్తితో ఎదగాలి

- డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి

నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి స్కీం లో భాగంగా శనివారం తార్నాక డివిజన్, లాలాపేట్ లోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియం వద్ద మహిళా క్యాంటీన్ ను డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శ్రీలత శోభన్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా, డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ వచ్చే ఐదు సంవత్సరాలలో మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇంద్ర మహిళ శుద్ధి పథకాన్ని శ్రీకారం చుట్టిందని తెలిపారు. మహిళా శక్తి స్కీం మహిళల ఆర్థిక శక్తివంతత కోసం కీలకంగా పని చేస్తుందని, ఈ క్యాంటీన్ మహిళల స్వయం ఉపాధికి ముఖ్యమైన మద్దతు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీపీఓ శ్రీనాథ్, శ్రీవాణి,మహిళా సెల్ఫ్ హెల్త్ గ్రూప్ సభ్యులు, వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు, అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.





పిల్లల భవిత పై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

- ఏసీపీ రమేష్

నవతెలంగాణ-కంటోన్మెంట్

విద్యార్థుల భవిత పై తల్లితండ్రులు కూడా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కార్ఖానా ఏసిపి గుజ్జ రమేష్ కోరారు. తిరుమలగిరి సెయింట్ జోసెఫ్స్ పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్, సైబర్ నేరాలు వ్యక్తిత్వ నిర్మాణంలో టీచర్లు తల్లిదండ్రులు పాత్ర గురించి విద్యార్థులకు ఆయన వివరించారు. కాగా పాఠశాల లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులు వచ్చిన ఏసీపీ రమేష్, సిఐ నాగరాజులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి సీఐ నాగరాజు , ఎస్సై. అంథోన్నామ్మ (పూర్వ విద్యార్థి), ప్రిన్సిపాల్ జోసెఫ్, ట్రస్ట్ కోఆర్డినేటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన 18 మంది ఎంబీఏ విద్యార్థులు

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయ డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ 2024 - 2025 విద్యా సంవత్సరానికి చెందిన 18 మంది విద్యార్థులు డెలాయిట్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు.ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ. 6.5 లక్షల వేతనం పొందనున్నారు. వీరిని విభాగం హెడ్ ప్రో.జహంగీర్ అభినందించారు.



'విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం'

నవతెలంగాణ-ఓయూ

ప్రభుత్వం, పోలీసుల నిర్లక్ష్యం తోనే వరుస రోడ్డు ప్రమాదాలలో విద్యార్థులు చనిపోతున్నారని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ఆరోపించారు. బీజేపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు రాము వర్మ ఆధ్వర్యంలో ప్రమాదాలు నివారించాలంటూ తార్నాక చౌరస్తాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హబ్సిగూడలో రెండు వారాల్లోనే వరుస రోడ్డు ప్రమాదాలలో పదో తరగతి విద్యా ర్థిని సాత్విక, ఆరో తరగతి విద్యార్థిని కామేశ్వరి చనిపోవడం చాలా బాధాకర మన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమన్నారు. వెంటనే బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. పోలీసులకు ప్రభుత్వానికి ట్రాఫిక్ చలాన్ల పై ఉన్న శ్రద్ధ ట్రాఫిక్ నియంత్రణపై లేదని అన్నారు. వెంటనే ట్రాఫిక్ సిబ్బందిని పెంచి, స్కూల్ సమయాలలో ప్రతి చౌరస్తా దగ్గర తప్పనిసరిగా ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. హబ్సిగూడ చౌరస్తాలో రోడ్డు వెడల్పు చేసి యూ టర్న్ పెట్టాలని లేకపోతే అండర్ గ్రౌండ్ రోడ్డు ఏర్పాటు చేయాలని, విద్యార్థుల భద్రత కోసం ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన రోడ్లు, చౌరస్తా దగ్గర చిన్న స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలన్నారు. తార్నాకలోని సెంట్ అన్స్ స్కూల్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి లిఫ్ట్‌ను వెంటనే ప్రారంభించాలని కోరారు. రోడ్ల పైన, ఫుట్ పాత్ పైన వ్యాపారులు చేస్తున్న వారి పైన చర్యలు తీసుకోవాలన్నారు. రాంగ్ రూట్లో వస్తున్న వాహనాల వారిని వెనుక నుంచి ట్రాఫిక్ పోలీసులు ఫోటోలు తీస్తున్నారు తప్ప ప్రమాదాల నివారణ పైన చర్యలు లేవని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయ కుడు వెంకటేష్ గౌడ్, రవి ప్రసాద్ గౌడ్, వేణు యాదవ్, కనకట్ల హరి, ప్రకాష్ గౌడ్, మలికంటి వీరన్న శారదా మల్లేష్,సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం

- వినాయక చవితి ఉత్సవాలకు గ్రేటర్ హైదరాబాద్‌లో అన్ని ఏర్పాట్లు చేస్తాం
- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



నవతెలంగాణ-సిటీబ్యూరో

గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి గ్రేటర్ హైదరాబాద్ నగరంలో అన్ని ఏర్పాట్లు చేస్తామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. గణేష్ ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో పోలీస్ శాఖ, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్‌లతో పాటు డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ ఆమ్రపాలి కాట, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులతో గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై సమన్వయ సమావేశం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... నగరంలో వినాయక ఉత్సవాలు, నిమజ్జన్న కార్యక్రమన్ని అందరూ ఆడం బరంగా, సంతోషంగా జరుపుకునేలా జీహెచ్ఎంసీ తరపున కావలసిన అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. భాగ్య నగర్ గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు సూచించిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్నామన్నారు. ప్రతి జోన్‌లో వినాయక నిమజ్జనం జరిగే చెరువులు బేబీ పాండ్స్‌ను పరిశీలించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే శేర్లింగంపల్లి, కూకట్ పల్లి జోన్ లలో క్షేత్ర పరిధిలో తిరిగి అన్ని చెరువులు, బేబీ పాండ్స్, రహదారులను పరిశీలించి, అవసరమైన వసతుల ఏర్పాట్లకు ఆయా అధికారులకు తగు సూచనలు చేశామన్నారు. మిగతా జోన్లలో కూడా ఏర్పాటును పరిశీలిస్తున్నామన్నారు. సెప్టెంబర్ 5వ తేదీలోగా అన్ని పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుని అన్ని సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. అవసరమైన చోట తాత్కాలిక టాయిలెట్స్, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తామని, లైటింగ్ పై ప్రత్యేక ఫోకస్ చేస్తున్నట్లు తెలిపారు. స్టాటిస్టిక్స్, మొబైల్ క్రేన్లు గత ఏడాది కంటే అవసరమైన క్రేన్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రోడ్లపై బారికేడ్, శానిటేషన్, పబ్లిక్ టాయిలెట్స్, ట్రీ కటింగ్, ప్రూనింగ్, ఆరోగ్య శిబిరాలు, బోట్స్, స్విమ్మర్ లు, నిరంతరంగా విద్యుత్తు సరఫరా, వీధి లైట్స్, పాట్ హెూల్స్ పూడ్చడం, అగ్నిమాపక యంత్రాలు, తాగు నీటి సరఫరా తదితర ఏర్పాట్లు చేయనున్నట్లు మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి మాట్లాడుతూ వినాయక చవితి పండుగ సందర్భంగా నగర వాసులు కన్నుల పండుగగా ఉత్సవాలు జరుపుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. గణేష్ ఉత్సవాలు మొదలు నిమజ్జనం పూర్తయ్యే వరకు శానిటేషన్ నిర్వహణ పగడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సీపీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాలు, నిమజ్జనాన్ని పురస్కరించుకొని కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని, అందరి సమన్వయంతో గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించుకుందామన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్, ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వనాథ్ ప్రసాద్, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, రవి కిరణ్, ఉపేందర్ రెడ్డి, వెంకన్న ఆయా శాఖల అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ డివిజన్ ల నుండి వచ్చిన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హరి కథ తెలుగు భాష ప్రాచీన కళా సంపద

నవతెలంగాణ-కల్చరల్

హరికథ తెలుగు భాష కు మాత్రమే సొంతమైన ప్రాచీన కళా సంపద అని విశ్రాంత సివిల్ సర్వీస్ ఉన్నత అధికారి డాక్టర్ కె వి రమణ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ తెలంగాణ హరికథా కళాకారుల సంఘం నిర్వహణలో హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 160 వ జయంతి వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని మాట్లాడుతూ నారాయణ దాసు ఆరంభించిన హరికథా మహా గాన యజ్ఞం శతాబ్ది పైగా కొనసాగుతూ ఈనాటికీ ఎందరికో ఆ కళ ఉపాధి నిస్తోందనీ తెలిపారు. నారాయణ దాసు బహు భాషలలో పండితుడు సంగీతసాహిత్యాలలో అపార జ్ఞాన నిధి అని వివరించారు. హరి కథ బుర్ర కథ నాటకం వంటి ప్రాచీన కళా రూపాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్థన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ జానపద శాస్త్రీయ కళా ప్రదర్శనలు ఎవరు నిర్వహించినా 365 లలో గాన సభ లోని ఏడు ఆడిటోరియంలలో సందర్భాన్ని బట్టి ఒకటీ ఉచితం గా ఇస్తామని చెప్పారు. కిన్నెర సంస్థ స్థాపకులు కిన్నెర రఘురాం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వారం రోజుల పాటు తమ సంస్థ హరికథా సప్తాహం నిర్వహిస్తున్న విశేషాలు తెలిపారు. తెలంగాణ హరికథ కళా కారుల సంఘం అధ్యక్షుడు బి.లక్ష్మీ నారాయణ,విశ్వనాధ జయ రాములు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిరంజీవాచార్యులు భాగవతార్ శ్రీ కృష్ణ రాయబారం హరికథా గానం చేశారు తారక్ మృదంగం పై శశి భూషణ్ రావు వాయులీనం పై సహకరించారు

ఏసీఎస్‌పై జాతీయ సెమినార్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో సీనియర్ ప్రొఫెసర్ ఆచార్య జి.ప్రభాకర్ రెడ్డి పదవీ విరమణ సందర్భంగా "అడ్వాన్స్ ప్రాసెస్ కంట్రోల్ సిస్టమ్స్ " అనే అంశంపై జాతీయ సెమినార్‌ను ఘనంగా నిర్వహించారు. టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చింత సాయిలు అధ్యక్షతన, డిపార్ట్ మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ ఆచార్య ఎస్. శ్రీను నాయక్ కన్వీనర్ గా,డా. సాదం ఐలయ్య ,కో- కన్వీనర్ గా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.యమునారాణి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ ఇన్ అడ్వాన్స్ ప్రాసెస్ కంట్రోల్ అనే అంశంపై గెస్ట్ లెక్చర్ ను ఇచ్చారు. ఆచార్య జి.ప్రభాకర్ రెడ్డిని వివిధ విభాగాల వారు డిపార్ట్మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజనీరింగ్, డిపార్ట్మెంట్ ఆఫ్ టెక్స్టైల్ టెక్నాలజీ , డిపార్ట్మెంట్ ఆఫ్ ఫార్మసీ, విద్యార్థులు, ఉద్యోగులు సన్మానించారు. ఈ సందర్భంగా టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రో. చింత సాయిలు, మాట్లాడుతూ ప్రో. జి.ప్రభాకర్ రెడ్డి తో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఆచార్య జి.ప్రభాకర్ రెడ్డి తమతో పాటే 1997 లో టెక్నాలజీ కళాశాల లో జాయిన్ అయ్యారన్నారు. కళాశా లకు చేసిన సేవలను కొనియాడారు. వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య వి.రమేష్ కుమార్ కార్యక్రమాన్ని సమన్వయం చేసి ప్రాసెస్ డైనమిక్స్ అండ్ కంట్రోల్ ప్రాధాన్యతను, ఆచార్య జి.ప్రభాకర్ రెడ్డి కంట్రోల్ లో ప్రభాకర్ రెడ్డి ప్రావీణ్యం ను కొనియాడారు. టెక్స్టైల్ టెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య జై హయ వదన, కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి, కన్వీనర్ ఆచార్య ఎస్. శ్రీను నాయక్, డిపార్ట్మెంట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆచార్య బి.రాజం, కో- కన్వీనర్ డాక్టర్ సాదం ఐలయ్య, పలువురు ఆచార్యులు ఆచార్య జి ప్రభాకర్ రెడ్డి గురించి మాట్లా డారు. ఈ కార్యక్రమంలో డా.జగన్ రెడ్డి, జి.సుకేషిణి, డా.టి. జ్యోతి, డా. ఎ.కవిత, డా.వి.భాస్కర్, డా.బి.పరమేశ్వర్లు, డా.బి.నారాయణ, డా.సమీ, డా.టి. వెంకటేశ్వర్లు, డా.పి.శ్రీ దుర్గ, డా.విజయ లక్ష్మి, డా. అజిత్, డా.విజయ్ కాంత్, డా. అర్జున్, డా.కె.శ్రీనివాసులు, డా. ధీరజ్, డా.ఎస్ అనిత, డా.అరుణా దేవి,కె.గోపి, కళాశాల ఆచార్యులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం సేవలు అద్వితీయం

- జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య



నవతెలంగాణ-ఓయూ

ఓయూ అర్థశాస్త్ర విభాగ ఆచార్యులు ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం పదవి విరమణ సభ శనివారం ఆర్ట్స్ కాలేజ్ రూమ్ నెంబర్ 133 లో నిర్వహించారు. డాక్టర్ దుబ్బ రంజిత అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథులుగా జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య పాల్గొని ప్రసంగించారు. అట్టడుగు కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి అత్యున్నత మనిషిగా ఎదిగి ఆ అట్టడుగు ప్రజల జీవన విధాన మార్పునకు నిరంతరం శ్రమించారని అతని సేవలు వెలగట్టలేనివి అన్నారు. ఉద్యోగ విరమణ జరిగిన నాటి నుంచి మరింత సమయం దొరుకుతుందని ఆ విలువైన పూర్తి సమయాన్ని సమాజసేవకే అంకితం చేయాలన్నారు .ఓయూ తెలుగు ప్రొ. కాసిం మాట్లాడుతూ విద్యార్థినేతగా, ఆర్టీసీ కార్మిక నేతగా, తెలంగాణ ఉద్యమకారునిగా, దళిత మేధావిగా, ఆర్థిక వేత్తగా, సామాజిక విశ్లేషకునిగా ప్రొఫెసర్ పురుషోత్తం అందించిన సేవలు ఆయనకే సాధ్యమన్నారు. సులువైన గ్రామీణ పేద ప్రజల భాషలో మాట్లాడగల నేర్పు, వారి భాష లోనే రాతలు రాయగలిగే తీరు ఆయనకే సాధ్యమన్నారు. ఆ వరవీడితో విద్యార్థిలోక ముందుకు పోవాలని పిలుపు నిచ్చారు. ప్రధాన వక్తలు పసునూరి రవీందర్, ప్రొ. మల్లేశం, ప్రొ. ఎం. రాములు, ప్రొ. ఐ. డేన్సీ,ప్రొ. లింబాద్రి, ప్రొ. అర్జునరావు,ప్రొ. జహంగీర్, ప్రొ. వంశీధర్, మాట్లాడుతూ ప్రొఫెసర్ పురుషోత్తం సంబంధించిన చైతన్య జ్ఞానం తనకు మరింత ధైర్యం, బలం చేకూరుస్తుందని తెలియజేశారు. ఆయన జీవిత సహచారి రామాభాయ్ అందించిన తోడ్పాటు మరో ఎత్తు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత శివ కుమార్ , జై భీమ్ తిరుపతి, డాక్టర్ కె. యుగేందర్, వలిగొండ నరసింహ, చనగాని దయాకర్, పాల్వాయి నగేష్, ఆర్.ఎన్. శంకర్, ఆంజనేయులు, నలిగంటి శరత్, వరంగల్ రవి , తో పాటు వివిధ విద్యార్థి సంఘాల, ప్రజాసంఘాల నేతలు పాల్గొని ప్రసంగించారు. ఆయన రచించిన దాలి, చేదు నిజం, మాయను గాయాల లాంటి పుస్తకాలు సమాజ మార్పుకు ఎంతో దోహదపడతాయని తెలియజేసారు. ఉస్మానియా విద్యార్థులు, కుటుంబ సభ్యులు మిత్రులు, అభిమానులు కన్నీటితో పదవి వీడ్కోలు పలికారు.

పదవీ విరమణ చేసిన లక్షణ చారికి ఘన సన్మానం



నవతెలంగాణ-కంటోన్మెంట్

పోస్టల్ శాఖలో చిరు ఉద్యోగి గ్రామీణ డాక్ సేవకులుగా చేసిన తందూరి లక్ష్మణ చారి శనివారం పదవి విరమణ చేశారు. చాలీ చాలని వేతనాలతో జీడీఎ గా విధులు నిర్వహించిన కందూరి లక్షణ చారి రెండున్నర సంవత్సరాల క్రితం డిపార్ట్మెంట్‌లో ఎంటీఎస్ సీనియారిటీ ప్రమోషన్ పొంది విరమణ పొందారు. లక్షణ చారి 1982 లో పోస్టల్ శాఖలో గ్రామీణ డాక్ సేవక్ గా ఉద్యోగంలో చేరారు. తాత్కాలిక ఉద్యోగం అయినా లక్షణ చారి ఎంతో సహనంతో ఓపికతో తన వృత్తి రీత్యా జీడీఎస్ పోస్టుమాన్ గా సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో గల తిరుమలగిరి ప్రధాన తపాలా కార్యాలయంలో విధులు నిర్వహిస్తు వచ్చారు.38 సంవత్సరాలుగా పోస్టుమాన్ గా విధులు నిర్వహించగా సుమారు మూడు సంవత్సరాల జీడీఎస్ క్రితం ఎంటీఎస్ అంటే గ్రూప్ డి గా సీనియారిటీ కింద ప్రమోషన్ పొందారు. పదవి విరమణ చేయగా శనివారం తిరుమలగిరి పోస్టల్ సిబ్బంది సన్మాన సభ ఏర్పాటు చేశారు. సభలో పోస్టుమాస్టర్ బి.సత్యనారాయణ, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ నార్త్ డివిజన్ జి.సంపత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస చారి అధ్యక్షతన ఏర్పాటైన ఈ సభలో ముఖ్య అతిథులు సత్యనారాయణ,సంపత్ రెడ్డిలతో పాటు నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ ఎం.టి.ఎస్ సికింద్రాబాద్ డివిజన్ మాజీ కార్యదర్శులు గవ్వల శ్రీనివాసులు, టి.శ్రీనివాస్ రావు, మాజీ అధ్యక్షుడు మూర్తి రాములు, పబ్లిక్ రిలేషన్స్ ఇన్స్పెక్టర్ నర్సింహా రావు తదితరులు పాల్గొని 42 సంవత్సరాల పాటు పోస్టల్ శాఖలో చిరు ఉద్యోగి అయిన కందూరి లక్షణ చారి చేసిన సేవలను కొనియాడారు. ఉత్తరాల బట్వాడాలో కూడా లక్షణ చారి ప్రజల మన్ననలు పొందారని, స్థానిక లయన్స్ క్లబ్ వారు కూడా పలు మార్లు లక్షణ చారిని సన్మానించారని మాజీ కార్యదర్శి టి.శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కందూరి లక్షణ చారి సతీమణి కందూరి మంగతయారు, కుమారుడు కందూరి వంశీ, కోడలు శ్రీప్రియ తదితర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బసవతారకం ఆస్పత్రిలో ఇతర రాష్ట్ర వైద్యులకు శిక్షణ



నవతెలంగాణ-బంజారా హిల్స్

ఇంటర్నేషనల్ డెవలెప్మెంట్ సెంటర్ ఆఫ్ జపాన్ (International Development Center of Japan (IDCJ)), జికా సహకారంతో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చి ఇన్స్టిట్యూట్‌లో తమిళనాడు ప్రభుత్వం ప్రభుత్వ వైద్య శాలలో పని చేసే సర్జికల్ ఆంకాలజిస్టులకు గైనకలాజికల్ క్యాన్సర్ల చికిత్సపై ప్రత్యేక శిక్షణ అందించడానికి ఎంపిక చేసింది.ఇలా ఒక రాష్ట్రంలో పని చేసే వైద్యులకు నైపుణ్య శిక్షణకు బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఎంపిక కావడం సంస్థకు ఎంతో గర్వకారణమని ఈ శిక్షణా కార్యక్రమంలో శస్త్ర చికిత్సకు సంబంధించిన నైపుణ్య శిక్షణతో పాటూ ఈ క్యాన్సర్ల చికిత్స విధానాలకు సంబంధించిన ప్రత్యేక శిక్షణ అందించబడుతుందనీ సంస్థ యజమాన్యం ప్రకటించింది. రెండు వారాల పాటూ అందించే ఈ ప్రతిష్టాత్మకమైన శిక్షణా కార్యక్రమాన్ని జపాన్ అంతర్జాతీయ సహకార ఏజెన్సీ వారి సహకారంతో తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో నాన్ కమ్యూనికబుల్ డిజీసెస్ (అంటువ్యాధి కాని రోగాలు) నియంత్రణ, నివారణ ప్రాజెక్టులో భాగంగా నిర్వహించడం జరుగుతుంది.తద్వారా తమిళనాడు రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధి నివారణ, నియంత్రణకు సంబంధించి అవసరమైన పరిపాలనాపరమైన, వైద్య పరమైన నైపుణ్యాన్ని పెంపొందించాలనేది కార్యక్రమ ప్రధాన లక్ష్యమని దీనికి సంబంధించిన అవగాహన ఒప్పందాన్ని ఇంటర్నేషనల్ డెవలెప్మెంట్ సంటర్ ఆఫ్ జపాన్, జికా తరపున ప్రాజెక్టును అమలు చేస్తున్న సంస్థ, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్స్టిట్యూట్ ల మధ్య జరిగింది.ఈ ఒప్పందం ప్రకారం తమిళనాడు ప్రభుత్వ వైద్యులకు అధికారికంగా BIACH&RI వారు శిక్షణ అందించడానికి వీలు కలుగుతుంది. ఈ ఒప్పందం ప్రకారం మొట్ట మొదటి శిక్షణా కార్యక్రమాన్ని 5 ఆగష్టు 2024 నుండి 30 ఆగష్టు 2024 మధ్య తమిళనాడు ప్రభుత్వ వైద్య శాలల నుండి వచ్చిన 8 మంది ప్రముఖ సర్జికల్ ఆంకాలజిస్టులకు చెందిన రెండు బృందాలకు అందించినట్టు ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ టి సుబ్రహ్మణ్యేశ్వర రావు తెలిపారు. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం కారణంగా ప్రభుత్వ హాస్పిటల్స్ లో ప్రత్యేక నైపుణ్యంతో కూడిన క్యాన్సర్ చికిత్సకు సంబంధించిన చికిత్స మెరుగుపడే అవకాశాలున్నాయని అన్నారు. ప్రపంచంలోనే అత్యున్నత స్థాయి నైపుణ్యాన్ని అందించగలగడం వలన ప్రభుత్వ హాస్పిటల్స్ లో గైనకలాజికల్ క్యాన్సర్స్ తో బాధపడుతున్న వారికి ఎంతో స్వాంతన చేకూరుతుందనడంలో సందేహం లేదని అభిప్రాయపడ్డారు. ఇంతటి మహత్తరమైన కార్యక్రమంలో భాగస్వామి కావడం BIACH&RIకు ఎంతో గర్వకారణమైన విషయమని పేర్కొన్నారు.

టీఎన్జీవోస్,టీజీవోస్ నేతలకు సన్మానం



నవతెలంగాణ- సిటీబ్యూరో

పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శి ఏ.సత్యనారాయణ , సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్ , ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్) , కేంద్ర సంఘ అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వరులు ,ముత్యాల సత్యనారాయణ గౌడ్ , రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణ్ , తెలంగాణ నాలుగో తరగతి సెంట్రల్ అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్ వారి సేవలను గుర్తించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు వెటర్నరీ యూనివర్సిటీ ఉద్యోగులకు శిరసు వంచి ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో పని చేస్తున్న అధికారుల నుంచి నాలుగో తరగతి సమస్యలన్నీ అతి త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నామని తెలిపారు.



హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో వివిధ విభాగాలల్లో పనిచేసిన 29 మంది అధికారులు పదవీవిరమణ పొందారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లోని సీసీసీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాయింట్ సీపీ గజరావు భూపాల్ వారిని ఘంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అకౌంట్ ఆఫీసర్ శ్రీదేవి, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు యన్.శంకర్‌రెడ్డితోపాటు ఆ సంఘం సభ్యులు పాల్గొన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో


ఎస్‌బీఐ చైర్మెన్ శ్రీనివాసులు శెట్టికి శుభాకాంక్షలు



నవతెలంగాణ-సిటీ బ్యూరో

బ్యాంకింగ్ దిగ్గజమైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు నూతన చైర్మెన్‌గా ఇటీవల నియమితులైన శ్రీనివాసులు శెట్టి ని ముంబైలోని ఎస్‌బీఐ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ కోలేటి దామోదర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందించి, శాలువతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి గ్రూప్ చైర్మెన్ యెర్రం విజయ్ కుమార్, వాసవి గ్రూప్ డైరెక్టర్లు సాయి రాజేష్, కౌశిక్ , వైష్ణవి, ఇతరులు కేసీ వెంకటేశ్వర్లు, గంథె సుధాకర్, చార్టెడ్ అకౌంట్ రాజేష్ డొంకేష్ పాల్గొన్నారు.

నేడు పింఛన్ విద్రోహ దినం



నవతెలంగాణ-సిటీబ్యూరో

గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు అండ్ పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలకు నేడు పింఛన్ విద్రోహ దినం నిర్వహిస్తున్నట్టు తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు బి.రవి ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని జిల్లా ఆఫీస్ బేరర్లు, యూనిట్ అధ్యక్షులు, కార్యదర్శులకు ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక, పెన్షనర్, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆలస్య గర్భం, హై రిస్క్ ప్రెగ్నెన్సీలపై అవగాహన



నవతెలంగాణ-సిటీబ్యూరో

మెడికవర్ ఉమన్ అండ్ చైల్డ్ హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో శనివారం ఐటీ కారిడార్లలో మహిళల ఆలస్య గర్భం, హై-రిస్క్ ప్రెగ్నన్సీలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సైబర్ క్రైమ్స్, సీఐడీ డాక్టర్ లావణ్య, విశిష్ట అతిథులుగా విద్యావేత్త-మహిళా సాధికారత, బాలల హక్కులు, వ్యాపారవేత్త, కంటెంట్ క్రియేటర్ ఆంచల్ బన్సల్, టీఏఓ డిజిటల్ సొల్యూషన్స్ అసోసియేట్ డైరెక్టర్-హెచ్‌ఆర్ లావణ్య వల్లూరి హాజరయ్యారు. ఈ సందర్భంగా గర్భిణులకు మాతదేవోభవ ప్రత్యేక డెలివరీ ప్యాకేజీని విడుదల చేశారు. అనంతరం లావణ్య మాట్లాడుతూ స్త్రీ తన జీవితంలో అనుభూతి చెందే అతిముఖ్యమైన వాటిలో గర్భం దాల్చడం ఒకటి అన్నారు. గర్భాధారణ సమయంలో సరైన నియమాలను పాటించకపోతే తల్లి ఆరోగ్యానికి నష్టం కలిగే అవకాశం ఉంటుందన్నారు. డాక్టర్ ఎస్‌వీ.లక్ష్మి మారుతున్న జీవనశైలి, లేటు వయస్సు పెళ్లిళ్ల వల్ల మొదటి సారి గర్భం దాల్చడానికి ప్రయత్నిస్తున్న వారు 30 ఏండ్ల లోపు ప్రయత్నించాలన్నారు. వయస్సు ఎక్కువతున్న కొద్దీ సంతానోత్పత్తి స్థాయిలు తగ్గుతాయన్నారు. పురుషుల్లో స్పెర్మ్ మహిళల్లో అండాల నాణ్యత వయసుతోపాటు తగ్గుతూ వస్తుందన్నారు. ఇది ముఖ్యంగా ఇప్పుడు మహిళలు ఎదురుకుంటున్న సమస్యలు అనీ, దీనివల్ల ప్రసవాలు హై రిస్క్‌తో కూడుకుంటున్నాయని తెలిపారు. మెడికవర్ హాస్పిటల్స్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మహేష్ దెగ్లూర్కర్ మాట్లాడుతూ 'అత్యాధునిక వైద్యసేవలు, అనుభవజ్ఞులైన వైద్యులు గల తమ హాస్పిటల్స్‌లో స్త్రీలు, పిల్లలు, నెలలు నిండకుండా పుట్టిన పిల్లలకి నాణ్యమైన వైద్య సేవలనందిస్తూ అనతికాలం లోనే పేరు గడించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోనాటాలజీ, పీడియాట్రిక్స్ హెచ్‌ఓడీ డాక్టర్ రవీందర్‌రెడ్డి పరిగె, డాక్టర్ ఎస్‌వీ.లక్ష్మి, డాక్టర్ మీనాక్షి, డాక్టర్ సవిత రాథోడ్, సెంటర్ హెడ్ కృష్ణ ప్రసాద్, ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'రీ-సస్టైనబిలిటీ' రీ బిగ్ గ్రీన్ గణేశ వేడుకలు





నవతెలంగాణ-సిటీబ్యూరో

అవార్డు గెలుచుకున్న గ్రీన్ గణేశ కార్యక్రమం 17వ ఎడిషన్ బిగ్ గ్రీన్ గణేశ కోసం 92.7 బిగ్ ఎఫ్‌ఎంతో తమ భాగస్వామ్యాన్ని కొనసాగిస్తున్నామని రీ సస్టైనబిలిటీ లిమిటెడ్ (ఆర్‌ఈఎస్‌ఎల్) వెల్లడించింది. వత్తాకార ఆర్థిక వ్యవస్థలో అంతర్జాతీయంగా అగ్రగామిగా, రీ సస్టైనబిలిటీ ఈ కార్యక్రమాన్ని మిషన్ లైఫ్ ప్రోగ్రాంకు అనుగుణంగా తీర్చిదిద్దింది. ఈ కార్యక్రమం కమ్యూనిటీలను నిమగ్నం చేస్తుంది. ఈ ఏడాది ఈ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా 15వేలకు పైగా పర్యావరణ అనుకూలమైన విత్తన గణేశ విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ విగ్రహాల్లో విత్తనాలు, ఎరువును పొందుపరిచారు. రీ సస్టైనబిలిటీ కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా నటుడు, ఈ వార్షిక కార్యక్రమానికి దీర్ఘకాల మద్దతుదారు సుధీర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా సస్టైనబిలిటీ సస్టైనబిలిటీ మేనేజింగ్ డైరెక్టర్ గౌతం రెడ్డి మాట్లాడుతూ 'సస్టైనబిలిటీ అవకాశం కాదు, మనకు, రాబోయే తరాలకు సురక్షితమైన భవిష్యత్‌ను నిర్ధారించడం కోసం మనం స్వీకరించాల్సిన బాధ్యత. రీ బిగ్ గ్రీన్ గణేశ వంటి కార్యక్రమాల ద్వారా, నీటి కాలుష్యాన్ని ఎదుర్కోవడంలో రీ సస్టైనబిలిటీ గణనీయమైన పురోగతిని సాధిస్తోంది' అని అన్నారు. సీఈఓ మసూద్ మల్లిక్ మాట్లాడుతూ 'ఈ ఏడాది మా ప్రతిష్టాత్మక కార్యక్రమం, భవిష్యత్ తరాలకు ప్రకృతిని సంరక్షించే దిశగా బాధ్యత తీసుకోవాల్సిన సందేశాన్ని ముందుకు తీసుకువెళ్తుంది. కొత్త మొక్కల ఎదుగుదలకు తోడ్పడే గణేశ విగ్రహాలను అందించడం, కాగితం, ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడం ద్వారా, పరిశుభ్రమైన, హరిత భారతావనిని సష్టించాలనే మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాం' అని తెలిపారు.

నిమ్స్ ఉద్యోగుల పదవీ విరమణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

పంజాగుట్ట నిమ్స్ హాస్పిటల్‌లో ఉద్యోగం చేస్తున్న పలువురు శనివారం పదవీ విరమణ చేశారు. హాస్పిటల్ మొదటి అంతస్తులోని లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ రిజిస్టర్ వారిని ఘనంగా సత్కరించి, వారు హాస్పిటల్‌కు అందించిన సేవల్ని కొనియాడారు.

పదవీ విరమణ పొందిన వారిలో డిప్యూటీ రిజిస్టర్ పి.రాజ్ కుమార్, సీనియర్ మెడికో సోషల్ వర్కర్ పార్వతి, ఇందిరా, ఎక్సరే టెక్నీషియన్ ఆనంద్ రావు, సెక్రటేరియల్ అసిస్టెంట్ విజయ లక్ష్మి, నర్సింగ్ ఆఫీసర్లు సత్య, గీత ఉన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ సూపరింటెంట్ డా. లక్ష్మి భాస్కర్ గారు, ఎగ్జిక్యూటివ్ రిజిస్టర్ డా. శాంతీవీర్ గారు, ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కారం రవీందర్ రెడ్డి, ముఠా గోపాల్ శాసన సభ్యులు , మరియు వివిధ ఉద్యోగుల సంఘ నాయకులు , ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని పదవీ విరమణ చేస్తున్నటువంటి తోటి ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.

విద్యా విధానంపై అవగాహనా వాక్



నవతెలంగాణ-సిటీబ్యూరో



డాక్టర్ మరియా మాంటిస్సోరీ జన్మదినాన్ని పురస్కరించుకుని మాంటిస్సోరీ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ 40 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ట్రస్ట్, అసోసియేషన్ మాంటిస్సోరీ ఇంటర్నేషనల్ సంయుక్తంగా శనివారం నగరంలో మాంటిస్సోరీ వాక్ నిర్వహించారు. మాంటిస్సోరీ కాన్సెప్ట్‌పై అవగాహన తీసుకురావడానికి నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగరంలోని 20కి పైగా మాంటిస్సోరీ పాఠశాలల నుంచి దాదాపు 300 మంది పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు. సంజీవయ్య పార్క్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి మాంటిస్సోరీ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ ట్రైనింగ్ డైరెక్టర్ టీనాజ్ రిపోర్టర్ నాయకత్వం వహించి మాట్లాడారు. నగరంలోని మాంటిస్సోరీ కమ్యూనిటీ నుంచి వచ్చిన అపూర్వమైన స్పందన తమకు ఉత్సాహాన్ని నింపిందన్నారు. మాంటిస్సోరీ కాన్సెప్ట్, డాక్టర్ మరియా మాంటిస్సోరీ వారసత్వాన్ని కొనసాగించడానికి పిల్లలు, పెద్దలు కలిసి రావడం ఆనందంగా ఉందన్నారు.

కబ్జా చేసిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి



● ప్రజాశక్తి సోషల్ ఆర్గనైజేషన్ సభ్యులు ఏకాంత్ గౌడ్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

బాగ్ అమీర్ గ్రామ ప్రభుత్వ సర్వే నెంబర్ 70లోని 201 గజాల ప్రభుత్వ (స్మశాన వాటిక) స్థలం కబ్జా చేసిన నిఖిలేశ్వర బిల్డర్స్, ప్లాట్ యజమాని పై విచారణ జరిపి క్రిమినల్ కేసు నమోదు చేయాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం నాయకులు ప్రజాశక్తి సోషల్ ఆర్గనైజేషన్ సభ్యులు ఏకాంత్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం కూకట్‌పల్లి డిప్యూటీ కమిషనర్ కృష్ణయ్యను ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు ఏకాంత్ గౌడ్ మాట్లాడుతూ వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని ఎ ఎస్.రాజు నగర్లోని కూకట్‌పల్లి సర్వే నెంబర్ 166, ప్లాట్ నెంబర్ 83, లేఔట్ ప్రకారం 599 గజాలు కాగా ప్రభుత్వ స్థలం 201 గజాలు కలుపుకొని కొంతమంది రెవిన్యూ అధికారుల సహకారంతో యుఎల్సి పొంది, జీహెచ్‌ఎంసీ నుంచి ఫైల్ నెంబర్ 005817/ జీహెచ్‌ఎంసీ / 3125 / కెపిఎల్ 2 / 2021 బిపి, పర్మిట్ నెంబర్ 2541 / జీహెచ్‌ఎంసీ / కేపీఎల్ / 2022 -బిపి ప్రకారం మంజూరు చేయడం జరిగిందని ఆరోపించారు. బాగ్ అమీర్ గ్రామ ప్రభుత్వ స్థలం సర్వే నెంబర్ 70 లో (స్మశాన వాటిక) నిర్మాణానికి సంబంధించిన అనుమతి మంజూరు విషయంలో మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కి, కూకట్ పల్లి మండల తహసీల్దార్ కి పిర్యాదు చేయగా కూకట్‌పల్లి మండల తహసీల్దార్, పూర్వ ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి విచారణ జరిపి 201 గజల ప్రభుత్వ స్థలాన్ని పలువురు కబ్జా చేయడం జరిగిందని తహసీల్దార్ నిర్ధారించి కూకట్‌పల్లి డిప్యూటీ కమిషనర్‌కు శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని లేఖ రాశారన్నారు. స్థానిక రెవిన్యూ కూకట్‌పల్లి సర్కిల్ -24 మున్సిపల్ అధికారులలోని కొంతమంది అధికారుల సహకారంతో డెవలపర్ (నిఖిలేశ్వర బిల్డర్స్) పి.రాంబాబు కోర్టు ను తప్పుదోవ పట్టించి కోర్టు కేసులో " స్టేటస్ కో " ఉన్న నిర్మాణం పూర్తి చేసినట్టు ఆరోపించారు. ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందన్నారు. బాగ్ అమీర్ గ్రామ ప్రభుత్వ సర్వే నెంబర్ 70 లోని ప్రభుత్వ (స్మశాన వాటిక) స్థలం 201 గజల స్థలాన్ని తిరిగి ప్రభుత్వం తమ అధీనంలోకి తీసుకోవాలని డెవలపర్ నిఖిలేశ్వర బిల్డర్స్ (జి. రాంబాబు), యజమాని పి. శ్రీనివాస్ రెడ్డి పై క్రిమినల్ కేసులు నమోదు చేసి ఇందుకు సహకరించిన అధికారుల పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఏకాంత్ గౌడ్ డిమాండ్ చేశారు.

పాఠశాల డాట్ ఇన్‌ను కొనుగోలు చేసిన స్కూల్‌నాట్ డాట్ కామ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎడ్యుకేషన్ టెక్నాలజీలో ప్రముఖ ప్లాట్‌ఫామ్ స్కూల్‌నాట్ డాట్ కామ్ స్కూల్ ఈఆర్‌పీ సొల్యూషన్స్ సెక్టార్‌లో ప్రముఖ పేరు అయిన పాఠశాల డాట్ ఇన్‌ను కొనుగోలు చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ వ్యూహాత్మక చర్య ఎండ్ టెక్ పరిశ్రమలో ఆధిపత్య శక్తిగా స్కూల్‌నాట్ డాట్ కామ్ స్థానాన్ని పటిష్టం చేయనుంది. ఈ సందర్భంగా స్కూల్‌నాట్ డాట్ కామ్ సికేందర్ షేక్ మాట్లాడుతూ పాఠశాల డాట్ ఇన్ సముపార్జన తమకు రూపాంతరమైన క్షణం అన్నారు. తమ ఫీచర్లు, సేవలను మెరుగుపరచడానికి అనుమతిస్తుందని తెలిపారు. భవిష్యత్ క్లయింట్లతో తమకు ఎక్కువ విలువను అందజేస్తోందన్నారు. పాఠశాల.ఇన్ సహ-వ్యవస్థాపకుడు అనిల్ మంగళంపల్లి మాట్లాడుతూ 'సముపార్జన వినియోగదారు ఇంటర్‌ఫేస్‌ను మెరుగుపరచడమే కాకుండా మొత్తం అనుభవాన్ని మెరుగుపరుస్తుంది. సాంకేతిక పురోగతి, క్లయింట్ సంతృప్తికి స్కూల్‌నాట్ డాట్ కామ్ నిబద్ధతను బలపరుస్తుంది' అని చెప్పారు. స్కూల్‌నాట్ డాట్ కామ్ సీటీఓ సతీష్ సావ్రా మాట్లాడుతూ 'పాఠశాల ఇన్ ఇంటిగ్రేషన్ అత్యాధునిక ఫీచర్లను తక్షణమే అందజేస్తుంది. ఇప్పటికే ఉన్న మా ఖాతాదారులకు మనశ్శాంతిని అందిస్తుంది. ఉన్నతమైన భద్రతా చర్యలకు భరోసానిస్తుంది' అని తెలిపారు. పాఠశాల డాట్ ఇన్ సీఈఓ విజయ మాచవోలు మాట్లాడుతూ 'మా నైపుణ్యం, స్కూల్ నాట్ డాట్ కామ్ వినూత్న పరిష్కారాల కలయిక నిస్సందేహంగా మా ఖాతాదారులకు అసాధారణమైన విలువను అందజేస్తుంది' అని తెలిపారు.

IN THE COURT OF HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: MAKAJGIRI
I.A. No. 97 OF 2022
IN
O.S No. 2104 OF 219 (OLD)
NEW O.S NO. 98 OF 2022

BETWEEN:
K. SUDARSHAN REDDY S/o. Late K. Raghava Reddy, Aged about 55 years, Occ: Business, R/o H.No. 2-4-76, Hanuman Tekdi, Macha Bollaram, Secunderabad-500010
...Petitioner/Defendant
AND
G.B. SRINIVAS RAO
...Respondent/Plaintiff

To,
G.B. Srinivas Rao, S/o. Late G Bhagawan Rao, Occ: Business, R/o.plot no,356, Gayaithri Nagar, Borabanda, Hyderabad-500018

Please take notice that the above Plaintiff above I.A 97/2022 in Suit against you for perpetual injunction and the said suit is posted on 10-09-2024 at 10:30 am for your appearance either inperson or through an advovate other vise the matter will be adjudicated in your absence as per law.

(BY ORDER OF THE COURT)
K. BUCHI BABU
Advocate,
Flot No. 205,2 nd Floor,
Mehtab Arcade Tarnaka,
Secunderabad-5000 017
Cell:9246373807

అర్హత ఉన్నవారికి రుణమాఫీ అందేలా చూస్తాం

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



నవతెలంగాణ-తుర్కయంజాల్

అర్హత ఉన్న ప్రతీ రైతుకు రుణమాఫీ అందేలా చూస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. తొర్రూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో టెస్కాబ్ వైస్ చైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని 9 సొసైటీల సీఈఓలు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డితో కలిసి రైతు రుణ మాఫీపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తర్వాత ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి సంబంధించిన 9 సొసైటీలలో బకాయి ఉన్న రుణ మాఫీపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఉన్నతాధికారులతో మాట్లాడి అర్హత ఉన్న ప్రతి రైతుకూ రుణ మాఫీ అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

అప్రమత్తంగా ఉండాలి

సిబ్బందిని ఆదేశించిన జలమండలి ఎండీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలోని జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్(గండిపేట), హిమాయత్ సాగర్ రిజర్వాయర్లకు వరద నీరు చేరుతోంది. ఈ క్రమంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. నగరంలో కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని శనివారం అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు (ఈఆర్టీ), ఎస్పీటి వాహనాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తరచూ సీవరేజీ ఓవర్ ఫ్లో అయ్యే మ్యాన్‌హోళ్లు గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నీరు నిలిచే ప్రాంతాలపైన ఈ బృందాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. మరో మూడు రోజులు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో మూసీ నది పరివాహక ప్రాంతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జలమండలితో పాటు వివిధ శాఖల అధికారులకు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సూచించారు.

మానవ అక్రమ రవాణాను

అడ్డుకోవడంలో సమర్థవంతంగా పనిచేయాలి

- రాచకొండ సీపీ సుధీర్ బాబు



నవతెలంగాణ-సిటీబ్యూరో

అక్రమ రవాణాను అడ్డుకోవడం కోసం మరింత సమర్థవంతంగా పనిచేయాలని రాచకొండ సీపీ సుధీర్ బాబు అన్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్.చంద్రబాబు రాచకొండ పరిధిలో మానవ అక్రమ రవాణా నిరోధం కోసం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా 2024లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ పనితీరు కనబరచినందుకుగాను, తెలంగాణ ఉమెన్ సేఫ్టీ వింగ్‌లో జరిగిన రెండు రోజుల సెమినార్‌లో మిస్టర్ డి జెలాలం టఫస్సే, చీఫ్ ఆఫ్ ఫీల్డ్ ఆఫీస్, యునిసెఫ్ ఇండియా నుండి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నేరెడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో ఇన్‌స్పెక్టర్ చంద్రబాబును సీపీ సుధీర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. మానవ అక్రమ రవాణాను అడ్డుకోవడం కోసం మరింత సమర్థవంతంగా పనిచేయాలని, నూతన విధానాలు అవలంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ఎస్ఓటి మురళీధర్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - ఎల్బీనగర్

ఎల్బీనగర్‌లోని సరూర్ నగర్ చెరువుకు పెద్ద చరిత్రే ఉంది. ఇది నైజాం కాలంలో నిర్మించారు. తాగునీటి అవసరాల కోసం నైజాం రాజు దాదాపు 100 ఎకరాల్లో చెరువును నిర్మించారు. నగరంలో జనాభా పెరగడంతో జన నివాసం పెరగడంతో చెరువులు, కుంటలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం చెరువులు, కుంటలు, నాలాలను రక్షించి భావితరాల వారికి అందించాలనే ఉద్దేశ్యంతో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ అసెట్ ప్రొడక్షన్ ఏజెన్సీ(హైడ్రా)ను ఏర్పాటు చేసింది. 40ఏండ్ల నుండి కబ్జాలకు గురైన చెరువు భూములను రక్షించడానికి ప్రభుత్వం నడుం బిగించింది. నగరంలో 182 చెరువులు ఉన్నాయి. ఇవన్నీ జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉన్నాయి. వీటిని రక్షించడానికి హైడ్రా నడుం బిగించింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు వెలిశాయి. ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ లో నిర్మించిన భవనాలను నేల మట్టం చేస్తూ హైడ్రా అదలెత్తించడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు హైడ్రాను అభినందిస్తున్నారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హైడ్రాను రాష్ట్రవ్యాప్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఒక నగరంలోనే కాదు మొత్తంగా అనేక జిల్లాలో, మండలాలలో, గ్రామాలలో చెరువులు కుంటలు కబ్జాకు గురయ్యాయని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి హైడ్రా నగరానికి ఔటర్ రింగ్ రోడ్డు పరిధి వరకు విస్తరించిది.

ఎల్బీనగర్ పరిధిలోని సరూర్‌నగర్ చెరువును దాదాపు 100ఎకరాల్లో నైజాం రాజు నిర్మించారు. ప్రజల దాహార్తి తీర్చడం కోసం ఈ చెరువును నిర్మించారు. అపార్ట్‌మెంట్లు, ఇండ్లు సరూర్‌నగర్ చెరువు చుట్టూ రావడంతో చెరువు భూమి కనుమరుగైంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అనేక నిర్మాణాలు కాలనీలు రావడంతో సరూర్ నగర్ చెరువు స్వరూపమే మారిపోయింది. సరూర్ నగర్ చెరువు మురికి కుపంగా మారిపోయింది. దాదాపు 100 ఎకరాల చెరువు ప్రస్తుతం 45 ఎకరాలకే పరిమితం అయిపోయింది. దాదాపు 60ఎకరాల చెరువు భూమిని మింగేశారు. అనేకమంది అమాయకులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ప్లాట్లు కొనుక్కొని నిర్మించుకున్నారు. వీరి వెనుక రాజకీయ నాయకులు ముందు ఉండి నడిపించారు. బ్యూటిఫికేషన్ పేరుతో చెరువు పరిధిని గణనీయంగా కుదించారు. చెరువు దాదాపు 56% కబ్జాకు గురైపోయింది. చెరువు చుట్టూ సింగరేణి కాలనీ, సైదాబాద్, గ్రీన్ పార్క్ కాలనీ, తపోవన్ కాలనీలు ఉన్నాయి. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో కాలనీలు వెలిశాయి. ఐదు అంతస్తుల భవనాలు కూడా నిర్మించారు. ఇండ్ల నిర్మాణాలు చేపట్టారు. రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రత్యక్షంగా పరోక్షంగా అక్రమ నిర్మాణాలకు సహకారాన్ని అందించడంతో చెరువు భూమి కబ్జాకు గురైంది. హైడ్రా ఎందుకు దృష్టి పెట్టడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా హైడ్రా అధికారులు సరూర్ నగర్ ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ పరిధిని నిర్ధారించి మార్కింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. సరూర్‌నగర్ కార్పొరేటర్ శ్రీవాణి సరూర్ నగర్ చెరువు పరిరక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. హైడ్రా అధికారులు కబ్జా కోరాల నుండి సరూర్‌నగర్ చెరువును రక్షిస్తారా లేదా వేచి చూడాలి.



సరూర్ నగర్

చెరువు భూమిని కాపాడేది ఎవరూ..?





సరూర్ నగర్ చెరువు భూమిని హైడ్రా రక్షిస్తుందా..?

సరూర్ నగర్ చెరువును రక్షించాలి

హైడ్రా సరూర్ నగర్ చెరువును ఎందుకు పటించుకోవడం లేదు. హైడ్రా రాజకీయ వత్తిడికి గురి కావొద్దు. కబ్జాకు గురైన సరూర్‌నగర్ చెరువును రక్షించాలి. - కార్పొరేటర్ శ్రీవాణి

చెరువును రక్షించి.. భావితరాలకు అందించాలి

సరూర్‌నగర్ చెరువును రక్షించి.. భావితరాలకు అందించాలి. సరూర్ నగర్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అక్రమంగా నిర్మాణం జరిగింది. హైడ్రా వెంటనే రంగంలోకి దిగి ఎఫ్‌టీఎల్ మార్కింగ్ చేయాలి.

చంపాపేట్ రాజకీయ నాయకులు అనిల్

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని కుర్మలగూడ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం కార్మిక కర్షక కాంగ్రెస్ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం కాలనీలోని పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేసినట్టు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయన్నారు. రోజు వారీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్న ఈ ప్రాంతంలో ఇలాంటి సేవా కార్యక్రమం చేపట్టడం వారికి కొంత ఊరట నిచ్చే విధంగా ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో పేదలు ఉండే స్థలాన్ని గుర్తించి అక్కడ కూడా వారికి వీలైన మేరకు సహాయం చేయడానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక కర్షక కాంగ్రెస్ చైర్మెన్ కౌశల్ సమీర్, ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, పింగళి సంపత్ రెడ్డి, మల్లేష్, మైన, ఆనంద్ రెడ్డి, కుల్లా జంపయ్య, కుమార్, సాధక్, హరి, వికాస్ ఫౌండేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగోల్‌ను క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్



నవతెలంగాణ - నాగోల్

నాగోలు డివిజన్‌ను క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం అని కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ నాథ్ యాదవ్ అన్నారు. ఇటీవల బదిలీపై వచ్చిన శానిటేషన్ డీఈ నీలిమను కార్పొరేటర్ శనివారం నాగోల్ డివిజన్‌లోని నాగోల్ వార్డు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాగోల్ డివిజన్ పరిధిలోని కాలనీలలో డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని.. వాటిపై ప్రత్యేక చొరవ తీసుకొని ఎప్పటికప్పుడు ఆ సమస్యలను పరిష్కరించాలని అన్నారు. డివిజన్ ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని డీఈని కోరారు. నాగోలు డివిజన్‌ను క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్ది, డివిజన్ ప్రజలకు ఒక పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడమే తమ లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకు అధికారులు, సంబంధిత సిబ్బంది సహకరించాలని సూచించారు. రానున్న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని డివిజన్ పరిధిలోని గణపతి మండపాల వద్ద పారిశుద్ధ్యం లోపించకుండా అక్కడ ఏరోజుకు ఆరోజుకు పేరుకుపోయిన చెత్తను తరలించాలన్నారు. అదేవిధంగా మండపాల వద్ద అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ రవీంద్ర బాబు, జవాన్ లక్ష్మయ్య, ఎస్ఎఫ్ఏ శ్రీనివాసచారి, వెంకటస్వామి, తన్వీర్, రవి, కుమార్, మహిపాల్ రాంకీ సూపర్వైజర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పథకాలను పక్కదోవ పట్టించేందుకే హైడ్రా

- బీజేపీ నేతలు



నవతెలంగాణ - హయత్‌నగర్

కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను పక్కదోవ పట్టించేందుకు గాను హైడ్రాను తీసుకొచ్చారని బీజేపీ నేతలు ఆరోపించారు. మన్సూరాబాద్‌లో ఉన్న రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అర్బన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఎఫ్‌టీఎల్ పరిధిలలో 30 సంవత్సరాలుగా టాక్స్ కడుతూ నివాసం ఉంటున్న పేదల ఇండ్లను హైడ్రా కూల్చడం సరికాదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారని చెప్పారు. పేదల ఇండ్లను కూల్చివేస్తున్న అధికార కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దలకు మాత్రం నోటీసులతో సరిపెడుతుందని ఆరోపించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటి వరకు ఒక్కటంటే ఒకటే పథకం అమలు చేశారని, మిగతా ఐదింటిని గాలికి వదిలేశారని మండిపడ్డారు. వీటిని పక్కదారి పట్టించేందుకు గాను నగరంలో హైడ్రాను తెచ్చారని అన్నారు. ఎంఐఎం పార్టీ నేతలది, బీఆర్ఎస్ నేతలది హైడ్రా ఎందుకు కూల్చకుండా వదిలేస్తుందో సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గతంలో ఎల్బీనగర్‌లో 10వేల మంది భూ రిజిస్ట్రేషన్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నా ప్రస్తుత ముఖ్యమంత్రి అప్పటి మల్కాజిగిరి ఎంపీ రేవంత్ రెడ్డి ఎందుకు పరిష్కారం చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. హైడ్రా పేదల ఇండ్లను కూల్చివేసేముందు వారికి ప్రత్యమ్నాయ మార్గాలు చూపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎల్బీనగర్ బీజేపీ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, రంగ నర్సింహ గుప్తా, ప్రేమెందర్ రెడ్డి, నాయి కోటి పవన్ కుమార్, బీజేపీ నేతలు రవీందర్ గౌడ్, చింతల సురేందర్ యాదవ్, పంగ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ - నాగోల్

నిరుపేదల ఆడబిడ్డల వివాహాల కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కల్యాణ లక్ష్మి ఆర్థిక సహాయాన్ని పెండ్లి సమయంలోనే కళ్యాణ మండపంలో అందిస్తే వారికి ఎంతో ఉపయోగపడుతుందని, దీనిపై ప్రభుత్వం ఆలోచిస్తే బాగుంటుందని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్ అన్నారు. నాగోలు డివిజన్లోని లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కులను శనివారం కార్పొరేటర్ అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆడబిడ్డ పెండ్లికి తులం బంగారం ఇస్తామన్న ముఖ్యమంత్రి..ఇప్పుడు ఆ ఊసేలేదని, ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన 6 గ్యారెంటీలు నెరవేర్చకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

ప్రజలకు సురక్షిత నీరందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే బలాల



నవతెలంగాణ - మలక్‌పేట్

ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం అని ఎమ్మెల్యే బలాల అన్నారు. మలక్‌పేట్‌లోని చౌని డివిజన్ పరిధిలో శనివారం రూ.26 లక్షల వ్యయంతో సురక్షిత తాగు నీరు ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. మలక్ పేట్ ప్రాంత వాసులు ఈ నీటిని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం 33 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. రానున్న కాలంలో మలక్‌పేట్‌లోని అన్ని ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు వేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చౌని డివిజన్ కార్పొరేటర్ సలాం షాహిద్, జీహెచ్ఎంసీ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.



కొత్తపేట శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో పూలతో లక్ష్మి సహస్ర నామాలు సామూహిక శ్రీ దేవి కడ్గమల స్తోత్ర పారాయణం మంత్ర పుష్ప నీరాజనం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మంజుల రాజు, రామ్ నారాయణ, పుర్షోత్తం గుప్త, నీల శ్రీధర్, రమణయ్య, లోకేష్ గుప్తా, భువనగిరి శ్రీనివాస్, వడ్డేపల్లి అంజయ్య స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ -నాగోల్

బెట్టింగ్‌లతో అప్పులు.. యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-నాగోల్



బెట్టింగుల కోసం అప్పులు చేసి వాటిని తీర్చలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. నాగోల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వీ.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగోలు డివిజన్ సాయినగర్‌లో నివాసం ఉంటున్న కనుమంత్ రెడ్డి సందీప్(25) అనే యువకుడు స్విగ్గిలో కొంతకాలం పనిచేశాడు. శుక్రవారం రాత్రి భోజనం చేసి పడుకున్న సందీప్ రెడ్డి ఉదయం వరకు లేవకపోవడంతో గమనించిన తల్లి శోభ మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో వెళ్లి చూడగా ఇంటి పైకప్పుకు ఉరి వేసుకుని ఉన్నాడని, దీంతో తల్లి చుట్టుపక్కల వారికి విషయం తెలిపి చూడగా అప్పటికే చనిపోయినట్లు గుర్తించారు. ఈ మధ్యకాలంలో బెట్టింగులకు అలవాటు పడి పని మానేశాడు. బెట్టింగులు ఆడుతూ అప్పులు చేశాడని, దీంతో అప్పులు తీర్చడానికి సొంత ఊర్లో ఉన్న భూమి పాసు బుక్కులను పెట్టి లోన్ ఇప్పిస్తే అప్పులు తీర్చుకుంటానని ఆ యువకుడు అన్నట్టు తల్లి శోభ చెప్పారని పోలీసులు తెలిపారు. బెట్టింగులు ఆడి అప్పులు చేసి వాటిని తీర్చలేకే నా కొడుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడని, నా కొడుకు మృతి పట్ల ఎవరిపై అనుమానాలు లేవని తల్లి శోభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వినాయక ఉత్సవాలను

శాంతియుతంగా నిర్వహించుకోవాలి : డీసీపీ సునీతరెడ్డి



నవతెలంగాణ-తుర్కయంజాల్

వినాయక ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని మహేశ్వరం జోన్ డీసీపీ సునీతరెడ్డి సూచించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని తుర్కయంజాల్‌లోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో శనివారం ఆదిభట్ల పోలీసు వారి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాన్ని ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ సమితి నిర్వాహకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్వరం జోన్ డీసీపీ సునీతరెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు సెప్టెంబర్ 7 ప్రారంభమై 17వ తేదీన నిమజ్జనంతో ముగిసే అవకాశం ఉందన్నారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసే భక్తులు, నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో సురక్షిత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరారు. వినాయక నిమజ్జనం జరిగే తుర్కయంజాల్ మాసాబ్‌చెరువు వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సాగర్ రహదారిపై రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, ట్రాఫిక్ సిబ్బంది నిరంతర పర్యవేక్షణ జరపాలన్నారు. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటిస్తూ మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి మండపం ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గణేష్ నిమజ్జనానికి పోలీసులు, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, విద్యుత్ శాఖతో అన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ సమావేశంలో తుర్కయంజాల్ మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, అబ్దుల్లాపూర్‌మెట్ ఎమ్మార్వో సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సీఐ, తుర్కయంజాల్ మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కల్యాణ్‌నాయక్, కౌన్సిలర్లు, మర్రి మాధవి, కుంట ఉదయశ్రీ, నక్క శివలింగం, బీజేపీ సీనియర్ నాయకులు బోసుపల్లి ప్రతాప్, బచ్చిగళ్ల రమేష్, కాంగ్రెస్ నాయకులు మేతరి దర్శన్, మర్రి మహేందర్ రెడ్డి, ఉత్సవ కమిటీ నిర్వహకులు పాల్గొన్నారు.



లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్

నవతెలంగాణ-హస్తినాపురం

భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా హస్తినాపురం డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. లోతట్టు ప్రాంతాలైన ఏపీ ఎస్ సిబి కాలనీ, ద్వారక తిరుమల కాలనీ, రెడ్డి కాలనీ, సాగర్ ఎంక్లేవ్ కాలనీ, పోచమ్మ గడ్డ కాలనీలలో జీహెచ్ఎంసీ ఏఈ మల్లికార్జున్, వాటర్ వర్క్స్ మేనేజర్ సురేష్, మాన్సూన్ టీంతో కలిసి ఆయా కాలనీలో శనివారం కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షాకాల దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అవసరం ఉన్నచో అధికారులకు కానీ తమకు గానీ ఫోన్ చేస్తే అక్కడికి వచ్చి వెంటనే సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటికి రావాలని ఆయా కాలనీల వాసులను కోరారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో భారీ వర్షాలు వచ్చినా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ బిక్కు నాయక్, సత్యనారాయణ, శ్రీకాంత్ రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జీవితమే నా కవిత్వం

సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలపై తన కలాన్ని ఝుళిపిస్తోంది. భరించలేని బాధ నుండి ఆమె కవితలు పుట్టుకొస్తాయి. రాయకుండా ఉండలేనితనం ఆమెతో అక్షరాలు రాయిస్తుంది. ఆ అక్షరాలనే ఆయుధాలుగా మలిచి వివక్షను ప్రశ్నిస్తున్నారు. అంటరానితనాన్ని నిలదీస్తున్నారు. అసమానతలను ధిక్కరిస్తున్నారు. అక్షరంతో సమాజంలోని రుగ్మతలకు వైద్యం చేస్తున్నారు. ఆమే సాహిత్య లోకానికి వైష్ణవిశ్రీగా పరిచయమైన రోష్ని. ఈ రోజు దాసరి శిరీష జ్ఞాపిక అందుకోబోతున్న సందర్భంగా ఆమె పరిచయం నేటి మానవిలో...





నేను పుట్టింది కృష్ణా జిల్లాలోని హనుమాన్‌జంక్షన్. అమ్మ లతీఫున్, నాన్న అజీజ్. అమ్మ పదో తరగతి చదివి స్కూల్ టీచర్‌గా పని చేసేది. నాన్న మెకానిక్ పని చేసేవాడు. పని కోసం ఖమ్మం జిల్లా అశ్వారావు పేటలో అమ్మ వాళ్లు 20 ఏండ్లు ఉన్నారు. వాళ్లకు మేము ముగ్గురం పిల్లలం. నేనూ, తమ్ముడు, చెల్లి. నేను ఆరో తరగతి వరకు అశ్వారావుపేటలో చదువుకుని, ఏడు నుంచి పదో తరగతి వరకు అమ్మమ్మ, తాతయ్య దగ్గర ఉండి చదువుకున్నాను. ఇంటర్ సత్తుపల్లిలో చదివాను. చిన్నప్పుడు పుస్తకాలు బాగా చదివేదాన్ని. మా అమ్మ కూడా చదివేది. హైస్కూల్లో ఉన్నపుడు అమ్మ కోసం లైబ్రరీకి వెళ్లి పుస్తకాలు తీసుకొచ్చేదాన్ని. కవిత్వం, కథలు, నవలలే కాదు చిన్న కాగితం కనబడినా తీసుకొని చదివి తర్వాతే పడేసేదాన్ని. అలా చదవడం నాకూ అలవాటయింది. తాతయ్య పద్యాలు బాగా పాడేవారు. ఆయన ప్రభావం కూడా నాపై ఉండేది.

అభ్యుదయ భావాలతో...


నాకు చిన్నప్పటి నుండే అభ్యుదయ భావాలు ఉండేవి. మూడో తరగతి ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేటలో చదివాను. అక్కడ సీపీఎం కుటుంబంతో మాకు పరిచయం. వారి ప్రోత్సాహంలో ప్రజానాట్యమండలి వారితో కలిసి మా చెల్లి జానపద, అభ్యుదయ గేయాలు పాడేది. అలా ఆ కుటుంబంతో పరిచయం నాలో అభ్యుదయ భావాలకు కారణమయ్యింది. తర్వాత కాలంలో హిందూ వ్యక్తిని పెండ్లి చేసుకోడానికి కూడా అదే కారణం. భయపడకుండా ఇంట్లో ఒప్పించి పెండ్లి చేసుకున్నాం.

ట్యూషన్లు చెప్పి చదువుకున్నా

నా చిన్నతనంలో ఇంట్లో ఆర్థిక సమస్యలు బాగా ఉండేవి. అమ్మ వంద రూపాయల కోసం స్కూల్లో టీచర్‌గా పని చేసేది. చాలా కష్టాలు పడ్డాం. పుస్తకాలు కొనుక్కోడానికి కూడా డబ్బులు లేక స్నేహితుల పుస్తకాలు తెచ్చుకొని చదువుకునేదాన్ని. ట్యూషన్లు చెప్పి పుస్తకాలు కొనుక్కునేదాన్ని. అందుకే నేను రాసే కవత్వంలో సగం నా జీవితమే కనిపిస్తుంది. ఇల్లు కూడా మేము మట్టి మోసుకొస్తే అమ్మ గోడలు పేర్చింది. దీన్ని కూడా తర్వాత కాలంలో ఓ కవితగా రాసుకున్నాను.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడిపి

నేనూ, నా భర్త రుద్రయోగేశ్వరరావు స్కూల్లో కలిసి చదువుకున్నాం. తర్వాత ఇద్దరం కలిసి వైజాగ్‌లో హొటల్ మేనేజ్‌మెంట్ చేశాము. అప్పట్లో పెండ్లి చేసుకోవాలనే ఆలోచన లేదు. ఆయన తర్వాత ఆర్మీలోకి వెళ్ళారు. అక్కడ కొంత కాలం పని చేసిన తర్వాత కాలుకు దెబ్బ తగిలి వెనక్కి వచ్చేశారు. అప్పుడు మా పెండ్లి గురించి చర్చ వచ్చి ఇద్దరం ఇష్టపడి పెండ్లి చేసుకున్నాం. మా అత్తగారి కుటుంబం వ్యవసాయంపై ఆధారపడి ఉంది. అంతగా ఆదాయం ఉండేది కాదు. మా వారికి పెన్షన్ 15 వందలు వచ్చేది అది సరిపోయేది కాదు. అప్పటికే మాకు పాప పుట్టింది. ఆదాయం సరిపోక హొటల్ మేనేజ్‌మెంట్ చేసిన వైజాగ్‌లో ఏదైనా జాబ్ చేసుకుందామని వెళ్లాను. అక్కడ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ పెట్టుకున్నాం. పని విపరీతంగా ఉండేది. మొదట్లో పెద్దగా ఆదాయం లేదు. పాపకు మంచి తిండి కూడా పెట్టలేకపోయాము. పాలు కూడా సరిగ్గా వచ్చేవి కావు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ మెల్లగా డెవలప్ కావడంతో కాస్త మెరుగుపడ్డాం. అది చూసుకుంటూనే దూరవిద్య ద్వారా డిగ్రీ, పీజీ హిందీ, పండిట్ పూర్తి చేశాను. టీచర్ ట్రైనింగ్ చేసే అవకాశం వస్తే అనకాపల్లిలో రెగ్యులర్‌గా చేరాను. అప్పుడు మా వారు ఒక్కరే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ చూసుకోలేక దాన్ని తీసేసారు. టీచర్ ట్రైనింగ్ తర్వాత డీఎస్సీ రాద్దామంటే చిన్న పిల్లలతో వీలు కాలేదు. దాంతో ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా చేరాను.



సాహితీ స్రవంతితో పరిచయం


వైజాగ్‌లో ఉన్నపుడే నా సాహితీ ప్రస్థానం మొదలయ్యింది. మొదట్లో చిన్న చిన్న వాక్యాలు రాసి వాట్సాప్ గ్రూపుల్లో పెట్టేదాన్ని. ప్రతీది సామాజిక సమస్యలపైనే రాసేదాన్ని. ముఖ్యంగా మహిళా సమస్యలపైనే ఉండేవి. గ్రూపుల్లో అవి చూసి కొందరు 'రెండు పదాలే అద్భుతంగా రాస్తున్నావు, వీటినే కవిత్వం చేస్తే ఇంకా బాగుంటుంది కదా' అని అడిగేవారు. సాహితీ స్రవంతిలో పని చేసే శ్రీనివాస్‌గారు నన్ను బాగా ప్రోత్సహించారు. నన్ను కూడా అందులో చేర్చుకున్నారు. 2016లో గోదావరిపైన రాసిన నా మొదటి కవిత ఓ పత్రికలో వచ్చింది. వైజాగ్ పొల్యూషన్‌పై కవిత రాస్తే బహుమతి వచ్చింది. ప్రజాశక్తిలో కూడా కొన్ని కవితలు వచ్చాయి. అప్పుడే ప్రేమ-పెట్టుబడి, మార్క్సిమ్ గోర్కి అమ్మ, ఏడుతరాలు పుస్తకాలు చదివాను. నన్ను ప్రభావితం చేసిన మరో పుస్తకం పాకుడు రాళ్లు. ఈ పుస్తకాలన్నీ నాతో పాటు మా అమ్మ కూడా చదివేది.

జర్నలిస్టుగా...

జీవితం కొంత ప్రశాంతంగా సాగిపోతుంది అనుకుంటున్న సమయంలో ఓ ప్రమాదంలో నా కాలికి దెబ్బతగిలింది. ప్రైవేట్ స్కూల్స్‌లో ఎక్కువ సేపు నిలబడి పాఠాలు చెప్పాలి. దాంతో కాలు బాగా వాసిపోయి నొప్పి వచ్చేది. శ్రీనివాస్‌గారి సలహాతో ప్రజాశక్తిలో ట్రైనింగ్ కోసం చేరాను. అక్కడ చాలా నేర్చుకున్నాను. ప్రజాశక్తి ఫీచర్ డెస్క్‌లో రెండేండ్లు పని చేశాను. అక్కడ చేరిన తర్వాత మరింత బాగా రాయగలిగాను. అయితే వెన్నుముక సమస్యతో అక్కడ కూడా ఎక్కువ కాలం పని చేయలేకపోయాను. రెండు నెలలు మంచానికే పరిమితయ్యాను. ఏడాది పాటు ప్రయాణాలు చేయలేకపోయాను. పిల్లలు పెద్దవాళ్ళయి ఉద్యోగాలు చేసే స్థాయికి రావడంతో ఇప్పుడు కాస్త ఇబ్బందులు తగ్గాయి.

ఆలోచింప జేస్తాయి

నా మొదటి పుస్తకం ఏడవ రుతువు (2019), రెండవది దేశమంతా వాళ్ల ఊరు



(2021), ఇది కరోనా సమయంలో వలస కార్మికుల సమస్యలపై రాసింది. మూడోది అటుగా వంగిన ఆకాశం (2022). నాలుగోది రెండు ప్రపంచాల మధ్య (2024). దీనికే దాసరి శిరీష జ్ఞాపిక అందుకోబోతున్నాను. ఈ నాలుగు కవితా సంపుటాల్లో మహిళా సమస్యలు, సామాజిక అంశాలే ఉంటాయి. ఎక్కడ చూసినా మహిళలపై హింస, దాడులు జరుగుతున్నాయి. వివక్ష చూపిస్తున్నారు. సమాజంలోని ఆర్థిక అసమానతలు, వివక్ష నన్ను ఆలోచింప జేస్తాయి. అక్షరాల ద్వారా సమాజ మార్పు కోసం ప్రయత్నించడం బాధ్యతగా భావిస్తున్నాను.

గర్వపడతా అన్నాడు

ఓ రచయితగా, జర్నలిస్టుగా ఉన్నాను కాబట్టి సమాజాన్ని చూసే దృష్టి కోణంలోనూ మార్పు వచ్చింది. ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్యం లేకుండా పోయింది. మనుషుల్ని కులమతాల మాయా రంగుల్లో ముంచేస్తున్నారు. ప్రశ్నించిన వారిని జైల్లో పెడుతున్నారు. ఎన్ని దాడులు జరిగినా ప్రశ్నించాల్సిన బాధ్యత మనపై ఉంది. రేపు మాపై కూడా జరగొచ్చు. వీటన్నింటినీ తట్టుకొని రాయాల్సిందే. అప్పుడే దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలం. 'ఇంత తీవ్రంగా రాస్తున్నావు, నిన్నూ జైల్లో వేస్తారేమో' అని కొంత మంది రచయితలు నాతో సరదాగా అనేవారు. ఇదే విషయాన్ని మా అబ్బాయితో అంటే 'సమాజం కోసం మా అమ్మ జైలుకు వెళ్లిందని గర్వపడతాను' అన్నాడు. చాలా సంతోషంగా అనిపించింది.

- సలీమ



మిత్తీలు కట్టలేకపోతున్నాం..

పదవి పోయి ఎనిమిదినెలలైనా ఎవరూ పట్టించుకోవట్లే

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేసిన సర్పంచ్ జేఏసీ నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గత పదేండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జేఏసీ అధ్యక్షులు సర్వి యాదయ్యగౌడ్, ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై తమ సంఘం ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో గల మహాత్మాగాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. 2019 నుంచి 2024 వరకు గ్రామాల్లో వైకుంఠ ధ్వామాలు, డంపింగ్ యార్డ్‌కు చెత్త తరలించేందుకు ట్రాక్టర్ల కొనుగోలు, రైతు వేదికలు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం, సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ చేపట్టటం తదితర అనేక కార్యక్రమాలను సర్పంచులు అప్పులు చేసి మరీ పూర్తి చేశామని తెలిపారు.. వారి పదవి కాలమైపోయి ఎనిమిదినెల్లు కావొస్తున్నదని పేర్కొన్నారు. తెచ్చిన అప్పులకు మిత్తీలు కట్టలేక కొందరు సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో పెండింగ్ బిల్లులను విడుదల చేసి సర్పంచ్‌ల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.తొమ్మిదినెల్లు గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులపై స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసమే డబ్బులు వడ్డీలకు తెచ్చి గ్రామాభివృద్ధికి పాటుపడ్డామని తెలిపారు. పెండింగ్ బిల్లులు విడుదల చేసిన తర్వాతనే గ్రామ పంచాయతీల ఎన్నికలు నిర్వహించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

హైడ్రా తెచ్చిందే నా కోసం



నవతెలంగాణ-బోడుప్పల్

గ్రేటర్ హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రాను తాను, తన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోసమే తెచ్చారని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో కల్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఆయన అక్కడే ఉన్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రెష్ యాదవ్‌తో మాట్లాడారు. "జంగన్న (వజ్రెష్ యాదవ్) హైడ్రా పేరుతో పేదలపై ప్రభుత్వం ప్రతాపం చూపుతున్నది.. జెర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పేదలకు అన్యాయం జరగకుండా చూడవే అన్న" అని అన్నారు. దానికి ప్రతిగా వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ.. "హైడ్రా ఎవరినీ కావాలని ఇబ్బంది పెట్టదు.. ఆక్రమణదారులు ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటుంది.. అందులో ఎవరికీ మినహాయింపులు లేవు" అని చెప్పారు. మళ్లీ మల్లారెడ్డి కలుగజేసుకుని "జంగన్న నాపై ఫిర్యాదులు చేశావ్ కదా.. అసలు హైడ్రా వచ్చిందే నా కోసం, నా అల్లుడు కోసం, పల్లా రాజేశ్వర్ రెడ్డి కోసం.. అయినా మాకు వంద బిల్డింగ్‌లున్నాయి.. అందులో ఒక్కటి పోతే నష్టమేమీ లేదు.. హైడ్రా మా పని చేస్తే.. హైడ్రా పని మేము చూసుకుంటాం.. తప్పులు దొరికే వరకు ఆగుతాం.. ఆ తర్వాత ప్రభుత్వంపై పోరాడుతాం.." అని అన్నారు.

రైతుల ఉద్యమం @ 200 రోజులు

డిమాండ్లు నెరవేరే దాకా వెనక్కి తగ్గొదు : రెజ్లర్ వినేశ్ ఫోగట్

బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ పై చర్యలకు రైతు నేతల డిమాండ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కల్పించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేపట్టిన ఉద్యమం 200 రోజులు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో రైతులు శనివారం సరిహద్దుల్లో ప్రత్యేక కార్యక్రమ నిర్వహణకు పిలుపునిచ్చారు. ఖనౌరీ, శంభు, రతన్‌పురా సరిహద్దుల్లో నిరసన చేపట్టారు. దీంతో పెద్ద సంఖ్యలో రైతులు అక్కడికి చేరుకున్నారు. ఇక ఈ నిరసనల్లో స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్ కూడా చేరారు. ఈ నిరసనను శాంతియుతంగానే నిర్వహించినట్టు రైతు సంఘాల నేత స్వర్ణ సింగ్ పంధేర్ తెలిపారు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. తమ డిమాండ్లను మరోసారి ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. దీంతోపాటు కొత్త అంశాలను కూడా ప్రకటిస్తామని అన్నారు. నిరసనలు 200 రోజులు పూర్తి చేయడం ఓ మైలురాయిగా రైతు నేతలు అభివర్ణించారు. బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ పై చర్యలు తీసుకోవాలి.. రైతు నేతల డిమాండ్ రైతుల ఉద్యమాన్ని బంగ్లాదేశ్ పరిస్థితులతో పోల్చిన బాలీవుడ్ నటీ, మండి లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా త్వరలో జరగబోయే హర్యానా ఎన్నికలకు తమ వ్యూహాన్ని వెల్లడిస్తామని ఈ సందర్భంగా రైతు సంఘాల నేతలు ప్రకటించారు. రాష్ట్ర రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలనే ఉద్దేశంతో రానున్న రోజుల్లో తమ తదుపరి చర్యలను ప్రకటించాలని యోచిస్తున్నట్టు వెల్లడించారు.

డిమాండ్లు తీరే వరకు వెనక్కి తగ్గొద్దు : రెజ్లర్ వినేశ్ ఫోగట్

దేశ రాజధాని ఢిల్లీ శివార్లలోని శంభు సరిహద్దులో రైతులు చేస్తున్న ఆందోళనకు రెజ్లర్ వినేశ్ ఫోగట్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా రైతులు వినేశ్ ఫోగట్‌ను సత్కరించారు. ఆమె మెడలో పూలమాల వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆందోళనను ఉద్దేశించి వినేశ్ ఫోగట్



మాట్లాడుతూ "నేను రైతు కుటుంబంలో పుట్టినందుకు అదృష్టవంతురాలిని. మీ కుమార్తె మీతోనే ఉందన్న విషయం చెప్పదల్చుకొన్నాను. మన హక్కుల కోసం మనమే నిలబడాలి. ఎవరూ రారు. మీ డిమాండ్లు పూర్తి కావాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా. వాటిని సాధించుకోకుండా వెనక్కి తగ్గవద్దు. రైతులు తమ హక్కుల కోసం 200 రోజుల నుంచి కూర్చొని ఉన్నారు. ఈ డిమాండ్లను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని నేను కోరుతున్నాను. కానీ, కేంద్రం ఇన్నాళ్లుగా మీ డిమాండ్లు వినకపోవడం బాధాకరం" అని పేర్కొన్నారు.

ఇక్కడ పాలిటిక్స్ మాట్లాడితే, రైతుల పోరాటాన్ని వృథా చేసినట్టే

కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తే, మీరు హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తారా..? అన్న మీడియా ప్రశ్నకు వినేశ్ ఫోగట్ సమాధానమిస్తూ ఇప్పుడు తాను రాజకీయాలు మాట్లాడనని చెప్పారు. తాను తన కుటుంబాన్ని (రైతులు) కలిసేందుకు వచ్చానని అన్నారు. ఇక్కడ రాజకీయాలు మాట్లాడితే వారి (రైతుల) పోరాటాన్ని, సంఘర్షణను వృథా చేసినట్లే అవుతుందని ఫోగట్ వ్యాఖ్యానించారు. ఇక్కడ మీడియా ఫోకస్ చేయాల్సింది తనమీద కాదని, రైతుల మీద ఫోకస్ చేయాలని, ఇది తన అభ్యర్థన అని ఆమె అన్నారు. తానొక క్రీడాకారిణిని, భారతీయురాలిని అన్నారు. ఎన్నికలపై నాకు ఎలాంటి ఆందోళన లేదని, రైతుల సంక్షేమంపై మాత్రమే తన దృష్టి ఉందని అన్నారు. తాను అథ్లెట్‌నని, భారతీయురాలినని అని, ఈ దేశం తనదని, తాను కేవలం రాష్ట్రానికే పరిమితమై చేసేదేమీ ఉండదని చెప్పారు. ప్రస్తుతం నా దేశం సమస్యల్లో ఉన్నదని, రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం రైతు సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని వినేశ్ డిమాండ్ చేశారు. పంటలకు కనీస మద్దతు ధర అంశానికి చట్టబద్ధత కల్పించాలని, తమ ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి రైతులు చేస్తున్న ఆందోళన శనివారంతో 200వ రోజుకు చేరుకుంది. ఈ క్రమంలో శనివారం ఢిల్లీ పరిసరాల్లోని ఖనౌరీ, శంభు, రతన్‌పుర సరిహద్దులను ముట్టడించాలని రైతులు నిర్ణయించారు.

రామగుండంలో 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్

సింగరేణి, తెలంగాణ జెన్‌కో సంయుక్తంగా నిర్మాణం

డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నంతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ - గోదావరిఖని

ప్రజల భావోద్వేగాల మేరకు రామగుండంలో 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలో శనివారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి డిప్యూటీ సీఎం విస్తృతంగా పర్యటించారు. రామగుండంలో నిర్మించనున్న 800మెగావాట్ల టీజీ విద్యుత్ ప్లాంట్ స్థలాన్ని సందర్శించారు. సెక్టార్-2 వద్ద రూ.3కోట్లతో నిర్మించిన నైపుణ్య కేంద్రాన్ని ప్రారంభించారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అమృత్ 2.0, టీయూ ఎఫ్‌డీఐసీ కింద చేపట్టే పలు అభివృద్ధి పనులకు, సింగరేణి ఆధ్వర్యంలో రూ.5కోట్లతో 23 కిలో మీటర్ల అంతర్గత రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంగణంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అధ్యక్షతన



నిర్వహించిన కార్యక్రమంలో భట్టి మాట్లాడారు. ప్రజల అభీష్టం మేరకు సీఎం రేవంత్ రెడ్డి రామగుండంలో 800మెగావాట్ల పవర్ ప్లాంట్ నిర్మిస్తామని ప్రకటించినట్టు తెలిపారు. సింగరేణి, తెలంగాణ జెన్‌కో సంయుక్తంగా ఈ పవర్‌ప్లాంట్ నిర్మిస్తాయన్నారు. అందుకు అవసరమైన భూమి ఇతర సౌకర్యాల కల్పనకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించి ఎంత తొందరగా ప్రతిపాదనలు పంపితే అంత తొందరగా పవర్ ప్లాంట్ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. 1971లో ఏర్పడిన రామగుండం ఆర్‌టీఎస్‌బీ బ్లాక్ 50ఏండ్లపాటు రాష్ట్రానికి, దేశానికి సేవలు అందించిందన్నారు. సాంకేతిక కారణాలతో దాన్ని మూసేయాల్సి వచ్చిందని, ఈ ప్రాజెక్టుతో స్థానిక ప్రజలకు ఉన్న భావోద్వేగాలను గుర్తించి ఇక్కడే పవర్ ప్లాంట్ నిర్మించాలని నిర్ణయించామని వివరించారు. రాష్ట్రంలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి జాబ్ క్యాలెండర్ ప్రకటించి దాని ప్రకారం ఖాళీలను భర్తీ చేస్తున్నామని తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. 8నెలల నుంచి రామగుండం అభివృద్ధిపై స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ వహించారని, ముఖ్యంగా బీ పవర్ హౌస్ థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణం కోసం కృషి చేశారని చెప్పారు. స్థానికులకు ఉపాధి అందించాలనే ఉద్దేశంతో 800 మెగావాట్ల పవర్ ప్లాంట్ మంజూరు చేశామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రామగుండం ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే దిశగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికుల పాత్ర ప్రత్యేకమైందని చెప్పారు. గత పాలకులు ఆశించిన మేర ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. రామగుండం ఎమ్మెల్యే కోరిన విధంగా ఈ ప్రాంతానికి త్వరలోనే అదనంగా బస్సులు కేటాయిస్తామని తెలిపారు. అనంతరం 211 మహిళా సంఘాలకు రూ.23 కోట్ల 35 లక్షల 50 వేల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను డిప్యూటీ సీఎం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, సింగరేణి చైర్మెన్ ఎన్.బలరాం, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, గడ్డం వివేక్, గడ్డం వినోద్, ప్రేమ్ సాగర్‌రావు, రామగుండం మేయర్ బంగి అనిల్ కుమార్, అదనపు కలెక్టర్‌లు జె.అరుణశ్రీ, జివి శ్యామ్ ప్రసాద్‌లాల్ పాల్గొన్నారు.

అప్పాచెరువులో కూల్చివేతలు

(మొదటిపేజీ తరువాయి)

ఎకరాలకుపైగా 2021 నుంచి అనేక అక్రమ నిర్మాణాలు వెలిశాయి. కొందరు చెరువు స్థలాన్ని కబ్జా చేసి కంపెనీల కోసం భారీ షెడ్లను నిర్మించారు. ఇటీవల స్థానికుల నుంచి హైడ్రాకు ఫిర్యాదులు అందడంతో వెంటనే స్పందించిన అధికారులు అప్పచెరువు ఆక్రమణలను గుర్తించారు. ఈ కూల్చివేత సమయంలో కొందరు కంపెనీ యజమానులు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించారు. కొంతమంది మాత్రం తమకు ముందే నోటీసు ఇచ్చి ఉంటే కంపెనీలో ఉన్న విలువైన యంత్రాలను తీసుకెళ్లేవారమని, తమకు నష్టం జరిగేది కాదని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చేయడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. మూడేండ్ల కిందట వచ్చిన వర్షాలకు అప్పచెరువు కట్ట తెగడంతో ఆరుగురు చనిపోయారని స్థానికులు గుర్తు చేశారు. రెండు, మూడ్రోజుల్లో మామిడికుంట చెరువు స్థలంలో నిర్మించిన నిర్మాణాలు కూల్చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కూల్చివేతలను డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు.

ఈదులకుంట చెరువు పరిశీలించిన హైడ్రా కమిషనర్

శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్ పరిధిలోని ఈదులకుంట చెరువులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. కానామేట్ విలేజ్ సర్వే నెంబర్ 7లో ఆరెకరాల ఐదు గుంటల పరిధిలో ఈదులకుంట చెరువు ఉంది. అది శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి మండలాల పరిధిలోకి వస్తుంది. గతంలో శేరిలింగంపల్లి పరిధిలోకి రాదని అధికారులు తెలిపారు. కానీ దీనిపై కొన్నేండ్లుగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అనేక పోరాటాలు, ఆర్‌టీఏ ద్వారా సమాచార సేకరణ చేసి శేరిలింగంపల్లి పరిధిలోకి కూడా వస్తుందని నాయకులు చెప్పారు. అయితే, హైడ్రా ఏర్పడిన కొద్ది కాలంలోనే వీటిపై సమగ్రమైన సమాచారం కమిషనర్‌కి అందింది. దానిపై స్పందించిన రంగనాథ్ శనివారం చెరువుని పరిశీలించారు. రెవెన్యూ అధికారులు, ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ జగదీష్‌ను సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు శోభన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంతటి వారైనా వదలం: రంగనాథ్

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాల్టీ పరిధిలోని చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పరిధిలో అక్రమ నిర్మాణాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. రికార్డులను పరిశీలించారు. అమీన్‌పూర్ మున్సిపాల్టీలోని పెద్దచెరువు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నాలా కబ్జాలపై ఆరా తీశారు. నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా నిర్మించిన కట్టడాల వెనుక ఎంతటి వారు ఉన్నా.. వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. నోటీసులు అందించిన వెంటనే కూల్చివేతలు ప్రారంభిస్తామన్నారు. చెరువులు కుంటలు నాళాల పరిరక్షణకు హైడ్రా కఠినంగా వ్యవహరిస్తుందని చెప్పారు.

ఆరుగురిపై కేసు నమోదు

హైడ్రా అధికారుల ఆదేశాల మేరకు సైబరాబాద్ కమిషనర్ పరిధిలో ఆరుగురు అధికారులపై కేసు నమోదైంది. అక్రమ కట్టడాలను ప్రోత్సహించిన వారు.. వారికి సహకరించిన ప్రతి ఒక్కరినీ చట్ట పరిధిలో పూర్తిగా శిక్షించే విషయంపై పరిశీలిస్తామని హైడ్రా కమిషనర్ ఇదివరకే చెప్పారు. అందులో భాగంగానే చందానగర్, బాచుపల్లి తదితర ప్రాంతాల్లోని చెరువుల్లో అక్రమ నిర్మాణాలకు పర్మిషన్ ఇచ్చిన అధికారులపై చర్యలకు పూనుకుంది. చందానగర్ మాజీ డిప్యూటీ కమిషనర్ సుధన్స్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రాజ్‌కుమార్, బాచుపల్లి తహసీల్దార్ పుల్ సింగ్‌తోపాటు మరో ముగ్గురిపై సైబరాబాద్ కమిషనర్ ఎకనామిక్స్ అఫెన్స్ వింగ్‌లో కేసు నమోదు చేశారు.


రెండు రోజులు భారీ వర్షాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా రాగల రెండురోజులు పలుజిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వాయుగుండం పశ్చిమ వాయువ్య దిశగా కదిలి ఉత్తరాంధ్ర తీరానికి ఆనుకుని ఉన్న దక్షిణ ఒడిశా సమీపంలో, విశాఖపట్నం, గోపాల్ పూర్ మధ్య కలింగపట్నానికి సమీపంలో తీరం దాటే అవకాశముందని పేర్కొంది. ఫలితంగా రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని పేర్కొంది. భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలో పలు జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించినట్టు వాతావరణ శాఖ సంచాలకులు నాగరత్న తెలిపారు.

నవచిత్రం

విజువల్ వండర్‌గా సుబ్రహ్మణ్య


సుబ్రహ్మణ్య ప్రీ లుక్‌లో అద్వయ్

నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్ పి.రవిశంకర్ తన కుమారుడు అద్వయ్‌ని హీరోగా పరిచయం చేసేందుకు రెండవ సారి మెగాఫోన్ పట్టారు. 'సుబ్రహ్మణ్య' టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని తిరుమల్‌రెడ్డి, అనిల్ కడియాల ఎస్‌జి మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం2గా నిర్మిస్తున్నారు. ప్రవీణ కడియాల, రామలక్ష్మి ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. శనివారం ఈ చిత్ర ప్రీ-లుక్ రిలీజైంది.
ప్రీమియం లార్జ్ ఫార్మాట్, ఐమాక్స్ థియేటర్లలో ప్రేక్షకులకు అడ్వెంచర్ థ్రిల్‌ను అందించడానికి ఈ చిత్రాన్ని బిగ్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఇప్పటికే 60% నిర్మాణాన్ని పూర్తి చేసుకుంది. పోస్ట్ ప్రొడక్షన్ కూడా ముంబయిలోని రెడ్ చిల్లీస్ స్టూడియోలో జరుగుతోంది.
ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో వీఎఫ్ఎక్స్, సిజీ వర్క్ చేస్తున్నారు. అత్యున్నత సాంకేతిక విలువలతో పాన్ ఇండియా సినిమాగా తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

బ్లాక్‌బస్టర్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్



నాని, దర్శకుడు వివేక్ ఆత్రేయ కలయికలో రూపొందిన చిత్రం 'సరిపోదా శనివారం'. ఆగస్టు 29న విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల రెస్పాన్స్‌తో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో హీరో నాని మాట్లాడుతూ,'రిలీజ్ రోజు నుంచి వస్తున్న అభినందనలు, ప్రశంసలు మనసుని తాకుతున్నాయి. ఇంత వర్షాల్లో కూడా చాలా చోట్ల హౌస్ ఫుల్ అవుతున్నాయంటే; థాంక్స్ టు తెలుగు ప్రేక్షకులు. ప్రపంచంలో ఎక్కడా ఉండరు. ఇది కేవలం వీకెండ్ షో కాదు లాంగ్ రన్ ఉండబోతోంది. ఇది చాలా బెస్ట్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే మూవీ. ఈ సినిమాని థియేటర్లో ప్రేక్షకులతో కలిసి చూస్తున్నప్పుడు ఎన్నో సార్లు ఎమోషనల్‌గా అనిపించింది. ప్రతి సీన్‌ని బాగా ఎంజాయ్ చేస్తున్నారు' అని అన్నారు.
'ప్రేక్షకులు ఇచ్చిన రెస్పాన్స్, సక్సెస్‌కు చాలా థాంక్స్. చారు మీ మనసుల్లో నిలిచిపోతుంది. ఇది నా ఫేవరేట్ క్యారెక్టర్. 100 డేస్ సక్సెస్ కూడా ఇలాగే సెలబ్రేట్ చేసుకోవాలి' అని హీరోయిన్ ప్రియాంక మోహన్ చెప్పారు. డైరెక్టర్ వివేక్ ఆత్రేయ మాట్లాడుతూ,'నామీద నాకున్న నమ్మకం కంటే; నామీద నానికి ఉన్న నమ్మకం ఎక్కువ. అందుకే ఇంత మంచి సినిమా రాగలిగింది. ఇప్పటివరకూ కొంచెం స్లో సినిమాలు చేశాను. ఇంత ఫాస్ట్ ఉన్న సినిమాని ప్రెజెంట్ చేయగలిగిన నిర్మాత దానయ్యకు థ్యాంక్స్.
కళ్యాణ్ బాబు సినిమాతో ఇంత పెద్ద సక్సెస్ కొట్టినందుకు ఆనందంగా ఉంది. ఈ సక్సెస్ టీమ్ ఎఫర్ట్. ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు' అని తెలిపారు.
నిర్మాత దానయ్య మాట్లాడుతూ,"ఈ సినిమా కచ్చితంగా హిట్ అవుతుందని ప్రీ రిలీజ్‌లో చెప్పాను. చెప్పినట్టే ప్రేక్షకులు హిట్ చేశారు. నాని కెరీర్‌లో ఇది రెండో సక్సెస్ ఇచ్చినందుకు నానికి థ్యాంక్స్' అని చెప్పారు.



ఇంటెన్స్ సస్పెన్స్ థ్రిల్లర్


నిఖిల్ దేవాదుల

నిఖిల్ దేవాదుల హీరోగా నటిస్తున్న సినిమా 'ఘటికాచలం'. ఈ చిత్రానికి కథ అందిస్తూ, ఒయాసిస్ ఎంటర్‌టైన్ మెంట్ బ్యానర్ పై నిర్మాత ఎం.సి.రాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అమర్ కామెపల్లి దర్శకుడు.
శనివారం ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ ఫస్ట్ లుక్‌లో రెండు డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తున్నారు హీరో నిఖిల్ దేవాదుల. ఈ రెండు లుక్స్‌లో ఒకటి ఇన్నోసెంట్‌గా, మరొకటి ఇంటెన్స్‌గా కనిపిస్తోంది. టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ ఆసక్తికరంగా ఉండటంతో సినిమా మీద క్యూరియాసిటీ క్రియేట్ చేస్తున్నాయి. ఇందులో ఈటీవీ ప్రభాకర్, ఆర్వికా గుప్తా, జోగి నాయుడు, సంజయ్ రాయ్ చుర, దుర్గాదేవి ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్



ప్రస్తుతం ఫీల్ గుడ్ స్టోరీస్, చిన్న చిత్రాలు, కొత్త వాళ్ళు చేస్తున్న ప్రాజెక్టులు బాక్సాఫీస్ వద్ద సక్సెస్ అవుతున్నాయి.
ఆ కోవలోనే న్యూ కంటెంట్‌తో రిఫ్రెషింగ్ ఫీల్‌తో రూపొందుతున్న చిత్రం 'ప్రణయ గోదారి'. పి.ఎల్.విఘ్నేష్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని పారమళ్ళ లింగయ్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజ్ చేసిన గ్లింప్స్, పోస్టర్లు, పాటలు ఆడియెన్స్‌లో మంచి రెస్పాన్స్‌ను దక్కించుకున్నాయి. తాజాగా మరో పాటను మేకర్లు విడుదల చేశారు. 'గు గు గ్గు..'అంటూ సాగే హుషారైన పాటను కొరియోగ్రాఫర్ గణేష్ మాస్టర్ రిలీజ్ చేశారు. ఈ పాటకు మార్కండేయ బాణీ, సాహిత్యం స్పెషల్ అట్రాక్షన్ కానున్నాయి. భార్గవి పిళ్లై గాత్రం కుర్రకారుని కట్టిపడేసేలా ఉంది.
ఈ సందర్భంగా గణేష్ మాస్టర్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలోని 'గు గు గ్గు...' అనే ప్రత్యేక గీతాన్ని విడుదల చేశాను. పాట చాలా బాగుంది. హుక్ స్టెప్స్ బాగున్నాయి. విఘ్నేశ్ తెరకెక్కించిన విధానం చాలా బాగుంది. చాలా ఫ్రెష్ ఫీల్ ఇచ్చే సినిమా ఇది. మంచి కంటెంట్ ఉంటే ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. అలాంటి కంటెంట్ ఉన్న చిత్రమిది. కచ్చితంగా మంచి విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను' అని అన్నారు.
ఈ చిత్రానికి సంబంధించి ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే మేకర్స్ రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేయనున్నారు. ఈ చిత్రానికి కెమెరా:ఈదర ప్రసాద్, డాన్స్:కళాధర్, మోహనకృష్ణ, రజిని, ఎడిటర్ :కొడగంటి వీక్షిత వేణు.



వెంకటలక్ష్మితో..



టింట్ స్ప్రీ స్టూడియోస్ బ్యానర్‌పై ఆలేటి రాజేష్ నిర్మాతగా రామమూర్తి కొట్టాల దర్శకత్వంలో తెరకెక్కుతున్న స్వచ్ఛమైన ప్రేమ కథా చిత్రం 'వెంకటలక్ష్మితో'. 'ఏడాది కిందట' అనే ట్యాగ్‌లైన్‌తో రూపొందిన ఈ చిత్రంలో రఘు గద్వాల్ హీరోగా, ప్రియాంక శ్రీ, శివ ప్రసన్న హీరోయిన్స్‌గా నటించారు. తాజాగా ఈ మూవీ టైటిల్ పోస్టర్‌ను హీరో శ్రీకాంత్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'టైటిల్ చాలా బాగుంది. క్యాచీగా ఉంది. షార్ట్ ఫిల్మ్స్‌తో ఫేమస్ అయిన హీరో రఘు ఈ సినిమా ద్వారా అందర్నీ ఆకట్టుకుంటాడని నమ్ముతున్నా. కంటెంట్ ఉన్న సినిమాలను తెలుగు ప్రేక్షకులు కచ్చితంగా ఆదరిస్తారు. ఇది కూడా ఓ కొత్త కంటెంట్‌తో రాబోతోందని అర్థమవుతోంది. సినిమా విజయం సాధించాలని ఆశిస్తున్నాను' అని అన్నారు.
'నూతన నటీనటులతో ఏడాది కిందట ఈ చిత్రాన్ని మొదలుపెట్టాం. ప్రమోషన్స్‌లో భాగంగా హీరో శ్రీకాంత్ మాకు సపోర్ట్ చేయడం చాలా ఆనందంగా ఉంది' అని హీరో రఘు గద్వాల చెప్పారు.
చిత్ర దర్శకుడు రామమూర్తి కొట్టాల మాట్లాడుతూ,'ఇదొక స్వచ్ఛమైన ప్రేమ కథా చిత్రం. థ్రిల్లర్, సస్పెన్స్‌తో పాటు అన్ని ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. అంతా కొత్త వారితో తీసిన ఈ సినిమా ప్రేక్షకులకు చాలా ఫ్రెష్ ఫీల్‌ని ఇస్తుంది. నిర్మాత రాజేష్ బాగా సపోర్ట్ చేశారు' అని అన్నారు. 'షూటింగ్‌తోపాటు పోస్ట్ ప్రొడక్షన్ కూడా పూర్తయ్యింది. దర్శకుడితో సహా అంతా కొత్త వారితో ఈ చిత్రాన్ని నిర్మించాం. సరికొత్త కంటెంట్‌తో వస్తున్న మా చిత్రం కచ్చితంగా విజయం సాధిస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని నిర్మాత ఆలేటి రాజేష్ తెలిపారు.





అందర్నీ కనెక్ట్ చేసే కథ


నివేత థామస్

నివేత థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్‌లో నటించిన న్యూ ఏజ్ క్లీన్ ఎంటర్‌టైనర్ '35-చిన్న కథ కాదు'. సురేష్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రానికి నంద కిషోర్ ఈమాని రైటర్, డైరెక్టర్. ఈ సినిమా ఈనెల 6న తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో విడుదల కానుంది.
ఈ సందర్భంగా హీరోయిన్ నివేత థామస్ మీడియాతో మాట్లాడుతూ, 'ఇదొక సింపుల్ అండ్ బ్యూటీఫుల్ స్టోరీ. ఇందులో నివేత థామస్ కాకుండా తల్లిగా నటించిన సరస్వతి పాత్రే కనిపిస్తుంది. డైరెక్టర్ నంద కిషోర్ కథని అద్భుతంగా రాశారు. ఇందులో తిరుపతి తిరుమల వెంకన్న స్వామి కూడా కథలో ఒక క్యారెక్టర్. కథ ఇంత రీజినల్‌గా, రూటెడ్‌గా ఉండటం నాకు చాలా నచ్చింది. డివైన్ ఫీలింగ్ అన్ని సీన్స్‌లో ఉంటుంది. ఇన్నోసెంట్ ఫ్యామిలీ స్టోరీ ప్రేక్షకులకు చాలా బాగా నచ్చుతుంది. ఇందులో మ్యాథ్స్ అనేది చిన్న పార్ట్ మాత్రమే. భార్య, భర్త, పిల్లలు, టీచర్ స్టూడెంట్స్ ఇలాంటి బ్యూటీఫుల్ రిలేషన్షిప్స్ గురించి చాలా అందంగా చెప్పాం. ఇది కె.విశ్వనాథ్ సినిమాలు చూసిన ఫీలింగ్ ఇస్తుంది. ఇందులో మ్యాథ్స్ టీచర్ చాణక్యగా ప్రియదర్శి నటించారు. గౌతమి, భాగ్యరాజ్‌తో నటించటం ఆనందంగా ఉంది. రానాకి ఈ కథ ముందునుంచి తెలుసు. సురేష్ ప్రొడక్షన్‌తో ఆయన ఈ సినిమాని ప్రజెంట్ చేసినందుకు కృతజ్ఞతలు. అందర్నీ కనెక్ట్ చేసే కథతో రాబోతున్న ఈ సినిమా విజయం సాధిస్తుంది' అని చెప్పారు.

రీ-రిలీజ్‌లోనూ సరికొత్త చరిత్ర సృష్టిస్తుంది


హరీష్‌శంకర్, బండ్ల గణేష్

పవన్ కళ్యాణ్, డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబోలో రూపొందిన చిత్రం 'గబ్బర్ సింగ్'. నిర్మాత బండ్ల గణేష్ నిర్మించిన ఈ చిత్రం 2012లో విడుదలై కలెక్షన్ల వర్షం కురిపించింది. పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 2న ఈ సినిమా రీ- రిలీజ్ కానుంది.
ఈ నేపథ్యంలో నిర్మాత బండ్ల గణేశ్ మాట్లాడుతూ,"గబ్బర్ సింగ్' ఒక చరిత్ర. ఈ సక్సెస్ క్రెడిట్ డైరెక్టర్ హరీష్ శంకర్‌కి చెందుతుంది. విందుభోజనం లాంటి ఈ సినిమా మరోసారి విడుదల చేయడం నా అదృష్టం. రీ-రిలీజ్‌లోనూ కలెక్షన్ల పరంగా సరికొత్త చరిత్ర సృష్టిస్తుంది' అని అన్నారు.
'మా జీవితాలను మార్చేసిన చిత్రమిది. ఈ సినిమా సక్సెస్ ఊహించిన తొలి వ్యక్తి పవన్‌కల్యాణ్. డబ్బింగ్ టైమ్‌లోనే ఆయన ఇది పక్కా బ్లాక్‌బస్టర్ అన్నారు. నా ఫ్యాన్స్ కోరుకునేది ఇవ్వబోతున్నావ్. ఇది పక్కా బ్లాక్ బస్టర్ అని షేక్ హ్యాండ్ ఇచ్చారు. ఈ సినిమా రీ- రిలీజ్ అవ్వడం చాలా హ్యాపీగా ఉంది' అని డైరెక్టర్ హరీష్ శంకర్ తెలిపారు.





Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

మహిళల భద్రత గాలిలో దీపమేనా..!?





మేకిరి దామోదర్
9573666650

మన దేశాన్ని "భారతమాత"గా సమున్నతంగా, సముచితంగా మర్యాదపూర్వకంగా గౌరవించుకుంటున్న సమాజం మనది. కానీ నేడు మనిషి విచక్షణ కోల్పోయి మహిళలపై లైంగికదాడులు, హత్యలు, అఘాయిత్యాలు తెగబడుతున్న తీరు ఆందోళన కలిగిస్తున్నది. మానవ మృగాలు అనేక విధాలు(రకాలు)గా అకృత్యాలకు పాల్పడటంతో దేశం అనాగరికతకు ముఖచిత్రంగా మారుతోంది. ప్రజాస్వామ్య దేశంలో చట్టబద్ధ పాలనలో ఆడపిల్లలు, మహిళలపై అమానుష అకృత్యాలకు బరితెగిస్తూ, తెగబడుతున్న కీచకులకు సకాలంలో కఠిన శిక్షలు విధించలేనప్పుడు, లింగ వివక్షను సమూలంగా సమాజం నుండి నిర్మూలించనప్పుడు మనది చట్టబద్ధ పాలన అనిపించుకోదు. కలకత్తాలోని ఆర్ జీ వైద్య కళాశాల ఆసుపత్రిలో ట్రెయినీ డాక్టర్ పై ఘోరాతి ఘోరంగా, అమానుషంగా హత్యాచార ఘటనకు పాల్పడిన రాబంధులకు శిక్ష పడుతుందా? ఈ కేసుపై అనేక సందేహాలు ప్రతి ఒక్కరి హృదయాన్ని మెలివేస్తున్నది. చట్టాలు చట్టుబండలై, నేరస్తులకు చుట్టాలవుతున్నాయని యావత్ దేశం దిగ్భ్రాంతికి లోనవుతుంది.

గత పన్నెండేళ్ల క్రితం దేశ రాజధానిలో కదులుతున్న బస్సులో "నిర్భయ" పై జరిగిన హత్యాచారం దేశవ్యాప్తంగా గగ్గోలు రేపింది. స్త్రీలకు సరైన రక్షణ కల్పించలేని వ్యవస్థల అసమర్థతను చీత్కరిస్తూ ఆనాడు యువత పెద్ద ఎత్తున ఉద్యమించింది. ఇకపై అటువంటి ఘోరకృత్యాలు దేశంలో చోటు చేసుకోకుండా చూస్తామంటూ మాటలెన్నో చెప్పిన నాటి పాలకులు హడావుడి చట్టాలకు పదును పెట్టారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన కీచకులకు కఠిన శిక్షలు పడేలా చట్టాలను రూపొందించారు. అయినా ఆ తర్వాత కూడా హైదరాబాద్‌లో "దిశ" ఉదంతం మన పాలనావ్యవస్థను బట్టబయలు చేసింది. ఇలా మహిళలపై రేప్‌లు, మర్డర్లు నిత్యం దేశంలో ఏదో ఒక ప్రాంతంలో జరుగుతూనే ఉన్నాయి. చట్టాలెన్ని వచ్చినా "శిక్ష పడుతుందనే భయం లేకనే" ఇంత అమానవీయంగా వ్యవహరిస్తున్నట్లు అర్థమవుతున్నది. నాటితో పోలిస్తే పరిస్థితులు ఇంకా అధ్వానంగా తయారయ్యాయి. అధికారిక గణాంకాల ప్రకారమే 2012లో దేశవ్యాప్తంగా స్త్రీలపై దాదాపు పాతికవేల హత్యాచారాలు చోటుచేసుకున్నాయి. 2022లో అవి 31,516కు పెరిగాయి. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా, ఒడిశాలో 'మృగాళ్లు' మహిళలపై స్వేచ్ఛా విహారం చేస్తున్నట్లు సర్కారీ నివేదికలే వెల్లడిస్తున్నాయి.

ఉభయ తెలుగు రాష్ట్రాలలో స్త్రీలపై లైంగికదాడులు ఎక్కువగానే జరుగుతున్నాయి. గృహహింస, అపహరణ, హత్యాచారం, బాలికలు, మహిళల అక్రమ రవాణా, లైంగిక వేధింపుల వంటివి ఏడాదికేడాది అధికమవుతున్నాయి. ఇది మహిళలకు ప్రాణసంకటంగా, ప్రగతికి ఆటంకంగా మారుతుంది. ఇదిలా ఉంటే బాలికలు, మహిళలపై నమోదవుతున్న అనేకానేక నేర ఘటనలు అసలు వెలుగులోకి రావడం లేదు. ఫిర్యాదు చేసేందుకు బాధితులు వెనుకాడడమే అందుకు ప్రధాన కారణం. వారు ధైర్యంగా ఫిర్యాదు ఇచ్చిన సందర్భాల్లోనూ కేవలం 1.6 శాతం కేసుల్లోనే నిందితులకు శిక్షలు పడుతుండటం వాస్తవ పరిస్థితికి అద్దం పడుతోంది. ఇలాంటి అలసత్వం మూలంగా దేశంలో మహిళలు, బాలికలపై హింస అంతకంతకూ పెరిగిపోతోంది.

> భారతదేశం ప్రగతి పథంలో ఆర్థిక శక్తిగా దూసుకుపోతుందని గొప్పలు చెప్పకుంటున్న పాలకులు ఆ అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్న మహిళల్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఆర్థిక కార్యకలాపాలు, అన్నిరంగాలు, విభాగాల్లో మహిళా భాగస్వామ్యం ఇంకా పెరగాలంటే వారి భద్రత ప్రభుత్వాల బాధ్యత. అది సాధ్యపడాలంటే? పని ప్రదేశాల్లో కనీస రక్షణ చర్యలు కల్పించబడాలి. వాటిని పర్యవేక్షించేందుకు కమిటీని నియమించి, నిరంతరం పర్యవేక్షించాలి.

కేంద్ర గణాంకాలు, మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన "భారత్‌లో మహిళలు-పురుషుల పరిస్థితి-2023" నివేదిక ప్రకారం మహిళలపై జరిగిన దారుణాలపై విచారణకు వచ్చిన ఉదంతాల్లో కేవలం రెండుశాతం లోపు కేసుల్లో మాత్రమే శిక్షలు పడుతున్నాయి. ఇలా అనేక రకాలుగా స్త్రీలపై హింస, లైంగిక దాడులు, బలవంతపు వివాహాలు, సైబర్ వేధింపులు, అక్రమ రవాణా, దాష్టీకాలు జరుగుతున్నాయి. ఈ హింసాత్మక పరిస్థితులు వారి ఎదుగుదలకు ప్రధాన అవరోధంగా మారుతున్నాయని నివేదిక వివరించింది. దాన్ని అంతం చేయడం ద్వారానే అతివల సాధికారతకు అడ్డంకులు తొలగుతాయని పేర్కొంది.

ఈ ఘటనల్లో బాధితుల్లో అత్యధికులు 18 నుంచి 30 ఏళ్ల లోపు మహిళలే అధికంగా ఉండడం, బాధితుల్లో పనిచేసే వారిలోనే ఎక్కువమంది పై ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ఇంటా, బయట పనిచేసే చోటుకు వెళ్తున్నప్పుడు అఘాయిత్యాలకు బలవుతున్నారు. రాత్రిపూట పని వేళల్లో పనిచేసే ప్రదేశాలలో అత్యాచారాలు జరుగుతున్నాయి. లైంగికదాడుల నిరోధానికి ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు శూన్యంగానే కనిపిస్తున్నాయి. ఘటనల్లో చాలావరకు వెలుగు చూడడం లేదు. తమపై జరిగిన హింసాత్మక ఘటనలు బయటపెట్టడం తమకు కళంకంగా, అవమానంగా మారుతుందనే భయాందోళన, అపోహలతో చాలామంది ఫిర్యాదు చేయడానికి కూడా ముందుకు రావడం లేదు.

భారతదేశం ప్రగతి పథంలో ఆర్థిక శక్తిగా దూసుకు పోతుందని గొప్పలు చెప్పకుంటున్న పాలకులు ఆ అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్న మహిళల్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఆర్థిక కార్యకలాపాలు, అన్నిరంగాలు, విభాగాల్లో మహిళా భాగస్వామ్యం ఇంకా పెరగాలంటే వారి భద్రత ప్రభుత్వాల బాధ్యత. అది సాధ్యపడాలంటే? పని ప్రదేశాల్లో కనీస రక్షణ చర్యలు కల్పించబడాలి. వాటిని పర్యవేక్షించేందుకు కమిటీని నియమించి, నిరంతరం పర్యవేక్షించాలి. సమాజాన్ని తిరోగమనపథంలో నడిపించే మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలంటే ఇంటా, బయట లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్లో కేసులను సత్వరం విచారణ జరిపి దోషులకు కఠినమైన శిక్షలు విధించాలి. సమాజంలో నైతిక విలువలు పెంపొందించడంలో ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. దేశానికి తల వంపు తెస్తున్న ఈ హత్యాచార విష సంస్కృతిని రూపుమాపినప్పుడే ఈ దేశం బాగుపడుతుంది.

మహిళలు ఆగ్రహిస్తే ఈ సృష్టికి, మానవ జాతికి పుట్టగతులుండవన్న సంగతి పాలకులు గుర్తెరగాలి. సమాజంలో నైతిక విలువల్ని పెంపొందించడంలో ప్రభుత్వాలు కృషి చేయాలి. లైంగికదాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. శిక్షలు పడేలా చూడాలి. లేదంటే ఎప్పటిలాగే 'మహిళల భద్రత గాలిలో దీపమే' అవుతుంది. ✦

బల్బును కనుగొనే ప్రయత్నంలో వందల ప్రయత్నాలను పట్టుదల వదలకుండా చేసి ప్రపంచానికే వెలుగునిచ్చిన థామస్ అల్వా ఎడిసన్ మనకు స్ఫూర్తి ప్రదాత. నిరుపేద కుటుంబంలో పుట్టి అడుగడుగునా వివక్షతకులోనై పట్టుదల వదలకుండా విశ్వ మేధావిగా ఎదిగిన భారతరత్న అంబేద్కర్ మన పోరాటానికి ఎప్పటికీ ఆద్యుడే. రామేశ్వరం వీధుల నుంచి అంతరిక్షంలోకి ఓ మిస్సైల్ లా మారి, రాష్ట్రపతి భవన్ వరకు సాగిన అబ్దుల్ కలాం సుదూర స్ఫూర్తి ప్రయాణం మనందరికీ ఒక దిక్సూచియే. సచిన్ టెండూల్కర్, మహేంద్ర సింగ్ ధోనీ, అమితాబ్ బచ్చన్, ఆంగ్ సాన్ సూకీ, కల్పనా చావ్లా,మదర్ థెరిస్సా, సుధా మూర్తి వంటి ఇలా ఎందరో వివిధ రంగాల ప్రముఖుల జీవిత చరిత్రలు మన జీవితాలకు వ్యక్తిత్వపు శిఖరాలై మన జీవితాలకు మార్గదర్శనం చేస్తూనే వుంటాయి.

కొందరి జీవిత కథలు... మనకు నిత్య ప్రేరణలు!



పి. అరుణ్ కుమార్

నేటి యువతరం అనంత విశ్వమే హద్దుగా కృత్రిమ మేధ వంటి సాంకేతికతతో ఎన్నో అద్భుతాలు సృష్టిస్తుందన్నది మన కళ్ల ముందు కదలాడుతున్నది.కానీ కొన్ని సందర్భాల్లో ఐఐటీ, మెడిసిన్,విశ్వవిద్యాలయాల స్థాయిలో ఉన్నత విద్యనభ్యసించిన ప్రతిభావంతులైన విద్యార్థులతో పాటు సామాన్యవ్యక్తులు సైతం జీవితంలో ఎదురయ్యే వివిధ రకాల, రంగాల శారీరక , మానసిక ఓటమిలను, సమస్యలను తట్టుకోలేక డిప్రెషన్‌కు లోనవుతున్నారు. పరీక్షలలో ఫెయిలై కొందరు,ఉద్యోగ అర్హత పరీక్షలో జాబ్ రానివారు మరికొందరు,వ్యాపారాల్లో దివాలా తీసినవారు ఇంకొందరు, ప్రేమించిన వ్యక్తులతో జీవితం పొందలేకవారు...ఇలా ఎన్నో సమస్యల సంద్రంలో, కాలపరిణామ క్రమంలో వస్తున్న మార్పులను స్వాగతించలేక ఆత్మవిశ్వాసం కోల్పోయిన కొందరు ఈ పోటీ ప్రపంచంలో తీవ్ర ఒత్తిడికి చిత్తవుతున్నారు.



జీవితం విలువ తెలుసుకోలేక కొన్ని క్షణిక పాటు నిర్ణయాలు తీసుకొని తమతో పాటు తమ కుటుంబాలకు కూడా తీవ్ర సంఘర్షణలను మిగులుస్తున్నారు.ఆశావాద దృక్పథాన్ని వీడి నిరాశ వాదంలో పిచ్చికలలు కంటున్నారు.కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.శాంతిని మరచి ద్వేషపు అభిప్రాయాలతో హత్యలు చేసి హంతకులుగా కూడా మారుతున్నారు. ఏదేమైనా నవతరం ప్రపంచాన్ని ప్రభావితం చేసిన మహానుభావుల జీవితచరిత్రలు చదవడం లేదు.తెలుసుకోవడం లేదు.విద్యాసంస్థల్లో కూడా మార్కులు,గ్రేడుల చాటున వ్యక్తిత్వపు పాఠాలకు సమయం లేదు.చరితను ప్రభావితం చేసిన అసాధారణ వ్యక్తులు కూడా మనలాంటి సాధారణ వ్యక్తులని, వారు కూడా తమ జీవితంలో ఎన్నో సమస్యల్ని అధిగమించారని గుర్తెరగాలి. మొక్కవోని దీక్షతో నిరంతరం ప్రయత్నించి వైఫల్యాల నిశ్శబ్దం చాటున గెలుపు శబ్దమై మిగిలారని, వెలుగు దివ్వెలై నేడు ప్రకాశిస్తున్నారని తెలుసుకోవాలి.

శరీర అవయవాలు పనిచేయకపోయినప్పటికీ కొన్ని దశాబ్దాలుగా తన జీవితం వీల్ చైర్ కే పరిమితమైన ఆధునిక ఐన్ స్టీన్ గా ఎదిగిన స్టీఫెన్ హాకింగ్ జీవన ప్రస్తానం ఎంతో స్ఫూర్తిదాయకం."ఈ విశ్వం ఎంత పెద్దదైనా కావచ్చు..కానీ మన ప్రయత్నాల ముందు చాలా చిన్నది" అనే హాకింగ్ తన అసాధారణ మేధా సంపత్తితో బ్లాక్‌హోల్స్ పై చేసిన పరిశోధనలు నేటి ఆధునిక సైన్సుకు, సైంటిస్టులకు సవాళ్లు గా మారాయి."ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్" పేరుతో ఆయన రాసిన పుస్తకం నేటి బెస్ట్ సైన్స్ పుస్తకాల్లో ఒకటిగా నిలిచింది.అనంత విశ్వ ఆవిర్భావం నుంచి ఎలక్ట్రాన్, ప్రోటాన్ వంటి సూక్ష్మ పరమాణు కణాల వరకు సైన్స్ ప్రస్థానాన్ని హైస్కూల్ విద్యార్థులక్కూడా అర్థమయ్యే రీతిలో ఆయన వివరించారు.ప్రపంచవ్యాప్తంగా "వైకల్యం ఏనాటికీ వైఫల్యం కాదనే" పాఠంతో కొన్ని కోట్ల మందికి స్ఫూర్తి పాఠ్యాంశంగా నిలిచారు.

పెద్దగా అసాధారణ నైపుణ్యాలు లేని బక్కపలుచని గాంధీ 34 కోట్లమంది భారతీయులను ఏకతాటిపై నిలిపి అహింస,సత్యాగ్రహాలతో ఆయన చేసిన రాజకీయ పోరాటం మన దేశానికి స్వాతంత్ర్యం సంపాదించడమే కాకుండా విశ్వ విఖ్యాత మేధావుల జీవితాలనే కదిలించింది.ఈ శతాబ్దపు అత్యున్నత వ్యక్తుల్లో ప్రముఖున్ని చేసింది.ఐన్ స్టీన్,స్టీవ్ జాబ్స్, సివిరామన్, మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా వంటి విశ్వ విఖ్యాతులకే గాంధీ జీవితం స్ఫూర్తిగా నిలిచింది.ఆయన జీవితంపై వచ్చిన "గాంధీ" సినిమా విశేష ప్రాచుర్యం పొంది ఆస్కార్ అవార్డుల పంట పండించింది.గాంధీజీ సూక్తులు భవిష్యత్తు తరాలకు జీవిత బాటలయ్యాయి.

'మహిళవు కాబట్టి ఉన్నత విద్యకు అర్హురాలివి కావంటూ, పరిశోధనలకు అవకాశం ఇవ్వలేమంటూ' చేసిన అవహేళనలను మేడం క్యూరీ తన అసాధారణ ప్రయత్నాల పట్టుదల పరంపరలో భౌతిక, రసాయన శాస్త్రాల్లో రెండింటిలో నోబెల్ గెలిచిన ఏకైక వ్యక్తిగా నిలిచారు నేటికి.రేడియోధార్మికత అంశంపై ఆమె చేసిన ప్రయోగాల ఫలితాలు వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చాయి.ఆనాటి ప్రఖ్యాత భౌతిక,రసాయన శాస్త్రవేత్తలకే కాక నేటి తరంలో కూడా ఆమె మేధస్సు, కృషి ఆదర్శాలయ్యాయి. దక్షిణాఫ్రికా ప్రజల స్వాతంత్ర్యం కోసం దాదాపు ఇరవై ఏండు సంవత్సరాల జైలు జీవితం అనుభవించి "ఎ లాంగ్ వాక్ టూ ఫ్రీడం" అంటూ తన జీవిత చరిత్రను విరచించిన నెల్సన్ మండేలా నల్లజాతి విప్లవసూర్యుడయ్యాడు.ఐక్యరాజ్యసమితి ఆయన జయంతిని మండేలాడేగా ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నది. క్షమాగుణం,సహనం, శాంతి వంటి ఆయన అనుసరించిన మార్గాలు నేటి తరానికి విజయ సోపానాలు.

బల్బును కనుగొనే ప్రయత్నంలో వందల ప్రయత్నాలను పట్టుదల వదలకుండా చేసి ప్రపంచానికే వెలుగునిచ్చిన థామస్ అల్వా ఎడిసన్ మనకు స్ఫూర్తి ప్రదాత. నిరుపేద కుటుంబంలో పుట్టి అడుగడుగునా వివక్షతకు లోనై పట్టుదల వదలకుండా విశ్వమేధావిగా ఎదిగిన భారతరత్న అంబేద్కర్ మన పోరాటానికి ఎప్పటికీ ఆద్యుడే. రామేశ్వరం వీధుల నుంచి అంతరిక్షంలోకి ఓ మిస్సైల్ లా మారి, రాష్ట్రపతి భవన్ వరకు సాగిన అబ్దుల్ కలాం సుదూర స్ఫూర్తి ప్రయాణం మనందరికీ ఒక దిక్సూచియే. సచిన్ టెండూల్కర్, మహేంద్ర సింగ్ ధోనీ, అమితాబ్ బచ్చన్, ఆంగ్ సాన్ సూకీ, కల్పనా చావ్లా, మదర్ థెరిస్సా, సుధామూర్తి వంటి ఇలా ఎందరో వివిధ రంగాల ప్రముఖుల జీవిత చరిత్రలు మన జీవితాలకు వ్యక్తిత్వపు శిఖరాలై మన జీవితాలకు మార్గదర్శనం చేస్తూనే వుంటాయి. మన ఎదుగుదల కోసం, జీవితం విలువ తెలుసుకోవడం కోసం కనీసం నెలకు ఓ ఇద్దరి ప్రఖ్యాత వ్యక్తుల జీవితాలను అధ్యయనం చేద్దాం.నేను ఆరంభించాను ఈ రోజు నుంచే.. మరి మీరు..? ✦

కరెంట్ అఫైర్స్

హైజంప్‌లో పూజాసింగ్ జాతీయ రికార్డు



భారత యువ అథ్లెట్ పూజా సింగ్ హైజంప్‌లో జాతీయ రికార్డు తిరగరాసింది. 17 ఏండ్ల పూజ 1.83 మీటర్ల ఎత్తు దూకి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ క్రమంలో పూజ తన పేరిటే ఉన్న జాతీయ రికార్డును(1.82 మీటర్లు) బద్దలు కొట్టింది. హరియాణాకు చెందిన తాపీ మేస్త్రీ కూతురైన పూజ క్వాలిఫయింగ్ రౌండ్‌లో తొమ్మిదో స్థానంలో ఫైనల్‌కు అర్హత సాధించింది. సరైన సౌకర్యాలు లేకుండానే అండర్-14 స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్వర్ణం నెగ్గిన పూజ 2022 జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో అండర్-16, అండర్-18 పోటీల్లో పసిడి పతకాలు కైవసం చేసుకుంది.

యూజియా ఫార్మాకు ఫార్మెక్సిల్ ప్లాటినం స్టార్ అవార్డు



అరబిందో ఫార్మాకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ యూజియా స్పెషాలిటీస్ 2022-23లో ఫార్మ ఎగుమతులకు సంబంధించి ఫార్మెక్సిల్ ప్లాటినం స్టార్ అవార్డు అందుకుంది. ఫార్మా ఎగుమతుల్లో కీలకపాత్ర పోషించినందుకు గాను నోయిడాలో జరిగిన కార్యక్రమంలో దీన్ని ప్రదానం చేశారు. కంపెనీ సీఈవో పువ్వల యుగంధర్, అసోసియేట్ ప్రెసిడెంట్ విజయ్ నటరాజన్‌కు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితన్ ప్రసాద్ ఈ పురస్కారాన్ని అందజేశారు.

జయశంకర్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ) ఫిజిక్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ జయశంకర్‌కు రేర్ ఎర్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంస్థ లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రకటించింది. ఈ అవార్డు... రేర్ ఎర్త్ పరిశోధన, అభివృద్ధి, అనువర్తనాల రంగంలో ఆయన చేసిన అద్భుతమైన కృషికి గుర్తింపుగా ఇవ్వబడింది. కేరళలోని తిరువనంతపురంలో ఆగస్టు 22వ తేదీన అంతర్జాతీయ సదస్సులో ఆయనకు అవార్డును అందజేశారు.

అత్యంత సంపన్నుల జాబితాలో అంబానీని మళ్లీ దాటేసిన అదానీ



పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీ (62) భారతదేశీయంగా అత్యంత సంపన్నుల జాబితాలో అగ్ర స్థానంలో నిలిచారు. మరోసారి రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీని(67) అధిగమించి అగ్రస్థానం దక్కించుకున్నారు. ఏడాది వ్యవధిలో ఆయన సంపద ఏకంగా 95శాతం ఎగిసి రూ.11.6 లక్షల కోట్లకు చేరింది. హురున్ ఆగస్టు 29వ తేదీ విడుదల చేసిన సంపన్నుల జాబితా-2024లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 2023 నివేదికలో అదానీ సంపద 57 శాతం క్షీణించి రూ.4.74 లక్షల కోట్లకు పడిపోయింది. అప్పుడు అంబానీ సంపద రూ.8.08 లక్షల కోట్లుగా నమోదైంది. తాజాగా అంబానీ మొత్తం సంపద 25 శాతం పెరిగి రూ.10.14 లక్షల కోట్లకు చేరడంతో ఆయన రెండో స్థానంలో నిలిచారు. తాజా జాబితాలో జూలై 31 నాటి వరకు రూ.1,000 కోట్ల పైగా నికర విలువ ఉన్న భారతీయ సంపన్నులను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ సారి కుబేరుల సంఖ్య 220 మేర పెరిగి 1,539కి చేరింది. మొత్తం సంపద 64 శాతం వృద్ధి రూ.159 లక్షల కోట్లకు చేరింది. ■

గంజాయి, గందరగోళం అనేవి ఏ భాషాపదాలు..?



నానాపురం నర్సింహులు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహేశ్వరం, రంగారెడ్డి జిల్లా.
9030057994

నెట్ / సెట్ ప్రత్యేకం

1. గ్రాము/గ్రహము, మోము/మొగము, దాకా/తనుక లాంటి పదాల్లో జరిగిన పరిణామం...
   - ఎ.వర్ణవ్యత్యయం బి.తాలవ్యీకరణం
   - సి.లోపదీర్ఘత డి.స్వరభక్తి
2. పగలు/పవలు, నివురు/నిమురు, తెలుగు/తెనుగు, తీగ/తీగ, అదరిపడు/అదిరిపడు... లాంటి పదాల్లోని ధ్వని మార్పులు..?
   - ఎ. వర్ణసమీకరణం బి. వర్ణవ్యత్యయం
   - సి. వర్ణవినిమయం డి. విప్రకర్ష
3. ఆసర, గందరగోళం, కొరడ, గంజాయి, చవక, కిచిడి... లాంటి పదాలకు మూలం?
   - ఎ.ఒరియా బి. తమిళం
   - సి.కన్నడం డి.మరాఠీ
4. మనకు లభిస్తున్న మొదటి లిఖితపదం 'నాగబు'
   - ఎ. తత్సమం బి.తద్భవం
   - సి.దేశ్యం డి.అన్యదేశ్యం
5. 'వంద మంది కార్మికులు' ఇందులో అర్థశూన్యపదాంశం?
   - ఎ.వంద బి.మంది
   - సి.కార్మికులు డి.వందమంది
6. ఆగమ పదాంశాన్ని గుర్తించండి?
   - ఎ.బొమ్మలు, గాలివాన బి.సీతాకోకచిలుక, నాగమల్లి
   - సి.కులీనస్త్రీ, నందివర్ధనం డి.ఇంటికి, మంటికి
7. జతపర్చుము
   - 1.శత్రర్థకం అ.వెళ్ళినా, అడిగినా
   - 2.చేదర్థకం ఆ.వెళ్ళి, అడిగి
   - 3.క్త్వార్థకం ఇ.వెళ్ళితే, అడిగితే
   - 4.అప్యర్థకం ఈ.వెళ్తూ, అడుగుతూ

	1	2	3	4
ఎ.	ఇ	ఈ	ఆ	అ
బి.	అ	ఇ	ఆ	ఈ
సి.	ఈ	ఆ	అ	ఇ
డి.	ఈ	ఇ	ఆ	అ

8. 'ఆమె నోటితో మాట్లాడి, నొసలుతో వెక్కిరిస్తుంది' వాక్యంలో 'తో' విభక్తి ప్రత్యయం ఇలా ప్రయుక్తమయ్యింది?
   - ఎ.రీత్యర్థంలో బి.సహార్థంలో
   - సి.కరణార్థంలో డి.కాలార్థంలో
9. 'కుందేటి కొమ్ము' - పదబంధంలోని విభక్తి ప్రత్యయం?
   - ఎ. అనౌప విభక్తి ప్రత్యయం బి.ఔప విభక్తి ప్రత్యయం
   - సి.ప్రథమ విభక్తి ప్రత్యయం డి.ఏదీలేదు
10. సంశ్లిష్టకావ్యంలో...
   - ఎ. రెండు క్రియరహిత వాక్యాలుండొచ్చు
   - బి. రెండు లేదా అంతకంటే ఎక్కువ ప్రధాన వాక్యాలుండొచ్చు
   - సి. రెండు సమాపక క్రియలుండొచ్చు
   - డి. రెండు అసమాపక క్రియలుండొచ్చు
11. క్రింది వానిలో సరియైనది?
   - ఎ. సామాన్య వాక్యాల్లో ఒకే ఆఖ్యాతం ఉంటుంది.
   - బి. ఏక పదార్థ బోధకాలైన రెండు నామాలను ఒక చోట చేరిస్తే క్రియరహిత వాక్యాలు ఏర్పడతాయి.
   - సి. క్రియరహిత వాక్యాల్లోని రెండు నామాల్లో మొదటిది ఉద్దేశ్యం, రెండోది విధేయం
   - డి. పైవన్నీ
12. సరియైన నామ్నీకరణ వాక్యాన్ని గుర్తించండి?
   - ఎ. ఆ అబ్బాయి ఊరికి వెళ్ళాడు - ఊరికి వెళ్ళిన అబ్బాయి
   - బి. వాడు సువర్ణతో వచ్చాడు - వాడు వచ్చిన సువర్ణ
   - సి. వాడు వాళ్ళలో మంచివాడు - వాడు మంచి వాడయిన వాళ్ళు
   - డి. మాకు 2006లో పెళ్ళయ్యింది - మాకు పెళ్లైన 2006
13. తిక్కన భారతంలో ప్రయోగించబడిన మాండలిక భాషా పదం?
   - ఎ. మోట బి. కపిల
   - సి. మదుం డి. చిలుకు
14. ఈ క్రింది వానిలో తద్ధిత రూపాలు...?
   - ఎ. నేర్పరి, టక్కులాడి, ఆటకత్తె
   - బి. తలపోయు, మేల్కొను, నిలబడు
   - సి. గంపెడు, దొంగతనం, కుట్రదారు
   - డి. టపీమని, ధామ్మని, పరపర
   - ఎ. ఇ,ఈ బి. అ,ఆ
   - సి. అ,ఇ డి. ఆ,ఈ
15. జతపర్చుము
   - 1. పర్యాయపదాలు అ. ప్రతిమాటకు బహుళార్థకత్వం ఉండటం మాట
   - 2. సారూప్యపదాలు ఆ.వాడు=అతడు/శోషిల్లు, నాడు= దినం/దేశం
   - 3. నానార్థాలు ఇ. భవం = పుట్టుక, బ్రతుకు, ప్రపంచడం
   - 4. అనేకార్థపదాలు ఈ. వ్యవసాయం, సేద్యం, కమతం, సాగు

	1	2	3	4
ఎ.	ఈ	ఆ	ఇ	అ
బి.	ఈ	ఇ	ఆ	అ
సి.	ఇ	ఈ	ఇ	అ
డి.	ఆ	అ	ఇ	ఈ

16. జతపర్చుము
   - 1. అర్థసౌమ్యత అ. కంపు, కైంకర్యం, ఛాందసుడు
   - 2. అర్థాపకర్ష/అర్థగ్రామ్యత ఆ. సభికులు, ముహూర్తం, వైతాళికులు
   - 3. అర్థవ్యాకోచం ఇ. కోక, ఉద్యోగం, పత్రం, వస్తాదు
   - 4. అర్థసంకోచం ఈ. చెంబు, అవధాని, తైలం

	1	2	3	4
ఎ.	ఆ	ఈ	అ	ఇ
బి.	ఆ	అ	ఈ	ఇ
సి.	ఈ	ఇ	అ	ఆ
డి.	ఇ	అ	ఆ	ఇ

17. నన్నయ 'పొంటెన్' అనే ప్రత్యమాన్ని ఏ విభక్తిలో వాడాడు?
   - ఎ. ద్వితీయ విభక్తి బి. తృతీయ విభక్తి
   - సి. చతుర్థీ విభక్తి డి. పంచమీ విభక్తి
18. తెలుగు మధ్యద్రావిడ ఉపకుటుంబానికి చెందుతుందని నిరూపించిన భాషావేత్త?
   - ఎ. బిషప్ కాల్డ్‌వెల్ బి. బ్లూమ్ ఫీల్డు
   - సి. పి.ఎస్.సుబ్రమణ్యం డి. భద్రిరాజు కృష్ణమూర్తి
19. జతపర్చుము
   - 1. వర్గమండలికం అ. పోతుంది, కురుస్తుంది, తెలియదు
   - 2. ప్రాంతీయ మాండలికం ఆ. రోయిణి, సుక్క, బాస, దర్మం
   - 3. జానపద మాండలికం ఇ. దుబ్బనేల, పెండ, బునాది, కర్రు
   - 4. శిష్ట వ్యవహారం ఈ. పాప, యెండి, నేదు, గట్టా

	1	2	3	4
ఎ.	ఈ	ఇ	ఆ	అ
బి.	ఈ	ఇ	అ	ఆ
సి.	ఈ	ఆ	ఇ	అ
డి.	ఇ	ఆ	ఈ	అ

20. జతపర్చుము
   - 1. అర్థమరిణామం(Semantic Change) అ. జి.ఎన్.రెడ్డి
   - 2. ఆధునిక భాష : సంగ్రహ వర్ణనం ఆ. చేకూరి రామారావు
   - 3. ధ్వని పరిణామం ఇ. టోలోమే
   - 4. ప్రాచీనాంధ్ర శాసనాలు ఈ. గంటి జోగి సోమయాజి

	1	2	3	4
ఎ.	అ	ఇ	ఆ	ఈ
బి.	అ	ఆ	ఇ	ఈ
సి.	ఈ	ఇ	ఆ	అ
డి.	ఈ	ఆ	ఇ	అ

21. జతపర్చుము
   - 1. అమరసింహుడు అ. త్రిలింగ లక్షణశేషం
   - 2. ఆచార్య జి.ఎన్.రెడ్డి ఆ. తెలుగు వ్యాకరణం
   - 3. బహుజనపల్లి సీతారామాచార్యులు ఇ. నామలింగాను శాసనం
   - 4. రావిపాటి గురుమూర్తిశాస్త్రి ఈ. తెలుగు పర్యాయ పద నిఘంటువు

	1	2	3	4
ఎ.	ఆ	ఇ	అ	ఈ
బి.	ఆ	ఈ	అ	ఇ
సి.	ఇ	ఈ	అ	ఆ
డి.	ఇ	అ	ఈ	ఆ

22. గ్రీమర్సన్ రాసిన 'లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా'లో పేర్కొన్న మాండలికాలు ఎన్ని?
   - ఎ. 250 బి. 300 సి. 644 డి. 544
23. 'కైఫియత్తు' అనునది ఏ భాషా పదం?
   - ఎ. హిందుస్థాని బి. తెలుగు
   - సి.మరాఠీ డి.పోర్చుగీసు
24. 'తెలంగాణ' ప్రాంతం ఏ మండలానికి చెందుతుంది?
   - ఎ. దక్షిణ మండలం బి. ఉత్తర మండలం
   - సి. మధ్య మండలం డి. పూర్వ మండలం
25. ఆధునిక భాషాశాస్త్రవేత్తల దృష్టిలో సాధు(ర), శకట (ఱ) రేఫలు?
   - ఎ. సవర్ణాలు బి. సపదాంశాలు
   - సి. మూర్ధన్యాలు డి. ద్విత్వవర్ణాలు
26. ద్రావిడ భాషల్లో తాలవ్యీకరణం చెందని భాష?
   - ఎ. తమిళం బి. తెలుగు
   - సి. కన్నడం డి. మలయాళం
27. 'తహశీల్దారు' ఏ భాషాపదం?
   - ఎ. పోర్చుగీసు బి. ఉర్దూ
   - సి. డచ్చీ డి. ఇంగ్లీష్

సమాధానాలు

1. సి	2. సి	3. డి	4. ఎ	5. బి
6. ఎ	7. డి	8. సి	9. బి	10. డి
11. డి	12.ఎ	13.బి	14.సి	15. ఎ
16. బి	17. సి	18. డి	19. ఎ	20. బి
21. సి	22. డి	23. ఎ	24. బి	25. ఎ
26. సి	27. బి			